సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 163
సోమవారం 2-9-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'



'పసిడి' వేటలో భారత షట్లర్లు

పారిస్ పారాలింపిక్స్ పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్–4 కేటగిరీలో సుహాస్.. ఎస్‌ఎల్–3 కేటగిరీలో నితేశ్ ఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం రజత పతకాలను ఖాయం చేసుకున్నారు. మహిళల సింగిల్స్ ఎస్‌యు 5 కేటగిరీలో భారత్‌కు కనీసం రజతం లభించనుంది. మహిళల అథ్లెటిక్స్ టి35 200 మీటర్ల విభాగంలో భారత అథ్లెట్ ప్రీతి పాల్ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. 14లో



సత్వర తీర్పులు

మహిళలపై నేరాల్లో సత్వర తీర్పులతో బాధితులకు న్యాయం చేకూర్చాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోర్టులకు సూచించారు.
వివరాలు 6లో ▸



క్షమాపణల్లోనూ అహంకారమే

శివాజీ విగ్రహం కూలిన ఉదంతంపై ప్రధాని క్షమాపణ అహంకారపూరితంగా ఉందని ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు.
వివరాలు 6లో ▸



బందీలను చంపేశారు

గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ బలగాలు బందీలను సమీపిస్తున్నాయన్న ఉక్రోషంతో వారిలో ఆరుగురిని హమాస్ హతమార్చింది.
వివరాలు 6లో ▸



బలవంతపు రాజీనామాలు

బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందూ ఉపాధ్యాయులతో విద్యార్థులు, స్థానికులు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు.
వివరాలు 6లో ▸

ఆదివారం మున్నేరువాగు వరదలో మునిగిన ఖమ్మం జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దతండా ప్రాంతం



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం–ఇంటికన్నె మధ్య వరద ఉధృతికి కంకర, మట్టి కొట్టుకుపోయి వేలాడుతున్న పట్టాలు



వర్షం... విలయం

భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా 18 మంది మృతి

పదుల సంఖ్యలో గల్లంతు

- పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులు.. జలాశయాల్లోకి చేరుతున్న నీరు
- ప్రధాన రహదారులపై వరదలతో స్తంభించిన ప్రజారవాణా
- అప్రమత్తమైన ప్రభుత్వం.. సహాయక చర్యలు ముమ్మరం.. రంగంలోకి ఎన్డీఆర్‌ఎఫ్
- పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు
- భారీ వర్షాలపై కేంద్రం ఆరా..
- సచివాలయంలో ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు
- మరో రెండు రోజులు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిక

రాత్రీ పగలూ ఎడతెరిపి లేకుండా ఒకటే వాన.. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టు కుండపోత.. అడుగు బయటపెట్టలేకుండా ఎటు చూసినా నీళ్లే.. లోతట్టు ప్రాంతాల ప్రజలకు మిగిలింది కన్నీళ్లే. వాగులు, వంకలు ఉప్పొంగుతూ, చెరువులు అలుగుపారుతూ.. ఊర్లు, రోడ్లను ముంచేస్తూ అతలాకుతలం చేస్తున్నాయి. వరద దాటే ప్రయత్నం చేసిన ఎన్నో ప్రాణాలను మింగేస్తున్నాయి. ఇది మరో రెండు రోజులూ కొనసాగుతుందని, మరింతగా వర్షాలు పడతాయని వాతావరణశాఖ చేసిన హెచ్చరికలు ఆందోళన రేపుతున్నాయి.
- వివరాలు 3లో

అందరూ అందుబాటులో ఉండాలి

- అధికారులు సెలవులు రద్దు చేసుకోవాలి
- అత్యవసర సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- సీఎంకు ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్.. తక్షణ సాయానికి హామీ

5లో



96 రైళ్లు, 566 బస్సులు రద్దు

- భారీ వర్షాలతో స్తంభించిన ప్రజారవాణా
- వివిధ మార్గాల్లో నిలిచిపోయిన రైళ్ల వద్ద ప్రయాణికులకు అత్యవసర సేవలు
- ఉన్నతాధికారులతో దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సమీక్ష

16లో

9.87 సెం.మీ. రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల్లో నమోదైన సగటు వర్షపాతం..
(గత పదేళ్లలో ఇదే అత్యధికం)

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో..	వరంగల్ జిల్లా రెడ్లవాడలో..
43.8 సెం.మీ.	43.5 సెం.మీ.

శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 వరకు కురిసిన అత్యధిక వర్షపాతం

నైరుతి సీజన్ (జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు)లో కురవాల్సిన సాధారణ వర్షపాతం..
72.85 సెం.మీ.

అందులో సెప్టెంబర్ 1 నాటికి నమోదు కావాల్సిన వర్షపాతం..
58.15 సెం.మీ.

ఇప్పటికే నమోదైన వర్షపాతం
76.19 సెం.మీ.

ఇది సాధారణం కంటే 31% ఎక్కువ

8 జిల్లాలకు రెడ్ అలర్ట్

ఆదిలాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలకు అవకాశం.

విజయవాడ విలవిల

వరదలో చిక్కుకొని 3.5 లక్షల మంది నరకయాతన

- వైఎస్ జగన్ హయాంలో కృష్ణలంక రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ఇప్పుడు లక్షల మందికి తప్పిన వరద ముప్పు
- వరద అంచనా, సహాయక చర్యల్లో సర్కారు దారుణ వైఫల్యం
- విజయవాడలో 10 మంది మృతి, నలుగురు గల్లంతు
- అతి భారీ వర్షాలపై ముందే హెచ్చరించిన ఐఎండీ, సీడబ్ల్యూసీ
- అక్రమ నివాసంపై ప్రజల దృష్టి మళ్లించేందుకే బాబు అర్ధరాత్రి హడావుడి



బుడమేరు విశ్వరూపంతో వరద నీటిలో చిక్కుకున్న విజయవాడ

సాక్షి విజయవాడ: ముంచెత్తిన అతి భారీ వర్షాలపై అప్రమత్తంగా వ్యవహరించాల్సిన ఏపీ ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చోవడంతో విజయవాడలో మూడున్నర లక్షల మందికిపైగా వరదల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. చుట్టుముట్టిన నీళ్ల నుంచి బయటకు రాలేక, కనీసం తాగునీరు కూడా అందక అల్లాడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తిందనే అభిప్రాయం అధికారవర్గాల్లోనే బలంగా వ్యక్తమవుతోంది. అతి భారీ వర్షాలు కురవడం.. కృష్ణా, ఉప నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో పల్లపు ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం కనీసం అప్రమత్తం చేయలేదు. కృష్ణా నదికి భారీ వరద వస్తున్న సమయంలోనే బుడమేరు ఉప్పొంగింది. కృష్ణా వరద ప్రవాహం ఎగదన్నడంతో బుడమేరు కరకట్టలకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో బుడమేరు కరకట్ట తెగిపోతుందనే భయంతో వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ 11 లాకులను ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎత్తేశారు. ఫలితంగా వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ లాకుల నుంచి బుడమేరు వరద విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. 30 వేల క్యూసెక్కుల ప్రవాహం సింగ్ నగర్, ఇందిరా నాయక్ నగర్, వాంబే కాలనీ, దేవీనగర్, పాయకాపురం, రాజీవ్ నగర్, న్యూరాజరాజేశ్వరిపేట, కండ్రిగ, వైఎస్సార్ కాలనీసహా పలు ప్రాంతాలను ముంచేసింది. నగరంలో 12 డివిజన్‌లు పూర్తిగా మునిగాయి. మరోవైపు రాజధాని అమరావతి ప్రాంతంలో పోటెత్తిన వాగులతో వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసి తగినంత నిధులు, సహాయ సామగ్రిని
మిగతా 12వ పేజీలో ▶

నర్సుపై రోగి వేధింపులు



- బెంగాల్‌లో మరో దారుణం
- నైట్ డ్యూటీలో సెలైన్ పెడుతుండగా అసభ్యకరంగా తాకిన రోగి
- పోలీసులకు వైద్యుల ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

- వివరాలు 6లో

హైడ్రా.. ఫ్లడ్ స్టడీ!

హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాల పరిశీలన

- వరద ప్రాంతాలు, అడ్డంకులు క్షేత్రస్థాయిలో గుర్తింపు
- స్వయంగా రంగంలోకి దిగిన కమిషనర్ రంగనాథ్
- డీఆర్‌ఎఫ్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తూనే కబ్జాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన



బేగంపేటలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న రంగనాథ్

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాలతో నీట మునిగిన ప్రాంతాలను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పరిశీలించింది. వరద ప్రభావిత ప్రాంతాలు, అక్కడి పరిస్థితులు, అడ్డంకులను క్షేత్రస్థాయిలో గుర్తించింది. చెరువులు, నాలాల కబ్జా వల్ల కలిగే ఇబ్బందులను ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి వివరించే ప్రయత్నం చేసింది.

హైడ్రా ఏర్పడ్డాక తొలి ముసురు...

జీహెచ్‌ఎంసీలో అంతర్భాగంగా ఉన్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్)ను వేరు చేయడంతోపాటు చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతను అప్పగిస్తూ ప్రభుత్వం హైడ్రాకు రూపమిచ్చింది. ఈ మేరకు జూలై 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాతి రోజే హైడ్రా కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ బాధ్యతలు స్వీకరించారు. వెంటనే చెరువుల ఆక్రమణలపై దృష్టి పెట్టి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అక్రమంగా నిర్మించిన భవనాల కూల్చివేతల ప్రక్రియకు మిగతా 12వ పేజీలో ▶

నేడు విద్యాసంస్థలకు సెలవు

- సోమవారం ఉస్మానియా వర్సిటీ పరిధిలో జరిగే పరీక్షలు వాయిదా
- 3న జరిగే పరీక్షలు యథాతథం

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. పరిస్థితిని బట్టి ఆ తర్వాత తగిన నిర్ణయాన్ని తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితిని డీఈవోలు పలు జిల్లాల్లో కలెక్టర్లకు వివరించారు. పిల్లలు పాఠశాలలకు వచ్చే పరిస్థితి లేదని, పాఠశాలల ప్రాంగణాలు వరద నీటితో నిండిపోయాయని, కొన్ని పాఠశాల భవనాలు కురుస్తున్నాయని, ఇక శిథిలావస్థలో ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహించలేని పరిస్థితి ఉందని తెలిపారు. పలు చోట్ల వాగులు పొంగుతున్నాయని, రహదారుల్లో వెళ్లలేని
మిగతా 3వ పేజీలో ▶

15 లక్షల ఎకరాల్లో పంట మునక

- పత్తి, వరి, సోయా సహా ఇతర పంటలపై ప్రభావం
- పలుచోట్ల కొట్టుకుపోయిన వరి... పత్తికి తీవ్రమైన నష్టం
- సోయా, కంది పంటలపైనా ప్రభావం

5లో



మహబూబాబాద్ జిల్లా బయ్యారం సమీపంలో నీటమునిగిపోయిన వరి

గాలిలో రైలు పట్టాలు..

- మహబూబాబాద్ జిల్లాలో వరదకు పలుచోట్ల దెబ్బతిన్న ట్రాక్‌లు
- కొట్టుకుపోయిన సిమెంట్ దిమ్మెలు, కంకరరాళ్లు
- రైల్వే సిబ్బంది, అధికారుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదాలు
- డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రంలో పలు రైళ్ల నిలిపివేత..

5లో

ఇంటితో సహా కొట్టుకుపోయిన కుటుంబం



వరద నీటిలో చిక్కుకున్న యాకూబ్ ఇల్లు

- మంత్రి పొంగులేటి ఆదేశంతో 8గంటల పాటు రెస్క్యూ చేసిన అధికారులు
- కుమారుడిని కాపాడిన పోలీసులు.. దంపతుల గల్లంతు.. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించిన మంత్రి
- ఆ దంపతులను కాపాడలేకపోయామంటూ పొంగులేటి కంటతడి

- వివరాలు 16లో

ఇదం జగత్



మా ఇల్లు బఫర్ జోన్‌లో లేద్సార్! లోతట్టు ప్రాంతంలో ఉంది!

'స్వగృహ' సాఫ్!



మిగిలిపోయిన ఇళ్లు, ఖాళీ భూములన్నింటినీ అమ్మాలని నిర్ణయం

- ఆ రూపంలో రూ.3500 కోట్లు కూడగట్టుకునే ప్రయత్నం
- వేగంగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- కొత్త ధరలను సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి కమిటీ నివేదిక
- త్వరలో అధికారికంగా వెల్లడించి అమ్మకపు ప్రకటన విడుదల

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ స్వగృహ ఇళ్లలో మిగలిపోయిన ఫ్లాట్లను, ఖాళీ స్థలాలన్నింటినీ అమ్మేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు వేగంగా కసరత్తు చేస్తోంది. గతంలో అమ్ముడు పోగా అసంపూర్తిగా ఉన్న ఇళ్లను, మరిన్ని ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన భూములను అమ్మడం ద్వారా కనీసం రూ.3500 కోట్లను సమీకరించుకోనున్నట్టు అంచనా. అసంపూర్తి ఇళ్లను ఉన్నవి ఉన్నట్టుగా విక్రయించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆ ఫ్లాట్లకు ధరలను నిర్ణయించేందుకు గతంలో వేసిన కమిటీ ఆయా ఇళ్ల పరిస్థితి, అక్కడి మార్కెట్ డిమాండ్ ఆధారంగా ధరలను సిఫార్సు చేస్తూ తాజాగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వం మరికొద్ది రోజుల్లో అధికారికంగా ధరలను వెల్లడించి లాటరీ పద్ధతిలో ఇళ్లను విక్రయించనుంది.

భూములు, ఇళ్లు ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

ప్రస్తుతం నగరంలోని పోచారం, నాగోలు సమీపంలోని బండ్లగూడ, గాజులరామారం, జవహర్‌నగర్, ఖమ్మం పట్టణ శివారు మున్నేరు సమీపంలో ఇళ్లు ఉన్నాయి. నిర్మాణాలు చేపట్టకుండా ఉన్న ఖాళీ భూములు 136 ఎకరాల
మిగతా 12వ పేజీలో ▶

35శాతం వరకు తక్కువ ధరలకే..

ఇళ్లను కొనుక్కున్నవారు సొంతంగా ఖర్చు చేసి మిగతా పనులు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లోని మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 35 శాతం వరకు తక్కువ ధరలకే ఇళ్లు సొంతమయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని ఇళ్లను తమకు కేటాయించాలంటూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన తపాలాశాఖ, ఎఫ్‌సీఐ, ఆదాయపన్ను శాఖ ఉద్యోగులతోపాటు అటవీ శాఖ ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఒకేసారి ఫ్లాట్ల టవర్లను గంపగుత్తగా కొనుగోలు చేసి, ప్రైవేటు సంస్థలతో పనులు చేయించుకుని గృహప్రవేశాలు చేసుకోవాలని వారు భావిస్తున్నారు.

వరదలో చిక్కుకున్నాం.. రక్షించండి

- యువ సైంటిస్టును బలి తీసుకున్న వరద
- పీహెచ్‌డీ సాధించి శాస్త్రవేత్తగా రాణిస్తున్న అశ్విని
- హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తుండగా ఆకేరు నదిలో కొట్టుకుపోయిన కారు
- కుమార్తె మృతదేహం లభ్యం.. లభించని తండ్రి ఆచూకీ



తండ్రి మోతీలాల్‌తో అశ్విని

- వివరాలు 3లో



DB
Siggnature
Finest Silver Elaichi
New Pack
DB
Siggnature
Finest Silver Elaichi
A Premium Product from Dilbagh®
www.dbsiggnature.com
For Calorie conscious people, the product shown here contains artificial sweeteners like Sodium Saccharin (INS 954), Sucralose (INS 955), and Neotame (INS 961. Not recommendable for kids.
A Premium Product from Dilbagh®

వరదలో చిక్కుకున్నాం.. రక్షించండి

యువ సైంటిస్ట్‌ను బలి తీసుకున్న వరద

పీహెచ్‌డీ సాధించి శాస్త్రవేత్తగా రాణిస్తున్న అశ్విని
తండ్రితో కలిసి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తుండగా
ఆకేరు నదిలో కొట్టుకుపోయిన కారు
చిక్కుకున్నాం.. కాపాడమని బంధువులకు ఫోన్
బంధువులు, పోలీసులు వచ్చేలోగానే ఆమెతో పాటు తండ్రి గల్లంతు..
కుమార్తె మృతదేహం లభ్యం.. లభించని తండ్రి ఆచూకీ

మరిపెడ రూరల్, కారేపల్లి: భారీ వరద ఉజ్వల భవిష్యత్ ఉన్న ఓ యువ సైంటిస్టును బలి తీసుకుంది. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించిన ఆమె వ్యవసాయ విద్యలోసత్తా చాటింది. జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ సాధించి జాతీయ స్థాయిలో పరిశోధనా శాస్త్రవేత్తగా మొదటి స్థానంలో నిలిచింది. యూనివర్సిటీ స్థాయిలో ఆరు బంగారు పతకాలే కాక ఎమ్మెస్సీలోనూ బంగారు పతకం సాధించింది. అలాంటి అద్భుతమైన ఆమె భవిష్యత్‌ను వరద గల్లంతు చేసింది. ఆమెతో పాటు తండ్రి ప్రయాణిస్తున్న కారు ఆకేరు వాగు ప్రవాహంలో కొట్టుకు పోగా, ఈ ప్రమాదంలో కుమార్తె మృతదేహం లభ్యమైంది.. తండ్రి ఆచూకీ కోసం రెస్క్యూటీం గాలిస్తోంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామ శివారు ఆకేరు నది వాగు వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ విషాద ఘటన వివరాలిలా..

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కారేపల్లి గ్రామ పరిధిలోని గంగారం తండాకు చెందిన నూనావత్ మోతీలాల్ (55), మేజ దంపతులకు కుమారుడు




అశ్విని మృతదేహం



పోలీసులు బయటికి తీసిన కారు

అశోక్ కుమార్, కుమార్తె అశ్విని (30) ఉన్నారు. కుమారుడు విద్యుత్‌శాఖలో ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. కుమార్తె అశ్విని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో శాస్త్రవేత్తగా ఉద్యోగం చేస్తోంది. ఇటీవల ఏప్రిల్‌లో జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో 4వ స్థానం పొంది మంచి గుర్తింపు పొందింది. తన సోదరుడి నిశ్చితార్థం కావడంతో స్వగ్రామం గంగారంతండాకు వచ్చిన అశ్విని శుభకార్యం ముగిశాక శంషాబాద్ నుంచి రాయపూర్ వెళ్లేందుకు ఫ్లైట్ టికెట్ రిజర్వేషన్ బుక్ చేయించుకుంది. ఈ క్రమంలో భారీ వర్షాలు పడుతుండడంతో తండ్రి మోతీలాల్ తానే స్వయంగా కారులో హైదరాబాద్‌లో దించేందుకు తెల్లవారు జామున బయలు దేరారు. వయా మరిపెడ మీదుగా హైదరాబాద్ వెళ్తుండగా పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న విషయం గమనించని వారు నేరుగా వచ్చి ప్రవాహంలో చిక్కుకున్నారు. వెంటనే కారులోనుంచి బయటకు దిగిన తండ్రి మోతీలాల్ తన అన్నకు కాల్ చేసి తాము వరదలో చిక్కుకున్నామని, రక్షించాలని పరిస్థితి వివరించారు. సోదరుడు మరిపెడలో ఉన్న బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పి తిరిగి తమ్ముడికి ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వాగు పరీవాహక ప్రాంతానికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకుని జల్లెడ పట్టాయి. సాయంత్రానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో వంతెన సమీపంలో కారు చిక్కుకొని కనిపించింది. బాల్నిధర్మారం సమీపంలోని ఆయిల్‌పామ్‌తోటలో యువ సైంటిస్టు అశ్విని మృతదేహం లభ్యమైంది. మోతీలాల్ ఆచూకీ ఇంకా లభించలేదు. ఆదివారం సాయంత్రం దాటాక మోతీలాల్ మృతదేహం కారులో దొరికినట్లు ప్రచారం జరిగినా పోలీసులు నిర్ధారించడం లేదు. అశ్విని మృతదేహాన్ని పోలీసులు.. స్థానికుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. కాగా, తెల్లవారుజామున చీకటిగా ఉండడం, రోడ్డు మార్గం సరిగా తెలియకపోవడం.. వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో కారులోనుంచి దిగినా ప్రయోజనం లేకుండాపోయిందని భావిస్తున్నారు.



ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులో తీగల బ్రిడ్జికి ఆనుకుని ప్రవహిస్తున్న వరద



భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలంలో పాలవాగు వరద ఉధృతికి మృతిచెందిన పశువులు




నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలో ఇంటిగోడ కూలి మృతి చెందిన తల్లీ, కూతురు



సూర్యాపేట జిల్లా నగడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద తెగిన సాగర్ ఎడమ కాల్వ కట్ట



సూర్యాపేట జిల్లా మోతె మండలం రావిపహడ్ పెద్ద చెరువులో చిక్కుకున్న యువకుడు



ఆళ్లపల్లి-కొత్తగూడెం మధ్య కిన్నెరసాని లోలెవల్ వంతెనపై వాగు ఉధృతి

వర్షం.. విలయం

భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తం



మున్నేరు వరదలో మునిగిన ఖమ్మంలోని పంపింగ్‌వెల్ రోడ్డు ప్రాంతంలోని ఇళ్లు

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. రెండు రోజులుగా కురుస్తున్న వానల తీవ్రత శనివారం రాత్రి నుంచి మరింత పెరిగింది. ఆదివారం మధ్యాహ్నం వరకు ఆగకుండా కురిసింది. దీనితో జనజీవనం అతలాకుతలమైంది. వరద పోటెత్తి, రహదారులు కోతకు గురై రాకపోకలు స్తంభించాయి. రైలు మార్గాలు దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలూ నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు నిండి అలుగెత్తాయి. వాగులు, వంకలు పోటెత్తాయి. దీనితో పదులకొద్దీ గ్రామాలు జలదిగ్బంధం అయ్యాయి. పలుచోట్ల వరద ఉధృతికి వాహనాలు కొట్టుకుపోయాయి. మరోవైపు ఎడతెరిపిలేని వర్షాలపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలు, సహాయక చర్యలు, ముందు జాగ్రత్తల గురించి దిశానిర్దేశం చేశారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి.

సచివాలయంలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్

భారీ వర్షాల నేపథ్యంలో సచివాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో 040–23454088 నంబర్ ద్వారా.. వర్షాలు, వరదల పరిస్థితిపై కలెక్టర్లతో సంప్రదిస్తూ.. అవసరమైన సహాయ సహకారాలు, సూచనలను అందిస్తారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

రికార్డు స్థాయిలో వర్షపాతం..

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు సరికొత్త రికార్డును నమోదు చేశాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా 9.87 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఒక్కరోజే ఇంత భారీగా వానలు కురవడం గత పదేళ్లలో ఇదే తొలిసారి అని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో సెప్టెంబర్ 1 నాటికి 58.15 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా.. ఈసారి 76.19 సెంటీమీటర్లు కురిసింది. ఇది సాధారణం కంటే 31శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం సీజన్‌లో నమోదవాల్సిన వర్షపాతం.. మరో నెల రోజులు ఉండగానే కురిసింది.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

రాష్ట్రంలో మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. సోమవారం అతి భారీ వర్షాలు కురుస్తాయంటూ.. ఆదిలాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, రంగారెడ్డి, మెదక్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలర్ట్ ఇచ్చింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

తడిసి ముద్దయిన హైదరాబాద్

రెండు రోజులుగా కురుస్తున్న వానలతో హైదరాబాద్ మహానగరం తడిసి ముద్దయింది. శనివారం రాత్రి నుంచీ ఆదివారం మధ్యాహ్నం వరకు ఆగకుండా వర్షం కురుస్తూనే ఉంది. నాలాలలో వరద పెరిగి, డ్రైనేజీలు పొంగుతున్నాయి. దీనితో లోతట్టు ప్రాంతాల కాలనీలు, బస్తీలు జలమయం అయ్యాయి. హుస్సేన్‌సాగర్ నిండిపోవడంతో తూముల ద్వారా మూసీలోకి నీటి విడుదల చేస్తున్నారు. మూసీ పరీవాహక ప్రాంతాలకు జీహెచ్ఎంసీ హైఅలర్ట్ ప్రకటించింది. దాదాపు 165 వాటర్ ల్యాగింగ్ ప్రాంతాల్లో పరిస్థితులు ప్రమాదకరంగా మారడంతో.. జీహెచ్ఎంసీ, హైడ్రా, వాటర్‌బోర్డుల ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు ఎప్పటికప్పుడు నీటిని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యాయి.

ఖమ్మం.. అల్లకల్లోలం

భారీ వర్షాల ధాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లా అల్లకల్లోలమైంది. పాలేరు, మున్నేరు, వైరా, ఆకేరు, కట్టలేరు నదులు పోటెత్తాయి. చాలాచోట్ల రాకపోకలు స్తంభించాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా వర్షం పడటం, ఎగువన మహబూబాబాద్ జిల్లాలో అతి భారీ వర్షం కురవడంతో.. ఒక్కసారిగా మున్నేరు, ఆకేరు ఉగ్రరూపం దాల్చాయి. గత 20 ఏళ్లలో ఎన్నడూ లేనట్టుగా ఖమ్మం నగరానికి వరద పోటెత్తింది. 35 కాలనీలు నీటమునిగాయి. తమను కాపాడాలంటూ కాలనీలు, గ్రామాల వాసులు నేతలు, అధికారులకు ఫోన్లు చేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఇంకా చాలా మంది తమ భవనాలపైకి ఎక్కి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా 39 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి.. 5వేల మంది వరద బాధితులను తరలించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క హైదరాబాద్ నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వరదలను, సహాయక చర్యలను పరిశీలించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా పలుచోట్ల సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మణుగూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. అనేక గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచ మండలంలో సీతారామ ప్రధాన కెనాల్‌కు గండి పడింది. ములకలపల్లి మండలంలో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువకు గండి పడింది.

వరంగల్.. ఎటు చూసినా వరదే!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదవడంతో.. జలదిగ్బంధమైంది. మున్నేరు, ఆకేరు, పాలేరు, పాకాల, వట్టి, మసి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. 56 చెరువులు తెగిపోయాయి. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ కింద కట్ట కొట్టుకుపోయింది. దీనితో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లికుదురు మండలం రావిరాల, మరిపెడ మండలం తండా ధర్మారం గ్రామపంచాయతీ సీతారాం తండాలు నీటమునిగాయి. ఇళ్లపైకి ఎక్కిన గ్రామస్తులు.. 'ప్రాణాలు పోయేలా ఉన్నాయి. ఆదుకోండి' అంటూ అధికారులు, బంధువులకు ఫోన్లు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వందల కొద్దీ పాత ఇళ్లు కూలిపోయాయి.

వేములవాడ నుంచి భద్రాచలానికి 45 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు.. శనివారం రాత్రి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం– తోపనపల్లి శివార్లలో వరదలో చిక్కుకుంది. ప్రయాణికులు వరద మధ్య బస్సులోనే రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు.

ఉమ్మడి నల్లగొండ వాన బీభత్సం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సూర్యాపేట జిల్లా కాగిత రామచంద్రాపురం వద్ద, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం శివారు రంగులబ్రిడ్జి వద్ద గండ్లు పడ్డాయి. సూర్యాపేట మండలం పిల్లలమర్రి- పిన్నాయిపాలెం మధ్య మూసీ ఎడమ కాలువకు గండిపడింది. వేల ఎకరాలు నీట మునిగాయి. పలుగ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి. పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపైకి వరద చేరి రాకపోకలు నిలిచిపోయాయి. మఠంపల్లి మండలం చౌటపల్లిలో ఊరచెరువుకు, హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ చెరువు, మేళ్లచెరువులో నాగుల చెరువులు తెగిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో రామన్నపేట, చౌల్లరామారం, అడ్డగూడూరులలో చెట్లు విరిగిపడ్డాయి.

ఉమ్మడి మెదక్ నిలిచిన రాకపోకలు

మెదక్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వానలు పడుతున్నాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో నారింజ వాగు ఉప్పొంగడంతో కర్ణాటక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ జిల్లా నర్సాపూర్-హైదరాబాద్ రహదారిపై చెట్లు కూలిపడటంతో వాహనాలు నిలిచిపోయాయి. గుండువాగు, పెద్దవాగు, గంగమ్మ వాగులు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ పట్టణం జలదిగ్బంధమైంది.

ఉమ్మడి రంగారెడ్డి దెబ్బతిన్న పంటలు

రంగారెడ్డి ఉమ్మడి జిల్లా పరిధిలో కాగ్నా, ఈసీ, మూసీ నదులకు వరద పోటెత్తింది. దీనితో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. జిల్లాలో టమాటా, ఆకుకూరల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాగులు ఉప్పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాండూరు పరిధిలోని గౌతాపూర్ సబ్‌స్టేషన్‌లో వరద నీరు చేరడంతో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఉమ్మడి ఆదిలాబాద్ నిండుకుండల్లా ప్రాజెక్టులు

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో భారీ వరదలతో ప్రాజెక్టులు నిండు కుండల్లా మారాయి. కుమురం భీం, కడెం, వట్టివాగు, గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. జైనథ్ మండలం పెండల్‌వాడ, సాంగ్వి, ఆనంద్‌పూర్‌లలో పంటలు నీట మునిగాయి. బోథ్ మండలం పొచ్చెర జలపాతం ఉప్పొంగుతోంది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం నక్కలపల్లి వాగు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో సిద్దాపూర్ వాగు పొంగడంతో సిద్దాపూర్, కౌట్ల, ముజ్గిగి గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. నిర్మల్ మండలం చిట్యాల వంతెనపై నుంచి ప్రయాణిస్తున్న వ్యాన్ అదుపు తప్పి వాగులో పడిపోయింది. వాహనంలోని వారికి ఈతరావడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

ఉమ్మడి కరీంనగర్ రోడ్లు జలమయం

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో వర్షం దంచికొట్టింది. కలెక్టరేట్ ఆవరణలోని భారీ వృక్షం కూలిపడి, విద్యుత్ స్తంభం విరిగింది. వీణవంక, మామిడాలపల్లిలో వాగులు ఉప్పొంగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సింగరేణిలోని ఓపెన్ కాస్ట్‌లలో బొగ్గు వెలికితీతకు ఆటంకం ఏర్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కథలాపూర్ మండలం ఇప్పపెల్లి-తాండ్ర్యాల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందపల్లెలోని బ్రిడ్జిపై వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి బస్టాండ్, రంగంపల్లి, పెద్దకల్వల, సుల్తానాబాద్ బస్టాండ్, రామగుండం-మల్యాలపల్లి సమీపంలో రాజీవ్ రహదారి (ఎస్‌హెచ్-1)పై వరద నీరు చేరి.. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఉమ్మడి పాలమూరు దెబ్బతిన్న రోడ్లు

రెండు రోజులుగా కురుస్తున్న వానలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా బీభత్సం సృష్టించాయి. మహబూబ్‌నగర్ లోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. జడ్చర్ల పట్టణంలోని యాసాయకుంట తెగి పలు కాలనీలు నీటమునిగాయి. పెద్దగుట్ట రోడ్డుపై కొండచరియలు విరిగిపడ్డాయి. హైదరాబాద్– శ్రీశైలం రహదారిపై దోమలపెంట వద్ద కొండచరియలు విరిగిపడి.. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మిడ్జిల్ మండలం మున్ననూర్ వాగు వద్ద కేఎల్ఐ ప్రధాన కాల్వకు గండిపడి 167 జాతీయ రహదారిపై నీళ్లు చేరాయి. ఇదే రహదారిపై మహమ్మదాబాద్‌లో రెండు చోట్ల రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి.

ఉమ్మడి నిజామాబాద్ దంచికొట్టిన వాన

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కామారెడ్డి జిల్లా పోచారం ప్రాజెక్టు నిండి అలుగు పోస్తోంది. మాచారెడ్డి, బీబీపేట, లింగంపేట, తాడ్వాయి మండలాల్లో వాగులు పొంగడంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాలాలు నీట మునిగాయి. చెట్లు కూలిపడటంతో మెదక్-ఎల్లారెడ్డి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

నేడు విద్యా సంస్థలకు సెలవు

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితి ఉందని డీఈవోలు తమ నివేదికల్లో పేర్కొన్నారు. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకుని సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఇంకా వర్షాలు కురిస్తే మంగళవారం స్కూళ్లు తెరవాలా? లేదా? అనేది ఆలోచిస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. మరోవైపు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు విశ్వవిద్యాలయం అధికారులు ప్రకటించారు. 3వ తేదీన జరగాల్సిన పలు పరీక్షలు యథావిధిగా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జేఎన్‌టీయూ పరిధిలోని అన్ని కాలేజీలు, అటానమస్ కాలేజీలకు సెలవు ప్రకటిస్తున్నట్టు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సెం.మీ.లలో)
(శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30గంటల వరకు)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
మహబూబాబాద్	ఇనుగుర్తి	43.8
వరంగల్	రెడ్లవాడ	43.5
మహబూబాబాద్	చిన్నగూడూరు	42.8
సూర్యాపేట్	ముకుందాపురం	42.5
ఖమ్మం	కాకార్‌వాయి	42.2
మహబూబాబాద్	నెల్లికుదురు	41.6
మహబూబాబాద్	పెద్దనాగారం	40.2
మహబూబాబాద్	కొమ్ములవంచ	38.9
ఖమ్మం	బాచోడు	33.6
మహబూబాబాద్	దంతాలపల్లె	33.2
మహబూబాబాద్	మల్యాల	33.0
మహబూబాబాద్	మరిపెడ	32.4
మహబూబాబాద్	అయ్యగారిపల్లె	31.9
సూర్యాపేట	లక్కవరం	31.0

ఆదివారం ఉదయం 8.30 నుంచి అర్ధరాత్రి వరకు వర్షపాతం వివరాలివీ.. (సెం.మీ.లలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
నిజామాబాద్	తూంపల్లి	21.03
కామారెడ్డి	కామారెడ్డి	19.78
కామారెడ్డి	తాడ్వాయి	18.13
కామారెడ్డి	సర్వాపూర్	17.10
కామారెడ్డి	రామారెడ్డి	16.20
కామారెడ్డి	గాంధారి	15.53
నిజామాబాద్	చిమన్‌పల్లి	15.38
మెదక్	మిన్‌పూర్	15.30
సిద్దిపేట	మిరుదొడ్డి	15.15
సిద్దిపేట	రాఘవాపూర్	14.18
సిద్దిపేట	నారాయణరావ్‌పేట్	14.08
కామారెడ్డి	లింగంపేట్	14.38
సిద్దిపేట	గాంధీపల్లి	12.98

వానలకు 18 ప్రాణాలు బలి

వానలు, వరదల ధాటికి రాష్ట్రవ్యాప్తంగా 18 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు జరుగుతోంది.

- పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో పవన్ నక్కల వాగులో కొట్టుకుపోయి మృతిచెందాడు. రామగిరి మండలం రాజాపూర్‌లో అంకరి రాజమ్మ (65) విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. కమాన్‌పూర్ మండలం జూలపల్లిలో వ్యవసాయ కూలీ ఇలాసారం కిరణ్ (36)కు ఫిట్స్ వచ్చాయి. వర్షంతో ఆస్పత్రికి తీసుకెళ్లలేకపోవడంతో మృతి చెందాడు.
- నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం ఎక్కమేడులో వర్షానికి పాత ఇల్లు పైకప్పు కూలి హన్మమ్మ (60), అంజులమ్మ (40) మృతిచెందారు.
- రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లికి చెందిన ఎరుకలి శేఖర్ (35) పల్లం చెరువులో మునిగి కన్నుమూశాడు. ఇదే జిల్లాలోని ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో రైతు యాదయ్య (50) పశువుల కొట్టానికి విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి మృతి చెందాడు.
- కుమ్రం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలం బొందగూడకు చెందిన టీకం గణేశ్ (35) గ్రామశివార్లలో వాగుదాటుతూ కొట్టుకుపోయి మృతి చెందాడు.
- ఉమ్మడి ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన తండ్రీకూతుళ్లు నునావత్ మోతీలాల్, అశ్విని.. మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయిగూడెం వద్ద వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందారు. మధిర మండలం దెందుకూరులో గేదెలు కాసేందుకు వెళ్లిన పద్మావతి వరదలో కొట్టుకుపోయి మృతి చెందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో వరద నీటిలో చిక్కుకుని ఓ యువకుడు మృతి చెందాడు. అశ్వాపురం మండలంలో తోగువాగు ఉప్పొంగడంతో ఇద్దరు పశువుల కాపర్లు కొట్టుకుపోయి మృతి చెందారు.
- వరంగల్ జిల్లా రాజీపేటలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన రాములు (58) మృతిచెందాడు. ఇదే జిల్లా దుగ్గొండి మండలం మందపల్లిలో వృద్ధురాలు కొండ్ర సమ్మక్క (75) వరద నీటిలో పడిపోయి మృతి చెందింది.
- సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన నాగం రవికుమార్ వాగు దాటే క్రమంలో కారుతో సహా కొట్టుకుపోయి మరణించాడు. ఉత్తమ్ పద్మావతినగర్ వద్ద యారమాల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి బైక్‌పై వరదను దాటుతూ ప్రమాదానికి గురై మరణించారు.

జిల్లాల వారీగా సగటు వర్షపాతం (సెం.మీ.లలో)

జిల్లా	వర్షపాతం
మహబూబాబాద్	28.43
సూర్యాపేట	20.07
ఖమ్మం	19.32
వరంగల్	15.23
భద్రాద్రి కొత్తగూడెం	14.47
నాగర్‌కర్నూల్	11.34
నల్లగొండ	10.94
జనగామ	10.91
ములుగు	10.58
మహబూబ్‌నగర్	10.04
కామారెడ్డి	9.98
కరీంనగర్	9.79
మెదక్	9.38
వనపర్తి	9.32
యాదాద్రి భువనగిరి	9.02
నారాయణపేట	8.66
రంగారెడ్డి	8.67
వికారాబాద్	8.49
ఆదిలాబాద్	7.91
సిద్దిపేట	7.26
హనుమకొండ	6.95
రాజన్న సిరిసిల్ల	6.94
సంగారెడ్డి	6.78
నిజామాబాద్	6.16
మేడ్చల్-మల్కాజిగిరి	6.14
నిర్మల్	5.28
హైదరాబాద్	5.24
పెద్దపల్లి	5.16
ఆసిఫాబాద్	4.40
జగిత్యాల	4.22
జోగులాంబ గద్వాల	3.94
జయశంకర్	2.53
మంచిర్యాల	2.49



మనిషి ఊహాశక్తి కంటే ప్రకృతి ఊహాశక్తి చాలా చాలా అత్యున్నతం.
- రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 2 సెప్టెంబర్ 2024

కళాపోసన

'ఆ.. మడిసన్నాక కూసింత కళాపోసన ఉండాలయ్యా! ఉత్తికే తిని తొంగుంటే మడిసికీ గొడ్డుకీ తేడా ఏటుంటది?'– 'ముత్యాలముగ్గు' సినిమాలో కాంట్రాక్టరు పాత్రధారి రావు గోపాలరావు పలికిన అమృతవాక్కులివి. ముళ్లపూడి వెంకటరమణ కలం నుంచి తూటాల్లా వెలువడిన మాటలివి. తెలుగునాట అమిత జనాదరణ పొందిన పది సినిమా డైలాగుల జాబితాను ఎవరైనా రూపొందిస్తే, ఈ డైలాగుకు అందులో తప్పకుండా చోటు దక్కి తీరుతుంది.

నిజమే! ఊరకే తిని తొంగున్నట్లయితే, మనిషికీ గొడ్డుకూ ఏమాత్రం తేడా ఉండదు. గొడ్డుకు లేని బుద్ధి మనిషికి ఉంది. మనిషిని ఇతర జంతుతతి నుంచి వేరు చేసేది ఆలోచనా శక్తి మాత్రమే! ఆలోచనకు పదునుపెట్టే సాధనం సృజనాత్మకత. మనిషిలోని సృజనాత్మకతకు ఫలితాలే కళలు. కొందరికి జన్మతః కళాభినివేశం ఉంటుంది. అలాంటివారు సునాయాసంగా కళలను కైవసం చేసుకోగలుగుతారు. ఇంకొందరు అభిరుచితో సాధన చేసి కళల్లో రాణిస్తారు. అభినివేశం, సాధన లేకున్నా, చాలామంది కళలను ఆస్వాదిస్తారు. కలిగిన ఆసాములు కళలను ఆదరిస్తారు. కళలు అరవై నాలుగు అని వాత్స్యాయనుడు చెప్పాడు. వీటిలో చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నృత్యం, కవిత్వం అనే అయిదు కళలూ లలితకళలుగా గుర్తింపు పొందాయి.

లలితకళలు మనుషుల భావోద్వేగాల అభివ్యక్తికి అందమైన సాధనాలు. మనుషులు తమ ఆలోచనలను, ఆనంద విషాదాది భావోద్వేగాలను; తమ కాల్పనిక ఊహాజగత్తులోని విశేషాలను, తమ సృజనాత్మకతను ఇతరులతో పంచుకోవడానికి కళలను ప్రదర్శిస్తారు. పురాతన నాగరికతలు ఊపిరి పోసుకోక మునుపటి నుంచే మనుషులు కళల ద్వారా తమ ఉద్వేగాలను చాటుకోవడం మొదలుపెట్టారు. మాటలాడటం ఇంకా నేర్చుకోని ఆనాటి మానవులు బొమ్మల ద్వారా తమ ఆలోచనలను వెల్లడించేవారు. పాతరాతి యుగం మానవులు రాతిగుహల గోడల మీద చిత్రించిన చిత్రాలే ఇందుకు ఆనవాళ్లు. నాగరికతలు మొదలైన నాటి నుంచి నేటి వరకు కళలకు– ముఖ్యంగా లలితకళలకు జనాదరణ ఉంది.

కళలు ఏవైనా సరే, వాటి ప్రయోజనం ఒక్కటే – ఆత్మప్రక్షాళన. 'దైనందిన జీవితంలో మన ఆత్మలపై పేరుకున్న ధూళిని శుభ్రం చేయడమే కళ ప్రయోజనం' అంటాడు ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో. కళలు భావోద్వేగాల ప్రసారమాధ్యమాలు మాత్రమే కాదు, ఆత్మప్రక్షాళనకు ఉపకరించే సాధనాలు కూడా! కళలు మనుషుల జీవితాలను సౌందర్యభరితం చేస్తాయి. కళలు విలువలు నేర్పుతాయి. దైనందిన జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లతో అలజడికి గురైన మనసుకు సాంత్వన నిస్తాయి. కళలు జీవితాన్ని చైతన్యవంతం చేస్తాయి. ఇంతేకాదు, కళలు సామాజిక అన్యాయాలను ఎత్తి చూపుతాయి. ఆలోచన రేకెత్తిస్తాయి. ఆత్మవిమర్శ దిశగా మనుషులను ప్రేరేపిస్తాయి. కళలు సమాజాన్ని మరింత నాగరికంగా, ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. సమాజంలోని రకరకాల సంస్కృతులకు చెందిన సమూహాల గుండెచప్పుడును వినిపిస్తాయి. కళలు సామాజిక మార్పులకు ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి.

'కళ చాలా విశాలమైనది. మనుషుల తెలివి చాలా ఇరుకైనది' అంటాడు ఇంగ్లిష్ కవి అలెగ్జాండర్ పోప్. ప్రపంచం తీరుతెన్నులను చూస్తుంటే, ఆయన మాట నిజమేననిపిస్తుంది. సామాజిక మార్పులకు ఉత్ప్రేరకాలుగా పనికొచ్చే లక్షణం కళలకు ఎంతో కొంత ఉన్నమాట వాస్తవమే అయినా, ప్రపంచవ్యాప్తంగా కళాకారులు అసంఖ్యాకంగా కళాసృజన కొనసాగిస్తూ వస్తున్నా, ఈ ప్రపంచం మారాల్సిన పద్ధతిలో ఇంకా మారలేదు. మనుషుల కురచ బుద్ధులు కూడా మారలేదు. బహుశా, జనాభాలోని అత్యధికులు కళలను ఒంటబట్టించుకోకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. కళలకు ఆదరణలేని దేశాలు నిరంతరం అలజడులు, అశాంతితో అలమటించే పరిస్థితులను చూస్తూనే ఉన్నాయి. అఫ్గానిస్తాన్‌లోని తాలిబన్ నాయకులు సంగీత ప్రదర్శనలపై నిషేధాజ్ఞలు విధించారు. అక్కడి పరిస్థితులు మనకు తెలియనివి కావు. చిత్రకళా ప్రదర్శనలపై నానా రకాల ఆంక్షలు ఉన్న ఉత్తర కొరియా పరిస్థితులు కూడా మనకు తెలిసినవే! స్వేచ్ఛ లేనిచోట కళలకు ఊపిరాడదు. ఇక స్వేచ్ఛే ఊపిరిగా బతికే కళాకారుల పరిస్థితి ఆంక్షలున్న చోట ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. నియంతృత్వ దేశాల్లో మాత్రమే కాదు, ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పుకుంటున్న చాలా దేశాల్లోనూ కళాకారులు పూర్తి స్వేచ్ఛను అనుభవిస్తున్న పరిస్థితులు లేవు.

కళలన్నీ కళాకారుల ఆత్మావిష్కరణలే! అందుకే, 'అన్ని కళలూ కళాకారుల ఆత్మకథలే! ముత్యం ఆల్చిప్ప ఆత్మకథ' అంటాడు ఇటాలియన్ దర్శకుడు ఫెడెరికో ఫెలినీ. ఆంక్షలు లేనిచోట మాత్రమే కళాకారుల ఆత్మావిష్కరణకు అవకాశాలు అపరిమితంగా ఉంటాయి. కాల ప్రవాహంలో ప్రపంచంలోని మిగిలిన మార్పులతో పాటే కళలు కూడా మారుతూ వస్తున్నాయి. కళల్లో ప్రాచీన కళ, ఆధునిక కళ అనేవి కాలానికి సంబంధించిన కొండగుర్తులు మాత్రమే! కళల అస్తిత్వం నిరంతరం.

స్వేచ్ఛలేని పరిస్థితుల వల్ల కొన్నిచోట్ల, ఆధునిక జీవనశైలిలోని తీరిక దొరకని పరిస్థితుల వల్ల కొన్నిచోట్ల మనుషులు కళలకు దూరమవుతున్నారు. దొరికే కొద్దిపాటి తీరిక సమయాన్ని టీవీ, స్మార్ట్‌ఫోన్ వంటివి అందించే యాంత్రిక వినోదంతో సరిపెట్టుకుంటున్నారు. ఫలితంగా మానసిక సమస్యలతో సతమతమవుతున్నారు. అయితే, కళాస్వాదన, కళా సాధనల వల్ల మనుషుల్లో మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఇటీవల బ్రిటిష్ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. మరందుకే మడిసన్నాక కూసింత కళాపోసన ఉండాల! లేకపోతే బతుకులు గొడ్డుదేరిపోవూ!

జనం గుండెల్లో నిండిన దేవుడు

స్మృతిపథం



ఉండవల్లి అరుణ్‌కుమార్

ప్రజా సంక్షేమం కోసం అనుక్షణం పరితపించిన నాయకుడాయన. పేదవాడి ముఖంపై చిరునవ్వు వెలిగించడానికి నిరంతరం శ్రమించిన కార్మికుడాయన. జలయజ్ఞంతో రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చిన కర్షక భగీరథుడాయన. సర్కారీ పాలనలోనే కాదు... స్నేహంలోనూ, సాయంలోనూ వై.ఎస్. రాజశేఖరరెడ్డిది ఓ అరుదైన వ్యక్తిత్వం. మనుషుల గుండెల్లో చిరకాలం చెరిగిపోని సంతకం. జనహృదయ విజేత వైఎస్ 2009లో అకాల మరణం చెందినప్పుడు ఆయన ఆప్తుడు, నాటి కాంగ్రెస్ నేత ఉండవల్లి అరుణ్‌కుమార్ తన గుండె లోతుల్లో నుంచి 'సాక్షి'తో పంచుకున్న అనుభవాల మాలిక ఈ వ్యాసం.

నేడు వైఎస్ 15వ వర్ధంతి సందర్భంగా నాటి కథనాన్ని నవతరం పాఠకుల కోసం మరోసారి అందిస్తున్నాం.

గాంధీభవన్‌లో మీటింగ్... పీసీసీ అధ్యక్షులు ఎం. సత్యనారాయణరావు గారు, సీఎల్పీ లీడర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారు కూర్చున్నారు. ఏదో అర్జంట్ మీటింగ్! అందుబాటులో ఉన్న నాయకులందరినీ పిలిచారు. ప్రెసిడెంట్ గారి రూంలోనే మీటింగ్. ముప్పై కుర్చీల దాకా వేశారు. నేను బాగా చివరి వరుసలో మూలగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను. 'అరుణ్! ముందుకు రావయ్యా... ఇక్కడ ఖాళీగా ఉంది గదా!' అంటూ ముందు వరుసలో కూర్చోమని ఆహ్వానించారు సత్యనారాయణ గారు. 'ఎందుకు సార్... మళ్లీ ఎవరైనా పెద్ద లీడరొస్తే లేచి వెనక్కి రావాలి. ఇక్కడ కూర్చుంటే ఎవ్వరొచ్చినా లేవక్కర్లేదు' అన్నాను నవ్వుతూ. అన్ని సీట్లూ నిండిపోయాయి. మీటింగ్ ప్రారంభమైంది. ఏదో నోట్ చేయాల్సిన అవసరమొచ్చింది. 'అరుణ్! ముందుకు రావయ్యా!' అంటూ వైఎస్ గారి పక్కనే కుర్చీ వేయించి నన్ను కూర్చోపెట్టారు. నేను, వైఎస్ గారితో అన్నాను... 'చూశారా సార్! టైం వచ్చినప్పుడు చివరాఖర్న కూర్చున్నా తీసుకొచ్చి ముందు కూర్చోపెడ్తారు.' 'అవును అరుణ్! ఇది బైబిల్‌లో ఉంది... తనను తాను తగ్గించుకొనువాడు హెచ్చించబడును, తనను తాను హెచ్చించుకొనువాడు తగ్గించబడును'. నా జీవితంలో మర్చిపోలేని సందేశమిది. అప్పట్నుంచి నేనేనాడూ నా గురించి నేను గొప్పగా ఊహించుకోలేదు. ఎవరైనా పొగుడుతుంటే వైఎస్ గారి వాక్యమే గుర్తుతెచ్చుకుంటూ ఉండేవాడిని. 2009 ఎన్నికల ఫలితాలపై వైఎస్ మాట్లాడుతూ, 'ప్రజలు మాకు పాస్ మార్కులే వేశారు. ఇది ఘన విజయంగా నేను భావించడం లేదు. గర్వం వీడి అణకువతో ప్రజలకు దగ్గరకండి' అంటూ తనను తాను తగ్గించుకుంటున్నప్పుడు ఆయన మరింత హెచ్చించబడతాడనే అనుకున్నాను గానీ ఆ హెచ్చు మరీ ఇంత ఎక్కువగా ఉంటుందనీ... ఎవరికీ అందనంత ఎత్తులోకి వెళ్లిపోతారనీ కలలోనైనా ఊహించుకోలేదు.

ఎవరైనా ఇతర ప్రాంతాల నుంచి నాయకులొస్తే వారి ఉపన్యాసాలను నేను అనువదించాలి. ఈ విషయంలో మాత్రం ఇంకెవర్నీ ఒప్పుకునేవారు కాదు వైఎస్ గారు! చాలాసార్లు కొందరు నాయకులు లోపల్లోపల గొణుక్కుంటూ ఉండేవారు 'వీడే చెయ్యాలా ట్రాన్స్‌లేషన్... ఆ మాత్రం అనువాదకులు మనూళ్లో లేరా...' అని!! కొన్నిసార్లు బాహాటంగా పత్రికల్లోనే విమర్శించారు. రాజీవ్‌గాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్ గాంధీ – ఎవరొచ్చినా వారితోపాటు వేదిక మీద నాకూ కుర్చీ వేసేవారు! నాకన్నా సీనియర్లు, మంత్రులు, పెద్ద నాయకులు ఎంతోమంది కింద కూర్చోవటం, కేవలం అనువాదకుడినైన కారణంగా నేను వేదిక మీద కూర్చోవటం కొంతమందికి మింగుడుపడేది కాదు. కానీ ట్రాన్స్‌లేషన్ విషయంలో మాత్రం వైఎస్ కాంప్రమైజ్ అయ్యేవారు కారు.

రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ ప్రోగ్రాం అనంతపూర్‌లో ప్రారంభించారు. ప్రధాని మన్మోహన్‌సింగ్, అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రఘువంశప్రసాద్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి మణిశంకర్ అయ్యర్ ప్రసంగించారు. నన్ను సోనియాగాంధీ గారికి కేటాయించి, మిగతా ముగ్గురికీ ఇంకో ముగ్గురు నాయకులను ట్రాన్స్‌లేషన్‌కి ఏర్పాటు చేశారు. సరిగ్గా అందరూ స్టేజీ మీద కూర్చున్నాక వైఎస్ గారికి ఈ ఏర్పాటు సంగతి తెలిసింది. ఆయన ససేమిరా అంగీకరించలేదు. మొత్తం నలుగురికీ నేనే అనువాదం చెయ్యాలన్నారు. 'సుమారు నలుగురు మాట్లాడేదీ ఒకటే ఉంటుంది. మళ్లీ మళ్లీ అదే నేనొక్కడినే రిపీట్ చేస్తే జనానికి బోర్ కొడ్తుందేమో సార్' అన్నాను. 'చెప్పినట్లు చెయ్! నో మోర్ ఆర్గ్యుమెంట్!' అన్నారు. నలుగురి స్పీచ్‌లూ నేనే అనువదించాను. 'ఇంటర్ప్రెటేషన్ కావాలి, ట్రాన్స్‌లేషన్ కాదు. లక్షల మంది పాల్గొన్న సభ, ఎక్స్‌పెరిమెంట్లు చేయటం పద్ధతి కాదు' అన్నారాయన.

నాకు అప్పుడు పదేళ్ల క్రితం జరిగిన ఒక అనువాద సంఘటన గుర్తుకొచ్చింది.



ఆ రోజుల్లో వైఎస్‌తో ఉండవల్లి

విశాఖలో గాజువాక దగ్గర రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ. రాజేష్ పైలట్, అహ్లూవాలియా, వైఎస్, ద్రోణంరాజులతో కలిసి కార్లలో గాజువాక వెళ్తున్నాం. రాజీవ్‌గాంధీ చిరునవ్వు ముఖంలో మృత్యుకళ ప్రవేశపెట్టడం ఆ దేవుడి వల్ల కాలేదనీ... అందుకే అందమైన ఆ ముఖం నిర్జీవమైనప్పుడు ఎలాగుంటుందో చూపించలేని ఆ దేవుడు, అసలు ఆ ముఖమే లేకుండా చేసేశాడని వైఎస్ గారితో చెప్పాను. ఈ మాటలు రాజశేఖరరెడ్డి గారి స్పీచ్‌లో చెప్పమన్నాను. ఆయన వద్దన్నారు. 'ఇంత వివరంగా నువ్వే చెప్పగలవు. నువ్వే చెప్పు' అన్నారు. 'సార్! నేను అనువాదకుణ్ణేగానీ వక్తను గాను. రాజేష్ పైలట్, లేదా అహ్లూవాలియానో ఈ మాటలంటే నేను అనువదించగలను గానీ వాళ్లనకుండా నేనెలా చెప్తాను' అన్నాను. 'అక్కడికేదో వాళ్లు చెప్పింది మాత్రమే నువ్వు చెబుతున్నట్టు పోజు పెట్టకోయ్... అయినా నువ్వు చేసేది భావానువాదం, భాషానువాదం కాదు! భావం మారకుండా ఈ పదాలు జొప్పించు' అన్నారు వైఎస్. అహ్లూవాలియా మాట్లాడుతూ రాజీవ్ మరణాన్ని విశ్లేషిస్తుండగా... నేను అనువాదం చేస్తూ, పైన చెప్పిన నాలుగు మాటలూ కలిపేశాను. సభలో ఊహించని రెస్పాన్స్. వైఎస్ గారు మీటింగ్ అయిపోయాక నా భుజం తట్టారు. ఇప్పుడనిపిస్తోంది... ఎప్పుడూ నవ్వుతూ ఉండే వైఎస్ ముఖంలో సైతం మృత్యువును ప్రవేశపెట్టడం ఆ భగవంతుని వల్ల కాలేదనీ, అందుకే హెలికాప్టర్ ప్రమాదంలో ఛిన్నాభిన్నమైన ఆ శరీరం కోట్లాదిమంది అభిమానుల ఆఖరి చూపులకు కూడా నోచుకోలేదని!



ఇద్దరు మనుష్యుల మధ్య సంబంధాలు... ఇచ్చిపుచ్చుకోవటాలతో బలపడుతుంటాయి. ఒకరికొకరు సహాయపడుతూ ఆప్తులవుతారు. వైఎస్ గారితో నా సంబంధం తల్చుకుంటే... నాకు ఆశ్చర్యమేస్తుంది! ఎప్పుడూ ఆయన వల్ల నాకు జరిగిన ఉపకారాలే తప్ప... నా నుంచి ఆయన కోసం వీసమెత్తు కంట్రిబ్యూషన్ కూడా లేదు. కనీసం వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేయడానికి కూడా... కావల్సిన కులబలం, ధనబలం లేని నన్ను రెండుసార్లు అసెంబ్లీకి, రెండుసార్లు పార్లమెంట్‌కీ పోటీ చేయించారు. ఎక్కడో లక్షలాదిమంది మధ్య నుంచొని రాజీవ్‌గాంధీ ఉపన్యాసానికి చప్పట్లుకొట్టే స్థాయి కాంగ్రెస్ కార్యకర్తనైన నన్ను సాక్షాత్తూ ఆ రాజీవ్‌గాంధీ పక్కనే నిలబెట్టారు. అగ్రనాయకులందరూ అడ్డుపడ్డా... నేనే బాగా అనువదిస్తానని, వారితో వాదించి – వారిని వారించి నాకు ఢిల్లీ స్థాయి నాయకులందరి పక్కనా ఉండే స్థాయి కల్పించారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ స్థాయి నాయకులు నన్ను పేరెట్టి పిలిచే స్థానంలోకి పంపించారు. నేనేనాడూ ఆయన్ని 'నాకిది కావాల'ని అడగలేదు. మొన్నటి (2009) ఎన్నికలకు మూడు నెలల ముందు మాత్రం ధైర్యం చేసి ఒక్క రిక్వెస్ట్ చేశాను... 'ఈసారి ఎన్నికల్లో నన్ను పోటీ చేయించవద్ద'ని! అప్పటికే రామచంద్రరావు గారి దగ్గర ఈ ప్రతిపాదన చేసి చాలా తిట్టించుకున్నాను. అందుకే వైఎస్ గారితో నెమ్మదిగా ఈ విషయం చెప్పాను. హైదరాబాద్ శివార్లలో ఒక సభకు హాజరవ్వటానికి బయలుదేరుతున్న వైఎస్, తనతో పాటు కారెక్కమన్నారు. సుమారు ఇరవై నిమిషాల ప్రయాణం. దారిలో ఆయనకి ఎక్స్‌ప్లెయిన్ చేశాను. ఈసారి నాకెంత ప్రతికూల పరిస్థితులున్నాయో... నేను నెగ్గటం ఎంత అసాధ్యమో వివరించాను. 'ఇప్పుడు నువ్వు పోటీ చేయకపోవడం కరెక్ట్ డెసిషన్ కాదు. నువ్వు చెప్పిందంతా నిజమే, అయినా నువ్వే గెలుస్తావు... డోంట్ వర్రీ గాడ్ ఈజ్ దేర్' అన్నారు వైఎస్.

అది 2009 సెప్టెంబర్ 3. ఆ రోజు వినాయక నిమజ్జనం. హైదరాబాద్ నగరమంతా అల్లకల్లోల సునామీ సముద్రంలా ఉండేరోజు. వైఎస్ మరణవార్త నెమ్మది నెమ్మదిగా జనానికి చేరుతోంది. నిశ్శబ్దంగా నిమజ్జనం ప్రారంభమయ్యింది. ప్రతి ముఖంలో దుఃఖం, ఎంతో మంది మహానాయకుల మరణవార్తల్ని విన్నాం, కళ్లారా చూశాం. 'ఆ వార్త వినగానే గుండె పగిలింది' అంటూ చాలాసార్లు అంటుంటాం. ఇంతకాలం ఇదొక పద ప్రయోగమే... మహా అయితే పదాలంకారమో అనుకున్నాగానీ... నిజంగా గుండె పగిలి చచ్చిపోయేంత దుఃఖం ఉంటుందని నాకు ఇప్పుడే తెలిసింది. ఇంట్లో అందొచ్చిన కొడుకు చచ్చిపోతే ఏడ్చినట్టుగా ఏడుస్తున్న వృద్ధులు... 'రేపు నా బిడ్డల పరిస్థితేమి'టంటూ పిల్లల తల్లులు... ఫ్రీగా ఇంజనీరింగ్ చదువుకుంటున్న విద్యార్థులు... రాష్ట్రమంతా వెక్కివెక్కి ఏడ్చింది. కొన్ని వందల గుండెలు నిజంగానే పగిలిపోయాయి. యాక్సిడెంట్ కన్‌ఫర్మ్ అయి వైఎస్ మృతదేహాన్ని గుర్తించారని తెలిసిపోయాక, సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి గారి ఫ్లోర్‌లోకి వెళ్లాను. ఆయనతో నాకున్న సంబంధం, ఆయన నాపై చూపిన ప్రేమాభిమానాలూ మనసులో రీళ్లు తిరగసాగాయి. ఒక మాట దగ్గర రీల్ ఆగిపోయింది. 'డోంట్ వర్రీ,,, గాడ్ ఈజ్ దేర్.' నేను తప్పుగా విన్నాను ఆయనన్న మాట... 'డోంట్ వర్రీ గాడ్ ఈజ్ హియర్!' అని అయి ఉంటుంది. నేనుండగా నీకెందుకు వర్రీ!! నా సంకల్పమే నీకు దైవం. నా బలమే నీకు దైవబలం. ఇంకా తెలియలేదా అరుణ్... నేనెవరినో!!

వైఎస్ గారితో నేను మాట్లాడిన మాటలు, వెటకారాలు, వేళాకోళాలు, జోకులూ అన్నీ గుర్తుకొచ్చి నెమ్మదిగా వెన్నులో వణుకు పుట్టింది. ఆయనతో మాట్లాడేటప్పుడు ఏమి అనాలనిపిస్తే అది అనేసేవాడిని. ఎవరేమనుకుంటారో, అనొచ్చో-లేదో... అని ఏనాడూ సంకోచించలేదు. ఎన్నిసార్లు నా మాటలు ఆయనకు నచ్చకపోయి ఉండొచ్చో... ఎన్నిసార్లు ఆయనకు నా మాటల వల్ల బాధ కలిగిందో... హఠాత్తుగా నాకు 'భగవద్గీత'లోని ఒక శ్లోకం (11: 42) గుర్తుకొచ్చింది.

అర్జున ఉవాచ :

''యచ్చావహా సార్థ మసత్కృతోసి
విహార శయ్యాసన భోజనేషు
ఏకోథ వాప్యచ్యుత తత్సమక్షం
తత్ క్షామయే త్వామహ మప్రమేయమ్''

(విశ్వరూప సందర్శన యోగం)

''కృష్ణా! నాశరహితా! నీ ఈ మహిమ తెలియక పొరపాటున గానీ, చనువు వల్ల గానీ ఓ కృష్ణా, ఓ యాదవా, ఓ సఖా అని అలక్ష్యముగా నేనేమి అన్నానో... విహారము సల్పునపుడుగానీ, పరుండునప్పుడుగానీ, కూర్చుండునప్పుడు గానీ, భుజించినప్పుడు గానీ, ఒక్కడవుగా ఉన్నప్పుడుగానీ, ఇతరుల యెదుట పరిహాసముగా గానీ ఏ విధంగా ప్రవర్తించితినో నా అపరాధములన్నీ అప్రమేయుడవగు నీవు క్షమించమని వేడుకొనుచున్నాను.''

తండ్రీ! ఓ రాజశేఖరరెడ్డీ! నన్ను క్షమించు... అనుగ్రహించు!!

– వ్యాసకర్త ప్రముఖ రాజకీయ నాయకుడు, పార్లమెంట్ మాజీ సభ్యుడు

ప్రజల బాగు కోరిన పాలకుడు

సందర్భం



తిరుమలగిరి సురేందర్

ముఖ్యమంత్రి పదవిని లక్కీ లాటరీలా పొందిన వారు కొందరు, పైరవీలతో చేజిక్కించుకున్న వారు కొందరు, తెలివిగా పావులు కదిపి సాధించిన వారు కొందరు... ఈ కేటగిరీల్లో కాంగ్రెస్ ఏలుబడిలోని రాష్ట్రాల్లో ఎందరినో చూశాం. పూర్తి ప్రజాదరణతో ఒకే ఒక్కడై నిలిచి, గెలిచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించిన వ్యక్తి... కాదు శక్తి... డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే! జమ్మలమడుగులో పుట్టి, స్వగ్రామం పులివెందులలో, బళ్లారిలో చదివి, గుల్బర్గాలో మెడిసిన్ చేసి డాక్టరుగా పులివెందులలో రూపాయి డాక్టరుగా ఊరి జనానికి చేరువయ్యారు.

చిన్ననాటి నుండీ గాంధీ, నెహ్రూలపై పెరుగుతూ వస్తున్న అభిమానం ఆయనను కాంగ్రెస్‌కు చేరువ చేసింది. పులివెందుల డిగ్రీ కాలేజీ స్థాపించి విద్యాభివృద్ధికీ, 20 పడకల ఆసుపత్రి నిర్మించి, పేదలకు ఉచిత వైద్యం చేసి ఊరి చుట్టుపక్కల ప్రజలకూ దగ్గరయ్యారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడై 1978లో కాంగ్రెస్ చీలిక రాగా 'రెడ్డి కాంగ్రెస్' ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రతిసారీ గెలుస్తూ వచ్చారు. యువజన సర్వీసులు, ఎక్సైజ్, విద్యా శాఖలకు మంత్రిగా పనిచేశారు. రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో తన నాయకత్వంలో 91 స్థానాలు గెలుచుకుని ప్రతిపక్ష నాయకుడిగా సత్తా చాటారు. 2004 ఎన్నికలకు ఏడాది ముందు జనంలోకి వెళ్ళారు. ఆ ఏడాది ఏప్రిల్ 9న రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో పాదయాత్రకు శ్రీకారం చుట్టి, ఆంధ్రప్రదేశ్ చివరి గ్రామం ఇచ్ఛాపురం వరకూ దాదాపు 1600 కిలోమీటర్లు వైఎస్ పాదయాత్ర చేశారు. దారి పొడవునా, గ్రామ గ్రామాన ప్రజల కష్టనష్టాలను కళ్ళారా చూశారు. చెవులారా విన్నారు. భగ్గున మండుతున్న ఎండల్లో కాలినడకలో ప్రజలు ఎన్నెన్ని అవస్థలు పడుతున్నారో గమనించారు.

ఓ పక్క కరువు, మరోవంక గంజినీళ్లకు కూడా నోచుకోని అభాగ్యులు, విద్యుత్ కొరత వల్ల బోర్లు పనిచేయక అచేతనులైన రైతన్నల దౌర్భాగ్య స్థితి, నిరుద్యోగుల నిస్తేజం... ఇవన్నీ ఆయనను కొత్త మనిషిగా తీర్చిదిద్దాయి. 'ఇందిరమ్మ రాజ్యం' తెస్తాననీ, అన్ని కష్టాల నుంచి గట్టెక్కిస్తాననీ ప్రజలకు మాటిచ్చారు. నమ్మకం కలిగించారు. వ్యవసాయ ప్రధానమైన గ్రామీణ ప్రజలకు విద్యుత్ చార్జీలు భారం కావడం, ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియని కరెంటు సరఫరా ప్రాథమిక అవరోధంగా గుర్తించి 'ఉచిత విద్యుత్' హామీ ఇచ్చి ముఖ్యమంత్రిగా తొలి సంతకం ఆ ఫైలు పైనే చేస్తానన్నారు. సరిగా పండక, అరకొర దిగుబడి తెగనమ్మితే పెట్టుబడి ధర కూడా రాక రైతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్న వార్తలు విని, చదివి ఆయన చలించి పోయారు. వివిధ వర్గాల ప్రజల జీవన్మరణ సమస్యలను ఎలాగైనా సరే పరిష్కరించాలని నిశ్చయించుకున్నారు. పాదయాత్ర క్రమంలో రాజమండ్రి నగరం వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజుల విశ్రాంతి అనంతరం మళ్ళీ నిర్విరామంగా ఇచ్ఛాపురం వరకూ నడక సాగించి, 64 రోజుల పాదయాత్ర (3 రోజుల విరామంతో కలిపి 67 రోజులు) లక్ష్యం పూర్తి చేశారు.



అంతలో 2004 ఎన్నికల నగారా మోగింది. వైఎస్ హైదరాబాద్ తిరిగి పయనమయ్యారు. అంతకు పదేళ్ళ ముందు 1994 ఎన్నికల్లో ఎన్టీఆర్ అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రి అయ్యారు. కొద్దికాలానికే ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుణ్ణి చేసి, తెలుగుదేశం పార్టీని హైజాక్ చేసి, ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు చంద్రబాబు. అలాంటి చంద్రబాబు బీజేపీ ఆసరా తోడై, 1999లో మళ్ళీ అధికార పగ్గాలు చేపట్టారు. ప్రజలంటే గొట్టెలనీ, ఎన్నికలంటే కాస్త పేరున్న పార్టీతో జతకట్టి సునాయాసంగా గెలవచ్చనీ పాత అనుభవ పాఠాల ద్వారా నమ్మి, ఈసారి 2004 ఎన్నికల బరిలోకి దూకారు. అలిపిరి మందుపాతర పేలుడులో త్రుటిలో బతికి బయటపడిన ఘటన సానుభూతి తెచ్చి గెలిపిస్తుందని నమ్మారు. సానుభూతి చల్లారకుండా ముందస్తు ఎన్నికలకు చంద్రబాబు దిగారు. ప్రచార పర్వంలో ఎక్కడా సానుభూతి జాడలేదు సరికదా ప్రజాగ్రహం ఎదురైంది. కాంగ్రెస్ అఖండ విజయం, వైఎస్ ముఖ్యమంత్రి కావడం చకచకా జరిగిపోయాయి.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 2004 మే 14న హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో ప్రజా సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు వైఎస్. ఇచ్చిన మాట ప్రకారం ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేశారు. అది మొదలు ప్రజలకు ఎలా మేలు చేయాలన్న ఆలోచన తప్ప ఆయనకు మరొకటి లేదు. రైతులకు సహకార రుణమాఫీ కోసం కేంద్రాన్ని ఒప్పించారు. పీకల లోతు అప్పుల్లో మునిగి ఉన్న రైతులకు రుణ విముక్తి కలిగించారు. 'ఆరోగ్యశ్రీ'తో అత్యంత ఖరీదైన వైద్యాన్ని నిరుపేదలకు అందించారు. పేదరికం కారణంగా పౌష్టికాహార లోపంతో గుండెజబ్బుల బారిన పడిన పసిపిల్లలకు ఉచిత శస్త్రచికిత్సలు చేయించారు.

'108 వాహనం' ద్వారా అత్యవసర అంబులెన్సు వాహనాలను రాష్ట్రమంతటా అందుబాటులోకి తెచ్చారు. బీసీ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య కోసం 'ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్' పథకాన్ని ప్రవేశపెట్టారు. ముస్లిమ్ మైనారిటీ విద్యార్థులకు 4 శాతం రిజర్వేషన్లతో ఇంజనీరింగ్ విద్యను అందించారు. 'జలయజ్ఞం'తో భారీ, మధ్యతరహా, చిన్నతరహా సాగునీటి ప్రాజెక్టులను రాష్ట్రం నలుమూలలా విస్తరించే పథకాలకు శ్రీకారం చుట్టారు. కోటి ఎకరాల సాగుభూమితో రాష్ట్రం అన్నపూర్ణగా విరాజిల్లాలని పట్టుదలతో కృషి చేసారు. అంతకు ముందు నామమాత్రంగా ఉండే వికలాంగ, వృద్ధాప్య పింఛన్లను ఇబ్బడిముబ్బడిగా పెంచారు. ఎస్సీ, ఎస్టీ పథకాల రుణమాఫీతో ఊరట కలిగించారు.

'ఇందిరమ్మ ఇళ్ల'ను 'ఇందిరమ్మ ఊళ్ళు' అనేలా గణనీయంగా నిర్మించారు. ప్రకృతి కూడా పరవశించిందేమో... హర్షాతిరేకంతో వర్షాలను చాలినంతగా రాష్ట్రమంతటా కురిపించింది. గ్రామదేవతల, దేవాలయ ఉత్సవాలు ఊరూరా పునః ప్రారంభమయ్యాయి. దేశం ఆంధ్రప్రదేశ్ వైపు తల తిప్పి చూడసాగింది. కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు సైతం 'ఆరోగ్యశ్రీ'తో పాటు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన మరికొన్ని పథకాలను తమ రాష్ట్రంలో అమలు చేశారు.

2009 ఎన్నికల్లోనూ వైఎస్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారం కైవసం చేసుకుంది. రెండోసారి ముఖ్యమంత్రిగా అధికార పీఠాన్ని అధిష్ఠించి, మరింత జాగరూకతతో సాగుతూ, పథకాల అమలు తీరు ఎలా ఉందో ప్రజల నుండి నేరుగా తెలుసుకోవాలన్న కోరికతో 'రచ్చబండ' ప్రవేశపెట్టారు. తొలి సమావేశానికి హాజరవడానికి హెలికాప్టర్‌లో చిత్తూరు జిల్లాకు పోయే క్రమంలో వాతావరణం ప్రతికూలించింది. కంట్రోల్ రూముతో సంబంధాలు తెగిపోయాయి. మరునాడు ఊహించని విషాద వార్త వెల్లడైంది. 'నల్లమల అడవుల్లో హెలికాప్టర్ కూలిపోయింది. వైఎస్ ఇకలేరు'! ఈ వార్తను తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 గుండెలు ఆగిపోయాయి. ఇంతగా ప్రేమను పొందిన నాయకుడు చరిత్రలో మరొకరు లేరు.

2009 సెప్టెంబరు 3వ తేదీ జన హృదయ విజేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఇక లేరని లోకానికి తెలిసిన రోజు. అదే రోజు గణేశ నిమజ్జనం. 'గణేశ్ మహారాజ్‌కీ జై', 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో, పిల్లలు, పెద్దలు సహా అశేష జనసందోహంతో, నృత్యాలు, ఆటపాటలు, టపాసుల, డప్పులు, ఆర్కెస్ట్రాల కోలాహలంతో 24 గంటలపాటు నిర్విరామంగా సాగాల్సిన హైదరాబాద్ గణేశ్ నిమజ్జనోత్సవం అంతే జనంతో నిర్వికారంగా, ఎటువంటి ఆర్భాటం లేకుండా ఒక మహా మౌనప్రదర్శన అన్నట్టుగా సాగిపోయింది. లెక్కకు మిక్కిలిగా పూనుకున్నా జరగదనిపించే ఆ సంఘటన ఆ జననేత పట్ల గొప్ప గౌరవానికి తార్కాణం. 'పథకాలంటే ఇవీ, పరిపాలన అంటే ఇదీ, పాలకుడంటే ఇలా...' అని మామూలు వ్యక్తుల నుండి మేధావుల దాకా అనుకునేలా సాగిన ఆయన రాష్ట్ర నాయకత్వ హయాం 'న భూతో న భవిష్యతి!'

– వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు, ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** అమావాస్య పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** మఖ రా.12.32 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.11.38 నుండి 1.18 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.10.01 నుండి 11.42 వరకు, పోలాల అమావాస్య ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.12.

గాలిలో రైలు పట్టాలు..

- రైల్వే సిబ్బంది, అధికారుల అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదాలు..

సాక్షి, మహబూబాబాద్/ డోర్నకల్/ మహబూబాబాద్ రూరల్/ కేసముద్రం: మహబూబాబాద్ జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో నాలుగు చోట్ల రైల్వే లైన్లు దెబ్బతిన్నాయి. వరద తాకిడికి పట్టాల కింద సిమెంట్ దిమ్మెలు, కంకరరాళ్లు, మట్టి కొట్టుకుపోయి ఊయలలా పట్టాలు వేలాడుతున్న విషయాన్ని రైల్వే సిబ్బంది పసిగట్టడం.. అప్రమత్తమైన అధికారులు ఎక్కడిక క్కడ రైళ్లను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

అయోధ్య పెద్దచెరువు కట్ట తెగడంతో..

మహబూబాబాద్ రూరల్ మండలం అయోధ్య పెద్ద చెరువు కట్ట తెగడంతో వరద నీరు ఉధృతంగా తాళ్లపూసపల్లి సమీపంలో రైల్వేట్రాక్ కిందినుంచి వెళ్లింది. దీంతో కొత్తగా వేస్తున్న విజయవాడ–సికింద్రాబాద్ లైన్‌తోపాటు, పాత లైన్ల కింద ఉన్న మట్టి, కంకర రాళ్లతోపాటు, సిమెంట్ దిమ్మెలు కూడా కొట్టుకుపోయాయి. దీంతో ఆరు నుంచి పది అడుగుల మేరకు గొయ్యిపడి పట్టాలు గాలిలో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. అదేవిధంగా కేసముద్రం విలేజీ పెద్ద చెరువు, దామర చెరువు, ఇంటికన్నె చెరువుల వరదతో ఇంటికన్నె, కేసముద్రం మధ్యలో వరద తీవ్రత పెరిగి ట్రాక్ అడుగు భాగం అంతా కొట్టుకుపోయింది. దీంతో ఇంటికన్నె–కేసముద్రం మధ్య 200 మీటర్ల మేర, తాళ్లపూసపల్లి–మహబూబాబాద్ మధ్యలో ఒక చోట 50 మీటర్లు, మరోచోట 10 మీటర్ల మేరకు పట్టాల కింద మట్టి కొట్టుకుపోయి ట్రాక్ తీవ్రంగా దెబ్బతిన్నది. అదేవిధంగా నెక్కొండ– వరంగల్ మధ్య రెండు మీటర్ల మేర గొయ్యి పడింది.

వేలాది మంది ప్రయాణికులతో ఉక్కిరి బిక్కిరి

ట్రాక్‌లు దెబ్బతిన్న విషయాన్ని ముందుగానే గుర్తించిన అధికారులు కేసముద్రంలో సంఘమిత్ర రెండు రైళ్లు, మహబూబాబాద్‌లో సింహపురి, మచిలీపట్నం, డోర్నకల్‌లో పద్మావతి, అప్, డౌన్ రెండు గౌతమి రైళ్లు నిలిపి వేయడంతో సుమారు పదివేలకు పైగా ప్రయాణికులు ఒక్కసారిగా మూడు స్టేషన్‌లలో దిగారు. రైళ్లు ఎప్పుడు వెళ్తాయో తెలియకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. కొందరు ప్రైవేట్ వాహనాలలో వెళ్లగా, మరికొందరు లాడ్జీలు తీసుకొని ఉన్నారు. ఎటూ వెళ్లలేని వారు స్టేషన్లలోనే ఉండటంతో మహబూబాబాద్, కేసముద్రం, డోర్నకల్ ప్రాంతాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు వారికి పండ్లు, బిస్కెట్లు, టిఫిన్, మధ్యాహ్న భోజనం, మంచినీరు, మందులు అందజేశారు.



తాళ్లపూసపల్లి వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్

సార్లకు సమాచారం ఇచ్చాను..



నేను కేసముద్రం– ఇంటికన్నె లైన్‌లోని 550 ఆర్‌ఏఎఫ్‌టీ వద్ద ఉన్నా. పైనుంచి వరద పెరిగింది. అప్పటికే నా వద్దకు వచ్చిన పెట్రోలింగ్ టీమ్‌తో మాట్లాడి విషయం ముందుగా ఎస్ఎస్ఏ శ్రీనివాస్‌కు, తర్వాత రాజమౌళికి ఇచ్చాం. ట్రైన్ల వేగం తగ్గించారు. తర్వాత కూడా వరద పెరగడంతో కాషన్ ఆర్డర్ ఇవ్వాలని కోరాం.
– మోహన్, ట్రాక్‌మన్, ఇంటికన్నె

వారిద్దరి సమాచారంతో రైళ్లు ఆపేశాం



గతంలో జరిగిన వరద అనుభవాల దృష్ట్యా రైల్వే లైన్లకు ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక వాచ్‌మెన్లను పెట్టాం. ట్రాక్‌మన్ సమాచారంతో అప్రమత్తమై రోడ్డు మార్గంలో నేను 575 రైల్వే ఎఫెక్టెడ్ ట్యాంక్ వద్దకు వెళ్లాను. అప్పటికే పరిస్థితి విషమించింది. వరద పెరిగింది. విషయాన్ని పై అధికారులకు చేరవేశా. దీంతో ఎక్కడి రైళ్లు అక్కడ ఆపేశారు.– రాజమౌళి, సీనియర్ రైల్వే సెక్షన్ ఇంజనీర్

ప్రమాద స్థాయి గమనించాను



నేను తాళ్లపూసపల్లి– కేసముద్రం లైన్‌లోని 575 ట్యాంకు వద్ద ఉన్నా. సాయంత్రంనుంచి గంట గంటకూ వరద ఉధృతి పెరుగుతోంది. ప్రమాద స్థాయికి చేరుతుందని గమనించి రాత్రి 12 గంటల సమయంలోనే మా ఎస్ఎస్ఈ రాజమౌళికి చెప్పా. గస్తీ వాళ్లకు సమాచారం ఇచ్చి ఆయన వచ్చారు. రైళ్లు ఆపేశాం.
– జగదీశ్, ట్రాక్‌మన్, తాళ్లపూసపల్లి

భారీవర్షాలతో జాగ్రత్త

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 24 గంటలపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశ ముందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో.. లోతట్టు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. కొన్నిచోట్ల చెరువులు తెగాయని, ఈ నేపథ్యంలో ప్రాణ నష్టం సంభవించకుండా యుద్ధప్రాతిపదికన అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ కార్యకర్తలు సహాయక చర్యల్లో నిమగ్నమవ్వాలని కోరారు.

ఉద్యోగులు అప్రమత్తంగా ఉండండి

- జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి కోరారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూనే ఉద్యోగులంతా సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకెళ్లాలని ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వ ఉద్యోగులను కోరారు.

48 గంటలు నిర్మాణ పనులు బంద్

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే 48 గంటల పాటు గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్మాణ పనులు నిలిపి వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు క్రెడాయ్ హైదరాబాద్ సభ్యులకు, ఇతర బిల్డర్లకు సూచించారు. నిర్మాణ పనులు జరిగే ప్రాంతాల వద్ద గుమికూడి ఉండవద్దని, ఈ మేరకు ఆయా నిర్మాణ సంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలు పడుతుండటంతో సెల్లార్లు, గోడలు, నిర్మాణాలు కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ఆన్ సైట్ల వద్ద కార్మికులు నివసించకూడదని సూచించారు.

భారజల కర్మాగారంలో నిలిచిన ఉత్పత్తి

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆదివారం భారీ వర్షాలు ముంచెత్తగా.. అశ్వాపురం మండలంలోని మణుగూరు భారజల కర్మాగారాన్ని షట్‌డౌన్ చేశారు. ప్లాంట్‌లోని ప్రధాన విభాగమైన క్యాప్టివ్ పవర్ ప్లాంట్ (సీపీపీ)కు విద్యుత్ సరఫరా అయ్యే 220 కేవీ సబ్‌స్టేషన్‌లోకి వర్షపునీరు చేరడంతో ఉత్పత్తికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. గతంలో 2019లో భారీ వర్షాలు, 2022లో గోదావరి వరదలతో ప్లాంట్‌ను షట్‌డౌన్ చేయగా, ఇప్పుడు భారీ వర్షాల కారణంగా మరోసారి మూసివేశారు.

విపత్తులపై కనీస ప్రణాళిక లేదు: బీఆర్ఎస్



వివేకానంద

సాక్షి, హైదరాబాద్: దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వంగా తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ నిలిచిందని బీఆర్ఎస్ విమర్శించింది. తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను తిట్టడానికే సీఎం, మంత్రులు పరిమితం అయ్యారని విమ ర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవి గౌరవాన్ని మంటగలిపి దిగజారి మాట్లాడుతున్నారన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, విపత్తులు వస్తే ఏ విధంగా ఎదుర్కోవాలో ప్రభుత్వం దగ్గర కనీస ప్రణాళికలు లేవని విమర్శించారు. ఈ పాలన పట్ల ప్రజలు విసు గుచెంది కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటు న్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమ లు చేయాలన్నారు.

15 లక్షల ఎకరాల్లో పంట మునక

- పత్తి, వరి, సోయా సహా ఇతర పంటలపై ప్రభావం
- పలుచోట్ల కొట్టుకుపోయిన వరి... పత్తికి తీవ్రమైన నష్టం
- సోయా, కంది పంటలపైనా ప్రభావం



సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురంలో ఇసుక మేట వేసిన పొలాలు

సాక్షి, హైదరాబాద్: ఎడతెరపి లేని వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పంట నీట మునిగిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పత్తి పూత దశలో ఉండటం... వరి నాట్లు పూర్తయిన దశలో ఉన్న నేపథ్యంలో వరదల ప్రభావం ఆయా పంటలపై తీవ్రంగా ఉంటుందని భావిస్తున్నారు. పంట మునిగిన ప్రాంతాలపై వ్యవసాయశాఖ ఇంకా దృష్టి సారించలేదు. ఆదివారం కావడంతో అధికారులంతా సెలవుల్లో ఉండిపోయారు. దీంతో రైతులకు గ్రామాల్లో సలహాలు సూచనలు ఇచ్చే దిక్కే లేకుండా పోయింది. మరోవైపు ఏం చేయాలన్న దానిపై రాష్ట్రస్థాయిలో శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు ఇప్పించడంలో కూడా వ్యవసాయశాఖ విఫలమైంది.

8 లక్షల ఎకరాల్లో పత్తికి ఎఫెక్ట్...

రాష్ట్రంలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 1.09 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో అత్యధికంగా వరి 47.81 లక్షల ఎకరాల్లో, పత్తి 42.66 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. మొక్కజొన్న 4.88 లక్షల ఎకరాలు, కంది 4.60 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.84 లక్షలు ఎకరాల్లో సాగైంది. వర్షాల దెబ్బకు అధికంగా మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, నల్లగొండ, నాగర్‌కర్నూలు, మహబూబ్ నగర్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం వంటి జిల్లాలు సహా రాష్ట్ర వ్యాప్తంగా పంటలు నీట మునిగాయి. పత్తి 8 లక్షల ఎకరాల్లో నీట మునిగినట్లు అంచనా వేస్తుండగా, వరి 5 లక్షల ఎకరాల్లో నీట మునిగింది. నాట్ల దశలోనే వరి ఉండటంతో రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లనుంది. మిగిలిన పంటలు మరో 2లక్షల ఎకరాల్లో నీట మునిగినట్లు అంచనా వేస్తున్నారు. అయితే వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్తే ఈ లెక్కలు మరింతగా ఉండొచ్చని అంటున్నారు.

అందుబాటులోకి రాని పంటల బీమా...

ప్రభుత్వం ఈ సీజన్ నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలులోకి తీసుకొస్తామని హామీయిచ్చింది. కానీ ఇప్పటివరకు ఆ ఊసే లేదు. పంటల బీమా అమలులోకి వస్తే రైతులకు నష్టపరిహారం అందేది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో అది ఇప్పటికీ పట్టాలకెక్కలేదు. మార్గదర్శకాలు ఖరారు చేయడంలోనూ నిర్లిప్తత కొనసాగుతోంది. ఎప్పటినుంచో బీమాపై చర్చలు జరుగుతున్నా కొలిక్కి రావడంలేదు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

పోటెత్తిన కృష్ణమ్మ!



సాక్షి, హైదరాబాద్/దోమలపెంట/నాగార్జునసాగర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారి పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణమ్మ పోటెత్తింది. ప్రధానంగా దిగువ కృష్ణా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బరాజ్‌కి 9,02,576 క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 70 గేట్లు ఎత్తి వచ్చిన వరదను కిందికి విడుదల చేస్తున్నారు. బరాజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ఎగువన మహారాష్ట్రలోని ఆల్మట్టి జలాశయానికి 1.25 లక్షలు, నారాయణపూర్ జలాశయాలకు 1.30 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, దాదాపుగా అంతే వరదను కిందికి విడుదల చేస్తున్నారు. దీంతో తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు 3,82,000 క్యూసెక్కుల వరద వస్తుండగా, 3.88 లక్షల క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 5.10 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 10 గేట్లను ఎత్తి 4.06 లక్షల క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.8 అడుగుల వద్ద 213.8824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకి 4.83 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 18 గేట్లను 15 అడుగులు, మరో 8 గేట్లను 10 అడుగుల మేర పైకి ఎత్తి 4.97 లక్షల క్యూసెక్కులకు కిందికి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద తీవ్రత ఎక్కువగా ఉండటం.. దీనికి తోడు ఈదురుగాలులకు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతుండటంతో నాగార్జునకొండకు వెళ్లే లాంచీలను అధికారులు నిలిపివేశారు. సాగర్‌నుంచి దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుకి 6.36 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 6.02 లక్షల క్యూసెక్కులను దిగువన ఉన్న ప్రకాశం బరాజ్‌కు విడుదల చేస్తున్నారు.

వరదెత్తిన ఎగువ గోదావరి

సాక్షి, హైదరాబాద్/మంచిర్యాల రూరల్ (హాజీపూర్): రాష్ట్రంలోని పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కడెం వాగుతో పాటు ఎగువ గోదావరిలో క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో శ్రీరామ్‌సాగర్, కడెం ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ఎగువ గోదావరి నుంచి 37,165 క్యూసె క్కుల వరద వస్తుండడంతో ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు నిల్వలు 63.67 టీఎంసీలకు చేరాయి. కడెం ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 7.6 టీఎంసీలు కాగా, 27,282 క్యూసెక్కుల వరద వస్తుండటంతో 6.32 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 19,112 క్యూసెక్కులను గేట్లు ఎత్తి కిందికి విడుదల చేస్తున్నారు. దీంతో దిగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా 1,29,269 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, 18.26 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 1,44,714 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఏకంగా 20 గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలారు. ఉపనది మంజీరలో ఉధృతి పెరగడంతో సింగూరు, నిజాం సాగర్ ప్రాజెక్టులకు వరద పెరిగింది. సింగూరు ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 29.917 టీఎంలు కాగా, ప్రస్తుతం 13,076 క్యూసెక్కుల వరద వస్తుండగా, నిల్వలు 17.05 టీఎంసీలకు చేరాయి. వరద ఇలానే కొనసాగితే మరో వారం రోజుల్లో పూర్తిగా నిండే అవకాశముంది. ఇక నిజాంసాగర్ నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా 24,800 క్యూసెక్కుల వరద వస్తుండడంతో నిల్వలు 5.20 టీఎంసీలకు చేరాయి. తెలంగాణకు ఎగువన మహారాష్ట్రలో గోదావరిపై ఉన్న జైక్వాడి ప్రాజెక్టులోకి 16,202 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో నిల్వలు 90.2 టీఎంసీలకు చేరాయి. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 102.73 టీఎంసీలు కాగా, మరో వారం రోజుల్లో పూర్తిగా నిండితే గేట్లుఎత్తి కిందికి వరదను విడుదల చేసే అవకాశం ఉంది. దిగువన ఉన్న బాబ్లీ ప్రాజెక్టు నిండిన తర్వాత ఆ నీళ్లు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి చేరే అవకాశం ఉంది.

పోలీసులు అప్రమత్తం



డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. వివిధ విభాగాలతో సమన్వ యం చేసుకుంటూ వరద పరిస్థితులను సమీక్షించ డంతోపాటు సహాయక చర్యలు అందేలా జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. నదులు, వాగులు, వరద ప్రవాహం కొనసాగుతున్న బ్రిడ్జీల వద్దకు ప్రజలు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షాలతో రైల్వే బ్రిడ్జి తెగడం వల్ల రైళ్ల రాక పోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి ఆహారం, నీరు అందించిన మహబూబాబాద్ పోలీసులను డీజీపీ జితేందర్ అభినందించారు. అలాగే నాగర్‌కర్నూల్ నాగనూల్ వాగులో కొట్టుకు పోతున్న ఓ వ్యక్తిని కాపాడిన హెడ్ కానిస్టేబుల్ తకీయొద్దీన్, కానిస్టేబుల్ రాములుకు సైతం అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.




సూర్యాపేట జిల్లా కోదాడ పెద్దచెరువు వరదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు బోట్ ద్వారా వెళ్తున్న రెస్క్యూటీం



ఖమ్మంలోని ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మున్నేరు వరదలో చిక్కుకున్న జనం



పెద్దపల్లి పట్టణంలో రంగంపల్లి వద్ద వరదనీటిమయమైన రాజీవ్ రహదారి



మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం మున్నేరు వాగు వరదలో మునిగిన చాప్లా తండా శ్మశానవాటిక



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ ఇబ్రహీంబాద్ సమీపంలో తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

అందరూ అందుబాటులో ఉండాలి

- అధికారులు సెలవులు రద్దు చేసుకోవాలి
- అత్యవసర సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, పురపాలక, విద్యుత్, పంచాయతీరాజ్, హైడ్రా, నీటిపారుదల శాఖల అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలపై ఆదివారం ఆయన అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణా రావుతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ అధికారులు 24 గంటలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అధికారులెవరూ సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకుని సహాయక చర్యల్లో నిమగ్నం కావాలని కోరారు. అత్యవసర సేవల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి నిరంతరం సమీక్షిస్తుండాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎం కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కాంగ్రెస్ కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

కేంద్రం నుంచి అవసరమైన సాయం అందిస్తాం: పీఎం

రాష్ట్రంలో వర్షాలు, వరద పరిస్థితులు, వాటితో జరిగిన నష్టాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. ఆదివారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు జిల్లాల్లో భారీ వర్షం, వరదతో వాటిల్లిన నష్టాన్ని ప్రధానికి సీఎం రేవంత్ వివరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రాణ నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తక్షణ సహాయక చర్యలను, జాగ్రత్తలను తెలియజేశారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందని ప్రధానికి వివరించారు. ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించినందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని అభినందించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే హెలికాప్టర్లను పంపిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సాయం అందిస్తామన్నారు. కాగా, రాష్ట్రంలో పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలందరూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు రక్షణగా నిలవాలని టీపీసీసీ కోరింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు.

వరద పరిస్థితిని అమిత్‌షాకు వివరించిన సీఎం

ఆదివారం రాత్రి సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఫోన్ చేశారు. వర్షాలు, వరదల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్న ఆయన అవసరమైన తక్షణ సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా వాటిల్లిన నష్టాన్ని అమిత్‌షాకు సీఎం రేవంత్ వివరించారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలి

- అన్ని జిల్లాల కలెక్టర్లకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశం
- ఖమ్మం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్



వరద నుంచి బయటపడిన వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం, సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వరకు ఖమ్మం జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ఖమ్మం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వర్షం, వరద పరిస్థితులు, సహాయక చర్యలపై మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి పాల్గొన్నారు. ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి తీరం వెంట ఉన్న జిల్లాల్లోని అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

హైడ్రా ఆ పనులకు విరామమిచ్చి..

చెరువుల ఆక్రమణలు తొలగించే పనిలో నిమగ్నమైన హైడ్రా ప్రస్తుతం ఆ పనులకు రెండు, మూడు రోజుల విరామం ప్రకటించి విపత్తును ఎదుర్కొనేందుకు రెస్క్యూ ఆపరేషన్ టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని భట్టి ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర సేవలకు కావాల్సిన నిధులను ఆర్థిక శాఖ ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు.

అర్ధరాత్రి సహాయక చర్యలను పర్యవేక్షించిన భట్టి

మధిర: వరద సహాయక చర్యలను డిప్యూటీ సీఎం భట్టి స్వయంగా పర్యవేక్షించారు. శనివారం అర్ధరాత్రి దాటాక మధిర చేరుకున్న ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. మధిర మండలం వంగవీడుకు చెందిన మత్స్యకార సభ్యుడు తోటపల్లి వెంకటేశ్వర్లు వల తొలగించేందుకు బుగ్గ వాగులోకి వెళ్లి చిక్కుకున్న విషయం తెలియగానే అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అక్కడకు చేరుకున్నారు. కలెక్టర్, సీపీ అక్కడి పరిస్థితులను వివరించారు.. అధికారులు డ్రోన్ సాయంతో తాడు పంపించాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చివరకు గజ ఈతగాళ్లు రావడంతో గంటల సేపు ప్రయాసపడి వాగు మధ్యలో నుంచి వెంకటేశ్వర్లును బయటకు తీసుకొచ్చారు. అప్పటివరకు అక్కడే ఉన్న భట్టి గజ ఈతగాళ్లు, అధికార యంత్రాంగాన్ని అభినందించారు.

మరో 24 గంటలు అప్రమత్తం: పొంగులేటి

రాష్ట్రంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో భారీ వర్షాలు సోమవారం వరకు ఉండే అవకాశమున్నందున వచ్చే 24 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారీ వర్షాలపై ఆదివారం ఉదయం 5 గంటల నుంచే అధికారులతో సమీక్షలు నిర్వహించిన ఆయన మధ్యాహ్నం 12 గంటల సమయంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

నీటిపారుదల శాఖలో సెలవులు రద్దు

- మంత్రి ఉత్తమ్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖలో ఏఈ నుంచి సీఈ వరకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తుండాలని ఆ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. నీటిపా రుదల శాఖ సిబ్బందికి సెలవులను రద్దు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. ఆయన ఆదివారం నీటిపారు దల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. వర్షాలకు దెబ్బతిన్న చెరువులను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. నల్లగొండ జిల్లాలో డిండి ప్రాజెక్టులో నీటిమట్టం 6 అడుగులకు చేరిన నేపథ్యంలో.. ఉదయసముద్రం ప్రాజెక్టుకు నీళ్లను విడుదల చేయాలని ఆదేశించారు.

ఇదే వందే భారత్ స్లీపర్ కోచ్

ఆవిష్కరించిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



బెంగళూరు: వందేభారత్ స్లీపర్ కోచ్ నమూనాను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్)లో ఆవిష్కరించారు. పది రోజులపాటు టెస్టులు, ట్రయల్స్ నిర్వహించాక బీఈఎంఎల్‌లోనే మరిన్ని పరీక్షలు జరుగుతాయన్నారు. వందేభారత్ స్లీపర్ కోచ్‌లు మూడు నెలల్లో పూర్తిస్థాయిలో పట్టాలపైకి వస్తాయని చెప్పారు. కోచ్‌ల ఉత్పత్తి ప్రక్రియ మొదలయ్యాక నెలకు రెండు మూడు చొప్పున రైళ్లు పట్టాలపైకి వస్తాయని వివరించారు. 16 బోగీలుండే వందేభారత్ స్లీపర్ రైళ్లను 800 నుంచి 1,200 కిలోమీటర్ల దూరంలోని రాత్రి వేళ ప్రయాణాలకు ఉద్దేశించామని తెలిపారు. వీటి చార్జీలు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయని తెలిపారు.

నర్సుపై రోగి వేధింపులు

బెంగాల్‌లో మరో దారుణం

కోల్‌కతా: పని ప్రదేశాల్లో వైద్య సిబ్బందిపై లైంగిక వేధింపుల ఘటనలు ఆగడం లేదు. కోల్‌కతాలో ఆర్‌జీ కర్ ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యోదంతం ఘటనపై నిరసనలు కొనసాగుతున్న వేళ పశ్చిమబెంగాల్లో నర్సుపై ఒక రోగి వేధింపులకు పాల్పడ్డాడు. బీర్భూమ్ జిల్లా ఇలాంబజార్ ప్రభుత్వాసుపత్రిలో శనివారం రాత్రి విధుల్లో ఉన్న నర్సుపై లైంగిక వేధింపులకు పాల్పడ్డట్టు డ్యూటీ డాక్టర్ మసీదుల్ హసన్ తెలిపారు. ''శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అబ్బాసుద్దీన్ అనే ఛోటాచక్ గ్రామస్తుడు జ్వరంతో ఆసుపత్రికి వచ్చాడు. నైట్ డ్యూటీ నర్సు సెలైన్ పెడుతుండగా ఆమెను అసభ్యకరంగా తాకాడు. వారించినా వినిపించుకోలేదు. పైగా బూతులు తిట్టాడు. వెంట వచ్చిన బంధువులు వారించినా ఆగలేదు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం'' అని వివరించారు. పని చేసే చోట మహిళా సిబ్బందికి రక్షణ లేనప్పుడు విధి నిర్వహణ ఎలా సాధ్యమంటూ ఆయన ఆవేదన వెలిబుచ్చారు. పరిస్థితి ఇలాగే ఉంటే పని చేయడం మానేస్తామని హెచ్చరించారు. నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు.

పాక్‌లో నాలుగో మంకీపాక్స్ కేసు


ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో మంకీపాక్స్ కేసులు ఒక్కటొక్కటిగా పెరుగుతున్నాయి. ఇప్పటికే మూడు కేసులు వెలుగులోకి వచ్చిన ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్‌లోనే నాలుగో కేసు కూడా బయటపడిందని అధికారులు తెలిపారు. బాధితులంతా విదేశాల నుంచి వచ్చిన వారేనని, పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(పీఐఎంఎస్)లోని ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్న వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

మానవ సృష్టి ఉల్కాపాతం

డైమార్ఫోస్ నుంచి రాళ్లు, దుమ్ము ధూళి | పదేళ్లలో భూమిపైకి చేరుకొనే అవకాశం | ప్రమాదం లేదంటున్న పరిశోధకులు

ప్రపంచ చరిత్రలో మానవులు సృష్టించిన మొట్టమొదటి ఉల్కాపాతం(మిటియోర్)గా డైమార్ఫోస్ ఉల్కపాతం రికార్డుకెక్కబోతోందని అంతరిక్ష పరిశోధకులు చెబుతున్నారు. భూగోళం వైపు దూసుకొస్తూ ముప్పుగా మారిన గ్రహశకలాలను దారి మళ్లించడానికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' సైంటిస్టులు డబుల్–అస్టరాయిడ్ రీడైరెక్షన్ టెస్టు(డార్ట్) నిర్వహించారు. ఈ ప్రయోగం కోసం డైమార్ఫోస్ అనే గ్రహశకలాన్ని (అస్టరాయిడ్) ఎంచుకున్నారు. నిజానికి ఈ అస్టరాయిడ్‌తో భూమికి ముప్పు లేనప్పటికీ ప్రయోగానికి అనువుగా ఉండడంతో ఎంపిక చేశారు. 'డార్ట్'లో భాగంగా 2021 నవంబర్ 24న స్పేస్ క్రాఫ్ట్‌ను ప్రయోగించారు. ఇది 2022 సెప్టెంబర్ 26న భూమికి 1.1 కోట్ల కిలోమీటర్ల మైళ్ల) దూరంలో ఉన్న డైమార్ఫోస్‌ను గంటకు 13,645 కిలోమీటర్ల వేగంతో విజయవంతంగా ఢీకొట్టింది. దాంతో ఆ గ్రహశకలం దారిమళ్లింది. భవిష్యత్తులో గ్రహశకలాల నుంచి భూమికి ముప్పు తప్పించడానికి డార్ట్ ప్రయోగం దోహదపడింది.

10 లక్షల కిలోల రాళ్లు, దుమ్ము ధూళి: నాసా స్పేస్ క్రాఫ్ట్ అత్యంత వేగంగా ఢీకొట్టడంతో డైమార్ఫోస్ నుంచి చిన్నచిన్న రాళ్లు, దుమ్ము ధూళి వెలువడుతున్నట్లు గుర్తించారు. 2 మిలియన్ పౌండ్లకు (10 లక్షల కిలోలు) పైగా బరువైన రాళ్లు, దుమ్ము ధూళి వెలువడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వీటిని దాదాపు 7 రైలు పెట్టెల్లో నింపొచ్చు. వీటిలో కొన్ని ఇసుక పరిమాణంలో, మరి కొన్ని సెల్‌ఫోన్ పరిమాణంలో ఉంటాయని చెబుతున్నారు. అయితే, డైమార్ఫోస్ నుంచి వెలువడిన రాళ్లు, ధూళి చివరకు ఎక్కడికి చేరుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది. ఇవి మరో 30 సంవత్సరాల్లోగా భూమి, అంగారక గ్రహాల సమీపంలోకి చేరుకుంటాయని చెబుతున్నారు. కొన్ని రాళ్లు, ధూళి మరో ఏడేళ్లలో అరుణ గ్రహానికి చేరే అవకాశం ఉందని అంటున్నారు. మరో పదేళ్లలో చిన్నపాటి రాళ్లు భూవాతావరణంలోకి ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నా రు. చాలా చిన్నవి కావడంతో ఇవి భూమి ని ఢీకొట్టినా ఎలాంటి ప్రమాదం ఉండదని భరో సా ఇస్తున్నారు. డైమార్ఫోస్ నుంచి వెలువడిన రాళ్లు, ధూళి ఉల్కాపాతాలుగా మారి భూమి, అంగారక గ్రహంపైకి చేరడం 100 సంవత్సరాలపాటు కొన సాగుతుందని ఇటలీలోని పాలిటెక్నిక్ యూనివర్సిటీ ఆఫ్ మిలన్‌కు చెందిన డీప్–స్పేస్ అస్ట్రోడైనమిక్స్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ గ్రూప్ పోస్టు డాక్టోరల్ పరిశోధకుడు అసెన్సియో చెప్పారు.



– సాక్షి, నేషనల్ డెస్క్

మహిళలపై నేరాల్లో...
సత్వర తీర్పులు

న్యాయ వ్యవస్థకు రాష్ట్రపతి సూచన • వాయిదాల సంస్కృతి మారాలన్న ముర్ము

న్యూఢిల్లీ: మహిళలపై అత్యాచారం, హత్య వంటి హేయమైన నేరాల విషయంలో తీర్పులు ఇవ్వడంలో కోర్టులు ఎంతమాత్రం జాప్యం చేయొద్దని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. సత్వర తీర్పులతో బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. ''ఇలాంటి కేసుల్లో తీర్పులు ఆలస్యమైతే న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుంది. న్యాయ వ్యవస్థ సున్నితత్వం కోల్పోయిందని భావించే ప్రమాదముంది'' అన్నారు. జిల్లా న్యాయ వ్యవస్థపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆదివారం ముర్ము ప్రసంగించారు. హేయమైన నేరాలకు సంబంధించి కూడా కొన్నిసార్లు ఒక తరం ముగిసిన తర్వాత తీర్పులు వస్తున్నాయని ఆక్షేపించారు. కోర్టుల్లో వాయిదాల సంస్కృతి మారాలని సూచించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, బ్యాక్‌లాగ్ కేసులు న్యాయ వ్యవస్థకు పెను సవాలుగా నిలుస్తున్నాయన్నారు. వీటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ''తరచూ ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించాలి. ప్వారు. పెండింగ్ కేసులను తగ్గించడానికి అధిక ప్రాధాన్యమివ్వాలి'' అని సూచించారు.



సుప్రీంకోర్టు జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి ముర్ము, సీజేఐ చంద్రచూడ్

న్యాయం కోసం పోరాడితే మరిన్ని కష్టాలు: అంగబలం, అర్థబలం కలిగిన కొందరు నేరగాళ్లు యథేచ్ఛగా బయట సంచరిస్తున్నారని రాష్ట్రపతి ఆవేదన వెలిబుచ్చారు. ''వారికి సకాలంలో శిక్షలు పడడం లేదన్నారు. అలాంటి నేరగాళ్ల వల్ల నష్టపోయిన బాధితులు మాత్రం భయాందోళనల మధ్య బతుకుతున్నారు. గ్రామీణ పేదలు కోర్టులకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే వారు కోర్టుల దాకా వస్తున్నారు'' అన్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పారు.

కోర్టుల్లో మహిళలకు వసతులు మెరుగుపడాలి: సీజేఐ

జిల్లా స్థాయి కోర్టుల్లో మహిళలకు తగిన మౌలిక వసతులు లేవని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పారు. న్యాయ వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం బాగా పెరుగుతున్నా కోర్టుల్లో వారికి సరిపడా సదుపాయాలు లేకపోవడం గర్హనీయమన్నారు. జిల్లా స్థాయి న్యాయస్థానాల్లోని మౌలిక సదుపాయాల్లో కేవలం 6.7 శాతమే మహిళలకు అనువుగా ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరముందని ఉద్ఘాటించారు. ''కొన్ని రాష్ట్రాల్లో న్యాయ నియామకాల్లో 70 శాతం మహిళలే ఉంటున్నారు. వారికి వసతులు మెరుగుపడాలి. కోర్టు ప్రాంగణాల్లో వైద్య సదుపాయాలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు రావాలి. కక్షిదారుల కోసం ఈ–సేవా కేంద్రాలు, వీడియో కాన్ఫరెన్స్ వంటివాటితో న్యాయం సులువుగా అందుబాటులోకి వస్తుంది. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సురక్షితమైన, సానుకూల పరిస్థితులు కల్పించే చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. ప్రధానంగా మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలు, అణగారిన వర్గాల సంక్షేమం న్యాయస్థానాల కర్తవ్యం కావాలి'' అని పిలుపునిచ్చారు.

సామాన్య ప్రజల్లో 'నల్ల కోట్ సిండ్రోమ్'

''ఆసుపత్రి వాతావరణం చూడగానే రక్తపోటు పెరిగిపోయే 'వైట్ కోట్ హైపర్ టెన్షన్' గురించి మనకు తెలుసు. అలా ఇప్పుడు 'నల్ల కోటు సిండ్రోమ్' కనిపిస్తోంది'' అని రాష్ట్రపతి అన్నారు. ''సామాన్య ప్రజలకు కోర్టు గదిలోకి వెళ్లగానే మానసిక ఒత్తిడి పెరుగుతోంది. దాంతో కోర్టులో చెప్పాలనుకున్నది చెప్పలేక పోతున్నారు. ఈ పరిస్థితి మారితేనే సామాన్యులకు న్యాయం జరుగుతుంది'' అని అభిప్రాయపడ్డారు. న్యాయవ్యవస్థలో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బంగ్లాలో హిందూ టీచర్లపై దాడులు

బలవంతపు రాజీనామాలు • వాళ్లను స్టూడెంట్లే బెదిరిస్తున్న వైనం

ఢాకా: బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం పతనం తర్వాత హిందూ ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మైనారిటీలైన హిందూ ఉపాధ్యాయులతో విద్యార్థులు, స్థానికులు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. ఇలా 50 మంది దాకా రాజీనామా చేశారు. వెలుగులోకి రాని ఉదంతాలు చాలా ఉన్నాయని చెబుతున్నారు.

ఆఫీసును ముట్టడించి...

బరిషాల్‌లోని బేకర్‌గంజ్ ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపల్ శుక్లా రాణి హాల్దర్ కార్యాలయాన్ని ఆగస్టు 29న మూకలు ముట్టించాయి. వీరిలో బయటి వ్యక్తులతో పాటు ఆ కాలేజీ విద్యార్థులూ ఉన్నారు! తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గంటల తరబడి బెదిరింపులకు దిగారు. దాంతో వేరే మార్గం లేక ఖాళీ కాగితం మీదే 'నేను రాజీనామా చేస్తున్నాను' అంటూ సంతకం చేసిచ్చారామె. అజీంపూర్ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రిన్సిపల్ గీతాంజలి బారువాతో పాటు అసిస్టెంట్ హెడ్ టీచర్ గౌతమ్ చంద్ర పాల్ తదితరులతో బలవంతంగా రాజీనామా చేయించారు. వారంతా తన కార్యాలయంపై దాడి చేసి తనను అవమానించారని గీతాంజలి వాపోయారు.

వైరలవుతున్న వీడియోలు...

బంగ్లావ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. రాజీనామా లేఖలపై సంతకాలు చేయాలంటూ హిందూ టీచర్లను, ఇతర సిబ్బందిని బలవంతం చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ వేధింపుల దెబ్బకు ప్రొక్టర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని కాజీ నజ్రుల్ వర్సిటీ పబ్లిక్ అసోసియేట్ ప్రొఫెసర్ సంజయ్ కుమార్ ముఖర్జీ తెలిపారు.

ఖండించిన తస్లీమా

ఈ ఘటనలపై బంగ్లాదేశ్ బహిష్కృత రచయిత్రి తస్లీమా నస్రీన్ మండిపడ్డారు. మహమ్మద్ యూనస్ ప్రభుత్వం మైనారిటీలకు రక్షణ కల్పించడం లేదని ఆరోపించారు. ''హిందూ ఉపాధ్యాయులను బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. గత ప్రభుత్వంలోని మంత్రులు, అధికారులు హత్యలకు, వేధింపులకు గురవుతున్నారు. జైలుపాలవుతున్నారు. దర్గాలను కూల్చివేస్తున్నారు. అయినా యూనస్ నోరు విప్పడం లేదు'' అంటూ ఎక్స్‌లో దుయ్యబట్టారు. టీచర్లపై వేధింపులను బంగ్లా ఛత్ర ఐక్య పరిషత్ ఖండించింది.

మణిపూర్‌లో మిలిటెంట్ల దాడులు..
ఇద్దరు మృత్యువాత

ఇంఫాల్: మణిపూర్‌లోని కొట్రుక్, కడంగ్‌బాండ్ ప్రాంతాల్లో ఆదివారం అనుమానాస్పద మిలిటెంట్ల దాడుల్లో ఇద్దరు చనిపోగా, 9 మంది గాయపడ్డారు. మిలిటెంట్ల దాడులు, ఇళ్లు, ఆస్తుల విధ్వంసం నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో, పరిస్థితులను చక్కదిద్దేందుకు ఆ ప్రాంతంలోకి భద్రతా బలగాలను తరలించారు. క్షతగాత్రుల్లో ఐదుగురికి బుల్లెట్ గాయాలు, మిగతా వారికి బాంబు పేలుడు గాయాలను గుర్తించామని అధికారులు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించారు.

'వేధింపు'లకు సీపీఎం నేతల దన్ను

అందుకే కేరళ సీఎం మౌనం: బీజేపీ చీఫ్ నడ్డా



పాలక్కాడ్: మలయాళ సినీ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు పాల్పడ్డ వారికి అధికార సీపీఎం నేతల దన్ను ఉందని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ఆరోపించారు. అందుకే కమిటీ నివేదికపై సీఎం పినరాయి విజయన్ చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేరళలోని పాలక్కాడ్‌లో ఆదివారం ఓ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''జస్టిస్ హేమ కమిటీ నివేదిక ఎందుకు ఆలస్యమైంది? దానిపై చర్యలెందుకు తీసుకోవడం లేదు? ఎవరు అడ్డుకుంటున్నారు? మీ పార్టీ నేతలపై ఆరోపణలుండటం వల్లే చర్యలు తీసుకోవడం లేదు'' అని మండిపడ్డారు. మలయాళ సినీ పరిశ్రమతో అధికారవర్గాలకు సంబంధాలు, సినీ పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపులపై ప్రభుత్వం నియమించిన జస్టిస్ హేమ కమిటీ 2019 డిసెంబర్‌లోనే నివేదికను అందజేసింది. దాన్ని కేరళ ప్రభుత్వం ఆగస్టు 19న బహిర్గతం చేసింది. సినీ ప్రముఖులు, అధికార పార్టీ నేతలపై ఆరోపణలతో కూడిన ఆ నివేదిక సంచలనం రేపింది. సినీ పరిశ్రమలో పురుషాధికత్యం, కుల పక్షపాత ధోరణులు, మహిళా నటులు, సాంకేతిక నిపుణులపై వేధింపులు సాగుతున్నాయని నివేదిక తెలిపింది. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పలువురు నటులు, ప్రముఖులపై ఇప్పటిదాకా 10 వరకు కేసులు నమోదయ్యాయి.

కోల్‌కతా ఉదంతంపై మౌనమెందుకు?

ఎన్జీవోలకు ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ప్రశ్న



డెహ్రాడూన్: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను 'ఆటవికతకు పరాకాష్ఠ'గా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అభివర్ణించారు. ఇంతటి తీవ్ర చర్యపట్ల కొన్ని ఎన్జీవోలు మౌనంగా ఉండటంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంస్థల వైఖరిని ఆయన ఈ క్రౌర్యానికి పాల్పడిన వారి కంటే నేరపూరితంగా అభివర్ణించారు. ఇటువంటి ఘటనలపై రాజకీయాలు చేయాలని చూసే వారు మన స్వాక్షికి సమాధానం చెప్పుకోలేరన్నారు. రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. మానవీయతకే మాయని మచ్చగా మారిన ఆ ఘటనపై కొందరు చిల్లరవ్యాఖ్యలు చేస్తూ పుండుపై కారం చల్లినట్లుగా మరింత వేదనను కలగజేస్తున్నారని మండిపడ్డారు. అయితే, ఒక పార్లమెంట్ సభ్యుడు, సీనియర్ అడ్వొకేట్ ఇలా మాట్లాడటం తీవ్రమైన తప్పిదమని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనకు బాధ్యులెవరైనా సరే, సమాజానికీ కూడా ఇందులో బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాలకీ, రాజకీయ పార్టీలకీ కాదు, సమాజానికి సంబంధించిన అంశమని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు.

రష్యా హెలికాప్టర్ ప్రమాదం...
17 మంది దుర్మరణం

మాస్కో: హెలికాప్టర్ ప్రయాణం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రష్యాలోని ఫార్‌ఈస్టు ప్రాంతంలో శనివారం కనిపించకుండాపోయిన హెలికాప్టర్ నేల కూలినట్లు గుర్తించారు. శకలాలను ఆదివారం కనిపెట్టారు. 19 మంది యాత్రికులు, ముగ్గురు సిబ్బందితో బయలుదేరిన ఈ హెలికాప్టర్ ఓ అగ్ని పర్వతం సమీపంలో ప్రమాదవశాత్తూ నేలకూలింది. ఈ దుర్ఘటనలో 17 మంది మరణించినట్లు ఎమర్జెన్సీ అధికారులు చెప్పారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. కామ్‌చాట్కా ద్వీపకల్పంలోని వచ్‌కెజెట్స్ అగ్నిపర్వతం నుంచి నికోలావ్‌కా గ్రామానికి బయలుదేరిన ఈ హెలికాప్టర్ మధ్యలో కూలిపోయిందని స్థానిక గవర్నర్ వ్లాదిమిర్ సోలోదోవ్ చెప్పారు. సహాయక సిబ్బంది ఘటనా స్థలంలో 17 మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. మిగిలినవారి జాడ కనిపించలేదని, వారు కూడా మరణించి ఉంటారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరుగురు బందీలను చంపేశారు

- గాజాలో హమాస్ మరో దారుణం
- ఇజ్రాయెల్ బలగాలు వస్తుండటంతో హతమార్చిన వైనం
- మృతుల్లో అమెరికన్–ఇజ్రాయెల్ యువకుడు



జెరూసలేం: గాజా స్ట్రిప్‌లో తమ బందీలను విడిపించుకునేందుకు ఇజ్రాయెల్ బలగాలు చేసిన ప్రయత్నం వికటించింది. ఒక్కో సొరంగాన్ని జల్లెడ పడుతూ సాగుతున్న క్రమంలో విషాదం చోటుచేసుకుంది. సైనికులు బందీలను సమీపిస్తున్నారన్న ఉక్రోషంతో వారిలో ఆరుగురిని హమాస్ సాయుధులు చంపేశారని ఇజ్రాయెల్ ఆదివారం ప్రకటించింది. దక్షిణ గాజాలోని రఫా పట్టణంలో ఐడీఎఫ్ బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. ఆరుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయెల్ రెస్క్యూ సర్వీస్ ప్రకటించింది. మృతుల్లో ఇద్దరు మహిళలున్నారు. ఇజ్రాయెల్ దళాలు అక్కడకు వెళ్లడానికి కొద్ది గంటల ముందే హమాస్ ఉగ్రవాదులు వారిని అతి కిరాతకంగా చంపేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతులను హెర్ష్ గోల్డ్‌బర్గ్ పొలిన్ (23), రీ డేనినో (25), ఈడెన్ యెరుషల్మీ (24), అల్మాగ్ సరుసి (27), అలెగ్జాండర్ లబానోవ్ (33), కార్మెల్ గాట్ (40)గా గుర్తించారు. గతేడాది అక్టోబర్ ఏడో తేదీన ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై హమాస్ మెరుపు దాడి చేసి 1,200 మందికి పైగా చంపేయడం, 250 మందిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లడం తెల్సిందే. నాటినుంచీ వారిని చిత్రహింసలకు గురి చేసి ఉంటారని అక్కడి పరిస్థితులను చూస్తే అర్థమవుతోందని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారీ చెప్పారు. గత వారం రఫా పట్టణంలోని మరో సొరంగంలో ఫర్హాన్ అల్కాదీ అనే 52 ఏళ్ల బందీని బలగాలు సజీవంగా కాపాడాయి. దీనికి ప్రతీకారంగా గాజా స్ట్రిప్‌పై భీకర భూతల, గగనతల దాడులకు దిగి ఇజ్రాయెల్ ఇప్పటివరకు 40వేలకుపైగా అమాయక పాలస్తీనియన్ల ప్రాణాలు బలిగొనడం తెల్సిందే.

తగిన మూల్యం తప్పదు: బైడెన్

మృతుల్లో హెర్ష్ గోల్డ్‌బర్గ్ పొలిన్ అనే ఇజ్రాయెల్–అమెరికన్ యువకున్ని బలగాలు గుర్తించాయి. అతన్ని విడిచిపెట్టాలని తల్లిదండ్రులు పలుమార్లు ఐరాస సహా పలు అంతర్జాతీయ వేదికలపై పదేపదే వేడుకోవడం తెల్సిందే. పోప్ ఫ్రాన్సిస్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను కూడా కలిసి వారు గోడు వెళ్లబోసుకున్నారు. పొలిన్ మరణ వార్త తెలిసి బైడెన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇందుకు హమాస్ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మిగతా బందీల విడుదల కోసం ఇజ్రాయెల్–హమాస్ మధ్య వీలైనంత త్వరగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేలా కృషి చేస్తానని చెప్పారు.

నెతన్యాహూపై విమర్శలు

బందీల మరణంతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై మరోసారి విమర్శలు వెల్లువెత్తాయి. బందీల ప్రాణాలు పోతున్నా ఆయన మాత్రం యుద్ధం మీదే ధ్యాస పెట్టారని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. దీన్ని ఆటవిక చర్యగా నెతన్యాహు అభివర్ణించారు. బందీల మృతిపై తీవ్ర విచారం వెలిబుచ్చారు. ఇందుకు తీవ్ర మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కాల్పుల విరమణ ఇష్టంలేని వారు మాత్రమే ఇలాంటి దారుణాలకు పాల్పడతారంటూ మండిపడ్డారు.

కశ్మీర్ యువత మోదీని సాగనంపడం ఖాయం: ఖర్గే



న్యూఢిల్లీ: యువతను వంచించడమే బీజేపీ ఏకైక విధానమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మోసపోయిన జమ్మూకశ్మీర్ యువత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ అండ్ కంపెనీని సాగనంపడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఆదివారం ఖర్గే 'ఎక్స్'లో..మార్చి నాటికి జమ్మూకశ్మీర్ యువతలో అత్యధికంగా 28.2 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. 'పరీక్ష పత్రాల లీకేజీలు, లంచాలు, పెచ్చుమీరిన అవినీతి వంటివి నాలుగేళ్లుగా ఉద్యోగాల భర్తీకి అడ్డంకిగా మారాయి. ప్రభుత్వ విభాగాల్లో 2019 నుంచి 65 శాతం పోస్టులు ఖాళీగానే ఉంటున్నాయి. ప్రభుత్వ విభాగాల్లో 60 వేల మందికి పైగా రోజువారీ సిబ్బంది 15 ఏళ్లుగా రోజుకు కేవలం రూ.300 వేతనంపై పనిచేస్తున్నారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్నా వీరు కాంట్రాక్టు ఉద్యోగులుగానే కొనసాగుతున్నారు. విద్యుత్, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ వంటి అత్యవసర విభాగాల్లోనూ పోస్టుల ఖాళీలున్నాయి' అని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే జమ్మూకశ్మీర్ యువత అక్టోబర్ ఒకటో తేదీన జరిగే పోలింగ్‌లో మోదీ బృందానికి వీడ్కోలు పలకడం తథ్యమని ఆయన చెప్పారు.

ట్రంప్‌ది పొలిటికల్ స్టంట్: హారిస్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడుతున్న డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మధ్య విమర్శలు ప్రతివిమర్శలు పదునెక్కుతున్నాయి. అర్లింగ్టన్ జాతీయ శ్మశాన వాటికను ఇటీవల ట్రంప్ సందర్శించడం, అక్కడ ఫొటోలు, వీడియోలు తీసుకొని, మీడియాలో ప్రచారం చేసుకోవడాన్ని కమలా హారిస్ తప్పుపట్టారు. పవిత్రమైన స్థలాన్ని ట్రంప్ అవమానించారని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. శ్మశాన వాటికలో ట్రంప్ ప్రచార బృందం సభ్యుల అతిగా ప్రవర్తించారని, అక్కడి సిబ్బందితో వాగ్వాదానికి దిగారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారని విమర్శించారు. డొనాల్డ్ ట్రంప్‌ది పొలిటికల్ స్టంట్ అని ఆక్షేపించారు. అమెరికా యుద్ధ వీరులను గౌరవించుకొనే పవిత్ర ప్రదేశంలో రాజకీయ డ్రామాలు ఏమిటని కమలా హారిస్ మండిపడ్డారు. రాజకీయాలకు అక్కడ స్థానం లేదని తేల్చిచెప్పారు. అమెరికాలో శ్మశాన వాటికలు, పవిత్ర ప్రదేశాల్లో ప్రచారంపై నిషేధం అమల్లో ఉంది.

150పైగా డ్రోన్లు కూల్చేశాం: రష్యా



ఖర్కీవ్‌లో దెబ్బతిన్న షాపింగ్ సెంటర్

మాస్కో: ఉక్రెయిన్ తమపైకి భారీ సంఖ్యలో డ్రోన్ల దాడికి పాల్పడిందని రష్యా పేర్కొంది. శనివారం రాత్రి మొత్తం 158 డ్రోన్లను కూల్చేశామని రష్యా ఆర్మీ తెలిపింది. ఇందులో రాజధాని మాస్కోపైకి రెండు, పరిసరప్రాంతాలపైకి మరో దూసుకువచ్చిన తొమ్మిది డ్రోన్లు కూడా ఉన్నాయంది. సరిహద్దులకు సమీపంలోని ఉక్రెయిన్ బలగాలు ప్రస్తుతం తిష్ట వేసిన కర్స్క్ ప్రాంతంలో 46 డ్రోన్లు, బ్రియాన్స్క్‌లో 34, వొరొనెజ్‌లో 28 డ్రోన్లతోపాటు, బెల్గొరోడ్‌పైకి వచ్చిన మరో 14 డ్రోన్లను కూల్చినట్లు వివరించింది. సుదూర ట్వెర్, ఇవనొవో సహా మొత్తం 15 రీజియన్లపైకి ఇవి దూసుకొచ్చాయని తెలిపింది. మాస్కో గగనతలంలో ధ్వంసం చేసిన డ్రోన్ శకలాలు పడి ఆయిల్ డిపోలో మంటలు రేగాయని మేయర్ చెప్పారు. బెల్గొరోడ్ రాజధాని ప్రాంతంలో ఉక్రెయిన్ ప్రయోగించిన క్షిపణితో 9 మందికి గాయాలయ్యాయి. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌లోని డొనెట్స్క్ రిజియన్‌లోని పివ్‌నిచ్‌నె, వ్యింకా పట్టణాలు తమ వశమయ్యాయని రష్యా రక్షణ శాఖ ఆదివారం ప్రకటించింది. కురకోవ్ నగరంపై రష్యా క్షిపణి దాడుల్లో ముగ్గురు చనిపోగా మరో 9 మంది క్షతగాత్రులయ్యారు. శనివారం రాత్రి రష్యా ప్రయోగించిన 11 క్షిపణుల్లో ఎనిమిదింటిని కూల్చివేసినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. ఖర్కీవ్‌పై రష్యా ఆర్మీ ఆదివారం చేపట్టిన దాడుల్లో 41మంది గాయపడ్డారు.

మోదీ క్షమాపణల్లోనూ అహంకారమే

శివాజీ విగ్రహం కూలిన ఉదంతంపై పవార్, ఉద్ధవ్ • మద్దతుదారులతో ముంబైలో భారీ ర్యాలీ

ముంబై: సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్‌కోట్ కోటలో మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిపోవడంపై మహా వికాస్ అఘాడీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి కారణంగా ఈ తప్పిదం జరిగిందని, ఇది క్షమించరానిదని పేర్కొంది. ఆదివారం మహావికాస్ అఘాడీలోని ఎన్‌సీపీ(ఎస్‌పీ)చీఫ్ శరద్‌పవార్, శివసేన(యూబీటీ)చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేల సారథ్యంలో ముంబైలోని హుతాత్మ చౌక్ నుంచి గేట్‌వే ఆఫ్ ఇండియా వరకు భారీ ర్యాలీ జరిగింది. ఆగస్టు 26న విగ్రహం కూలిన ఘటనపై ప్రధాని మోదీ శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో క్షమాపణ చెప్పడం తెలిసిందే. దీనిపై ఠాక్రే స్పందిస్తూ..' క్షమాపణ చెప్పడంలో ప్రధాని మోదీ అహంకారాన్ని గమనించారా? ఆయన అహంకారానికి ఇదో ఉదాహరణ. అదే సమయంలో డిప్యూటీ సీఎం ఒకరు నవ్వుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అవినీతి వల్లే విగ్రహం కూలింది. ఇది మహారాష్ట్ర ఆత్మకే అవమానం. క్షమించరాని నేరం. దేశం నుంచి బీజేపీ వెళ్లిపోవాలి'అని ఆయన డిమాండ్ చేశారు. సింధుదుర్గ్‌లో శివాజీ మహారాజ్ విగ్రహం బీజేపీ అవినీతి కారణంగానే కూలిందని, ఛత్రపతి అభిమానులకు ఇది అవమానకరం'అని శరద్ పవార్ పేర్కొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఉద్ధవ్, శరద్ పవార్



కూలిన గాంధీ భవన్ ప్రహరీ

భారీ వర్షాలకు ఆదివారం గాంధీభవన్ ప్రహరీ కూలి పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో వీటిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీ గాంధీ భవన్ ప్రహరీని నిర్మించుకుని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సూచించారు. -అబిడ్స్

వాతావరణం

గరిష్టం/కనిష్టం
24.0/22.0

నగర పరిధిలో సోమవారం భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది. హోరు గాలుల ప్రభావం ఉంటుంది. గరిష్టంగా 24.. కనిష్టంగా 22 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



కూకట్‌పల్లి సమతానగర్ కళింగ ఎన్‌క్లేవ్ సమీపంలో నేలవాలిన చెట్టు



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ..



కవాడిగూడలో జలమయమైన రహదారి...



ఖైరతాబాద్ వెళ్లే రోడ్డులో వాసవి హాస్పిటల్ వద్ద..

నగరానికి వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. సోమవారం భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అప్రమత్తం చేసింది. అధికారులు నేడు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఆదివారం ఉదయం వరకు సుమారు 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు మరో 5 సెం.మీ వర్షం కురిసింది. రెండ్రోజులుగా తెరిపి నివ్వకుండా కురుస్తున్న వర్షాలతో నగరం తడిసిముద్దయింది. జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు కాలనీలు, బస్తీల ప్రజలు కాలు బయటపెట్టే పరిస్థితి లేకుండాపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో జంట జలాశయాల్లో భారీగా నీరు చేరుతోంది. హుస్సేన్ సాగర్ ఫుల్‌ట్యాంక్ లెవల్ దాటడంతో తూముల ద్వారా మూసీలోకి నీటి విడుదల చేస్తున్నారు. దీంతో మూసీ పరీవాహక ప్రాంతాలను అప్రమత్తం చేశారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. నాలాలలో వరద పెరిగి డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో గంటలకొద్దీ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జలమండలి, జీహెచ్ఎంసీ బృందాలు రంగంలో దిగి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నాయి. అత్యవసరమైతే తప్ప బయటికిరావద్దని నగరవాసులకు అధికారులు విజ్ఞప్తి చేశారు. – సాక్షి, సిటీబ్యూరో



రామకృష్ణ మఠం- ఇందిరా పార్కు వద్ద కారుపై కూకటివేళ్లతో సహా కూలిపోయిన భారీ వృక్షం

రెడ్ అలర్ట్

నగరానికి భారీ నుంచి అతిభారీ వర్ష సూచన

- నేడు విద్యా సంస్థలకు సెలవు
- తెరిపినివ్వకుండా కురుస్తున్న వర్షం
- జంట జలాశయాలకు భారీ వరద
- ఫుల్‌ట్యాంక్ లెవల్ దాటిన హుస్సేన్ సాగర్
- తూముల ద్వారా మూసీలోకి నీటి విడుదల
- పరీవాహక ప్రాంతాలకు ప్రమాద హెచ్చరికలు
- ఇప్పటికే లోతట్టు ప్రాంతాలు జలమయం
- నాలాల్లో పెరిగిన వరద ప్రవాహం
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- నేలకొరిగిన భారీ వృక్షాలు, విరిగిపడిన చెట్ల కొమ్మలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- రంగంలోకి జలమండలి, జీహెచ్ఎంసీ బృందాలు
- నిర్మాణ ప్రాంతాలు, సెల్లార్ల వద్ద సిబ్బంది తనిఖీలు
- అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని నగరవాసులకు విజ్ఞప్తి

రెండ్రోజులుగా కురుస్తున్న వానలతో నగర రోడ్లన్నీ జలమయమయ్యాయి. దాదాపు 165 వాటర్‌లాగింగ్ ప్రాంతాల్లో పరిస్థితులు ప్రమాదకరంగా మారడంతో జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్స్, వాటర్ బోర్డు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ ఎప్పటికప్పుడు నీటిని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యాయి. దాదాపు 115 ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. మూసీ పరీవాహక ప్రాంతాలకు జీహెచ్ఎంసీ హై అలర్ట్ ప్రకటించింది. కూకట్‌పల్లి అల్లాపూర్, రాజీవ్‌నగర్, సఫ్దర్‌నగర్ బస్తీలు నీట మునిగాయి. ముషీరాబాద్, పార్శిగుట్ట, పద్మాకాలనీ, నల్లకుంటలతో సహా పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. అమీర్‌పేట, బేగంపేట, షేక్‌పేట, టోలిచౌకి, గచ్చిబౌలి, కొండాపూర్, అత్తాపూర్ తదితర చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



కూకట్‌పల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీరు

కంట్రోల్ రూమ్‌ల నంబర్లు

జీహెచ్ఎంసీ: 040- 21 11 11 11, డీఆర్ఎఫ్: 9000113667, జలమండలి: 155313

హైదరాబాద్ కలెక్టరేట్: 040-23202813, 90634 23979



నారాయణగూడలో..

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షానికి పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజినీర్లు దెబ్బతిన్న లైన్లను పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. సీఎండీ ముషారఫ్ ఫారూఖీ సహా ఆయా జోన్ల సీజీఎంలు, సర్కిళ్ల ఎస్ఈలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించారు. కొన్ని చోట్ల లైన్లు తెగిపడగా, మరి కొన్ని చోట్ల స్తంభాలు విరిగిపడ్డాయి. ఇంకొన్ని చోట్ల ఫీడర్లపై జంపర్లు కట్టయ్యాయి. ఇన్సులేటర్లు ఫెయిల్ అయ్యాయి. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో 10, రాజేంద్రనగర్‌లో 8, సరూర్‌నగర్‌లో 6 ఫీడర్ల పరిధిలో సరఫరా నిలిచిపోయింది. హైదరాబాద్ సెంట్రల్, సౌత్ సర్కిళ్లతో పాటు హబ్సిగూడ, సికింద్రాబాద్, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలోనూ అంతరాయం తప్పలేదు. మారేడుపల్లిలోని విద్యుత్ స్తంభంపై భారీ చెట్టు విరిగిపడింది. ఖైరతాబాద్ గణేష్ మండపం సమీపంలో ఓ విద్యుత్ స్తంభం పక్కనే ఉన్న ఇంటిపై వంగిపోయింది. అత్తాపూర్ సిరిమల్లె కాలనీలో చెట్టు కూలి విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని మీనాక్షి ఫీడర్ విద్యుత్ స్తంభం నేలకూలింది. గడ్డిఅన్నారం ఫీడర్‌పై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో ఆయా ప్రాంతాలకు సరఫరా నిలిచిపోయింది. మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



నిండుకుండలా హిమాయత్ సాగర్

బండ్లగూడ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది. జలాశయం నీటి మట్టం 1,756.60 అడుగులు కాగా జలాశయం పూర్తి నీటి మట్టం 1,763.50 అడుగులు. జలాశయంలోకి ఇన్‌ఫ్లో 3,500 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నందున ఇన్‌ఫ్లో ఇంకా పెరిగే అవకాశం ఉందని జల మండలి అధికారులు తెలిపారు.

బల్దియా సిబ్బంది సెలవులు రద్దు

బంజారాహిల్స్: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తమయ్యామని, ఇప్పటికే జీహెచ్ఎంసీ సిబ్బంది సెలవులు సైతం రద్దు చేశామని కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. ఆదివారం రాజ్‌భవన్ రోడ్డులో లేక్‌వ్యూ అతిథి గృహం వద్ద జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సంపును ఆమె పరిశీలించారు. ఈ ఏడాది 141 చోట్ల వాటర్ లాగింగ్ ఉంటే వచ్చే ఏడాది వాటిని 50కి తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వాటర్ లాగింగ్ ఉన్న చోట్ల మోటార్ల సహాయంతో ఎప్పటికప్పుడు నీటిని తోడిస్తున్నామని చెప్పారు. పోలీసులు, హైడ్రా, ఇరిగేషన్ అధికారులతో సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రానున్న మూడు నాలుగు వారాల్లో కనీసం నాలుగు సంపులు అందుబాటులోకి వస్తాయన్నారు.



రాజ్‌భవన్ రోడ్డులో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సంపును పరిశీలించి వస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

వర్షపాతం (సెం.మీ)

శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 7 వరకు	పటాన్‌చెరు	గచ్చిబౌలి	కూకట్‌పల్లి	హెచ్‌సీయూ	యూసుఫ్‌గూడ	హయత్‌నగర్	షేక్‌పేట్	మాదాపూర్	బండ్లగూడ	హఫీజ్‌పేట
	8.2	7.7	7.6	7.6	7.4	7.3	7.1	6.9	6.9	6.8

ఆదివారం రాత్రి 7 గంటల వరకు	మలక్‌పేట	బతుకమ్మకుంట	విఠల్‌వాడి	హైదర్‌నగర్	హెచ్‌సీయూ	గచ్చిబౌలి	బాలాజీ నగర్	యూసుఫ్‌గూడ	షేక్‌పేట్	కేపీహెచ్‌బీ
	4.6	4.4	4.2	3.8	3.6	3.6	3.5	3.4	3.4	3.3



ఔటర్‌పై దెబ్బతిన్న రోడ్లు

భారీవర్షాల కారణంగా ఔటర్‌పై పలు ప్రాంతాల్లో నీరు నిలిచిన రోడ్లను హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఉన్నతాధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. కొల్లూరు జంక్షన్, మల్లంపేట్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. మెయింటెనెన్స్ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పరిస్థితులైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు . ఆదివారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ఉధృతి దృష్ట్యా ఎలాంటి ఘటనలు జరగకుండా మూసీ పరీవాహక ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలని, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల వరదను గేట్ల ద్వారా మూసీలోకి వదలడంతో నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని పేర్కొన్నారు. చెట్లు విరగడం,, రోడ్లు దెబ్బతినడం , పాత గోడలు పడిపోవడం వంటి సంఘటనలు ఉంటే సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు ఇళ్లలోంచి బయటకు రాకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాలతో పాఠశాలలు, గురుకులాల్లో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో కంట్రోల్ రూమ్‌లలో అనుబంధ శాఖల అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు కదిరివన్, ఈ.వెంకటాచారి, ఆర్డీఓలు జ్యోతి, దశరథసింగ్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను పరిశీలించిన జలమండలి ఎండీ

నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదివారం అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. డివిజన్ 3 పరిధిలోని మెహిదీపట్నం ఎంఎన్‌డీసీ భవనం వద్ద పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం మణికొండ సెక్రటేరియట్ కాలనీలో ఆయన పర్యటించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.





లోతట్టు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం జియాగూడ మండీ పక్కన మూసీ వరద నీటి ప్రవాహ వేగాన్ని పరిశీలించి లోతట్టు ప్రాంత ప్రజలతో మాట్లాడారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావద్దని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి సూచించారు. ప్రజలు మ్యాన్‌హోళ్లను తెరవద్దని, ఎక్కడైనా తెరిచి ఉంటే జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలని కోరారు.

ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలి: దానకిశోర్

లోతట్టు ప్రాంతాలు, శిథిల భవనాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాల్సిందిగా మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. తమ పరిధిలోని చెరువులు తదితర నీటి ప్రాంతాల వద్ద 24 గంటల పాటు నిఘా ఉంచాలని, ప్రజల ఫిర్యాదుల్ని తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. నాలాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మైకుల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటనల్లో ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకొని తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

- కూకట్‌పల్లి అల్లాపూర్‌లో 20 ఇళ్లు నీట మునిగినట్లు తమకు సమాచారముందన్నారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. అలాగే.. జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డిలు వేర్వేరుగా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవసరమైన పక్షంలో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సైకిల్‌పై పిల్లలు



నారాయణగూడలో..



హుస్సేన్ సాగర్ నుంచి దిగువకు నీరు..

నిండిన హుస్సేన్‌సాగర్

హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) దాటడంతో గేటు తెరిచి తూముల ద్వారా నీటిని మూసీలోకి వదులుతున్నారు. భారీగా చేరుతున్న వరద నీటితో చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో మూసీ ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని 185 చెరువులు నిండుకుండల్లా మారాయి. ఎఫ్‌టీఎల్ దాటిన దాదాపు 30 చెరువుల నీటిని సర్‌ప్లస్ నాలాల నుంచి బయటకు పంపిస్తున్నారు.



ప్రజలకు ఇబ్బంది కలగొద్దు



సాక్షి, సిటీ బ్యూరో: భారీ వర్షాల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం డైరెక్టర్ ప్రదీప్ కుమార్ శెట్టి అన్నారు. గత రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు పార్కులు, రహదారుల వెంబడి చెట్లు, కొమ్మలు నేలకొరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు వాటిని తొలగించేందుకు హెచ్ఎండీఏ, అర్బన్ ఫారెస్ట్రీ విభాగాలు సంయుక్తంగా పని చేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశాల మేరకు అన్ని పార్కులు, రహదారులపైన విరిగి పడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. కూకట్‌పల్లి, పటేల్ కుంట పార్కు, కొత్వాలగూడ ఎకో పార్కు, సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్, ట్యాంకుబండ్‌పైన విరిగిన కొమ్మలను తొలగించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జంట జలాశయాలను సందర్శించిన జలమండలి ఎండీ



సాక్షి,సిటీబ్యూరో: హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ (గండిపేట)ల జలాశయాలను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదివారం అధికారులతో కలిసి సందర్శించారు. జంట జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండటంతో సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధం కావాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిపాలనా యంత్రాంగంతో పాటు.. జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

జేఎన్‌టీయూ పరీక్షలు 5కు వాయిదా

కేపీహెచ్‌బీకాలనీ: భారీ వర్షాల కారణంగా జేఎన్‌టీయూహెచ్‌లో ఈ నెల 2న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం జరగాల్సిన బీటెక్ తృతీయ సంవత్సరం ఫస్ట్ సెమ్, బీఫార్మ్ తృతీయ సంవత్సరం ఫస్ట్ సెమ్, ఎంబీఏ మొదటి సంవత్సరం ఫస్ట్ సెమ్ సప్లిమెంటరీ పరీక్షలను 5వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు సెలవు.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జేఎన్టీయూహెచ్, అనుబంధ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.

అబ్బురం 'రావణ కృత శివతాండవ స్తోత్రం'

ఉప్పల్ శిల్పారామం వేదికగా ప్రపంచ రికార్డు

వందలాది మంది కళాకారుల నృత్య ప్రదర్శన









ఉప్పల్: స్థానిక శిల్పారామం వేదికగా ఆదివారం నిర్వహించిన 'రావణ కృత శివ తాండవ స్తోత్రం' అబ్బుర పరిచింది. నిష్ణాతులైన కళాకారులు, వీణా వాయిద్యాల మధ్య గజ్జె కట్టిన వందలాది కళాకారులు ఒకే చోటకు చేరి చేసిన నృత్య ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఉప్పల్ శిల్పారామం ఫంక్షన్ హాల్ వేదికగా ఐసీఎండీఏ సారథ్యంలో 10 ప్రపంచ రికార్డును నెలకొల్పే మెగా ఈవెంట్ 'రావణ కృత శివ తాండవ స్తోత్రం' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని కళాకారులు ఈ కార్యక్రమంలో ఏక కాలంలో ప్రదర్శనలో పాల్గొన్నారు. మన దేశంలో ప్రముఖ పుణ్య క్షేత్రం కాశీ నుంచి ప్రారంభం కాగా చెన్నై, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో కూడా ఏక కాలంలో ప్రారంభించారు.

నగరంలో 700 మందితో..

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 5000 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగానే నగరంలోని ఉప్పల్ శిల్పారామం నుంచి 700 నుంచి 800 వరకూ కళాకారులు పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. ఆరు నిమిషాల నిడివితో వీక్షకులను మనసులను చూరగొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, వాయిద్యం, చిత్ర కారులు తదితర కళాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఇంటర్నేషనల్ కర్నాటిక్ మ్యూజీషియన్స్, డ్యాన్సర్స్ అసోసియేషన్ (ఐసీఎండీఏ) అధ్యక్షులు సంగీత కళానిధి కన్యా కుమారి, ఫౌండర్ నాధబ్రహ్మ, ఈఆర్ జనార్ధన్, ప్రముఖ గాయకులు సంగీత రత్నాకర, డీఎస్‌వీ శాస్త్రి, జయలక్ష్మి అయ్యగారి, ప్రొ.అయ్యగారి సోమ సుందరం, కో-ఆర్డినేటర్స్ హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ ఉమామహేశ్వరి, అరుణ శ్రీనివాస్, భవాని విజయ్‌లు సన్మానించారు. కార్యక్రమానికి సహకరించిన విశ్రాంత ఐఏఎస్ కిషన్‌రావుకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఓయూలో ఇంజినీరింగ్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో మిగిలిన బీఈ మొదటి సంవత్సరం సీట్లకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు. బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో 6, మైనింగ్ ఇంజినీరింగ్‌లో 19, మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఒక సీటు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. కాలేజీలోని అసెంబ్లీ హాల్‌లో జరిగే స్పాట్ అడ్మిషన్లకు ఉదయం 11 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంసెట్ ర్యాంక్ కార్డుతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ


12 తులాల బంగారం అపహరణ

అత్తాపూర్: పట్టపగలే ఓ ఇంట్లోని 12 తులాల బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన హైదర్‌గూడలోని గుమ్మకొండ కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కాలనీకి చెందిన ఎల్.ధనుంజయ్ గౌడ్, సులోచన దంపతులు. వీరు పదేళ్లుగా జనప్రియ చౌరస్తాలో పూలు అమ్ముతూ జీవిస్తున్నారు. తమ కూతురు పెళ్లి కోసం 12 తులాల బంగారాన్ని కొనుగోలు చేశారు. ఈనెల 19న సాయంత్రం 6 గంటలకు పూజ చేసేందుకు బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను టిఫిన్ బాక్స్‌లో వేసి పూజగదిలో పెట్టారు. మళ్లీ ఈ నెల 28న ఉదయం 10 గంటలకు టిఫిన్ బాక్సును ఓపెన్ చేసి చూడగా అందులోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెండి వస్తువులు మాత్రం అలాగే ఉన్నాయి. దీంతో బాధితులు వెంటనే రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



'టానిక్' మద్యం షాప్ సీజ్

బంజారాహిల్స్: లైసెన్స్ గడువు ముగియడంతో జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లోని టానిక్ ఎలైట్ లిక్కర్ మార్ట్‌ను ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. రూ.1.70 కోట్ల విలువైన 10,291 మద్యం సీసాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2016 నుంచి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లో కొనసాగుతున్న టానిక్ ఎలైట్ మద్యం షాప్ అనేక వివాదాలకు కేంద్రంగా మారిందన్నారు. ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నందున ఈ దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి ప్రతి రెండేళ్లకోసారి మద్యం దుకాణాల వేలం నిర్వహిస్తామని, కానీ 2016లో ప్రత్యేకంగా టానిక్ ఎలైట్ షాప్‌కు అనుమతి తీసుకున్న యజమాని మరోసారి రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ చట్టానికి వ్యతిరేకంగా ఉన్నందున టానిక్ ఎలైట్ షాప్ రెన్యువల్‌ను తిరస్కరించామన్నారు. ఆగస్టు 31న షాప్ లైసెన్స్ గడువు ముగిసినందున దుకాణాన్ని సీజ్ చేసినట్లు వారు వివరించారు.



టానిక్ మద్యం షాప్‌ను సీజ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

లంచం తీసుకున్నారని..

ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లపై కేసు నమోదు

వెంగళరావునగర్ : లంచం తీసుకున్నారని ఆరోపణలు రావడంతో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌కాలనీకి చెందిన జువ్వల రాజు వ్యాపారం చేసేవాడు. జూన్ 14న అతడు తన స్నేహితులు తేజ, ద్వారక్‌రెడ్డిలతో కలిసి మోతీనగర్‌లో స్నేహితుడి బర్త్‌డేకు వెళ్లారు. అక్కడ ద్వారక్‌రెడ్డి, రాజు మద్యం సేవించారు. అనంతరం కారులో తిరిగివస్తూ జవహర్‌నగర్‌లోని ఓ దుకాణం వద్ద వాటర్ బాటిల్ కోసం ఆగారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పోలీస్ వాహనం నుంచి ఓ కానిస్టేబుల్ దిగి కారులో ఉన్న యువకులను కిందకు దిగమన్నాడు. రాజు కారు దిగడంతో కారులో మద్యం తాగరాదని, కేసు పెడతామని బెదిరించాడు. తాము కారులో మద్యం తాగలేదని చెప్పినా వినిపించుకోకపోగా రాజుపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మరో కానిస్టేబుల్ అతడి స్నేహితులను పీఎస్‌కు తీసుకెళ్లి కేసు బుక్ చేయకుండా ఉండాలంటే రూ.1000 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇటీవల స్పా సెంటర్‌లో డబ్బులు వసూలు చేసినందుకు ముగ్గురు కానిస్టేబుళ్లను కమిషనర్ సస్పెండ్ చేసినట్లు తెలియడంతో రాజు శనివారం సాయంత్రం మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమ స్నేహితుడి నుంచి లంచం తీసుకున్న కానిస్టేబుల్ నవీన్, ఎస్పీఓ రామకృష్ణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమర్జెన్సీ సినిమాను నిషేధించాలి

సిక్కుల నిరసన ప్రదర్శన

అమీర్‌పేట: త్యాగధనులైన సిక్కులను అరాచకశక్తులుగా చూపిస్తూ రూపొందించిన 'ఎమర్జెన్సీ' సినిమాను నిషేధించాలని డిమాండ్ చేస్తూ సిక్కులు ఆందోళన చేపట్టారు.ఆదివారం అమీర్‌పేట గురుద్వారా ఎదుట సినిమాను వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. సిక్కుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్న ఈ సినిమాను ఎక్కడా ప్రదర్శించకుండా నిషేధం విధించాలని నినాదాలు చేశారు.దేశం కోసం రక్తం చిందించిన వారిలో సిక్కులు మొదటి వరుసలో ఉంటారని, వారి త్యాగాలను దాచి పెట్టి, ఎమర్జెన్సీ నాటి కాలంలో చోటు చేసుకున్న దురదృష్టకర ఘటనలను ఎత్తి చూపి మొత్తం సిక్కు సమాజాన్నే తీవ్రవాద ప్రోత్సాహకులుగా చిత్రీకరించారన్నారు. పార్లమెంట్ సభ్యురాలైన కంగనా రనౌత్ నిర్మాణ సారథ్యంలో సిక్కు సమాజాన్ని అరాచక శక్తులుగా చూపిస్తూ రూపొందించిన చిత్రం విడుదలను అడ్డుకుంటామన్నారు.తెలంగాణలో ఈ చిత్రం విడుదలపై నిషేధం విధించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని సిక్కు సమాజం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుద్వారా ప్రబంధక్ కమిటీ చైర్మన్ అజీత్‌సింగ్,మాజీ చైర్మన్ భాగిందర్‌సింగ్, ప్రతినిధులు ఇందర్‌జీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



గురుద్వారా ఎదుట నిరసన చేపట్టిన సిక్కులు

మట్టి గణపతి..మహాగణపతి..

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా ఆదివారం స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాల తయారీ పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 50 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ నాగేశ్వరరావు మట్టి గణపతి తయారీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేస్తూ మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వారికి జ్యూట్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా 'మట్టి గణపతి మహా గణపతి' అనే అంశంపై విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ కళాజాత బృందం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోడల్ కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, హారిక, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి



శంషాబాద్ రూరల్: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేలా రెసిడెన్షియల్ హాస్టళ్లల్లో మౌలిక వసతులు, సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అధికారులకు సూచించారు. పాల్మాకులలో ఉన్న కేజీబీవీని ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కులం పేరుతో దూషించిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా చేయాలన్నారు. అంతకుముందు ఆయన పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ సుశీందర్‌రావు, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం పంపిణీ

సాక్షి, సిటీ బ్యూరో: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో జాతీయ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, యూత్ ఫీడ్ ఇండియా సంయుక్తంగా 3 వేల మందికి తాగునీరు, ఆహారం అందించినట్లు యూత్‌ఫీడ్ ఇండియా అధ్యక్షుడు షాజ్ మహమ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్, మహంకాళి మందిర్, క్లాక్ టవర్, గౌలిదొడ్డి, బండ్లగూడ, శివాజీబ్రిడ్జి, సాబర్‌నగర్, షహీన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎన్జీఓ వాలంటీర్లు ఆహారం పంపిణీ చేశామన్నారు. 2020 కరోనా, వరదల సమయంలో 1.7 కోట్ల ఆహార పొట్లాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితిలో హైదరాబాద్ ప్రజల ఆకలి తీర్చడానికి సిద్ధంగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.



లారీ ఢీ కొని డెలివరీ బాయ్ మృతి

మణికొండ: బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న యువకుడు లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లాకు చెందిన నరేష్(23) నానక్‌రాంగూడ ప్రాంతంలో ఉంటూ జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి అతను బైక్‌పై ఫుడ్ డెలివరీ చేసేందుకు వెళుతుండగా మైహోం అవతార్ వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. అతని తల పైనుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రేన్ ఢీకొని మహిళ దుర్మరణం

సనత్‌నగర్: క్రేన్ వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బోరబండకు చెందిన కేత (30) అనే మహిళ మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కొన్నాళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆమె ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా ఎర్రగడ్డ నుంచి మూసాపేట వైపు వెళ్తున్న క్రేన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సనత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన క్రేన్ వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో స్కూల్ ప్రిన్సిపాల్ మృతి



శ్రీనివాసరావు మృతదేహం

ఘట్‌కేసర్: విద్యుదాఘాతంతో ఓ స్కూల్ ప్రిన్సిపాల్ మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు(48) మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలో ఉండగా శ్రీనివాసరావు పాఠశాలలోనే ఉండేవాడు. ఆదివారం ఉదయం టిఫిన్ చేసిన అనంతరం గదిలోకి వెళ్లిపోయాడు. సాయంత్రం అతను భవనంపై పడి ఉండడాన్ని గుర్తించిన ఉపాధ్యాయుడు రాజేశ్ స్కూల్ యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. రూఫ్‌పై నిలిచిన నీటిని తొలగించేందుకు వెళ్లిన అతను కరెంట్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్కూల్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని యువతికి తీవ్ర గాయాలు



సీసీ కెమెరాలో రికార్డైన ప్రమాద దృశ్యాలు

హస్తినాపురం: వేగంగా దూసుకువచ్చిన వచ్చిన ఓ కారు అదుపు తప్పి పార్కు ఎదుట నడిచి వెళుతున్న యువతిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హయత్‌నగర్‌కు చెందిన సోని(21) ఆదివారం ఎన్‌జీఓస్‌కాలనీలో వివేకానంద పార్కు ఎదుట నడిచి వెళుతుండగా వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొంది. దీంతో గాల్లోకి ఎగిరిపడిన సోనీకి తీవ్రంగా గాయపడింది. మార్నింగ్ వాక్‌కు వచ్చిన స్థానికులు 108 కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం సాగర్‌రింగ్‌రోడ్డులోని మెడికేర్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్షణమాగలే... తెరిపినివ్వలే..!

● రెండురోజులుగా ఏకధాటిగా కురిసిన వాన ● రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం

- ప్రజలు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- రోడ్లపై నీరు నిల్వకుండా జీహెచ్‌ఎంసీ చర్యలు
- పలు చోట్ల నేలకూలిన చెట్లు, ఒరిగిపోయిన విద్యుత్‌ స్తంభాలు


శ్రీనగర్‌ కాలనీలో

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్‌ నియోజకవర్గాల్లో రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించిపోయింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కురిసిన ఏకధాటి వర్షానికి ఎక్కడికక్కడ లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం అయ్యాయి. మరో వైపు ఎక్కడా కూడా పెద్దస్థాయిలో నీరు నిలిచిపోకుండా జీహెచ్‌ఎంసీ యంత్రాంగం తగు చర్యలు తీసుకున్నారు. జూబ్లీహిల్స్‌ అపోలో ఆస్పత్రి వద్ద, లోటస్‌పాండ్‌లో చెట్లు నేలకూలడంతోపాటు కరెంటు స్తంభాలు ఒరిగిపోవడంతో విద్యుత్‌ సరాఫరాకు అంతరాయం ఏర్పడింది. ఖైరతాబాద్‌ సెన్సేషన్‌ థియేటర్‌ వద్ద భారీ చెట్టు నేల కూలడంతో అక్కడ రాకపోకలకు ఆటంకం కలిగింది. డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది మధ్యాహ్నం వరకు శ్రమించి చెట్టును పక్కకు తొలగించారు. మరో వైపు నిత్యం బిజీగా ఉండే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. భారీ వానలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో చాలా మంది ఇళ్ళకే పరిమితం అయ్యారు.
– బంజారాహిల్స్‌


హిమాయత్‌నగర్‌ రోడ్డునెంబర్‌-5లో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు


శ్రీనగర్‌ కాలనీలో


యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్‌ సమీపంలో నీటిలో మునిగిన ద్విచక్ర వాహనాలు


వర్షానికి గొడుగు సహాయంతో వెళ్తున్న యువతులు


ఫిలింనగర్‌లో వరద నీటిలో చేపలు విక్రయిస్తున్న మహిళ


అపోలో ఆస్పత్రి వద్ద కూలిన చెట్టు


లోటస్‌పాండ్‌ దారిలో వంగిపోయిన స్తంభం


నిర్మానుష్యంగా బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 2


రాజ్‌దూత్‌ చౌరస్తా నుంచి ఖైరతాబాద్‌ వెళ్లే రోడ్డులో

విద్యుత్‌ వ్యవస్థ అస్తవ్యస్తం!

18 చోట్ల నేలకూలిన చెట్లు


ఖైరతాబాద్‌ బడా గణేష్‌ వద్ద ఒరిగిన స్తంభం

బంజారాహిల్స్‌: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్‌ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. చాలాచోట్ల చెట్లు కూలి కరెంటు వైర్లుపై పడడంతో శనివారం రాత్రి నుంచి పలుచోట్ల విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బంజారాహిల్స్‌ విద్యుత్‌ ఏడీఈ హైమానందతో పాటు ఏఈలు అంతా శనివారం రాత్రి నుంచి కార్యాలయాల్లోనే అందుబాటులో ఉంటూ కరెంటు వైర్లు తెగిపడిన చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్‌ ప్రాంతాల్లో 18 చోట్ల చెట్లు కూలి విద్యుత్‌ స్తంభాలపై పడటంతో కరెంటు వైర్లు తెగిపడ్డాయి. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే సుమారుగా 10 గంటల పాటు ఆయా చోట్ల విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది.

అసభ్య ప్రవర్తన..ఆపై దాడి

వెంగళరావునగర్‌: అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ఇరువురిపై దాడి చేసిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సనత్‌నగర్‌ ప్రాంతానికి చెందిన రీనాజాన్‌ తన ఫ్రెండ్‌తో కలిసి ఆదివారం పంజగుట్టలోని సినిమాకు వెళ్ళి వస్తున్నారు. మైత్రీవనం వద్దకు రాగానే ముగ్గురు యువకులు వెనుక నుంచి వారిని అసభ్యంగా కామెంట్‌ చేయడమే కాకుండా వారిపైన నీటిని పోయడంతో వారి దుస్తులు పూర్తిగా తడిసిపోయాయి. దీంతో ఆగ్రహించిన రీనాజాన్‌ వారిపై కేకలు వేయగా యువకులు తిరిగి వచ్చి రీనాజాన్‌తోపాటు ఆమె ఫ్రెండ్‌పైనా దాడి చేశారు. ఈ దాడిలో జాన్‌తో పాటుగా ఫ్రెండ్‌ కూడా గాయపడ్డారు. బాధితులు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిస్థితిని సమీక్షించిన జోనల్‌ కమిషనర్‌

బంజారాహిల్స్‌: వర్షంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో పరిస్థితిని సమీక్షించేందుకు అధికారులు రంగంలో దిగారు. దీనిలో భాగంగానే ఖైరతాబాద్‌ జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి ఫిలింనగర్‌లోని కొత్త చెరువు బీజేఆర్‌నగర్, మల్కాపూర్‌ నాలాను ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ, ఏఈలతో కలిసి పరిశీలించారు. అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష జరిపారు. జూబ్లీహిల్స్‌లోని పలు ప్రాంతాల్లో సర్కిల్‌–18 డీసీ ప్రశాంతి పర్యటించి వాటర్‌ లాగింగ్‌ పాయింట్లను పరిశీలించారు. వరద నీటిని మోటార్ల ద్వారా సమీప నాలాల్లోకి పంపించారు. పలుచోట్ల చెట్లు కూలిపోవడంతో డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది వాటిని తొలగించారు.


రోడ్డునెంబర్‌-54లో మోటార్ల ద్వారా తోడుతున్న వరదనీటిని పరిశీలిస్తున్న డీసీ ప్రశాంతి


ఐమాక్స్‌ పక్కన వర్షానికి నిలిచిన వరదనీరు


జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం. 5లో

ఇళ్లపై పడ్డ బండరాయి


కూలిన బండరాయి

బంజారాహిల్స్‌: ఫిలింనగర్‌లోని మహాత్మానగర్‌ బస్తీలో రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలకు మట్టి నాని ఓ భారీ బండరాయి దొర్లుకుంటూ ఇళ్లపై పడింది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పలు ఇళ్ల గోడలకు పగుళ్లువచ్చాయి. షేక్‌పేట మండల వీఆర్వో మహేష్‌కుమార్‌ ఘటనా స్థలంలో పరిస్థితిని సమీక్షించారు.

మా ఈఎన్‌టీలో లైవ్‌ సర్జికల్‌ వర్క్‌షాప్‌


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు..

బంజారాహిల్స్‌: ప్రజలకు హెడ్‌అండ్‌ నెక్‌ కేన్సర్‌పై అవగాహన, వైద్య విద్యార్థులకు శిక్షణ కోసం ×లైవ్‌ హెడ్‌ అండ్‌ నెక్‌₹ వర్క్‌షాప్‌ ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్‌ నాగార్జునరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని మా ఈఎన్‌టీ సూపర్‌ స్పెషాలిటీ హాస్పిటల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కెఆర్‌ మెఘనాథ్, హెడ్‌అండ్‌ నెక్‌ సర్జన్‌ డాక్టర్‌ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆస్పత్రిలో 68వ లైవ్‌ హెడ్‌ అండ్‌ నెక్‌ వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ తల, మెడ భాగంలో వచ్చే కేన్సర్, కనతుల పట్ల జాగ్రత్త పడాలి అన్నారు. వర్క్‌షాప్‌లో సుమారు 120 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్‌ ప్రతమేశ్‌ పాయ్‌ సర్జన్‌ హెచ్‌ఎన్‌సీఐఐ, డాక్టర్‌ అక్షయ్‌ సర్జన్‌ సిటీ కేర్‌ ఆస్పత్రి బెంగళూరు, డాక్టర్‌ శశి కష్ణ, మా సూపర్‌ స్పెషాలిటీ హాస్పిటల్‌ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బస్తీవాసులు

ఫిలింనగర్‌: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9వ తేదీన జరగనున్న సేవాలాల్‌ సేన సింహగర్జనకు భారీగా తరలిరావాలని కోరుతూ జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌–5లోని దుర్గాభవానీనగర్‌ బస్తీలో కరపత్రాలను పంపిణీ చేశారు. బస్తీ అధ్యక్షుడు వి.గౌడ్‌నాయక్, జనరల్‌ సెక్రటరీ వి.జానీనాయక్, కోశాధికారి వి.రమేష్, కమిటీ సభ్యులు శ్రీనునాయక్, తమ్రూనాయక్, ఆర్‌.పాండునాయక్, వి.కళ్యాణ్‌నాయక్‌ల ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపాలి

లిబర్టీ: అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపాలని ఇండియన్‌ ప్రజా కాంగ్రెస్‌ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు నాగిళ్ల నవీన్‌కుమార్‌ విన్నవించారు. అడ్డూఅదుపు లేకుండా ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలను కబ్జా చేసుకొని విచ్చలవిడిగా నిర్మాణం చేశారని ఆయన ఆరోపించారు. లిబర్టీ ప్లాజాలోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాతూ అనేకేళ్లుగా అక్రమ కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్న ఏ ప్రభుత్వం కూడా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. అక్రమాలను కూల్చివేయాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు.

వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రహమత్‌నగర్‌: మూడురోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో డివిజన్‌ వాసులు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి సూచించారు. డివిజన్‌లోని ఎస్పీఆర్‌హిల్స్‌లోని పలు బస్తీల్లో ఆదివారం ఆయన పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షంలో విద్యుత్‌ స్తంభాలు, తీగలను తాకరాదని సూచించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. పాత భవనాల్లో నివాసించే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బస్తీ అధ్యక్షులు, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సహాయ, సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏదైన సమస్య ఉంటే తన కార్యాలయంలోని 9059782033గాని, జీహెచ్‌ఎంసీ కంట్రోల్‌ నెంబరు 9704607866 ఫోన్‌ నెంబర్లలలో సమాచారం అందిస్తే వెంటనే సహాయక చర్యలు చేపడ్తామని సీఎన్‌ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌ కాంగ్రెస్‌ నాయకులు శాంతకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీనగర్‌లో పర్యటిస్తున్న సీఎన్‌ రెడ్డి

పరిస్థితిని సమీక్షించిన బోరబండ కార్పొరేటర్‌

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జీహెచ్‌ంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్‌ బాబా ఫసీయుద్దీన్‌ అప్రమత్తమైయ్యారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ బస్తీ నాయకులను అప్రమత్తం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యుత్తు ప్రమాదాలు జరుగకుండా ఆశాఖ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాబా ఫసియుద్దీన్‌ కోరారు.

ఫిలింనగర్‌లో అగ్ని ప్రమాదం

ఫిలింనగర్‌: ఫిలింనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. ఫిలింనగర్‌ సైట్‌–2లోని రోడ్‌ నెం.2 డీవీఎస్‌ గ్రాండ్‌ అపార్ట్‌మెంట్‌లో ఒకటవో అంతస్తులో ఉన్న ఫ్లాట్‌ బెడ్‌రూమ్‌ నుంచి తెల్లవారుజామున మంటలు, పొగ రావడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు, ఫైర్‌ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్‌ సిబ్బంది బెడ్‌రూమ్‌ నుంచి వస్తున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కానీ అప్పటికే బెడ్‌రూమ్‌ పూర్తిగా కాలిపోయింది. మంటలు వస్తున్న సమయంలో ఫ్లాట్‌లో ఉండే రామకృష్ణ కుటుంబ సభ్యులు మరో బెడ్‌రూమ్‌లో నిద్రిస్తుండటంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఇంట్లోని ఏసీలు, ఫర్నిచర్‌తో పాటు పలు విలువైన వస్తువులు దగ్ధమైనట్లు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమయానికి ఫైర్‌ సిబ్బంది స్పందించడంతో పక్కనే ఫ్లాట్లకు మంటలు విస్తరించలేదు. లేదంటే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉండేది.


బెడ్‌రూమ్‌లో అగ్ని ప్రమాదానికి కాలిబూడిదైన వస్తువులు

షేక్‌పేట మండలంలో కంట్రోల్‌ రూం ఏర్పాటు

ఫిలింనగర్‌: భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌ కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి ఆదేశాల మేరకు షేక్‌పేట మండలంలో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్‌ అనితారెడ్డి తెలిపారు. 24 గంటల పాటు ఈ నెల 5వ తేదీ వరకు ఇక్కడ అధికారులు అందుబాటులో ఉంటారని, ఏ సమస్య ఉన్నా వెంటనే ఫోన్‌ చేయాలని, తక్షణమే స్పందిస్తామన్నారు. అధికారుల ఫోన్‌ నెంబర్లు..

ఎన్‌.శేఖర్‌	వీఆర్వో	99596 06309
టి.భానుచందర్‌	స్పెషల్‌ ఆర్‌ఐ	90009 55071
డి.సిద్దిరాములు	రికార్డు అసిస్టెంట్‌	95535 14750
సీహెచ్‌.మురళి	వీఆర్వో	93467 95894
ఎన్‌.సాయిలు	రికార్డు అసిస్టెంట్‌	99633 82106
సి.మహేష్‌కుమార్‌	వీఆర్వో	90301 10092
ఎం.నాగరాజు	రికార్డు అసిస్టెంట్‌	94403 65710
ఎం.యాదయ్య	స్పెషల్‌ ఆర్‌ఐ	98484 19782
ఆర్‌.నవీన్‌	రికార్డు అసిస్టెంట్‌	63090 68398
డి.నరేందర్‌	జూనియర్‌ అసిస్టెంట్‌	88864 84818
ఏ.లక్ష్మీనర్సింహులు	రికార్డు అసిస్టెంట్‌	94940 58625

వైభవంగా దక్షిణామూర్తి హోమం

వెంగళరావునగర్‌: వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని జీటీఎస్‌ కాలనీలోని వీరాంజనేయ భవానీశంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్‌ టెంపుల్‌)లో గత మూడు రోజులుగా భవానీశంకరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచే పూజలు ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, ఆశీర్వచనం, అన్నప్రసాద వితరణ, తదితర పూజలు చేశారు. దీంతోపాటుగా సరస్వతీ హోమం, దక్షిణామూర్తి హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వెంగళరావునగర్‌కాలనీ పరిసర ప్రాంత భక్తులు భారీగా హాజరై పూజల్లో పాల్గొన్నారు.


దక్షిణామూర్తి హోమంలో పాల్గొన్న భక్తులు

ముగిసిన కళాపీఠం 13వ వార్షిక వేడుకలు

పంజగుట్ట: ఆదిబట్ల కళాపీఠం ఆధ్వర్యంలో పంజగుట్ట టోపాజ్‌ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న ఆదిబట్ల నారాయణ దాసు 160వ జయంతి, కళాపీఠం 13వ వార్షికోత్సవ కార్యక్రమాలు మూడోరోజు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ నటి, ఆదిబట్ల కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు, బీజేపీ ధార్మిక పరిషత్‌ రాష్ట్ర జాయింట్‌ కన్వీనర్‌ కరాటే కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ప్రముఖ హరికథా భాగవతారని విన్నకోట రామకుమారిని హరికథ సుధానిధి బిరుదుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె.వీ.బ్రహ్మానందం సంకీర్తన గానం చెయ్యగా, ఆయనను నాద సుధాకర బిరుదుతో సత్కరించారు. విన్నకోట రామ కుమారి సీతాకళ్యాణం హరికథా గానం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాధా మనోహర్‌ స్వామి, ప్రముఖ సినీ దర్శకులు బుర్ర సాయి మాధవ్‌ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- పాస్ రిఫ్లెక్ట్ పేరిట మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరుగుతుంది.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఉదయం 8.30 గంటలకు బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని సిటీ సెంటర్ వద్ద, ఉదయం 9 గంటలకు పంజాగుట్ట సర్కిల్‌లోని హైదరాబాద్ సెంట్రల్ మాల్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాళులు అర్పిస్తారు.
- 9.30 గంటలకు బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, 10.30 గంటలకు కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 1లో, ఉదయం 10 గంటలకు దీనబంధు కాలనీ క్రాస్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద అభిమానులు నివాళులు అర్పించనున్నారు.
- భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11.30 గంటలకు జరుగుతుంది.
- కోఠిలోని ఉమెన్స్ యూనివర్సిటీ క్యాంపస్‌లో న్యూట్రిషన్ డైట్ ఫర్ ఆల్ (పోషణ్ అభియాన్) పేరిట ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఉదయం 10.15 గంటలకు రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ప్రారంభిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళాస్వయం సహాయక సంఘాల సభ్యులు


మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

'పట్టణ మహిళ'కు రూ.51 కోట్లు

మహిళాశక్తి రుణాల పంపిణీకి మెప్మా సన్నద్ధం

- 13 పురపాలక సంఘాల్లో 7,245 మహిళాసంఘాలు
- 130 మహిళా గ్రూపులకు రూ. 26 కోట్లు
- 900 మందికి రూ. 25 కోట్ల వ్యక్తిగత రుణాలు

సాక్షి, సిటీబ్యూరో: పట్టణ ప్రాంత పేద మహిళలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు మెప్మా కసరత్తు చేస్తోంది. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి పథకం అమలుకు సిద్ధమవుతోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలికల్లో ఇందిరా మహిళా శక్తి పథకం అమలుకు సంబంధించి మహిళలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, జవహర్‌నగర్, కొంపెల్లి, దుండిగల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్కేసర్, పోచారం పురపాలక సంఘాల్లో 7,245 మహిళాస్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లోని మహిళల ఉపాధి కల్పనకు రూ.51 కోట్లు వెచ్చించనున్నారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో గ్రూప్ సంస్థల ఏర్పాటుకు 13 పురపాలికల్లో కలిపి 130 గ్రూపులకు రూ.26 కోట్లు వెచ్చించనున్నారు. వ్యక్తిగత సంస్థల ఏర్పాటుకు సంబంధించి 900 మంది మహిళలకు రూ.25 కోట్లు వెచ్చించనున్నారు.



ఏర్పాటు చేయాల్సిన సంస్థలివే..

మహిళల ఆర్థిక సాధికారతకుగాను ఏర్పాటు చేయాల్సినవాటిలో క్యాంటీన్లు, మీసేవా కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్మెంట్, స్ట్రీట్ వెండర్ కలెక్టివ్స్/ కోల్డ్ స్టోరేజి, క్యాటరింగ్ సర్వీస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ తదితరాలు ఉన్నాయి. వ్యక్తిగత విభాగాల్లో కూరగాయలు, పండ్ల దుకాణాలు, బేకరి, డెయిరీ, డెయిరీ ప్రొడక్ట్స్, మైక్‌సెట్స్, సౌండ్‌సెట్స్, బ్యూటీ వెల్నెస్ సెంటర్స్, టెంట్ హౌస్, ఫ్యాన్సీ స్టోర్, కిరాణ జనరల్ స్టోర్, ఫుడ్‌కు సంబంధించినవి ఏర్పాటు చేయాల్సి ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం

"మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అన్ని పురపాలికల్లో ఇందిరా మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. ఈ పథకం కింద ప్రభుత్వ లక్ష్యాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పట్టణ ప్రాంతంలోని పేద మహిళలకు ఉపాధి కల్పిస్తాం."
– అనిల్, మెప్మా పీడీ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

మహిళాబిల్లులో బీసీ వాటా ఇవ్వాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: మహిళాబిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళా జేఏసీ చైర్మన్ మట్టా జయంతిగౌడ్ అధ్యక్షతన ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ప్రసంగించారు. వాటా ఇచ్చినప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కుతుందని అన్నారు. బీసీ మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, వారిపై జరిగే అత్యాచారాల గురించి రాజకీయ పార్టీల నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. బీసీలన్నా, బీసీ మహిళలన్నా రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు చిన్నచూపా అని ప్రశ్నించారు. విద్యా, ఉద్యోగాలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం మరిన్ని కఠిన చట్టాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాలపట్ల మహిళల్లో చైతన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, కోట్ల శ్రీనివాస్, మేకపోతుల నరేందర్ గౌడ్, నంద గోపాల్, ఉదయ్, మంజు, సుజాత, వరలక్ష్మీ, శ్యామల, సుజాత, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


నిజాయతీ అధికారులను సత్కరించిన దృశ్యం

సంస్కరణలతోనే అవినీతికి చెక్

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ
- నిజాయతీ అధికారులను సత్కరించిన యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ

సనత్‌నగర్: ఎన్నికలు, రాజకీయ సంస్కరణలతోనే సమాజంలో అవినీతిని నిర్మూలించవచ్చని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బేగంపేటలోని హరితాప్లాజాలో ఆదివారం నిజాయితీపరులైన అధికారులకు ఆత్మీయ సత్కారసభ జరిగింది. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలు బాగుపడితేనే సమాజం మెరుగు అవుతుందన్నారు. సమాజంలో అవినీతి పెరిగిపోతోందని ప్రతిఒక్కరూ అంటుంటారని, కానీ తమ కళ్ల ముందు అవినీతి జరుగుతున్నా ఎవరూ ప్రశ్నించడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వ శాఖల్లో ఎక్కడ నిజాయితీపరులు ఉన్నారో వెతకడం కూడా చాలా కష్టమైన పని అని, చాలామంది తప్పులు చేస్తూనే, నిజాయితీగా ఉన్నట్టు నటిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 16 మంది నిజాయతీ అధికారులను సత్కరించారు. తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రవీణ్ రావు, ఆర్ అండ్ బీ చీఫ్ జశ్వంత్‌కుమార్, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ నాగేంద్ర, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్, అగ్రికల్చర్ ఏఓ బుట్ల కరుణ, రిటైర్డ్ ఏడీఏ అమ్రేష్ కుమార్, వెటర్నరీ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అసిస్టెంట్ సర్జన్ శ్రీనివాసరావు, ఎలక్ట్రిసిటీ ఏడీఈ అశోక్, వినియోగదారుల ఫోరం సెక్షన్ ఆఫీసర్ జీవీఎస్ ప్రసాద్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్, మాజీ ఎమ్మెల్యే బక్కిని నర్సింహులు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్నిగ్ధ, లక్ష్మీకళ, జయరాం, రమేష్ బాబు, దేవేందర్, హరిప్రకాష్, గంగాధర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్స్... ముఖ్యమంత్రి గారూ..!

ఇళ్ల స్థలాల అంశంపై డీజేహెచ్‌ఎస్ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న డీజేహెచ్‌ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి

సాక్షి, హైదరాబాద్: పాత్రికేయులకు ఇళ్లస్థలాల మంజూరు విషయంలో అత్యంత సానుకూలంగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ(డీజేహెచ్‌ఎస్) కృతజ్ఞతలు తెలిపింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం డీజేహెచ్‌ఎస్ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. డీజేహెచ్‌ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు ప్రతాప్‌రెడ్డి, డి.రామకృష్ణ, నాగరాజు, సలహాదారు విక్రమ్, సభ్యుడు బి.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొల్లోజు రవి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి జర్నలిస్టులకు ఇళ్లస్థలాల మంజూరు అంశాన్ని మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరామన్నారు. తమ విన్నపం మేరకు ఆ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చారని తెలిపారు. వచ్చేవారం జవహర్‌లాల్ సొసైటీకి ఇళ్లస్థలాలు ఇవ్వనున్న నేపథ్యంలో తమకూ ఇళ్లస్థలాల మంజూరు ప్రకటన చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

సమావేశానికి హాజరైన జర్నలిస్టులు



పాత పింఛన్ ఇస్తే రుణపడి ఉంటాం

శాసనసభ స్పీకర్‌కు సీపీఎస్ యూనియన్ వినతి

సాక్షి, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం(సీపీఎస్) ద్వారా 20 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో సామాజిక భద్రత కొరవడిందని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్‌ఈయూ) ఆవేదన వ్యక్తం చేసింది. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని వర్తింపజేస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం తమకు పాత పింఛన్ ఇస్తే రుణపడి ఉంటామని వెల్లడించింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆదివారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. ఇటీవల కేంద్రం ప్రకటించిన ఏకీకృత పింఛన్ విధానంతోనూ ఎలాంటి వెసులుబాటు కలగలేదని పేర్కొన్నారు. తమ విజ్ఞప్తి పట్ల స్పీకర్ సానుకూలంగా స్పందించారని, సీఎం రేవంత్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని స్థితప్రజ్ఞ వెల్లడించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి నరేశ్‌గౌడ్, నేతలు నరేందర్‌రావు, అశోక్‌రెడ్డి, సుశీల్ తదితరులున్నారు.

'పితృస్వామ్యం'పై పోరులో పురుషులనూ కలుపుకోవాలి

పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభల్లో ప్రొఫెసర్ శాంతాసిన్హా



పీవోడబ్ల్యూ మహాసభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాంతాసిన్హా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పితృస్వామిక భావజాల వ్యతిరేక పోరులో పురుషులను కూడా భాగస్వాములను చేయాలని ప్రొఫెసర్ శాంతాసిన్హా పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర మహాసభల్లో ఆమె మాట్లాడుతూ తమపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మహిళలు గొంతు పెంచాలన్నారు. 'ఇక హింస వద్దు.. మాకూ హక్కులు ఉన్నాయి, వాటిని అమలు చేయాలి' అని పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో కూడా మహిళలు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రొఫెసర్ రమామెల్కొటే మాట్లాడుతూ మహిళలు గౌరవంగా జీవించే పరిస్థితులు క్షీణించాయన్నారు. కులం, మతం పేరిట మహిళలపై హింస పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అందె మంగ, ప్రొఫెసర్ మేరీజాన్, ఉపాధ్యక్షులు అనసూయ, డాక్టర్ సరిత, జ్యోతి, జాతీయ నాయకురాలు వి.సంధ్య, కార్యదర్శులు సీతా, గీతా తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు చేరువగా అగ్రి శిక్షణ

ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్

ఏజీవర్సిటీ: వ్యవసాయవిద్య శిక్షణాకార్యక్రమాలు గ్రామీణ యువతకు చేరువయ్యే విధంగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) ముందుకు సాగుతోందని మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్) 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ మట్లాడుతూ శిక్షణ ఇవ్వడమే కాకుండా గ్రామీణ యువతను వ్యాపార రంగంలోనూ ప్రోత్సహించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ పద్మరాజు మాట్లాడుతూ వ్యవసాయ డిప్లొమా కోర్సులను బలోపేతం చేయాలని, వీటి వల్ల ఉద్యోగ అవకాశాలతోపాటు స్వయంఉపాధికి మార్గం సులభతరమవుతుందని అన్నారు. నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ విద్య, పరిశోధన, శిక్షణ, నిర్వహణ కార్యక్రమాల ద్వారా యువ వ్యవసాయ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. 'ఏ–ఐడియా' ద్వారా దేశవ్యాప్తంగా 321 స్టార్టప్‌లకు సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. నార్మ్ థింక్ ట్యాంక్ పాలసీ ఇనిస్టిట్యూట్‌గా గుర్తింపు పొందిందన్నారు. అనంతరం నాలుగు ప్రచురణలను విడుదల చేశారు. బెస్ట్ ఇన్నోవేటివ్ రైతులు, బెస్ట్ స్టార్టప్ అవార్డులు, బెస్ట్ ప్రింట్ మీడియా, బెస్ట్ పీజీ స్టూడెంట్‌లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో నార్మ్ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ వి.రమాసుబ్రహ్మణ్యం, వివేక పూర్వర్, జాకీర్ కిల్జీతోపాటు ఉద్యోగులు, శాస్త్రవేత్తలు సిబ్బంది పాల్గొన్నారు.


నార్మ్ వ్యవస్థాపక దినోత్సవంలో అధికారులు, రైతులు, ఉద్యోగులు


బెస్ట్ రైతులకు అవార్డులను అందజేస్తున్న దృశ్యం

'అమ్మ' సంస్థ సేవలు అభినందనీయం

ఫైట్‌మాస్టర్స్ రామ్, లక్ష్మణ్


శిబిరం ప్రారంభించిన రామ్, లక్ష్మణ్


రక్త దానం చేసిన యువకులు

అమీర్‌పేట: తలసేమియా బాధితుల కోసం అమ్మ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని టాలీవుడ్ ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ అన్నారు. ఆదివారం అమీర్‌పేట శ్రీ బాలాజీ రాజస్థాన్ భవన్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో 51వ రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రామ్, లక్ష్మణ్ మాట్లాడుతూ విషజ్వరాలు విజృంభిస్తున్నా, భారీ వర్షాలు కురుస్తున్నా లెక్క చేయకుండా తలసేమియా పిల్లల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. 14 ఏళ్లుగా తలసేమియా సొసైటీకి అందిస్తున్న సహకారాన్ని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ 3 నెలలకోసారి తలసేమియాపై అవగాహన కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. శిబిరానికి వంద మందికి పైగా హాజరు కాగా, 53 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారన్నారు. ఆశా కార్యకర్తల కృషితో జరిగిన ఈ కార్యక్రమంలో వాలంటీర్లు కృష్ణకుమార్, నాగరాజు, జగన్, ధనేష్, సతీష్, వెంకటేష్, మోహన్, స్నేహ, అంజనీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు బయటికి రావొద్దు

ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లు 90590 36666, 94404 07402, 82972 50000


తిరుపతి వర్మ

సిటీకోర్టులు: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున వరదల్లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్న న్యాయవాదులు, ప్రజలకు ఎలాంటి సహాయం కావాలన్నా టీపీసీసీ లీగల్ సెల్ టీంను సంప్రదించాలని నాంపల్లి కోర్టు న్యాయవాది, టీపీసీసీ లీగల్ సెల్, ఆర్‌టీఐ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ పేర్కొన్నారు. వరదల్లో చిక్కుకొని చాలామంది ప్రాణాలు సైతం కోల్పోయారని, వర్షాలు తగ్గేవరకు ఎవరూ ఇండ్ల నుంచి బయటికి రావొద్దని అన్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఉచిత హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించామని, ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా 90590 36666, 94404 07402, 82972 50000 ఫోన్ నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. టీపీసీసీ లీగల్ సెల్ టీం సభ్యులు తనతో పాటు, మోమిన్ రోషన్, చౌహాన్, అశోక్‌రెడ్డి, శారద, సురేఖసింగ్, ఆనంద్, వికాస్ అందుబాటులో ఉంటారని తెలిపారు.

'ఆరోగ్య మిత్ర'ల సమ్మె వాయిదా


గిరి యాదయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్న 'ఆరోగ్యమిత్ర'ల నిరవధిక సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య తెలిపారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నామని, అయితే రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పేదలకు ఇబ్బంది కలగవద్దన్న సమ్మెను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

సంచారజాతుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్ తిప్పిరిశెట్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, అధ్యయన కమిటీ చైర్మన్ వెంకట నారాయణలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. సంచార జాతుల అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు దాటినా సంచారజాతుల స్థితిగతులు మారలేదని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పలువురు రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

'ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిని'


కోదండరాంను సత్కరిస్తున్న దృశ్యం

కాచిగూడ: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండటానికే తనకు ఎమ్మెల్సీ పదవి లభించిందని, తన బాధ్యతలను నిర్వర్తించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కోదండరాంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెక్చరర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. 'ఎప్పుడూ మిమ్మల్ని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద కలుసుకునేవాడిని, ఇప్పుడు ఇలా అభినందనసభలో కలుసుకోవడం శుభపరిణామం' అని అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్, అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ కనక చంద్రం, ప్రధానకార్యదర్శి ఆర్.శేఖర్, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరియాణా గవర్నర్‌ను కలిసిన సినిమా బృందం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గవర్నర్ బంగ్లాలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆదివారం సినీదర్శకుడు ఎంవీ సతీష్ కుమార్, నిర్మాత కాశెట్టి కుమార్ ప్రత్యేకంగా కలిశారు. ఆడపిల్లలపై జరుగుతున్న దాడుల గురించి చర్చించారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న సినిమా విశేషాలను దత్తాత్రేయతో పంచుకున్నారు. సనాతనవైదిక సంప్రదాయం రానున్న రోజుల్లో ఎలా ఉంటుంది, దేశం, ధర్మం కోసం ప్రతీ మనిషి ఏం చేయాలి, నేటి యువత ధర్మం కోసం ఏమీ చేస్తున్నారు, ఆడపిల్లలపై అత్యాచారాలను ఎలా ఆపాలి..అనే అంశాల గురించిన చిత్ర విశేషాలను వెల్లడించారు. ఈ ప్రయత్నాన్ని దత్తాత్రేయ అభినందించారు.

'వెల్‌స్పన్'కు సిల్వర్ అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: షాబాద్‌లోని వెల్‌స్పన్ ఫ్లోరింగ్ లిమిటెడ్‌కు సిల్వర్ అవార్డు దక్కింది. జాతీయస్థాయిలో 'మాన్యుఫ్యాక్చరింగ్ ఎక్సలెన్స్2023–24 రికగ్నైజేషన్ ప్రోగ్రామ్'లో భాగంగా తయారీ రంగంలో ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. తయారీ ప్రక్రియల్లో ఆవిష్కరణ, నిరంతరం నాణ్యతను కొనసాగించడంలో తమ నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలోని 19కిపైగా రాష్ట్రాల్లో వెయ్యి కర్మాగారాలను పరిశీలించిన అనంతరం అవార్డు విజేత ఎంపిక జరిగిందని తెలిపారు.

జోరువానలో గన్‌పార్క్ ఎదుట నిరసన

సెప్టెంబర్ 1న విద్రోహ దినంగా పాటించిన తెలంగాణ ఉద్యోగ జేఏసీ

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఎస్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఆదివారం తెలంగాణ అమరవీరుల స్తూపం(గన్‌పార్క్) ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 27 ఉద్యోగ సంఘాలతో కలిసి జేఏసీని ఏర్పాటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీలోని భాగస్వామ్య సంఘాల నేతలు పి.శ్రీపాల్‌రెడ్డి, చావా రవి, వి.రవీందర్ రెడ్డి, జి.సదానందంగౌడ్, జి.జ్ఞానేశ్వర్, మధుసూదన్ రెడ్డి, టి.నాగిరెడ్డి, టి.లింగారెడ్డి, చంద్రమోహన్, ఎం.మణిపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, ఎన్.శ్రీధర్, డాక్టర్ బి.రమేష్, ఎం.చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దాదాపు 15 శాతం మంది దంపతులు సంతానలేమితో బాధపడుతున్నట్లు ఓ సర్వే చెబుతోంది. హైదరాబాద్‌లో కూడా లైఫ్‌స్టైల్ మారడం వల్ల ఎన్నో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. అందులోనూ సంతానలేమి అనేది ప్రముఖంగా చెప్పుకోవచ్చు. జంక్‌ఫుడ్, ఎక్కువసేపు కూర్చుని చేసే డెస్క్ జాబ్‌ల కారణంగా ఈ సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరిలో జన్యుపరంగా కూడా ఇన్‌ఫెర్టిలిటీ సమస్యలు వస్తున్నాయని వైద్యులు, నిపుణులు పేర్కొంటున్నారు. చాలామందిలో ఆహారపు అలవాట్లను మార్చుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, మంచి నిద్ర, ఎక్సర్‌సైజ్‌లు కనుక చేస్తే సంతానలేమి అనేది పెద్ద సమస్య కాదని వైద్యులు సూచిస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



హైదరాబాద్ వైబ్స్





- ఫెర్టిలిటీ సెంటర్లతో మాతృత్వ మాధుర్యం
- మారుతున్న లైఫ్‌స్టైల్, ఆలోచనా విధానంతో సంతానలేమి
- ఇన్ఫెక్షన్లు, మానసిక ఒత్తిడి, హార్మోన్ల సమతుల్యతా ఓ కారణమే
- మంచి ఆహారపు అలవాట్లు, జీవన విధానంతో సత్ఫలితాలు

ఐవీఎఫ్‌తో.. సంతానం సఫలం

ఫలదీకరణ సమస్యలకు పరిష్కారం..

ఇటీవల దేశంలో సంతానలేమి సమస్యతో బాధపడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. హైదరాబాద్‌లో పెరుగుతున్న మెట్రో పాలిటన్ కల్చర్ కారణంగా సంతానలేమి సమస్య ఉత్పన్నం అవుతోందని ముఖ్యంగా చెప్పుకోవచ్చు. ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, ఉద్యోగాల్లో ఒత్తిడి, ఆహార అలవాట్లు, క్రమంగా లేని పనివేళలు, శారీరక శ్రమ ఎక్కువగా లేకపోవడం, అధిక బరువు, మద్యపానం, పొగతాగడం, డ్రగ్స్ వంటి అనారోగ్యకర అలవాట్లు, వ్యసనాలు వంటివి సంతానలేమికి దారితీస్తున్నాయి.

ఒత్తిడి వల్ల కూడా..


మహిళల్లో కనిపించే ఇన్ఫెక్షన్లు, మానసిక ఒత్తిడి, హార్మోన్లలో సమతుల్యత దెబ్బతినడం వంటివి సంతానలేమికి కారణమవుతున్నాయి. అండం తయారీలో, ఫలదీకరణలో, పిండం ఇంప్లాంటేషన్‌లో ఇబ్బందుల వంటివి మహిళలకు ప్రత్యేకంగా వచ్చే సమస్యల్లో కొన్ని. ఇక మగవారిలోనైతే.. శుక్రకణాల సంఖ్య, కదలిక, నాణ్యత తగ్గడం సంతనం కలగడానికి అవరోధంగా నిలుస్తున్నాయి.

సంతానలేమి నిర్ధారణ ఇలా?

సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న భార్యాభర్తలు వివాహం అయ్యాక ఎలాంటి కుటుంబనియంత్రణా పద్ధతులను పాటించకుండా, కలిసి ఉంటూ ఏడాది పాటు గర్భధారణ కోసం ప్రయత్నించినా గర్భం రాకపోతే అప్పుడు ఆ దంపతులకు సంతానలేమి సమస్య ఉండే అవకాశాలున్నాయని చెప్పవచ్చు. ఈ సమస్యను ప్రైమరీ ఇన్ఫెర్టిలిటీ అంటారు. మొదటిసారి గర్భధారణ తర్వాత, రెండోసారి గర్భధారణ కోరుకున్నప్పుడు ఏడాది పాటు ప్రయత్నించినా గర్భం దాల్చకపోతే దాన్ని సెకండరీ

ఎవరికి చికిత్స అవసరం..

మహిళకు ప్రతినెలా నెలసరి సక్రమంగా వస్తూ, రెండేళ్ల పాటు ప్రయత్నించాక కూడా అప్పటికీ గర్భం రానివారికీ, అలాగే ఆ మహిళ 30 ఏళ్ల వయసుకు చేరుకుంటున్నప్పుడు.. ఆ దంపతులు డాక్టర్‌ను సంప్రదించి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకోవడం మంచిది.



ఏయే చికిత్స అందజేస్తారు..

అండం సరిగా పెరగనప్పుడు, అది పెరగడానికి క్లోమిఫిన్, లెట్రోజ్ వంటి కొన్ని రకాల మాత్రలు, వాటి మోతాదులను క్రమంగా పెంచుకుంటూ వాడాలి. కొందరికి గొనాడోట్రోపిన్ హార్మోన్ ఇంజెక్షన్ అవసరమవుతుంది. అండాశయాలలో పీసీఓడీ కారణంగా అండాలు పెరగకపోతే లాప్రోస్కోప్ ఆపరేషన్ ద్వారా, పీసీఓడీలోని నీటితిత్తుల్లో కొన్నింటిని పేల్చడం అవసరం. దీన్నే ఒవేరియన్ డ్రిల్లింగ్ అంటారు. ఇక అండాశయంలో నీటితిత్తులు, ఎండోమెట్రియాసిస్ వంటి సమస్యలను కూడా లాప్రోస్కోపిక్ ప్రక్రియ ద్వారా తొలగించి, ఆ తర్వాత గర్భం వచ్చేందుకు అవసరమైన చికిత్స అందించాలి. థైరాయిడ్ సమస్య ఉంటే దాన్ని తగ్గించే మందులు వాడాలి. అప్పుడు హార్మోన్ల అసమతుల్యత తగ్గి, గర్భధారణకు అవకాశాలు మెరుగుపడతాయి.

గర్భాశయంలో లోపాలు

సాధారణంగా గర్భాశయంలో లోపాల వల్ల గర్భం దాల్చలేని వారు దాదాపు 10% నుంచి 15% వరకూ ఉంటారు. గర్భాశయంలో లోపాలు కూడా అనేక కారణాల వల్ల కలుగుతుంటాయి. గర్భాశయ ముఖద్వారంలో ఏదైనా ఇన్ఫెక్షన్ ఉన్నా, పూత ఉన్నా, అక్కడ స్రవించే స్రావాలు చిక్కగా ఉన్నా, గర్భాశయ ముఖద్వారం మరీ సన్నగా ఉన్నప్పుడు వీర్యకణాలు గర్భసంచి లోపలికి ప్రవేశించలేకపోవచ్చు. కొంతమందిలో యోని ద్రవాల్లో ఆమ్లగుణం మరీ ఎక్కువగా ఉంటే అవి వీర్యకణాలను చైతన్యరహితం చేస్తాయి.

ఐవీఎఫ్ ప్రక్రియ పనిచేస్తుందిలా..

స్త్రీ, పురుషులిద్దరిలోనూ ఫలదీకరణ సమస్యలు ఉన్నప్పు డాక్టర్లు ఐవీఎఫ్ మార్గాన్ని సూచిస్తారు. ఈ ప్రక్రియలో తొలుత మహిళలో అండాలు బాగా పెరిగేందుకు మందులిస్తారు. వాటిల్లోంచి ఆరోగ్యకరమైన అండాలను సేకరించి, పురుషుడి నుంచి స్వీకరించిన శుక్రకణాలతో ప్రయోగశాలలో ఫలదీకరణం చెందిస్తారు. ఈ ఫలదీకరణ ప్రక్రియలో ఒకటి కంటే ఎక్కువ పిండాలు వృద్ధిచెందుతాయి. ఇందులో నుంచి ఆరోగ్యకరమైన పిండాలను మళ్లీ మహిళ గర్భంలోకి ప్రవేశపెడతారు. మిగతా పిండాలను శీతలీకరించి పక్కన పెట్టుకుంటారు. ఆరు వారాల తర్వాత అల్ట్రాసౌండ్ పరీక్ష చేసి, ఆమెలో గర్భం నిలిచిందా లేదా అన్నది నిర్ధారణ చేసుకుంటారు. ఒక వేళ గర్భం నిలవకపోతే శీతలీకరించిన పిండాల్లో మరోదాన్ని గర్భంలోకి ప్రవేశపెడుతారు.

ఆహారపు అలవాట్లే కారణం..




ప్రస్తుతం యువతీ, యువకుల్లో ఆహారపు అలవాట్లు సంతానలేమి సమస్యలకు కారణం అవుతున్నాయి. మితిమీరిన ఆల్కహాల్, సిగరెట్ తాగడంతో ప్రత్యుత్పత్తి సంబంధిత సమస్యలు వస్తున్నాయి. గర్భాశయంలో లోపాలు, అండాశయాల్లో బుడగలు (పీసీఓడీ), వీర్యకణాల సంఖ్య తగ్గడం, చలనం లేకుండా పోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఆహారపు అలవాట్లు సరిచేసుకుని, ఆరోగ్యకరమైన జీవన విధానంతో సంతానలేమి సమస్యలకు దూరం కావచ్చు.

– జలగం కావ్యా రావు, ఫెర్టిలిటీ స్పెషలిస్టు, ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్

పురుషుల్లోనూ సమస్యలు..

స్త్రీలతో పాటు పురుషుల్లో కూడా పలు సమస్యలు ఉంటాయి. పురుషుల్లో వీర్యకణాలు తక్కువగా ఉండటం అతి పెద్ద సమస్య. సరైన మందులు ఇవ్వడంతో పాటు సరైన జీవన విధానం పాటిస్తే వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. కొందరిలో అసాధారణమైన వీర్యకణాలు ఉంటాయి. వాటిలో లోపాలు ఉంటాయి. సరైన ఆహారపు అలవాట్లు అలవర్చుకుంటే వాటి నాణ్యత పెరుగుతుంది. ఇక, కొందరిలో వీర్యకణాల కదలిక తక్కువగా ఉంటుంది. అప్పుడు వీర్యక ణాలు అండంతో ఫలదీకరణ చెందవు. ఈ సమస్యను కూడా మందులతో తగ్గించవచ్చు.



మొక్కలు కొలువైన మేళా..

- నగర వాసుల మనసు దోచుకుంటున్న నర్సరీ
- దేశవ్యాప్తంగా వందకు పైగా స్టాల్స్, వేల రకాల మొక్కలు
- ఇంటీరియర్, ఎక్స్టీరియర్, టెర్రస్, బోన్సాయ్

సాక్షి, సిటీబ్యూరో: ఓవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నవర్షాలు.., ఆ వర్షాన్ని సైతం లెక్కజేయకుండా నగరంలోని మొక్కల ప్రేమికులంతా నక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాకు చేరుకుంటున్నారు. నగరంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 16వ గ్రాండ్ నర్సరీమేళాలో మొక్కలు కొనడం కోసమే వీరి తాపత్రయమంతా. ప్రతి యేటా నగరంలో నిర్వహించే నర్సరీమేళాకు మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నర్సరీ మేళాలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మొక్కల పెంపకందారులు, నర్సరీ నిర్వాహకులు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. సాధారణ మొక్కలు మొదలు ఇంటీరియర్, ఎక్స్టీరియర్, మిద్దెపంట మొక్కలు ఇక్కడ విరివిగా అమ్ముడవుతున్నాయి. ముఖ్యంగా బోన్సాయ్, ఎడారి మొక్కలు తదితర ఆర్నమెంటల్ మొక్కలను కొనడానికి ప్రకృతి ప్రేమికులు ఆసక్తి చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా 150కి పైగా స్టాల్స్ ఇక్కడ కొలువుదీరాయి. రూ. 50 నుంచి మొదలు లక్షల విలువ చేసే మొక్కలు అందుబాటులో ఉండటం విశేషం. గార్డెన్ మొక్కలతో పాటు హార్టీకల్చర్, అగ్రికల్చర్ సంబంధిత మొక్కలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.





- వాన నీటిని ఒడిసిపట్టడంలో ముందడుగు
- వర్షాకాలం ఇబ్బందులతో పాటు వేసవి ఇక్కట్లకు చెల్లు
- పర్యావరణ వేత్త కల్పన రమేష్ చొరవే కీలకం

నీటి బొట్టు.. ఒడిసి పట్టు..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాలూ తడిసి ముద్దయ్యాయి. కాలనీలతో పాటు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు సైతం వరద, బురదలతో సతమతం అవుతున్నాయి. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే అడుగు బయటపెట్టలేని పరిస్థితి.. ఇక వేసవిలో అనునిత్యం నీటికి కటకటే. ఆ సీజన్‌లో దాదాపు ప్రతి చోటా నీటి ట్యాంకర్ల కొనుగోలు తప్పదు. ఈ రెండు సమస్యలకూ చక్కని పరిష్కారంగా వాన నీటిని ఒడిసిపడుతున్న గేటెడ్ కమ్యూనిటీ ఒకటుంది. అదే గచ్చిబౌలిలోని రోలింగ్ హిల్స్ విల్లాస్.

- సాక్షి, సిటీబ్యూరో

ఆదర్శంగా రోలింగ్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ

బెంగళూరుకు చెందిన కల్పన రమేష్ విదేశాలకు వెళ్లే ముందు వరకూ ఆ నగరంలో నీటి ట్యాంకర్ల కొనుగోలు అనేది ఉండేది కాదు. స్వదేశానికి తిరిగి వచ్చిన కల్పన హైదరాబాద్‌లోని సోమాజీగూడ, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో నివసించారు. అప్పుడే తొలిసారిగా నీటి ట్యాంకర్లు ఖరీదు చేసుకోవడం ఆమె కంట పడింది. ఆ నీటి నాణ్యతకు సంబంధించిన కీలకాంశాలు గుర్తించారు. అప్పటి నుంచి నీటి సంరక్షణ, పొదుపు చర్యలపై దృష్టి పెట్టారు. 1970లో నగరంలో కేవలం 40 అడుగులకు అందుబాటులో ఉన్న భూగర్భజలాలు ప్రస్తుతం వందల అడుగుల లోతుకు వెళ్లిపోవడానికి మానవ నిర్లక్ష్యమే కారణమని గుర్తించారు. భవిష్యత్తు తరాలు నీటికి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే సంరక్షణ తప్పదని భావించారు.

తన ఇంటి నుంచే ప్రారంభించిన కల్పన...

గచ్చిబౌలిలోని రోలింగ్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీలో 2009లో విల్లా నిర్మించిన కల్పన తన ఇంటి నుంచే మార్పునకు శ్రీకారం చుట్టారు. తన ఇంటిపై కురిసే వర్షం నీటితో పాటు వినియోగించిన నీరు కూడా వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టేలా ఇంటి కింద 25 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సంపు నిర్మించారు. కమోడ్ వాటర్ మినహా ఇంట్లో వినియోగించే ప్రతి నీటి చుక్కా మొక్కలకు చేరేలా చర్యలు తీసుకున్నారు. తన ఇంటితో ప్రారంభించిన ఈ విధానాన్ని మొత్తం గేటెడ్ కమ్యూనిటీకి విస్తరించాలని నిర్ణయించుకున్నారు. సహచర నివాసితులు కలిసి రావడంతో రోలింగ్ హిల్స్‌లో ఓ బృహత్తర కార్యక్రమానికి దాదాపు పదేళ్ల క్రితం నాంది పలికారు.





ఏటా 1.5 కోట్ల లీటర్ల నీరు ఒడిసి పడుతూ..

స్వయంగా ఆర్కిటెక్ట్, డిజైనర్ కావడం కల్పనకు కలిసి వచ్చింది. తన కమ్యూనిటీ స్థితిగతుల్ని బట్టి నీటి సంరక్షణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారు. కమ్యూనిటీలోని ఇళ్లు, రోడ్లపై వర్షపు నీరు వృథా కాకుండా, ఇబ్బందికరంగా మారకుండా వ్యవస్థను రూపొందించారు. ప్రతి ఇంటికీ, కమ్యూనిటీకీ హార్వెస్టింగ్ పిట్స్ నిర్మించారు. అందులోని వర్షపు నీరు తిరిగి భూమిలోకి ఇంకేలా ఇంజెక్షన్ బోర్లకు రూపమిచ్చారు. రోలింగ్ హిల్స్ ప్రతి ఏడాది దాదాపు 1.5 కోట్ల లీటర్ల నీటిని పొదుపు చేస్తోంది.

జీరో వేస్ట్ కాలనీ లక్ష్యంగా..

నగరంలోని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్స్ ప్రతి వేసవిలో వాటర్ ట్యాంకర్లతో సంపుల్ని నింపుకోవాల్సిందే. అయితే రోలింగ్ హిల్స్‌లో నివసించే వారు మాత్రం గడిచిన ఎనిమిదేళ్లల్లో ఒక్క నీటి ట్యాంకర్ కూడా ఖరీదు చేయలేదు. 2016లో తీవ్ర తాగు నీటి ఎద్దడి తలెత్తినప్పుడూ వీరికి ఆ అవసరం రాలేదు. 2020 సహా అనేక సందర్భాల్లో నగరాన్ని వరదలు ముంచెత్తినా ఈ కమ్యూనిటీపై వాటి ప్రభావమే లేదు. దీంతో రానున్న రోజుల్లో జీరో వేస్ట్ కాలనీగా మారాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

రోలింగ్ హిల్స్ విల్లాస్ ఇలా:

- విస్తీర్ణం: 14 ఎకరాలు
- విల్లాలు: 110
- బిల్డింగ్ స్పేస్: 30 శాతం
- పార్కులు: 2
- సామూహిక హార్వెస్టింగ్ పిట్స్: 26
- ఇంజెక్షన్ బోర్‌వెల్స్: 16
- హార్వెస్టింగ్ పిట్స్: వర్షపు నీరు భూమిలోకి చేరడానికి తవ్వే ఇంకుడు గుంతలు
- ఇంజెక్షన్ బోర్‌వెల్స్: నీటిని తోడుకోవడానికి కాకుండా భూగర్భంలోకి పంపడానికి తవ్విన బోర్లు



వాతావరణ మార్పులకు తగ్గట్టుగా..

పర్యావరణ మార్పులకు అనుగుణంగా మన వ్యూహాలు మారుతూ ఉండాలి. వీటి కారణంగా 10 గంటలు కురవాల్సిన వర్షం కేవలం అర్ధగంటలోనే కురుస్తోంది. ఆ స్థాయిలో నీరు భూమిలోకి ఇంకే సహజసిద్ధ అవకాశం లేదు. ఫలితంగా వరదలు, బురద సమస్య ఉత్పన్నమవుతుంది. వీటికి పరిష్కారంగానే రోలింగ్ హిల్స్‌లో అనేక చర్యలు తీసుకుని ఫలితాలు సాధించింది. ఇప్పటికే ఈ కాలనీలో 70 శాతం నివాసితులు వేస్ట్ మేనేజ్‌మెంట్ చేస్తున్నారు. భవిష్యత్తులో జీరో వేస్ట్ కాలనీగా మారాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ప్రతి ఒక్కరూ రీ-సైకిల్, రీ-యూజ్ ధోరణిని అలవరుచుకోవాలి. ఈ వ్యవహారంలో సింగపూర్‌ని ఆదర్శంగా తీసుకోవాలి. సౌత్ ఆఫ్రికాలోని కేప్ టౌన్‌ను 2018లో నో గ్రౌండ్ వాటర్ సిటీగా ప్రకటించారు. ఆ నగరం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. మనం అప్రమత్తం కాకపోతే ఇక్కడా అలాంటి పరిస్థితులు తప్పవు.


- కల్పన రమేష్, పర్యావరణ వేత్త

ఆర్ట్ గ్యాలరీలో పాస్‌రిఫ్లెక్ట్ చిత్ర ప్రదర్శన

మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు, స్కల్ప్చర్స్ అద్భుతంగా ఉన్నాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ డాక్టర్ కోట నీలిమ తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఆదివారం పాస్‌రిఫ్లెక్ట్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారులు తయారు చేసిన స్కల్ప్చర్స్ సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. మనిషి పుట్టుక, మనుగడను తెలిపే విధంగా రూపొందించారని కళాకారులను కొనియాడారు. ఈనెల 8 వరకూ నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 53 పెయింటింగ్స్, 60 స్కల్ప్చర్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకూ సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. కళాకారులు ధృవ్‌పటేల్, దుష్యంత్ పటేల్, జి.రఘు, ముక్తార్ అహ్మద్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.







ఐఎస్‌బీలో స్పార్క్ 2.0 స్టార్టప్ కాన్‌క్లేవ్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఆధ్వర్యంలో స్పార్క్ 2.0 స్టార్టప్ కాన్‌క్లేవ్‌ను నిర్వహించింది. 'ఇండియాస్ గ్రోత్ స్టోరీ' థీమ్‌తో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమలకు చెందిన ప్రముఖులు, వెంచర్ క్యాపిటలిస్టులు, వ్యవస్థాపకులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడారు. అంకుర సంస్థలు, వ్యవస్థాపక వృద్ధికి సహాయం చేయడంలో ఐఎస్‌బీ ఆధ్వర్యంలోని డీల్యాబ్స్ కీలకంగా పనిచేస్తుందని అభినందించారు. ఈ కాన్‌క్లేవ్‌లో భాగంగా ఫౌండర్స్ ఫినాలే, యునికార్న్ ఫౌండర్స్ ప్యానెల్, ఇన్వెస్టర్ ప్యానెల్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రా ప్యానెల్, సెలబ్రిటీ ఫైర్‌సైడ్ చాట్ నిర్వాహించారు. ఐఎస్‌బీ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, ఫ్యాకల్టీ డైరెక్టర్ ప్రొఫెసర్ భగవాన్ చౌదరి

క్లుప్తంగా...

78 మంది సివిల్ డీఎస్పీల పదోన్నతుల ప్రక్రియ షురూ

ఏసీబీ క్లియరెన్స్ కోసం జాబితాను పంపిన అదనపు డీజీ మహేశ్ భగవత్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న 78 మంది సివిల్ డీఎస్పీల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుత ప్యానెల్ ఇయర్ 2024–25కు గాను సివిల్ డీఎస్పీ నుంచి నాన్‌కేడర్ అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు మొత్తం 78 మంది అర్హులు ఉన్నారు. వీరి జాబితాను శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ ఆదివారం ఏసీబీకి పంపారు. సదరు అధికారులపై క్రిమినల్ కేసులు లేదా క్రమశిక్షణ చర్యలు ఏవైనా పెండింగ్‌లో ఉన్నాయా..? అన్న అంశానికి సంబంధించి సమాచారం ఇవ్వాల్సిందిగా జాబితాలో కోరారు.

హెచ్‌ఏఎల్ సీఎండీగా డాక్టర్ సునీల్

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థికి అపూర్వ అవకాశం



ప్రణయ్(ఫైల్)

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి డాక్టర్ డీకే సునీల్ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ (సీఏఎస్ఈఎస్‌టీ) పూర్వ విద్యార్థి అయిన సునీల్ భారత ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులవడం విశేషం. ప్రొఫెసర్ సామ్రాట్ పర్యవేక్షణలో డాక్టర్ సునీల్ 2018లో పీహెచ్‌డీ (ఎలక్ట్రానిక్స్ సైన్స్) డిగ్రీని అందుకున్నారు. డాక్టర్ సునీల్ నియామకంపై హెచ్‌సీయూ వీసీ, రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

లండన్‌లో వరంగల్ విద్యార్థి మృతి




ప్రణయ్ (ఫైల్)

దుగ్గొండి: లండన్‌లో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన వరంగల్ విద్యార్థి చికిత్స పొందుతూ భారతకాలమానం ప్రకారం ఆదివారం తెల్ల వారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన దేవులపల్లి రమేశ్– రజిత దంపతులు నిరుపేదలు. రమేశ్ సైకిల్ పంచర్లు వేస్తూ రజిత కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు దేవులపల్లి ప్రణయ్(25) వరుణ్ ఉన్నారు. డిగ్రీ చదివిన ప్రణయ్ ఏడాది క్రితం తెలిసిన వారి వద్ద అప్పు తీసుకొని ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్లాడు. 15 రోజుల క్రితం కడుపునొప్పి రావడంతో మిత్రులు ఆస్పత్రిలో చేర్పారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆహారం పడలేదని, ఫుడ్ పాయిజన్ అయిందని చెప్పారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

సీపీఎస్, యూపీఎస్ వద్దేవద్దు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్), యునైటెడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) పథకాలు వద్దని, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్ మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన విద్రోహ దినంగా పేర్కొంటూ ఆదివారం ఉద్యోగులు గన్‌పార్క్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్, యూపీఎస్ పథకాలకు వ్యతిరేకంగా నినాదా లు చేశారు. ఉద్యోగ జేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్ మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస రావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిందని గుర్తు చేశారు. ఈ అంశంపై తగిన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని వారు కోరారు. పెన్షన్ విద్రోహదినం సందర్భంగా గురుకుల ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురుకుల విద్యా సంస్థల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి.

పీఆర్‌టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఇప్పటివరకూ ఈ స్థానంలో ఉన్న బీరెల్లి కమలాకర్ పదవీ విరమణతో కొత్త ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం జరిగిన సమావేశంలో 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్ ఎన్నికను బలపరిచారు. ఆయన ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

విజయవాడ విలవిల



విజయవాడలోని పీఎండ్‌టీ కాలనీ నుంచి వరద నీటిలో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న బాధితులు

▶ మొదటి పేజీ తరువాయి

అందించాల్సిన సీఎం చంద్రబాబు తన కరకట్ట నివాసం వరదలో చిక్కుకోవడంతో దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కార్యాలయాల్లో గడుపుతూ బస్సులో బస పేరుతో డ్రామాకు తెర తీశారు. సీఎం నివాసాన్ని వరద నుంచి కాపాడేందుకు దాదాపు 25 ట్రక్కుల ఇసుకను తరలించినా లాభం లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. మోటార్లతో నీటిని తోడాల్సి వచ్చిందంటే సీఎం ఇంట్లో పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చు. చట్టాలను తుంగలో తొక్కి తాను నివాసం ఉంటున్న అక్రమ సౌధం కృష్ణా వరదలో మునిగిపోయిందనే వాస్తవాన్ని కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో అర్ధరాత్రి పూట పర్యటన పెట్టుకున్నారు. వరద బాధితులకు సహాయం అందించడంలో నిమగ్నం కావాల్సిన అధికారులు సీఎం పర్యటిస్తుండడంతో ఆయన చుట్టూ చేరిపోయారు. దాంతో సహాయక చర్యలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. తాగునీరు, ఆహారం అందక పిల్లలు, గర్భిణీలు, వృద్ధుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ప్రపంచంలో ఎక్కడైనా మహా విపత్తు సంభవించినప్పుడు ఆ దేశ అధినేతలు, ప్రధానులు సహాయక చర్యలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేయడం సాధారణం. సహాయ చర్యలు ముగిశాక క్షేత్ర స్థాయిలో బాధితులను పరామర్శించి సంతృప్తికరంగా సాయం అందిందో లేదో ప్రధానులు, ముఖ్య మంత్రులు తెలుసుకుంటారు. కానీ సీఎం చంద్రబాబు మాత్రం అందుకు భిన్నంగా ఐఎండీ ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా ప్రజలను అప్ర మత్తం చేయకుండా ఉదాసీనంగా వ్యవహరించారు.

అర్ధరాత్రి హడావుడి

వరద సహాయ చర్యల్లో విఫలమవడంతో ఆ విషయం గురించి చర్చ జరగకుండా శనివారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు చంద్రబాబు డ్రామా నడుపుతూనే ఉన్నారు. వరదలో చిక్కుకున్న బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించకుండా తాను మాత్రం అక్కడే ఉండి వరుస సమీక్షలు, మీడియా సమావేశాలు, పర్యటనలతో హడావుడి చేశారు. మూడుసార్లు మీడియా సమావేశాలు పెట్టి రెండుసార్లు సింగ్‌నగర్‌లో పర్యటించారు. ఒకవైపు లక్షలాది మంది వరద నీటిలో చిక్కుకుపోయి ఉంటే సాయంత్రం ఒకసారి వెళ్లి రెండు గంటలు షో చేశారు. మళ్లీ రాత్రి 11.30 గంటలకు సింగ్‌నగర్ వెళ్లి హంగామా నడపడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. షో చేయడం మినహా బాధితులను ఆదుకోవడంలో విఫలమయ్యారు.

సీఎం ఎదుట బాధితుల ఆక్రోశం..

విజయవాడలో ముంపు ప్రాంతాల ప్రజలు ఆదివారం ఉదయం నుంచి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడుపుతున్నారు. రహదారులు మునిగిపోవడంతో జల దిగ్బంధంలో చిక్కుకు న్నారు. ప్రభుత్వం వారిని బయటికి తెచ్చే ప్రయత్నం చేయకుండా వారి ఖర్మకు వదిలేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో భోజనం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయలేకపోయారు. ఇంత మంది వరదలో చిక్కుకుంటే ఏడు మాత్రమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పూర్తిగా కొరవడింది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సాయంత్రం వరకు రెస్క్యూ టీములు, పడవలు లేవు. కొంత మంది ట్రాక్టర్ల సహాయంతో బయటపడ్డారు.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ముందుచూపు లేకుండా..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ (వాతావరణ శాఖ) మూడు రోజుల క్రితమే హెచ్చరించింది. మరోవైపు ఎగువ నుంచి కృష్ణాతో పాటు మూసీ, మున్నేరు, బుడమేరు, కట్టలేరు, నాలేరు, రామిలేరుల నుంచి భారీ వరద ప్రభావం ముంచెత్తుతుందని సీడబ్ల్యూసీ కూడా అప్రమత్తం చేసింది. అయినప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయడం, సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. విపత్తును సైతం తాను నియంత్రిస్తానని పదేపదే చెప్పే ప్రభుత్వ పెద్దలు ముందుచూపు లేకుండా వ్యవహరించారు. యంత్రాంగం సైతం ఉదాసీనంగా ఉండిపోయింది. ఓవైపు కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చడం, అదే సమయంలో బుడమేరు ఉప్పొంగడంతో వరద వెనక్కి తన్ని పది చోట్ల గండ్లు పడ్డాయి. బుడమేరు కట్ట తెగిపోతుందనే భయంతో కవులూరు వద్ద వెలగలూరు హెడ్‌రెగ్యులేటర్‌ని ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. నీటి విడుదలపై బుడమేరు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయకపోవడంతో లక్షల మంది వరదలో చిక్కుకున్నారు. కాగా, వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 10 మంది మరణించగా.. నలుగురు గల్లంతయ్యారు.

వరద ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా తమను పట్టించుకున్న నాథుడే లేడని, కనీసం తాగునీరు కూడా అందలేదని స్వయంగా సీఎం చంద్రబాబు ఎదుట బాధితులు ఆక్రోశించారు.

అమరావతి.. అస్తవ్యస్తం

ఎమ్మెల్యేల నివాస భవనాల్లోకి వరద నీరు

జలదిగ్బంధంలో హైకోర్టు, రాష్ట్ర సచివాలయం, ఇతర ప్రభుత్వ భవనాలు

బాబూ వరద బాధితుడే

జలదిగ్బంధంలో ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు అక్రమ నివాస భవనం

అక్కడ ఉండటం ప్రమాదమని అధికారుల సూచన

దీంతో కలెక్టర్ కార్యాలయంలో చంద్రబాబు బస

వరద వృథాగా పోవొద్దు.. రోజుకు ఒక టీఎంసీ ఎత్తిపోయండి

- నీటిపారుదల శాఖకు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో వస్తున్న వరద సముద్రంలో వృథాగా కలవకుండా భవిష్యత్ అవసరాల కోసం సాధ్యమైనంత వరకు జలాశయాలు, చెరువులు, కుంటల్లో నిల్వ చేయాలని నీటిపారుదల శాఖను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఆ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఎగువ గోదావరి పరీవాహక ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కడెం ప్రాజెక్టుకు భారీ వరద పోటెత్తింది. కడెం నుంచి విడుదల చేస్తున్న వరదతో పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండింది. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు కాగా గేట్లు ఎత్తి 1,36,110 క్యూసెక్కుల వరదను కిందికి విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకి వస్తున్న వరదను నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా వీలైనంత మేరకు లిఫ్టు చేయాలని.. రోజుకు ఒక టీఎంసీకి తగ్గకుండా తరలించాలని ఆదేశించారు. ఎల్లంపల్లి నుంచి నీళ్లను ఏకధాటిగా మిడ్‌మానేరు, లోయర్ మానేరు రిజర్వాయర్లు, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లలోకి ఎత్తిపోయాలని సూచించారు.

వర్షాలతో 220 చెరువులు, కాల్వలు, ప్రాజెక్టులకు నష్టం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని 165 చెరువులకు నష్టం కలిగింది. మరో 23 ప్రాజెక్టులు/కాల్వలు దెబ్బతినగా, 32 ప్రాజెక్టులు/కాల్వలకు గండ్లు పడ్డాయి. దీంతో వర్షాలతో మొత్తం 220 జల వనరులకు నష్టం వాటిల్లిందని నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి నివేదించింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.221.98 కోట్లు, శాశ్వత మరమ్మతులకు మరో రూ.629.70 కోట్లు కలిపి మొత్తం రూ.851.68 కోట్లు అవసరమని తెలిపింది.

హైడ్రా.. ఫ్లడ్ స్టడీ!

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీకారం చుట్టారు. అయితే గత 40 రోజుల్లో నగరంలో పలుమార్లు వర్షం కురిసినా శని, ఆదివారాల మాదిరిగా ముసురుపట్టి వివిధ ప్రాంతాలు మునకేసే పరిస్థితి కనిపించలేదు. ఈ రెండు రోజులు వర్షాలతో నగరంలోని అనేక ప్రాంతాల్లో జనజీవనం స్తంభించడంతోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్నిచోట్ల ఇళ్లలోకి వరద ప్రవేశించింది. రోడ్లపై భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది.

షేక్‌పేట, టోలిచౌకి, బేగంపేటలలో పర్యటిస్తూ..

ఈ పరిణామాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ రంగంలోకి దిగారు. శని, ఆదివారాల్లో అనేక ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. షేక్‌పేట, టోలిచౌకి, బేగంపేట తదితర ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. నీళ్లు నిండిన రహదారులు, కాలనీల్లో తిరుగుతూ ఓపక్క డీఆర్ఎఫ్ సహాయ చర్యలను పర్యవేక్షిస్తూనే మరోపక్క ఆ ముంపునకు కారణాలను వారికి వివరించారు. చెరువులు, నాలాల కబ్జాల వల్లే ఈ విపత్కర పరిస్థితులు వస్తున్నాయని, దీని ప్రభావం కబ్జా చేసిన వారి కంటే ఎక్కువగా సామాన్యులపై ఉంటోందని చెప్పారు. ఎవరికి వారు బాధ్యతగా మెలిగేలా, కబ్జాలు, ఆక్రమణలపై వారు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహించారు.

ఆ వాదనకు తెరదించేలా...

నగరంలో గతంలో వర్షాలు కురిసిన సందర్భంలోనూ రంగనాథ్ క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. అయితే అప్పట్లో జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) డైరెక్టర్‌గా వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. అందులో భాగంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న అక్రమ నిర్మాణాలపైకి బుల్డోజర్లను కూడా ప్రయోగించారు. తాజాగా ఆయన హైడ్రా పగ్గాలు చేపట్టగా ఓ వర్గానికి చెందిన వారు ఆ సంస్థ చర్యలపై దుష్ప్రచారం ప్రారంభించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలు ఉన్నా ఇబ్బందుల్లేవని... కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ప్రభుత్వం హైడ్రాను ప్రయోగిస్తోందని ఆరోపించారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ఆయన శని, ఆదివారాల్లో క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా ఆ వర్గాల వాదన నిజం కాదని నిరూపించే ప్రయత్నం చేశారు.

యూఏఈలో మరోసారి క్షమాభిక్ష

ఐదేళ్లకోసారి ఆమ్నెస్టీ అమలు చేస్తున్న గల్ఫ్ దేశం

మోర్తాడ్ (బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో క్షమాభిక్ష మరోసారి అమల్లోకి వచ్చింది. తమ దేశానికి వర్క్ వీసాపై వచ్చిన వారు ఖల్లివెల్లి (అక్రమ నివాసి) కావడం, విజిట్ వీసాలపై వచ్చినవారు వీసా గడువు ముగిసినా చట్టవిరుద్ధంగా ఉండిపోవడాన్ని యూఏఈ ప్రభుత్వం గుర్తించింది. వీసాలు ఉన్నవారి కంటే వీసాలు లేనివారి సంఖ్య పెరిగిపోతుండటంతో ఆమ్నెస్టీకి యూఏఈ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 1తో మొదలైన క్షమాభిక్ష అక్టోబర్ 31తో ముగియనుంది. తెలంగాణకు చెందిన వలస కార్మికులకు క్షమాభిక్ష ఒక వరమని ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల 'సాక్షి'తో అన్నారు. తెలంగాణ జిల్లాలకు చెందిన వలస కార్మికులు యూఏఈలో చట్టవిరుద్ధంగా ఉంటున్నవారు దాదాపు 40 వేల మంది ఉంటారని ఓ అంచనా. మన దేశంలోని యూపీ, బిహార్, రాజస్తాన్, ఏపీలకు చెందిన వారు ఒక లక్ష మంది వరకు క్షమాభిక్ష లబ్ధి పొందే అవకాశం ఉంది. బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్ దేశాల వలస కార్మికుల సంఖ్య ఎక్కువ మొత్తంలోనే ఉండే పరిస్థితి కనిపిస్తోంది.

'స్వగృహ' సాఫ్!

▶ మొదటి పేజీ తరువాయి

వరకు ఉన్నాయి. కామారెడ్డి, కవాడిపల్లి, పేట్‌బషీరాబాద్, పోలేపల్లి, తట్టిఅన్నారం, నల్గొండ, కోకట్ తదితర ప్రాంతాల్లో భూములున్నాయి. ఖాళీ భూములతోపాటు 361 అసంపూర్తి ఇళ్లు కూడా వీటిల్లో ఉన్నాయి. రాష్ట్రంలోని 16 ప్రాంతాల్లో 1342 ప్లాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం చిన్న చిన్న పనులు, మరమ్మతులు మినహా మిగతా మొత్తం సిద్ధంగా ఉన్న ఇళ్లు నాగోలు సమీపంలోని బండ్లగూడ, ఘట్కేసర్ దారిలోని పోచారం, ఖమ్మంలలో మాత్రమే ఉన్నాయి. సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు బండ్లగూడలో 105, పోచారంలో 255, 2బీహెచ్‌కే ఇళ్లు బండ్లగూడలో 19, పోచారంలో 340 ఉన్నాయి. 3బీహెచ్‌కే ఫ్లాట్లు బండ్లగూడలో 8, పోచారంలో 4, 3బీహెచ్‌కే డీలక్స్ ఫ్లాట్లు బండ్ల గూడలో 3, పోచారంలో 4, సీనియర్ సిటిజన్స్ ఫ్లాట్లు బండ్లగూడ 24 సిద్ధంగా ఉన్నాయి. గాజులరామారంలో 408 అసంపూర్తి ఫ్లాట్లున్నాయి. ఒక్కోటి 8 అంతస్తులుగా ఉన్న 5 టవర్లు ఇక్కడున్నాయి. వీటిల్లో 3 బీహెచ్‌కే ఫ్లాట్లవి 3 టవర్లు, 2బీహెచ్‌కే ఫ్లాట్లవి 2 టవర్లు ఉన్నాయి. పోచారంలో పూర్తయిన ఇళ్లకు సంబంధించి జీ ప్లస్ 9 అంతస్తులతో కూడిన



19 టవర్లుంటే, చాలా పనులు చేసుకోవల్సిన అసంపూర్తి ఇళ్ల టవర్లు ఎనిమిది ఉన్నాయి. గతేడాది రెండు టవర్లను అమ్మగా ఇంకా ఆరున్నాయి. వీటిల్లో పైకప్పులు నిర్మించినవి 376 ఉన్నాయి. మిగతా టవర్లలో పైకప్పులు నిర్మిస్తే మొత్తం 694 ఫ్లాట్లు అందుబాటు లోకి వస్తాయి. జవహర్‌నగర్‌లో 9 అంతస్తుల 17 టవర్లు ఉన్నాయి. వీటిల్లో 2856 ఫ్లాట్లున్నాయి. టవర్ల మధ్యలో 19 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఖమ్మం పట్టణం శివారులోని మున్నేరు కాలువ ఒడ్డు ప్రాంతంలో జీ ప్లస్ 9 అంతస్తులతో కూడిన ఎనిమిది టవర్లు నిర్మించారు. వీటిల్లో 3బీహెచ్‌కే సాధారణ ఫ్లాట్లతో కూడినవి నాలుగుంటే, 3బీహెచ్‌కే డీలక్స్ ఇళ్లతో కూడినవి నాలుగున్నాయి. వీటిల్లో 576 ఫ్లాట్లున్నాయి. ఫ్లాట్లలో ప్లాస్టరింగ్ పూర్తయి సిద్ధంగా వున్నాయి. ఇతర ఫిట్టింగ్స్ డ్రైనేజీ, రోడ్లులాంటి వసతులు కల్పించాల్సి ఉంది.

మార్కెట్ ధరతో పోలిస్తే చాలా తక్కువే

ఆయా ప్రాంతాల్లో భూమి ధర, ఇళ్ల ప్రస్తుత కండిషన్ ఆధారంగా చదరపు అడుగు ధరను నిర్ణయిస్తూ కమిటీ సభ్యులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అధికారికంగా ధరను ఖరారు చేయాల్సి ఉంది. అది తేలగానే ఇళ్ల అమ్మకపు ప్రకటన వెలువడనుంది. గతేడాది పోచారంలో చ.అ. ధర రూ.1650 చొప్పున ఖరారు చేశారు. వాటిని కొన్నవారు చ.అ.కు రూ.1050 ఖర్చు చేసి ప్రైవేటు బిల్డర్లతో ఇళ్లను సిద్ధం చేయించుకున్నారు. వెరసి ఒక్కో ఫ్లాట్ చ.అ. ధర రూ. 2700గా పలికినట్టయింది. ఆ ప్రాంతంలో ప్రైవేటు నిర్మాణదారులు రూ. 4500 నుంచి రూ.5 వేలు చొప్పున అమ్ముతున్నారు. గాజులరామారంలో గతేడాది చ.అ.కు రూ.1600 చొప్పున కొన్నవారు చ.అ.కు మరో రూ.1150 ఖర్చు చేసి ప్రైవేటు బిల్డర్లతో ఇళ్లను సిద్ధం చేయించుకున్నారు. ఆ ప్రాంతంలో మార్కెట్‌ధర దాదాపు రూ.6500 పలుకుతోంది. ఇప్పుడు కూడా ఇంచుమించు ఇదే ధరలను నిర్ణయిస్తున్నట్టు తెలిసింది. పాత ధరలకు 5% వరకు కలిపి కొత్త ధరలు ఖరారు చేస్తారని తెలుస్తోంది.

పేదల ఇళ్లను కూలిస్తే ఖబడ్దార్: ఈటల



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలతో, అధికారులు ఇచ్చిన అనుమతులతో కట్టుకున్న ఇళ్లకు హైడ్రా నోటీసులిచ్చి కూలగొట్టేందుకు కుట్ర పన్నుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఆయన పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పేదల పక్షాన మాట్లాడే వారిపై సోషల్ మీడియాతో దాడి చేయిస్తున్నారని విమర్శించారు. హైడ్రా పేరిట సీఎం డ్రామాలాడుతున్నారు తప్ప.. సమాజహితం కోసం కాదని పేర్కొన్నారు. అల్వాల్‌లో 1968లో 56 ఏళ్ల క్రితం 200 మంది లేఅవుట్లలో స్థలాలు కొనుక్కొని.. ఇళ్లు కట్టుకొని ఉంటున్నారని వివరించారు. అది 17 ఎకరాల చెరువని అప్పుడే ఫెన్సింగ్ వేస్తే, ఇప్పుడు 48 ఎకరాల చెరువంటూ 200 మందికి నోటీసులిచ్చి వారి బతుకుల్లో హైడ్రా చిచ్చు పెట్టిందన్నారు. హస్మత్‌పేట చెరువు పక్కన 200 మంది పేదలు 60 గజాల జాగాలో 1982 నుండి ఇళ్లు కట్టుకుని నివసిస్తుంటే.. వారికి నోటీసులు ఇచ్చారన్నారు. గగన్ పహాడ్‌లో కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి తండ్రి 1978లో మెట్టుభూమి కొంటే 1980లో రిజిస్ట్రేషన్ అయ్యిందని, అక్కడ ఫ్యాక్టరీ పెట్టుకొని నడుపుతున్నారని తెలిపారు. దాన్నికూడా నోటీసు ఇవ్వకుండా కూలగొట్టారని ఈటల విమర్శించారు. ఎమర్జెన్సీ కాలంలో కంపెనీల కోసం బుల్డోజర్‌తో పేదల ఇళ్లు కూలగొట్టి, అడ్డు వచ్చిన వారిని కాల్చి చంపిన కాంగ్రెస్ నీచపు చరిత్రకు వారసుడు రేవంత్ రెడ్డి అన్నారు. సరూర్‌నగర్‌లో సింగరేణి కాలనీ పేరుతో 1981లో ప్రభుత్వమే లే అవుట్ చేసి పేదలకు అమ్మిందని గుర్తు చేశారు. కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం, కమలాపూర్ ఎంపీడీవో కార్యా లయాలను కుంటలో కట్టారని తెలిపారు. ఇమ్లిబన్ బస్టాండ్, మెట్రో స్టేషన్ కూడా మూసీనదిలో ఉన్నాయని ఈటల వెల్లడించారు. సమావేశంలో పార్టీ నేతలు కొండేటి శ్రీధర్, బొక్క నరసింహారెడ్డి, సామ రంగారెడ్డి, గౌతం రావు తదితరులు పాల్గొన్నారు

బాలికల్లో విశ్వాసం పెంచుతాం

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు
- పాల్మాకుల కేజీబీవీని సందర్శించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి



పాల్మాకుల కేజీబీవీ పాఠశాలలో సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్ రూరల్: పటిష్ట విద్యా వ్యవస్థ కోసం గత కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన కేజీబీవీల్లోని బాలికల్లో విశ్వాసం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా పాల్మాకులలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారితో కలసి భోజనం చేశారు. విద్యాసంస్థలో పెట్టే భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇక్కడి సమస్యపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. కేజీబీవీలో జరిగిన ఘట నపై విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేద న్నారు. ఆ పార్టీ సర్కార్ హయాంలో ఆస్పత్రుల్లో ఎలుకలు కొరికి రోగులు మృతి చెందిన సంఘటనను శ్రీధర్‌బాబు గుర్తుచేశారు.

రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

బీఆర్ఎస్ నేతలు హరీశ్, గంగుల, ప్రవీణ్



విద్యార్థులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రవీంద్రకుమార్

దేవరకొండ: రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడి గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. వారు ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లిలోని బీసీ గురుకుల పాఠశాలను మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి సందర్శించారు. మూడు రోజుల క్రితం కొండభీమనపల్లి గురుకుల పాఠశాల హాస్టల్‌లో నిద్రిస్తున్న 13 మంది విద్యార్థులను ఎలుకలు కరిచి గాయపరచడం తెలిసిందే. ఆ విద్యార్థులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. హాస్టల్ భవనాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలుకల దాడిలో గాయపడిన విద్యార్థుల ఆరోగ్యం ఎలా ఉందంటూ వాకబు చేశారు. ఫ్యాన్లు ఏర్పాటు చేశారా?.. యూనిఫాం, మ్యాట్స్ ఇచ్చారా? అని అడిగి తెలుసుకున్నా రు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, హరీశ్‌రావు మాట్లా డుతూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పాఠశాలలో పరిస్థితిని సమీక్షించేందుకు వచ్చినట్లు తెలిపారు.

రుణ వేధింపులతో బలవన్మరణం

పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): మైక్రో ఫైనాన్స్, లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన తూండ్ల శ్రీనివాస్ (31) ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ బాబాయ్ తూండ్ల రాజయ్య కథనం ప్రకారం.. డిగ్రీ ఫెయిలైన శ్రీనివాస్ కాల్వశ్రీరాంపూర్‌లో కూలి పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈక్రమంలో ఉపాధి కోసం మైక్రోఫైనాన్స్ కంపెనీలో ఏడాది క్రితం రూ.2 లక్షల రుణం తీసుకున్నాడు. తిరిగి చెల్లించేందుకు పలు లోన్ యాప్‌ల నుంచి మరికొంత అప్పు చేశాడు. మొత్తం అప్పు రూ.4.5 లక్షలకు చేరుకుంది. వీటిని చెల్లించకపోవడంతో నిర్వాహకులు కొంతకాలంగా ఫోన్‌లో వేధిస్తూ వస్తున్నారు. శ్రీనివాస్ ఇంటికి వచ్చి అతని తల్లిదండ్రులను వేధించారు. ఈ వేధింపులు భరించలేక శ్రీనివాస్ బుధవారం రాత్రి ఓదెల మండలం కొలనూరులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు బైక్‌పై వచ్చాడు. ధైర్యం చాలకపోవడంతో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటల్లో కాలుతూనే సోదరుడు రాజుకు సమాచారం అందించాడు. ఆయన వారించినా ఫలితం లేకపోయింది. ఆ వెంటనే ఆటోలో కొలనూరు చేరుకున్న కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మైక్రో ఫైనాన్స్, లోన్‌యాప్స్ నిర్వాహకుల వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు మేజిస్ట్రేట్‌కు శ్రీనివాస్ వాంగ్మూలం ఇచ్చాడు.

బీసీలపై రేవంత్‌ది కపటప్రేమ

ఆమరణదీక్ష చేస్తున్న బీసీ నేతలను పరామర్శించిన ఆర్ కృష్ణయ్య, వీహెచ్, కూనంనేని



గాంధీలో ఆమరణదీక్ష కొనసాగిస్తున్న బీసీ నేత సిద్ధేశ్వర్‌ను పరామర్శిస్తున్న అఖిలపక్ష నాయకులు

గాంధీ ఆస్పత్రి: బీసీల అనుగ్రహంతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి వారి ఆగ్రహానికి గురికాక తప్పదని, బీసీలపై కపటప్రేమ చూపిస్తున్న ఈ ప్రభుత్వానికి సరైన రీతిలో బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు జక్కని సంజయ్‌కుమార్, బత్తుల సిద్ధేశ్వర్‌లు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఎనిమిదవ రోజూ గాంధీ ఆస్పత్రిలో కొనసాగింది. దీక్ష చేపట్టిన బీసీ నేతలను ఆదివారం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు, సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు, సీపీఐ కార్యదర్శి బాల మల్లేశం, బీసీ నాయకులు రవియాదవ్‌తోపాటు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం పార్టీలకు చెందిన నాయకులు పరామర్శించి సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరపున అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వానికి జాప్యం ఎందుకని సీపీఐ శాసనసభాపక్ష నాయ కులు సాంబశివరావు ప్రశ్నించారు. కాగా, బీసీ నేత సంజయ్‌కుమార్ ఆరోగ్యం విషమించడంతో శనివారం రాత్రి ఆయనను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

మంచిమాట



స్థానం మారిన పుస్తకం

'ఎ మిస్ ప్లేస్డ్ బుక్ ఈజ్ ఎ లాస్ట్ బుక్' అన్నది ఆంగ్ల నానుడి. అలాగే 'దయచేసి ఎక్కడ నుంచి తీసిన పుస్తకాలు అక్కడే పెట్టండి' అన్న మాట కూడా గ్రంథాల యాలలో చూస్తుంటాం. అంటే ఏదైనా ఒక వస్తువు కానీ, పుస్తకం కానీ స్థానభ్రంశం చెందితే దానిని తిరిగి పట్టుకోవడం కష్టం అవుతుంది. పుస్తకాల విషయంలో అది మరీ కష్టం. అందుకే ఎక్కడ తీసిన పుస్తకాన్ని అక్కడ పెట్టడం అవసరమే కాదు, అనివార్యం కూడా.

గ్రంథాలయాల్లో పుస్తకాల్ని ఒక క్రమంలో సర్దుతారు. ఫలానా పుస్తకం కావాలి అంటే ఫలానా అలమరలోని ఫలానా అరలో ఉంది అ నిర్వాహకులు ఉన్న చోటు నుండి కదలకుండా చెప్ప గలరు. కానీ, ఆ పుస్తకాన్ని ఉన్న చోటు నుండి తీసి తిరిగి అక్కడ పెట్టక పోతే చెప్పటం సాధ్యం కాదు. బద్ధకించి, మళ్ళీ అక్కడిదాకా వెళ్ళటం ఎందుకు అని తాము ఉన్న చోటనే ఎక్కడి నుండో తెచ్చిన పుస్తకం పెట్టేసేవాళ్ళు ఉన్నారు. మరి కొంత మంది తాము చద వటం పూర్తి కాలేదు, దానిని దాని స్థానంలో పెడితే ఎవరైనా తీసుకువె డితే వాళ్ళు తిరిగి ఇచ్చేదాకా ఎదురు చూడాలి, కనుక దాని చోటు మారిస్తే తానే తీసుకో వచ్చు అని జాగ్రత్తగా... గుర్తుగా పెట్టుకుంటారు. మళ్ళీ వచ్చే సమయానికి పెట్టిన చోటు మర్చి పోతారు. ఇంకొకరు ఎవరో ఇది ఇక్కడిది కాదు అని తీసి పక్కన పెడతారు. అంతే సంగతులు. మళ్ళీ ఎప్పుడో అన్నీ సద్దుతున్నప్పుడు మాత్రమే బయట పడుతుంది.

ఇది ఒక్క పుస్తకాల విషయానికే కాదు, అన్ని విషయాలకీ వర్తిస్తుంది. ఇంట్లో ఏదైనా వస్తువుని అది ఉండే చోట కాక మరొకచోట పెడితే, ఎదురుగా ఉన్నా త్వరగా కనపడదు. ఇంకేదో వెతుకుతున్నప్పుడు కనపడు తుంది. అప్పుడు అది పనికి రావచ్చు, రాక పోవచ్చు. అందుకే ఎక్కడ నుండి తీసిన వస్తువుని అక్కడ పెడితే వెతుక్కునే పని ఉండదు. కళ్ళు మూసుకుని అయినా దానిని తీయవచ్చు. దీనికి కారణం మనిషి ఒక వస్తువుని పరిసరాలు మొదలైన వాటిని కూడా జత చేసి గుర్తు పెట్టుకునేట్టు చేయటం మనసు లక్షణం. మనుషులనైనా మొదటి సారి ఎక్కడ చూశామో అక్కడ కనపడితే వెంటనే గుర్తిస్తాం. వాతావరణం, పరిసరాలు మారితే గుర్తు పట్టటం కష్టమే. ఇక్కడ ఉంటారు అని అనుకో లేదు అంటూ సర్ది చెప్పే ప్రయత్నాలు దీనికి చిహ్నం.

ఇల్లు అందంగా, వెసులుబాటుగా ఉండ టానికి ఒక సూత్రం పాటించాలని పాశ్చా త్యులు గట్టిగానే చెప్పారు. ''ప్రతి వస్తువు దాని చోట ఉండటం, ప్రతి వస్తువుకి ఒక చోటు ఉండటం.'' వేలం వెర్రిగా వస్తువులని సేకరించితే ఎక్కడ పెట్టాలో తెలియక చిందరవందరగా పడేస్తూ ఉంటారు. వస్తువుది, ఇంటిది కూడా అందం, విలువ తగ్గిపో తాయి. పెట్టటానికి తగిన చోటు లేన ప్పుడు తెచ్చి వాటి విలువని తగ్గించ కూడదు.

వస్తువుల విషయం మాత్రమే కాదు. ప్రేమాభిమానాలు, నమ్మకం, విశ్వసనీయత మొదలైన మనో భావాలని కూడా అస్థాన పతితం చేయ కూడదు. కఠిన మైన మనస్సు కలవారి మీద ప్రేమాభిమానాలు పెంచుకుంటే, తరువాతి కాలంలో ఎవరినైనా ప్రేమగా చూడగల గటం కష్టమే. ప్రేమరాహిత్యంలో బతికే వారి విషయంలో ఇటువంటిదే జరిగి ఉండవచ్చు.

ఎక్కడి వస్తువులను అక్కడ పెట్టటం గొప్ప సౌలభ్యమే కాదు వ్యక్తి త్వాన్ని సూచిస్తుంది. దీనికి గొప్ప ఉదాహరణ హనుమ. సంజీవని పర్వతాన్ని తెచ్చి, దానితో పని పూర్తి అయిన పిమ్మట ఎక్కడి నుండి తీసుకువచ్చాడో తిరిగి అక్కడ భద్రంగా పెట్టి వచ్చాడు. అందువల్ల రెండవమారు తేవటానికి వెళ్ళినప్పుడు అది ఉండే ప్రదేశం తెలుసు కనుక వెంటనే తేగలిగాడు. మొదటిసారి పని అయింది కదా అని ఎక్కడో అక్కడ పెట్టి ఉంటే వెతకటానికి ఎంతో సమయం వెచ్చించవలసి వచ్చేది. వ్యక్తిత్వ వికాసానికి ఇది కూడా పెంపొందించుకోవాల్సిన ఒక లక్షణం.

– డా. ఎన్. అనంత లక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పిందె.. పండు... వైరాగ్యం



రుషిరుణం, పితృరుణం, దేవరుణం... ఈ మూడు రుణాలు తీరాలంటే ధర్మపత్ని సహకారం ఉండి తీరాలి. అంటే నీవు గృహస్థాశ్రమ ప్రవేశం చేస్తున్నావు. అప్పుడు నీవు ఏమి చేసినా అవి ధర్మంతో కట్టుబడి ఉంటాయి. చేయవలసినవి చేస్తూ తరించిపోతుంటావు. కారణం– అడుగున ధర్మం ప్రవహిస్తూ ఉంటుంది. అందువల్ల నీ కర్మలన్నీ పాశాలను విప్పేస్తుంటాయి. అందుకే ఈ తేలిక మార్గాన్ని నిర్దేశించారు. అది లేకపోతే ఇంద్రియాలు అకస్మాత్తుగా కాటువేసే అవకాశం ఉంది. అంటే ధర్మచ ట్రంలో ఉన్న అర్థకామాలు దేనిన యినా అనుభవించు... క్రమ క్రమంగా ఒక వయసు వచ్చేసిన తరువాత ధర్మానుష్ఠానబలం వైరాగ్య సుఖాన్నిస్తుంది. క్రమేణా ఒక నిరాసక్తత, ఒక అనుభవం బయల్దేరుతుంది లోపల. అంటే బలవంతంగా అంటించుకున్నది కాదు, అది ఈశ్వర కృపతో వచ్చేది.

వైరాగ్యమంటే.. ఈ సుఖా లన్నీ ఒక సుఖాలా... అనిపిం చడం... ఏమీ పట్టించుకో కుండా అని కాదు. గాలి తన పని తాను చేసుకుపో తుంటుంది. జాజి పందిరి మీదినుంచి పోతే పరి మళభరితం అవుతుంది..అప్పుడు గాలిని అభినం దిస్తే పొంగిపోదు. ఒక కళేబరం మీది నుంచిపోయి నప్పుడు దుర్గంధాన్ని వ్యాపింపచేస్తుందని అభిశం సిస్తే అది కృంగిపోదు. దాని పని అది చేసు కుంటూ పోతుంది. అలా పొంగిపోవడాలు, కుంగిపోవడాలు లేకుండా... నీ కర్తవ్యం నీవు చెయ్యాలి. నీ నిజా యితీ నీ అంతరాత్మకు, ఈశ్వరు డికి తెలిస్తే చాలు..''లోకుల్ నన్నని మెచ్చనీ యలగనీ లోలోన నిందించనీ/ చీకాకున్ బడనీ మహాత్ముడననీ../ మూకీభావ మునన్ తిట్టనీ త్రోయనీ / నీ కారుణ్యము కల్గి ఉండినను అంతేచాలు నోశంకరా!'' అంటారు శంకరాచా ర్యులు. నీ స్వచ్ఛత ఈశ్వరుడికి తెలిసినంత కాలం నీవు దిగులు పడాల్సిన అవసరం లేదు. ఆయన ముందు కూడా నీవు తలదించుకోవాల్సిన పరిస్థితి వస్తే... పూజామందిరంలోకి వెళ్ళు.. లెంపలేసు కుని క్షమాపణలడుగు.'ఈశ్వరా! నా వల్ల ఇటు వంటి అపరాధం మళ్ళీ జరగకుండు గాక!' అని శరణువేడుకో. చాలు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఎవరయితే ద్వంద్వాలకు అతీతు లయిపోతున్నారో వారు నాకు దగ్గరవు తున్నట్లు.. అంటాడు గీతాచార్యుడు. వైరాగ్యం క్రమంగా సత్యాన్ని అంగీక రించే స్థాయికి తీసుకువెడుతుంది. సూర్యోదయ సూర్యాస్తమయాల్లో ఆయుర్దాయం కరిగిపోతున్నది. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకో. ఈ శరీరం ఉండగానే నీవు చేయవలసిన కర్తవ్యాలు నెరవేర్చు. సద్వినియోగం చేసుకో. అంటే మంచి విషయాల్లోనే అనురక్తి ఉంటుంది తప్ప లౌకిక విష యాలపట్ల నిరాసక్తత పెరగడమే వైరాగ్యం. 'కోటి మంది వైద్యులు కూడి వచ్చినకాని మరణమన్న వ్యాధి మాన్పలేరు'. అంటే ఈ వైరాగ్యం ఎప్పుడు వస్తుంది..?. పిందెకూ పండుకూ తేడా తెలుసు కుంటే ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. పిందె పట్టుకుని ఉండాలి. పండు తనంతటతాను విడి పోయి పడిపోవడానికి సిద్ధంగా ఉండాలి. అంటే పట్టుకోవాల్సిన వయసులో అన్నీ పట్టుకో... ధర్మ బద్ధంగా. విడవాల్సి వచ్చినప్పుడు నిస్సంకోచంగా విడిచేసెయ్. కొబ్బరికన్నా పెంకును గట్టిగా పట్టు కునే వాళ్ళు ఎవరుంటారు... నీళ్ళు లోపలికి ఎప్పుడు ఎలా వెళ్ళాయో తెలియదు, ఎలా ఆవిర య్యాయో తెలియదు. లోపల గురుగుడుమంటూ ఉంది... అంటే విడిపోయింది. పూర్ణాహుతికి పని కొస్తుంది. అంటే ఈ శరీరం నేను కాదు...ఆత్మ అని అనుభవంలోకి రావడమే వైరాగ్యం. దీనికి ఈశ్వరకృప ప్రధానమయినా, నీ కర్మాచరణ లేకుండా ఈశ్వర కృప ఉండదు.

తాత్త్వికథ

ఆట కదరా శివా!

పాండిచ్చేరి పట్టణానికి చెందిన ఉన్నత విద్యావంతుడైన ఓ యువకుడికి అరుణాచలం వెళ్ళి గిరి ప్రదక్షిణం చేయాల నిపించింది. అనుకున్నదే తడవుగా అరుణాచలం బస్సు ఎక్కాడు.

అరుణాచలేశ్వర స్వామిని దర్శించుకుని రాజ గోపురం వద్ద నిలబడి వినాయకుణ్ణి ప్రార్థించి నడక ప్రారంభించాడు. అష్టలింగాలను చూస్తూ గిరి ప్రదక్షిణ పూర్తి చేయాలని అతడి ఆలోచన.

నడుస్తూ నడుస్తూ రమణ మహర్షి ఆశ్రమం చేరాడు. అక్కడ గిరి ప్రదక్షిణ చేయడానికి వచ్చిన ఓ ఆధ్యాత్మిక వేత్త పరిచయం అయ్యాడు. ''అలజడి లేని జీవితాన్ని గడపాలంటే ఏమి చేయాలి?'' అని ఆసక్తిగా ఆ ఆధ్యాత్మికవేత్తను అడిగాడు యువకుడు. ఆధ్యాత్మిక వేత్త చిరునవ్వు ముఖంతో ''ఇద్దరూ ఆడగలిగి, ఇద్దరూ గెలవగలిగే ఆట ఆడాలి'' అని బదులిచ్చాడు.



అర్థం కాని ముఖం పెట్టాడు ఆ యువకుడు. ఆధ్యాత్మికవేత్త యువకుడి హావభావాలు పట్టించుకో కుండా వేగంగా నడుచు కుంటూ వెళ్ళిపోయాడు. 'ఇద్దరు ఆడితే ఎవరో ఒకరు గెలుస్తారు కానీ, ఇద్దరూ ఎలా గెలుస్తారు?' అని ఆలోచనలు మొదలయ్యాయి ఆ యువకుడిలో. సమాధానం తెలుసుకుందామని తను కూడా వేగం పెంచాడు.

వల్లలార్ ఆశ్రమం వద్ద మళ్ళీ ఆధ్యాత్మిక వేత్త కనిపించాడు. ఆశ్చ ర్యంగా ''మీరు చెప్పింది ఎలా సాధ్యం?'' అని ప్రశ్నించాడు. ''ఆలో చించు. నీకే అర్థమవు తుంది. తమాషా ఏమి టంటే ఇద్దరే కాదు, ఆ ఆటని యాభై మంది ఆడినా... అందరూ గెలుస్తారు. అంతేకాదు... అది అందరూ ఆడగలిగిన ఆట కూడాను'' అంటూ ఆధ్యాత్మిక వేత్త వేగంగా నడుచుకుంటూ వెళ్ళిపో యాడు.

మళ్ళీ మొదటికి వచ్చింది యువకుడి పరిస్థితి. ఎవరినైనా అడిగి తెలుసుకుందామని ముందూ వెనుకా చూశాడు. తెలి సిన ముఖాలేవీ కనిపించలేదు. చేసేదేం లేక ఆధ్యాత్మికవేత్తను వెదుక్కుంటూ వెళ్ళాడు.

ఎలాగైతేనేమి ఈశాన్య లింగం వద్ద కనిపించాడు. గెస పోసుకుంటూ చెమటలు కారుస్తూ వెళ్ళి''మీరు సమాధానం చెప్పకపోతే నా తల బద్దలై పోయేలా ఉంది''అని దిగులుగా ముఖం పెట్టాడు. యువకుడి భుజం తడుతూ ఆ ఆధ్యాత్మిక వేత్త ''విచిత్రం ఏమిటంటే... వందమంది ఆ ఆట ఆడినా, వందమందీ గెలుస్తారు. అదేమిటంటే... ఎదుటివారిని ప్రేమించే ఆట. అక్కడ అందరూ విజేతలే. ఓటమి పాలయ్యే వారు ఎవ్వరూ ఉండరు'' అని సమాధానమిచ్చి అక్కడినుంచి మెరుపు వేగంతో వెళ్ళిపోయాడు.

''నిజమే. జీవితమనేది ఒక ఆటలాంటిది. ప్రేమ విత్తనాలు వెదజల్లే ఆట ఆడటం ప్రారంభిస్తే జీవితం పూల తోట అవుతుంది. దానికి వయస్సు, భాష, లింగం, ప్రాంతం, కులం, మతం అనే హద్దులు ఉండవు '' అనుకుంటూ ఆ యువకుడు గిరి ప్రదక్షిణ పూర్తి చేశాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా



నటుడిగా నందమూరి బాలకృష్ణ యాభై ఏళ్లు పూర్తి చేసుకున్నారు. 'తాతమ్మ కల' (1974) సినిమాతో బాలకృష్ణ కెరీర్ మొదలైంది. నటుడిగా ఆయన 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం తెలుగు చలన చిత్ర పరిశ్రమ బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవాన్ని హైదరాబాద్‌లో నిర్వహించింది. ఈ వేడుకలో నటులు చిరంజీవి, మోహన్‌బాబు, మురళీమోహన్, వెంకటేశ్, రాజశేఖర్, గోపీచంద్, శ్రీకాంత్, రానా, 'అల్లరి' నరేశ్, మంచు విష్ణు, మంచు మనోజ్, నానీ, విజయ్ దేవర కొండ, రానా, అడివి శేష్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ, శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర కుటుంబం, దర్శకులు కె. రాఘవేంద్ర రావు, పి. వాసు, బి. గోపాల్, ఎస్వీ కృష్ణారెడ్డి, బోయపాటి శ్రీను, అనిల్ రావిపూడి, బాబీ, బుచ్చిబాబు, నిర్మాతలు అశ్వనీదత్, అల్లు అరవింద్, డి. సురేష్‌బాబు, 'దిల్' రాజు, నవీన్, రవిశంకర్, నటీమణులు జయసుధ, జయప్రద, సుహాసిని, సుమలత, మాలాశ్రీ, శ్రీలీల తదితర సినీ ప్రముఖులు, ఏపీ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కందుల దుర్గేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ భరత్‌తో పాటు పలువురు రాజకీయ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

డేట్ మారింది

రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం విడుదల తేదీ మారింది. తొలుత ఈ సినిమాని ఈ నెల 7న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే మరో వారం ఆలస్యంగా 13న విడుదల కానుందని చిత్రయూనిట్ పేర్కొంది. జె. శివసాయి వర్ధన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా నటించారు. మారుతీ టీమ్ సమర్పణలో ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మించారు. ''ఇప్పటికే విడుదలైన మా సినిమా టీజర్, ట్రైలర్, సాంగ్స్‌కి అద్భుత మైన స్పందన వచ్చింది. సినిమా కూడా ప్రేక్షకుల్ని అలరిస్తుంది'' అని మేకర్స్ తెలిపారు.


● మనీషా, రాజ్ తరుణ్

సారీ... నాకు తెలియదు

– రజనీకాంత్



మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తోన్న హేమా కమిటీ గురించి జాతీయ స్థాయిలో చర్చ జరుగు తోంది. అయితే ఈ విషయం గురించి హీరో రజనీకాంత్ తనకు ఏమీ తెలియ దంటూ స్పందించడం సినిమా వాసులను ఆశ్చర్యపరుస్తోంది. చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న మహిళల కోసం జస్టిస్ హేమా కమిటీ తరహాలో కోలీవుడ్‌లోనూ ఓ కమిటీ రావాలంటారా? అనే ప్రశ్నకు రజనీకాంత్ స్పందిస్తూ– ''సారీ... ఆ అంశం గురించి నాకేమీ తెలియదు'' అంటూ జబాబు చెప్పారని కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

నిజం గెలుస్తుంది

– జయసూర్య



మలయాళ నటుడు జయ సూర్యపై లైంగిక దాడి ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ఆయనపై రెండు కేసులు నమోదు అయ్యాయి. ఆగస్టు 31న జయసూర్య పుట్టినరోజు. ఈ సందర్భంగా తనపై వచ్చిన ఆరోపణలపై స్పందిస్తూ ఓ నోట్‌ను రిలీజ్ చేశారు జయసూర్య.

''నాపై ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. మనస్సాక్షి లేనివారికి తప్పుడు ఆరోపణలు చేయడం సులభం. చేయని వేధింపులను చేశానని చెప్పడం, ఆ ఆరోపణలు మోయడం కూడా ఓ వేధింపులాంటిదే. నిజం కన్నా అబద్ధం వేగంగా ప్రయాణం చేస్తుందంటారు. అయినా నాకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది. నిజం గెలుస్తుంది. ఇక నా వ్యక్తిగతమైన కారణాల దృష్ట్యా ప్రస్తుతం యూఎస్‌లో ఉన్నాను. నా పనులు పూర్తి కాగానే కేరళకు వస్తాను'' అని ఆ నోట్‌లో పేర్కొన్నారు జయసూర్య.

దీంతో జయసూర్యపై ఫిర్యాదు చేసిన నటి సోనియా మల్హర్ మరోసారి స్పందించారు. ''నావి తప్పుడు ఆరోపణలని ఆయన (జయసూర్యను ఉద్దేశించి) అంటున్నారు. కానీ నా మాటల్లో నిజం ఉంది. ఆయనపై కామెంట్స్ చేయడానికి నేను లంచం తీసుకున్నట్లుగా సోషల్ మీడి యాలో కామెంట్స్ చేస్తున్నారు. హేమా కమిటీ రిపోర్ట్ వైరల్ అయిన నేపథ్యంలో మీడియా ముందుకు వచ్చి, హీరో పేరును బయట పెట్టాను. న్యాయ పోరాటం విషయంలో వెనక్కి తగ్గను'' అని సోనియా మల్హర్ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు.



అంతిమంగా సినిమా బతకాలి

– మమ్ముట్టి

మలయాళ పరిశ్రమలో జస్టిస్ హేమా కమిటీ నివేదిక ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఈ నివేదికలో పేర్కొనడంతో ఇందుకు నైతిక బాధ్యత వహించి, 'అమ్మ' (అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్షుడు మోహన్‌లాల్‌తో పాటు కమిటీ సభ్యులందరూ రాజీనామాలు చేసిన సంగతి తెలిసిందే. కాగా హేమా కమిటీ నివేదికపై ఆల్రెడీ మోహన్‌లాల్ స్పందించారు. తాజాగా మరో అగ్రనటుడు మమ్ముట్టి ఈ అంశం గురించి సోషల్ మీడియాలో సుదీర్ఘమైన పోస్టును షేర్ చేశారు. ఈ పోస్ట్ సారాంశం ఈ విధంగా...

- ఓ సంస్థకు సంబంధించి ఒక విధానం ఉంటుంది. మొదట నాయకత్వం స్పందించిన తర్వాతే సభ్యులు మాట్లాడితే బాగుంటుంది. ప్రస్తుతం నేను 'అమ్మ'లో సభ్యుడిని మాత్రమే. అందుకే నేను కాస్త ఆలస్యంగా స్పందిస్తున్నాను.
- సినిమా అనేది సమాజానికి ప్రతిబింబం. సమాజంలో జరుగుతున్న మంచి చెడులు సినిమాల్లోనూ ఉంటాయి. అయితే సినిమాలపై సమాజం దృష్టి చాలా దగ్గరగా ఉంటుంది. జరుగుతున్న ప్రతి అంశాన్ని గమనిస్తుంటారు. ఒక్కోసారి చిన్న అంశాలు కూడా పెద్ద స్థాయి చర్చలకు కారణమవుతుంటాయి. అందుకే ఇండస్ట్రీలో ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు జరగకుండా ఇండస్ట్రీ వాళ్ళు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.
- ఓ దురదృష్టకర సంఘటన (2017లో జరిగిన దిలీప్–భావనా మీనన్‌ల ఘటనను ఉద్దేశించి కావొచ్చు) జరిగిన నేపథ్యంలో ఇండస్ట్రీపై అధ్యయనం చేయాల్సిందిగా ప్రభుత్వం జస్టిస్ హేమా కమిటీని నియమించింది. మహిళ లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేలా ఆ నివేదికలో పేర్కొన్న సూచనలు, సలహాలు, పరిష్కారాలను స్వాగతిస్తున్నాం. అయితే ఈ అంశాలను అమలు చేయడా నికి మలయాళ చిత్ర పరిశ్రమలో అన్ని అసోసియేషన్‌లు ఏక తాటి పైకి రావాలి. ఇక హేమా కమిటీ పూర్తి నివేదిక కోర్టులో ఉంది. కమిటీకి అందిన ఫిర్యాదులపై పోలీసులు నిజాయి తీగా విచారణ చేస్తున్నారు. దోషులను కోర్టు శిక్షిస్తుంది. హేమా కమిటీ సిఫార్సులు అమ్మలయ్యేలా చట్టపరమైన కార్యాచరణ జరగాలి... అంతిమంగా సినిమా బతకాలి.

సగ భాగం ఇచ్చేవాడు కావాలి


● దిలీప్, రెజీనా

దిలీప్ ప్రకాశ్, రెజీనా జంటగా అర్జున్ సాయి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉత్సవం'. హార్న్‌బిల్ పిక్చర్స్ సమర్పణలో సురేష్ పాటిల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. కాగా ఈ సినిమా ట్రైలర్‌ని ఆదివారం విడుదల చేశారు. 'నాటకాలోళ్ల మీద ఏంటయ్యా నీ నాటకం' (దిలీప్ ప్రకాశ్), 'తనలో సగ భాగం ఇచ్చేవాడు కావాలి' (రెజీనా) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

కావాలని అలా ప్లాన్ చేయలేదు

– అరుళ్ నిధి




''నేనిప్పటివరకూ ఎక్కువగా థ్రిల్లర్స్, సస్పెన్స్ సినిమాలు చేశాను. కావాలని అలా ప్లాన్ చేయలేదు. ఇక నుంచి వేరే జానర్ మూవీస్ చేయాలను కుంటున్నాను. ఇప్పటివరకూ నా ప్రతిభకు రావాల్సినంత గుర్తింపు రాలేదనే ప్రశ్న చాలాసార్లు ఎదురైంది. అయితే 'డీమాంటీ కాలనీ' ఫ్రాంచైజీ ద్వారా ఆ గుర్తింపు దక్కుతోందని భావిస్తున్నాను'' అని హీరో అరుళ్ నిధి అన్నారు. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. తమిళంలో హిట్ అయిన ఈ మూవీని ఎస్. శ్రీనివాస రెడ్డి సమర్పణలో బి. సురేష్ రెడ్డి, బి. మానసా రెడ్డి తెలుగులో ఆగస్టు 23న రిలీజ్ చేశారు. ఈ నేపథ్యంలో అరుళ్ నిధి మాట్లాడుతూ – ''డీమాంటీ కాలనీ 2'కి తెలుగులో వస్తున్న స్పందనతో చాలా సంతోషంగా ఉన్నాం. ప్రొడ్యూసర్ సురేష్ రెడ్డిగారు తెలుగులో మంచి ప్రమోషన్ చేశారు. 'డీమాంటీ కాలనీ' ఫ్రాంచైజీలో మూడు, నాలుగో భాగాలు కూడా రానున్నాయి'' అన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ


● 'వెంకటలక్ష్మితో' పోస్టర్

రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్లుగా నటించిన చిత్రం 'వెంకటలక్ష్మితో'. 'యాడాది కిందట' అనేది ట్యాగ్ లైన్. రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో ఆలేటి రాజేశ్ నిర్మించారు. ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను నటుడు శ్రీకాంత్ లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''వెంకటలక్ష్మితో' టైటిల్ చాలా బాగుంది. షార్ట్ ఫిల్మ్స్‌తో ఫేమస్ అయిన రఘు ఈ సినిమా ద్వారా అందర్నీ ఆకట్టుకుంటాడని నమ్ము తున్నాను. ఈ చిత్రం ఓ కొత్త కంటెంట్‌తో రాబోతోందని తెలుస్తోంది'' అన్నారు. ''ఇదొక స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్‌తో పాటు అన్ని అంశాలతో రూపొందించాం'' అని తెలిపారు రామమూర్తి కొట్టాల. ''దర్శకుడితో సహా అంతా కొత్తవారితో ఈ చిత్రం రూపొందించాం'' అని ఆలేటి రాజేశ్ చెప్పారు. ''నూతన నటీనటులతో ఏడాది కిందట మొదలుపెట్టిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని రఘు గద్వాల అన్నారు.

థ్రిల్లర్ ఆరంభం


● శివకుమార్, నందిని

శివకుమార్ హీరోగా, నందినీ రాయ్ హీరోయిన్‌గా కొత్త సినిమా ప్రారంభమైంది. 'అన్‌లోడ్ 2023' అనే హాలీవుడ్ చిత్రాన్ని తెరకెక్కించిన రవికుమార్ నాసు దర్శకత్వంలో ట్రెండ్ సెట్ ఫిల్మ్స్‌పై రూపొందనున్న ఈ సినిమా అమెరికాలోని వర్జీనియాలో గల సాయిబాబా ఆలయంలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. రవికుమార్ నాసు మాట్లాడుతూ– ''థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందనున్న చిత్రమిది. ఈ సినిమా షూటింగ్ మొత్తం అమెరికాలోనే జరుపుతాం'' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాయికుమార్ అయినంపూడి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: శ్రావణి మాదిరాజ్, మాధవి నాసు, లైన్ ప్రొడ్యూసర్: పద్మ వాయువేగుల, చైతన్య వర్మ.

పారిస్ పారాలింపిక్స్‌లో నేటి భారత షెడ్యూల్

ఆర్చరీ
మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఓపెన్ (క్వార్టర్ ఫైనల్): (రాత్రి గం. 8:40 నుంచి)

షూటింగ్
మిక్స్‌డ్ 25 మీటర్ల పిస్టల్ ఎస్‌హెచ్1 (క్వాలిఫికేషన్ ప్రెసిషన్): (నిహాల్ సింగ్–అమీర్ అహ్మద్ భట్) (మధ్యాహ్నం గం. 12:30 నుంచి), మిక్స్‌డ్ 25 మీటర్ల పిస్టల్ ఎస్‌హెచ్1 (క్వాలిఫికేషన్ ర్యాపిడ్): (నిహాల్ సింగ్–అమీర్ అహ్మద్ భట్) (సాయంత్రం గం. 4:30 నుంచి), మిక్స్‌డ్ 25 మీటర్ల ఎస్‌హెచ్1 పిస్టల్ (ఫైనల్) (రాత్రి గం. 8:15 నుంచి)

బ్యాడ్మింటన్
మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్ 6 (కాంస్య పతక పోరు): సుమతి–సోలైమలై (భారత్) – మర్లీనా–సుభాన్ (ఇండోనేసియా) (మధ్యాహ్నం గం. 1:40 నుంచి), పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్3 (స్వర్ణ పతక పోరు): నితీశ్ కుమార్ – బెథెల్ డానియెల్ (బ్రిటన్) (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)

అథ్లెటిక్స్
పురుషుల డిస్కస్ త్రో ఎఫ్56 (ఫైనల్): యోగేశ్ కథూనియా (మధ్యాహ్నం గం. 1:35 నుంచి), పురుషుల జావెలిన్ త్రో ఎఫ్64 (ఫైనల్): సందీప్ సంజయ్, సుమిత్ అంటిల్, సందీప్ (రాత్రి గం. 10:30 నుంచి), మహిళల డిస్కస్ త్రో ఎఫ్53 (ఫైనల్): కంచన్ లఖానీ (రాత్రి గం. 10:34 నుంచి), మహిళల 400 మీటర్ల టి20 (తొలి రౌండ్): జివాంజి దీప్తి (రాత్రి గం. 11:34 నుంచి)

భార్గవ్ 'డబుల్'

- రెండు విభాగాల్లో టైటిల్స్ సొంతం
- మహిళల సింగిల్స్ విజేత సూర్య చరిష్మా


విన్నర్స్ ట్రోఫీతో భార్గవ్ రామ్, విశ్వతేజ్

పుణే: ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు అరిగెల భార్గవ్ రామ్ రెండు టైటిల్స్‌తో అదరగొట్టాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో గుంటూరు జిల్లాకు చెందిన భార్గవ్ అండర్–19 పురుషుల డబుల్స్, అండర్–19 మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచాడు. పురుషుల డబుల్స్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన గొబ్బూరు విశ్వతేజ్‌తో కలిసి ఆడిన భార్గవ్ రామ్ 21–13, 21–18తో అర్ష్ మొహమ్మద్–భవ్య్ ఛాబ్రా (భారత్) జోడీని ఓడించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భార్గవ్‌రామ్–కలగొట్ల వెన్నెల (భారత్) ద్వయం 21–9, 21–12తో మొహమ్మద్ విత్ అనాఫ్సా–కేలా అనీసా పుత్రి (ఇండోనేసియా) జంటను ఓడించి టైటిల్ దక్కించుకుంది. అండర్–19 మహిళల సింగిల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన సూర్య చరిష్మా తామిరి చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో సూర్య చరిష్మా 18–21, 21–11, 21–15తో థాలిత రమధాని విర్యావాన్ (ఇండోనేసియా)పై గెలుపొందింది. అండర్–19 మహిళల డబుల్స్ ఫైనల్లో తారిణి సూరి–శ్రావణి వలేకర్ (భారత్) జంట 21–17, 23–21తో చైచానా–పోలియం (థాయ్‌లాండ్) జోడీపై గెలిచి విజేతగా నిలిచింది.


సూర్య చరిష్మా

'పసిడి' వేటలో భారత షట్లర్లు

- రెండు సింగిల్స్ విభాగాల్లో ఫైనల్లోకి
- ఎస్‌ఎల్–4 కేటగిరీలో సుహాస్, ఎస్‌ఎల్–3 కేటగిరీలో నితేశ్ ఫైనల్లోకి
- మహిళల అథ్లెటిక్స్ 200 మీటర్ల విభాగంలో కాంస్యం గెలిచిన ప్రీతి


సుహాస్

పారిస్: పారాలింపిక్స్‌లో ఆదివారం భారత షట్లర్లు మెరిపించారు. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్–4 కేటగిరీలో సుహాస్ యతిరాజ్... ఎస్‌ఎల్–3 కేటగిరీలో నితేశ్ కుమార్ ఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం రజత పతకాలను ఖరారు చేసుకున్నారు. 2007 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ అయిన సుహాస్ గత టోక్యో పారాలింపిక్స్‌లోనూ ఫైనల్‌కు చేరి రజత పతకం దక్కించుకున్నాడు. ఈసారి సెమీఫైనల్లో సుహాస్ 21–17, 21–12తో భారత్‌కే చెందిన సుకాంత్ కదమ్‌ను ఓడించాడు. మరో విభాగం సెమీఫైనల్లో నితేశ్ 21–16, 21–12తో దైసుకె ఫుజిహారా (జపాన్)పై గెలిచి తొలిసారి పారాలింపిక్స్ ఫైనల్లోకి ప్రవేశించాడు. నేడు జరిగే ఫైనల్స్‌లో టోక్యో పారాలింపిక్స్ చాంపియన్ లుకాస్ మజుర్ (ఫ్రాన్స్)తో సుహాస్; డేనియల్ బెథెల్ (బ్రిటన్)తో నితేశ్ తలపడతారు. మహిళల సింగిల్స్ ఎస్‌యు5 కేటగిరీలో ఇద్దరు భారత క్రీడాకారిణులు తులసిమతి మురుగేశన్, మనీషా రామదాస్ సెమీఫైనల్లో పోటీపడనున్నారు. ఇద్దరిలో ఒకరు ఫైనల్‌కు చేరుకోనుండటంతో ఈ విభాగంలోనూ భారత్‌కు కనీసం రజతం లభించనుంది. ఈరోజు జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో ఫ్రెడీ సెతియావాన్ (ఇండోనేసియా)తో సుకాంత్ తలపడతాడు.

ప్రీతికి రెండో పతకం

మహిళల అథ్లెటిక్స్ టి35 200 మీటర్ల విభాగంలో భారత అథ్లెట్ ప్రీతి పాల్ కాంస్య పతకాన్ని సాధించింది. ప్రీతి 200 మీటర్ల దూరాన్ని 30.01 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. టి35 100 మీటర్ల విభాగంలోనూ ప్రీతికి కాంస్య పతకం లభించిన సంగతి తెలిసిందే.


ప్రీతి

రాకేశ్‌కు దక్కని కాంస్యం

పురుషుల ఆర్చరీ కాంపౌండ్ ఓపెన్ విభాగంలో భారత ప్లేయర్ రాకేశ్ కుమార్ కాంస్య పతక మ్యాచ్‌లో ఓడిపోయాడు. హి జిహావో (చైనా)తో జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో రాకేశ్ 146–147 స్కోరుతో పరాజయం పాలయ్యాడు.

రవికి ఐదో స్థానం

పురుషుల షాట్‌పుట్ ఎఫ్40 కేటగిరీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు రవి రొంగలి ఐదో స్థానంలో నిలిచాడు. ఇనుప గుండును రవి 10.63 మీటర్ల దూరం విసిరి ఐదో స్థానాన్ని దక్కించుకున్నాడు. గత ఏడాది ఆసియా పారా గేమ్స్‌లో రజతం గెలిచిన రవి ఈసారి తన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినా ఫలితం లేకపోయింది. మిగెల్ మోంటెరో (పోర్చుగల్; 11.21 మీటర్లు) స్వర్ణం సాధించాడు. మరోవైపు మహిళల 1500 మీటర్ల టి11 విభాగం తొలి రౌండ్‌లో భారత అథ్లెట్ రక్షిత రాజు 5 నిమిషాల 29.92 సెకన్లలో గమ్యానికి చేరి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయింది.

షూటర్ల గురి కుదరలేదు

భారత షూటర్లకు ఆదివారం అచ్చిరాలేదు. మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ (ఎస్‌హెచ్1) ఈవెంట్‌లో అవని లేఖరా 11వ స్థానంలో నిలువగా, సిద్ధార్థ బాబు 28వ స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు. ఇదే విభాగం వ్యక్తిగత ఈవెంట్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించిన అవని గురి 'మిక్స్‌డ్'లో మాత్రం కుదర్లేదు. ఆమె 632.8 స్కోరు చేయగా, సిద్ధార్థ 628.3 స్కోరు చేశాడు. మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ (ఎస్‌హెచ్2) ఈవెంట్‌లోనూ శ్రీహర్ష రామకృష్ణ క్వాలిఫయింగ్‌లో 630.2 స్కోరుతో 26వ స్థానంలో నిలిచాడు.


నితేశ్



హైజంప్‌లో నిశాద్‌కు రజతం

పురుషుల హైజంప్ టి47 కేటగిరీలో భారత అథ్లెట్ నిశాద్ కుమార్ రజత పతకం సాధించాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ ఈవెంట్‌లో నిశాద్ 2.04 మీటర్ల ఎత్తుకు ఎగిరి రెండో స్థానంలో నిలిచాడు. గత టోక్యో పారాలింపిక్స్‌లోనూ నిశాద్‌కు రజత పతకం లభించింది. అమెరికాకు చెందిన రొడెరిక్ టౌన్‌సెండ్ 2.12 మీటర్ల ఎత్తుకు ఎగిరి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గత టోక్యో పారాలింపిక్స్‌లోనూ రొడెరిక్ టౌన్‌సెండ్ పసిడి పతకాన్ని గెల్చుకున్నాడు.

సినెర్ సులువుగా...

- ప్రిక్వార్టర్ ఫైనల్లోకి టాప్ సీడ్
- వరుసగా ఆరో ఏడాది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన మాజీ చాంపియన్ మెద్వెదెవ్

న్యూయార్క్: ఈ ఏడాది దూకుడు మీదున్న ప్రపంచ నంబర్‌వన్ ప్లేయర్ యానిక్ సినెర్ (ఇటలీ) సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సినెర్ ఈ సీజన్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలవడంతోపాటు మరో నాలుగు టోర్నీల్లో విజేతగా నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు, వింబుల్డన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సినెర్... యూఎస్ ఓపెన్‌లో తనకు క్లిష్టతరమైన ప్రత్యర్థులు మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్), డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా)లు ఇంటిముఖం పట్టడంతో టైటిల్ ఫేవరెట్‌గా అవతరించాడు. సినెర్‌తోపాటు మాజీ చాంపియన్, ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) వరుసగా ఆరో ఏడాది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... పదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు.

వరుస సెట్లలో...

పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సినెర్ 6–1, 6–4, 6–2తో గంటా 53 నిమిషాల్లో క్రిస్టోఫర్ ఒ కానెల్ (ఆస్ట్రేలియా)పై అలవోక విజయం సాధించాడు. ఏకంగా 15 ఏస్‌లు సంధించిన సినెర్, 46 విన్నర్లు కొట్టాడు. మిగతా మ్యాచ్‌ల్లో మాజీ చాంపియన్, ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6–3, 6–4, 6–3తో ఫ్లావియో కొబొలి (ఇటలీ)పై, పదో సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా) 6–3, 6–7 (4/7), 6–0, 6–0తో ఇవాన్స్ (బ్రిటన్)పై, తాజా వింబుల్డన్ క్వార్టర్ ఫైనలిస్ట్, 14వ సీడ్ టామీ పాల్ (అమెరికా) 6–7 (5/7), 6–3, 6–1, 7–6 (7/3)తో గాబ్రియెల్ డియాలో (కెనడా)పై గెలుపొందారు.

క్వార్టర్ ఫైనల్లో పౌలా బదోసా

మహిళల సింగిల్స్‌లో 26వ సీడ్ పౌలా బదోసా (స్పెయిన్) తొలిసారి యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో బదోసా 6–1, 6–2తో యాఫన్ వాంగ్ (చైనా)పై గెలిచి ఐదో ప్రయత్నంలో ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మరోవైపు మాజీ చాంపియన్ (2022), టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), ఐదోసీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ), ఆరో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మూడో రౌండ్లో నంబర్‌వన్ స్వియాటెక్ (పోలాండ్) 6–4, 6–2తో 25వ సీడ్ అనస్తాసియా పావ్లీచెంకోవా (రష్యా)పై సునాయాసంగా గెలిచింది. ఐదో సీడ్ పావ్లోని (ఇటలీ) 6–3, 6–4తో 30వ సీడ్ పుతిన్‌త్సెవ (కజకిస్తాన్)పై గెలుపొందగా, ఆరో సీడ్ పెగులా (అమెరికా) 6–3, 6–3తో బోజెస్ మనెరియో (స్పెయిన్)ను ఓడించింది. మాజీ నంబర్‌వన్ వొజ్నియాకి (డెన్మార్క్) 6–3, 6–2తో జెస్సికా పొంచెట్ (ఫ్రాన్స్)పై విజయం సాధించగా, 16వ సీడ్ లుడ్‌మిలా సామ్సొనొవా (రష్యా) 6–1, 6–1తో ఆష్లిన్ క్రుయెగెర్ (అమెరికా)పై నెగ్గింది.


సినెర్

'మిక్స్‌డ్' క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

భారత అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఇండోనేసియన్ భాగస్వామి అల్దిలా సుత్జియదితో కలిసి ఎనిమిదో సీడ్‌గా బరిలోకి దిగిన బోపన్న జంట రెండో రౌండ్లో 0–6, 7–6 (7/5), 10–7తో జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా)–కాటరీనా సినియకోవా (చెక్ రిపబ్లిక్) జోడీపై గెలుపొందింది. క్వార్టర్ ఫైనల్లో బోపన్న–సుత్జియది జోడీ నాలుగో సీడ్ మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)–క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) జంటతో తలపడుతుంది. ఎబ్డెన్ పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న భాగస్వామి! ఇదివరకే పురుషుల డబుల్స్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం మూడో రౌండ్లోకి ప్రవేశించింది. మరోవైపు పురుషుల డబుల్స్ మూడో రౌండ్లో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం 2–6, 2–6తో టాప్ సీడ్ మార్సెల్ గ్రెనోలర్స్ (స్పెయిన్)–హొరాసియో జెబలాస్ (అర్జెంటీనా) జంట చేతిలో ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నిట్ వరంగల్‌లో వివిధ ఉద్యోగాలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



» మొత్తం పోస్టుల సంఖ్య: 04.
» పోస్టుల వివరాలు: విజిటింగ్ కన్సల్టెంట్ (లీగల్ అడ్వైజర్)–1, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్(ఆన్ క్రాంటాక్ట్)–1,విజిటింగ్ కన్సల్టెంట్(ఆర్కిటెక్ట్)–1, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్(ఆన్ కాంట్రాక్ట్)–1.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్, బీఆర్క్, పీజీ, విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టుకు హైకోర్టులో మూడేళ్ల పాటు అడ్వకేట్‌గా పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు విజిటింగ్ కన్సల్టెంట్‌కు రూ.50,000, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్‌కు రూ.70,000, విజిటింగ్ కన్సల్టెంట్‌కు ప్రతి విజిటింగ్‌కు రూ.5000, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌కు రూ.60,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.09.2024.
» వెబ్‌సైట్: https://nitw.ac.in

ఐఐఎస్సీ, బెంగళూరులో 12 పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 12.
» పోస్టుల వివరాలు: ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్–02, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్–04, ప్రాజెక్ట్ అసోసియేట్2–04, ప్రోగ్రామ్ అసిస్టెంట్–02.
» విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ పోస్టులకు 35 ఏళ్లు, మిగతా పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుకు రూ.49,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు రూ.42,000, మిగతా పోస్టులకు రూ.28,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.09.2024.
» వెబ్‌సైట్: https://iisc.ac.in

సీపెట్, న్యూఢిల్లీలో 12 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 12
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ ప్రొఫెసర్–08, అసోసియేట్ ప్రొఫెసర్–02, లైబ్రేరియన్–01, అసిస్టెంట్ ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్–01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 65 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.35,000 నుంచి రూ.40,000, అసిస్టెంట్ ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్ పోస్టుకు రూ.35,000, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.46,400, లైబ్రేరియన్‌కు రూ.30,000.

ముఖ్య సమాచారం
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును ది డైరెక్టర్ అండ్ హెడ్, సీపెట్: సీఎస్‌టీఎస్–హాజీపూర్, ఇండస్ట్రియల్ ఏరియా, హాజీపూర్, వైశాలి, బీహార్–844102 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 09.09.2024.
» వెబ్‌సైట్: https://www.cipet.gov.in

50 రోజుల్లో.. విజయానికి ఇలా!

టీజీపీఎస్సీ గ్రూప్–1.. 563 పోస్ట్‌లతో వెలువడిన నోటిఫికేషన్‌కు తీవ్ర పోటీ! తొలిదశ ప్రిలిమినరీ పరీక్షకు మూడు లక్షల మందికిపైగా హాజరైతే.. 31,382 మంది రెండో దశ మెయిన్‌కు అర్హత సాధించారు. మెయిన్ పరీక్షలను టీజీపీఎస్సీ అక్టోబర్ 21 నుంచి వరుసగా ఏడురోజులపాటు నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ 50 రోజుల సమయంలో... మెయిన్స్‌లో విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, సబ్జెక్ట్‌ల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు, రైటింగ్ ప్రాక్టీస్, ముఖ్యమైన టాపిక్స్ తదితర అంశాలపై విశ్లేషణ..

» అక్టోబర్ 21 నుంచి గ్రూప్–1 మెయిన్ పరీక్షలు
» ఆరు పేపర్లుగా 900 మార్కులకు మెయిన్ పరీక్షలు
» వీటికి అదనంగా అర్హత పేపర్‌గా ఇంగ్లిష్ లాంగ్వేజ్
» నిరంతరం రివిజన్, రైటింగ్ ప్రాక్టీస్‌తోనే సక్సెస్

- 563–టీజీపీఎస్సీ గ్రూప్–1 పోస్ట్‌ల సంఖ్య.
- 3,02,172–తొలి దశ ప్రిలిమ్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య.
- 31,382–ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించి.. మెయిన్స్‌కు అర్హత పొందిన వారి సంఖ్య.
- అంటే ఒక్కో పోస్ట్‌కు దాదాపు 56 మంది పోటీ పడుతున్న పరిస్థితి. దీంతో ఇప్పుడు మెయిన్స్‌లో ప్రతిభ చూపడం అత్యంత కీలకంగా మారింది. తీవ్ర పోటీ పరిస్థితుల్లో అభ్యర్థులు అందుబాటులో ఉన్న సమయంలో ప్రతి నిమిషాన్ని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత నెలకొంది.

50 రోజుల సమయం

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను అక్టోబర్ 21 నుంచి 27 వరకు టీజీపీఎస్సీ నిర్వహించనుంది. అంటే అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సమయం 50 రోజులు మాత్రమే. ఈ సమయంలో ఆయా పేపర్ల వారీగా ముఖ్యమైన అంశాలను గుర్తిస్తూ.. వాటిని అధ్యయనం చేస్తూ.. రివిజన్‌తోపాటు రైటింగ్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. అప్పుడే పరీక్ష హాల్లో మంచి ప్రతిభ చూపేందుకు ఆస్కారం ఉంటుందని నిపుణులు, గత విజేతలు పేర్కొంటున్నారు.

మెయిన్స్ ఆరు పేపర్లు

- .మెయిన్ పరీక్షను మొత్తం ఆరు పేపర్లలో 900 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్–1 జనరల్ ఎస్సే 150 మార్కులకు, పేపర్–2 హిస్టరీ, కల్చర్–జాగ్రఫీ 150 మార్కులకు, –పేపర్–3 ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం, పరిపాలన 150 మార్కులకు, పేపర్–4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ 150 మార్కులకు, పేపర్–5 సైన్స్–టెక్నాలజీ–డేటా ఇంటర్‌ప్రిటేషన్ 150 మార్కులకు, పేపర్–6 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం 150 మార్కులకు ఉంటాయి. మొత్తం మెయిన్ ఎగ్జామినేషన్‌కు కేటాయించిన మార్కులు–900.
- పేపర్–ఎ..జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫయింగ్ టెస్ట్) 150 మార్కులకు ఉంటుంది.
- పేపర్–ఎగా పేర్కొన్న జనరల్ ఇంగ్లిష్ అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో పొందిన మార్కులను మెరిట్ లిస్ట్ రూపకల్పనలో పరిగణించరు. ఈ పేపర్‌లో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే మిగిలిన పేపర్ల మూల్యాంకన చేస్తారు.

కీలకాంశాలపై పట్టు సాధించేలా

- మెయిన్ ఎగ్జామినేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తెలంగాణ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, తెలంగాణ ఉద్యమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా.. జనరల్ ఎస్సే పేపర్‌లో, హిస్టరీ పేపర్‌లో ఉండే తెలంగాణ రాష్ట్ర విధానాలు, తెలంగాణ సమాజం, సంస్కృతి, వారసత్వం, కళలు, సాహిత్యం, హక్కులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- జనరల్ ఎస్సే పేపర్–1 కోసం సమకాలీన సామాజిక అంశాలు, సమస్యలు, ఆర్థిక వృద్ధి, భారత చారిత్రక, వారసత్వ సంపద, సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజా పరిణామాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- పేపర్–2లో ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, భారత చరిత్ర,సంస్కృతి అంశాలు, అదే విధంగా తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వారసత్వ అంశాలను చదవాలి. వీటితోపాటు భారత, రాష్ట్ర భౌగోళిక అంశాలపై పట్టు సాధించాలి.
- పేపర్–3 కోసం భారత రాజ్యాంగం, పాలనా వ్యవస్థ, భారత సమాజం, సమస్యలు, సాంఘిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి.
- పేపర్–4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ కోసం భారత, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ–అభివృద్ధి, అభివృద్ధి, పర్యావరణ సమస్యలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- పేపర్–5 సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం సామాజిక అభివృద్ధికి సైన్స్ అండ్ టెక్నాలజీ దోహద పడుతున్న తీరు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆధునిక పద్ధతుల గురించి ప్రత్యేకంగా తెలుసుకోవాలి.

ఆరో పేపర్‌కు ప్రత్యేకంగా

గ్రూప్–1 మెయిన్‌లో ఆరో పేపర్‌గా పేర్కొన్న.. తెలంగాణ ఆలోచన (1948–1970), ఉద్యమ దశ(1971–1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991–2014) అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం 1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు–వాటి సిఫార్సులు వంటి వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి.


టీజీపీఎస్సీ ఎగ్జామ్స్

కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం

మెయిన్స్ ప్రిపరేషన్ క్రమంలో కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా.. తెలంగాణకు సంబంధించి ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై మరింత ప్రత్యేక దృష్టితో అభ్యసనం సాగించాలి. ఆర్థిక వనరుల అభివృద్ధి, రాష్ట్రంలో వ్యవసాయ, సాగు పరిస్థితులు, పారిశ్రామిక విధానాలు వంటి అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ప్రత్యేక అంశాలకు ఇలా

- తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీలపై అభ్యర్థులు లోతైన అవగాహన ఏర్పరచుకుంటే మార్కులు పెంచుకునే అవకాశం ఉంది.
- చరిత్రలో తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు–రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు–వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- జాగ్రఫీలో.. తెలంగాణలోని ముఖ్యమైన నదులు–పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపై అవగాహన అవసరం.
- ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు–ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన ఏర్పరచుకోవాలి.

పునశ్చరణకు ప్రాధాన్యం

- ప్రస్తుత సమయంలో అభ్యర్థులు పునశ్చరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో కొత్త అంశాల అధ్యయనం జోలికి వెళ్లకుండా ఇప్పటికే పట్టు సాధించిన అంశాలపై మరింత అవగాహన పొందేందుకు కృషి చేయాలి.
- అందుకోసం పేపర్ వారీగా రోజు వారీ ప్రణాళిక రూపొందించుకోవాలి. పరీక్ష తేదీని పరిగణనలోకి తీసుకుంటే 50 రోజుల వ్యవధి అందుబాటులో ఉంది.

ఈ వ్యవధిలో అభ్యర్థులు ప్రతి రోజు అన్ని పేపర్లను చదివే విధంగా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రతి పేపర్‌కు సగటున రెండున్నర గంటల సమయం కేటాయించేలా చూసుకోవాలి. తమకు సులభం అనిపించే పేపర్లకు కొంచెం తక్కువ సమయం కేటాయించి, ఆ సమయాన్ని క్లిష్టంగా భావించే పేపర్లకు కేటాయించాలి. దీనివల్ల పేపర్లు, అంశాలపై పట్టు విషయంలో సమతుల్యత పాటించే అవకాశం లభిస్తుంది.

చివరి వారం రెడీ రెకనర్స్

పరీక్షకు ముందు వారం రోజుల నుంచి అభ్యర్థులు పుస్తకాల జోలికి వెళ్లకుండా రెడీ రెకనర్స్‌ను వినియోగించి ప్రిపరేషన్ సాగించాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయంలో రాసుకున్న సొంత నోట్స్ మేలు చేస్తుంది. అదే విధంగా ఆయా టాపిక్స్‌కు సంబంధించి ప్రామాణిక మెటీరియల్‌లో ఉండే సబ్ హెడింగ్స్‌ను పరిశీలించాలి.

రైటింగ్ ప్రాక్టీస్

మెయిన్స్ అభ్యర్థులు రైటింగ్ ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రోజు తాము చదివిన టాపిక్‌కు సంబంధించి ఒక ప్రశ్నకు సమాధానం రాయడం అలవర్చుకోవాలి. అదే విధంగా పరీక్ష హాల్లో ప్రతి ప్రశ్నకు సగటున లభించే సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ప్రిపరేషన్ సమయంలోనే ప్రతి రోజు ఒక ప్రశ్నకు ఆ సమయం ఆధారంగా సమాధానాలు రాయాలి. ఆ తర్వాత వాటిని మూల్యాంకన చేసుకుని అన్ని పాయింట్లు రాశామా లేదా అని తెలుసుకోవాలి.

స్టాక్ మార్కెట్లు
(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
231	84
82,366	25,236

విదేశీ సూచీలు

నాస్‌డాక్	17,714	▲	197
డోజోన్స్	41,563	▲	228
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,377	▼	3
డాక్స్	18,907	▼	6
షాంఘై	2,842	▼	19
నికాయ్	38,648	▼	285

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.44	84.46
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.21	111.82
€	యూరో	ఎస్‌బీఐ	91.78	94.17
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.34	58.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.13	58.08
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.09	66.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.46	22.97
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.95	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.71



అదనపు రుణానికి రూట్.. టాపప్ హోమ్‌లోన్!

- వేగంగా, డిజిటల్‌గా మంజూరు
- ఎలాంటి పత్రాలు అవసరం లేదు
- వడ్డీ రేటు ఇతర రుణాల కంటే తక్కువ
- అన్నీ ఆలోచించాకే నిర్ణయం
- ముఖ్య అవసరాలకే పరిమితం కావాలి

సొంతిల్లు.. చాలా మంది జీవిత లక్ష్యాల్లో ఒకటి. రుణంపై సొంతిల్లు సమకూర్చుకునే వారే ఎక్కువగా ఉంటున్నారు. అలా గృహ రుణం తీసుకున్న తర్వాతి కాలంలో ఎదురయ్యే అవసరాల కోసం అదనపు రుణం తీసుకునే అవకాశం ఉంటే..? గృహ నవీకరణ లేదా విద్యా సంబంధిత ఫీజుల చెల్లింపు లేదా అనారోగ్యం.. అవసరం ఏదైనా గృహ రుణంపై టాపప్ రుణం సులభంగా లభిస్తుంది. కాకపోతే ఈ విధంగా తీసుకుంటున్న రుణం ఏ అవసరాలకు వినియోగిస్తున్నారనేది ఇంత వరకు బ్యాంక్‌లు పెద్దగా పట్టించుకునేవి కావు. కానీ, ఇటీవలే ఆర్‌బీఐ ఈ విషయమై బ్యాంక్‌లను హెచ్చరించింది. కనుక టాపప్ హోమ్‌లోన్‌ను ఏ అవసరం కోసం తీసుకుంటున్నామనేది రుణ గ్రహీతలు సైతం ఒక్కసారి పరిశీలన చేసుకోవాల్సిందే. చౌకగా లభించే ఈ రుణాన్ని ముఖ్యమైన అవసరాల్లో వినియోగించుకోవడం ద్వారా తగినంత ప్రయోజనం పొందొచ్చు.

- సాక్షి, బిజినెస్ డెస్క్

టాపప్ అంటే...

అప్పటికే తీసుకున్న గృహ రుణంపై అదనపు రుణాన్ని తీసుకోవడమే టాపప్ హోమ్‌లోన్ అవుతుంది. దాదాపు అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ తరహా రుణాలను ఆఫర్ చేస్తుంటాయి. ఇంటి విలువ ఎంత? ఇంటికి తీసుకున్న రుణానికి చెల్లింపులు ఏ విధంగా చేస్తున్నారు? అప్పటి వరకు ఎంత మేర చెల్లించారు? తదితర అంశాల ఆధారంగా ఈ రుణానికి అర్హత లభిస్తుంది. ఇది సెక్యూర్డ్ లోన్ కిందకే వస్తుంది. కనుక బ్యాంక్‌లకు వీటిపై రిస్క్ తక్కువే. అయితే రుణ గ్రహీత చెల్లింపుల సామర్థ్యాన్ని బేరీజు వేసుకున్న తర్వాతే ఈ రుణంపై బ్యాంకింగ్ నిర్ణయం తీసుకుంటుంది.

ఎలా పనిచేస్తాయి?

''గృహ రుణం తీసుకున్న తర్వాత క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లిస్తూ.. 18–24 నెలలు గడిచిన తర్వాత టాపప్ లోన్ తీసుకునేందుకు అర్హత లభిస్తుంది'' అని విష్‌ఫిన్ సీఈవో రిషి మెహ్రా తెలిపారు. వాస్తవంగా జారీ అయిన గృహ రుణం నుంచి అప్పటికి మిగిలి ఉన్న రుణ బకాయి పోను మిగిలిన మొత్తం టాపప్‌గా లభిస్తుంది. అంటే అప్పటి వరకు తీర్చిన రుణం మొత్తమే తిరిగి రుణంగా తీసుకోవచ్చు. ఉదాహరణకు రూ.కోటి విలువ చేసే ఇంటి కోసం గరిష్ట పరిమితి మేరకు రూ.80 లక్షల రుణం తీసుకున్నారని అనుకుందాం. తర్వాత ఐదేళ్లలో రూ.10లక్షలు అసలు తీర్చివేసినట్టయితే.. అప్పుడు తిరిగి రూ.10 లక్షల మేర టాపప్ హోమ్ లోన్‌కు అర్హత ఉంటుంది. అంతేకాదు ఈ ఐదేళ్లలో పెరిగిన ఇంటి విలువను సైతం బ్యాంక్‌లు పరిగణనలోకి తీసుకుంటాయి. రూ.కోటి విలువ చేసే ఇంటి విలువ ఐదేళ్లలో రూ.1.20 లక్షలకు చేరిందనుకుంటే అప్పుడు రుణ అర్హత రూ.96లక్షలకు పెరుగుతుంది. ఈ రుణ కాల వ్యవధి కూడా, గృహ రుణం కాలానికి మించకుండా ఉంటుంది. చాలా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు టాపప్ హోమ్‌లోన్‌ను 15 ఏళ్ల కాలవ్యవధి వరకు ఆఫర్ చేస్తున్నట్టు పైసాబజార్ హోమ్ లోన్స్ హెడ్ రతన్ చౌదరి తెలిపారు. గృహ రుణం కాల వ్యవధి ఇంకా ఏడేళ్లు, అంతకు మించి ఉంటే.. ఇతర రుణాల కంటే తక్కువ ఈఎంఐకే రుణం పొందొచ్చని చౌదరి సూచించారు.

సులభతరం

టాపప్ హోమ్‌లోన్‌ను చాలా సంస్థలు డిజిటల్‌గా మంజూరు చేస్తున్నాయి. కనుక వేగంగా రుణం చేతికి అందుతుంది. అప్పటికే గృహ రుణం కోసం అన్ని పత్రాలు సమర్పించి ఉంటారు కనుక.. అదనంగా ఎలాంటి డాక్యుమెంట్ల అవసరం ఏర్పడదు. అన్ని పత్రాలు దగ్గర ఉండడంతో బ్యాంక్‌లు వేగంగా నిర్ణయం తీసుకుంటాయి. రుణ గ్రహీత తాజా క్రెడిట్ రిపోర్ట్‌ను తప్పకుండా పరిశీలిస్తాయి.

చౌక ఆప్షన్

అన్ని రుణాల్లోకి గృహ రుణం చౌక వడ్డీ రేటుకే లభిస్తుంది. గృహ రుణంపై ప్రస్తుతం అమల్లో ఉన్న వడ్డీ రేటే.. టాపప్‌కి సైతం అమలవుతుంది. పర్సనల్ లోన్, క్రెడిట్‌కార్డుపై రుణం, బంగారంపై రుణం కంటే టాపప్ హోమ్‌లోన్ చౌక అని పైసాబజార్ రతన్ చౌదరి తెలిపారు. ఒకవేళ అప్పటికే క్రెడిట్ కార్డ్‌పై రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకుని, అధిక వడ్డీ రేటు చెల్లిస్తుంటే.. అటువంటి వారు సైతం టాపప్ హోమ్‌లోన్ తీసుకుని వాటిని తీర్చివేయడం ద్వారా భారాన్ని తగ్గించుకోవచ్చు. పర్సనల్, క్రెడిట్ కార్డు రుణాలు అన్ సెక్యూర్డ్ కిందకు వస్తాయి. అందుకే వాటిపై వడ్డీ రేటు ఎక్కువ. గృహ రుణం సెక్యూర్డ్ (ఇల్లు తనఖాపై) కనుక వడ్డీ రేటు తక్కువ.

అవసరం మేరకే..

సులభంగా, చౌకగా వస్తుందని చెప్పి టాపప్ హోమ్‌లోన్‌కు మొగ్గు చూపించే ముందు, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలన చేయడం ఎంతో అవసరం. టాపప్ రుణాలతో వచ్చే పెద్ద సమస్య నెలవారీ చెల్లించాల్సిన ఈఎంఐ పెరిగిపోవడమేనని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ (ఆర్‌ఐఏ), సహజ్ మనీ వ్యవస్థాపకులు అభిషేక్ కుమార్ తెలిపారు. టాపప్ హోమ్ రుణాలు అనుత్పాదక అవసరాలకు వినియోగం అవుతుండడంపై ఆర్‌బీఐ ఇటీవలే బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను అప్రమత్తం చేసింది. ఈ రుణాలు తీసుకున్న వారు దేనికి వినియోగిస్తున్నారో తెలుసుకోవాలని కోరింది. ముఖ్యంగా ఈ తరహా రుణాలు ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగిపోయాయి. లోన్–టు–వేల్యూ రేషియో (ప్రాపర్టీ విలువపై జారీ చేసే రుణం మొత్తం/ఎల్‌టీవీ), రిస్క్‌లు, రుణ నిధుల వినియోగంపై ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. కనుక ఈ తరహా రుణాలు స్పెక్యులేటివ్ అవసరాలకు తీసుకోవడం లేదని బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీని నమ్మించాల్సి రావచ్చు. ఇలా తీసుకున్న నిధులను ట్రేడింగ్‌లో నష్టపోయి, తిరిగి చెల్లింపులు చేయలేకపోతే అప్పుడు రుణం ఇచ్చిన బ్యాంక్ ఇంటిని జప్తు చేస్తుందన్నది మర్చిపోవద్దు. ''టాపప్ హోమ్ లోన్స్ అన్నవి సాధారణంగా గృహ నవీకరణ కోసమే. పిల్లల విద్య లేదా వైద్య వ్యయాలు వంటి ఇతర అవసరాలకు కూడా వీటిని వినియోగించుకోవచ్చు. రుణం తీసుకునే సమయంలోనే దీనిపై బ్యాంక్‌లు నిబంధనల గురించి స్పష్టంగా తెలియజేస్తాయి'' అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి వివరించారు. అయితే ఈ రుణాన్ని స్పెక్యులేటివ్ అవసరాలకు వినియోగించరాదని సూచించారు. ఇదే విషయం రుణ ఒప్పంద నిబంధనల్లోనూ స్పష్టంగా ఉంటుంది.

రుణం రాకపోతే..?

చాలా సంస్థలు బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ సమయంలో (గృహ రుణం బదిలీ) టాపప్ రుణాలు ఆఫర్ చేస్తున్నట్టు పైసాబజార్ చౌదరి తెలిపారు. ఇంటి రుణం ఇచ్చిన సంస్థ దగ్గర టాపప్ హోమ్ లోన్ పొందలేకపోతే.. లేదా అధిక వడ్డీ రేటు వసూలు చేస్తున్నట్టు అయితే.. అప్పుడు మిగిలి ఉన్న గృహ రుణాన్ని (బ్యాలెన్స్) మరో సంస్థకు బదిలీ చేసుకోవడం ద్వారా టాపప్ హోమ్‌లోన్‌ను పొందొచ్చని చౌదరి సూచించారు.





ఇవి గమనించాలి..

- విహార యాత్ర, ఖరీదైన వస్తు కొనుగోళ్ల కోసం టాపప్ హోమ్‌లోన్ తీసుకోవడం ఎంత మాత్రం సూచనీయం కాదు. తమ ఆస్తి విలువ పెంచుకునేందుకు వినియోగించుకోవచ్చు.
- టాపప్ హోమ్ లోన్‌ను వీలైనంత తక్కువ కాల వ్యవధికి (రెండు నుంచి నాలుగేళ్లు) పరిమితం చేసుకోవాలి. దీర్ఘ కాలం ఎంపిక చేసుకోవడం వల్ల వడ్డీ భారం పెరిగిపోతుంది.
- గృహ రుణం, దానిపై టాపప్‌తో కలిపి అసలు ఇంటి విలువలో 75 శాతం మించకుండా చూసుకోవడం సౌకర్యం.
- ఈ తరహా రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలను చాలా సంస్థలు వసూలు చేస్తున్నాయి.
- బ్యాంక్‌తో సంప్రదింపులు చేయడం ద్వారా వీలైతే వడ్డీ రేటులో రాయితీ పొందొచ్చు.
- టాపప్ హోమ్‌లోన్‌ను ఖరీదైన ఇతర రుణాల చెల్లింపులకు వినియోగించుకోవడం తెలివైన నిర్ణయమే అవుతుంది.

10 శాతం పెరిగిన జీఎస్‌టీ వసూళ్లు

ఆగస్టులో రూ.1.75 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్లు మరో సారి బలంగా నమోదయ్యాయి. ఆగస్టులో రూ.1.75 లక్షల కోట్లు జీఎస్‌టీ రూపంలో సమకూరింది. 2023 ఆగస్టు నెలలో రూ.1.59 లక్షల కోట్ల ఆదాయంతో పోల్చి చూస్తే 10 శాతం పెరిగింది. ఇక ఈ ఏడాది జూలై నెలకు జీఎస్‌టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లుగా ఉన్నాయి. దీంతో పోల్చితే ఆగస్టులో స్వల్పంగా తగ్గాయి. 2024 ఆగస్టులో దేశీ లావాదేవీలపై జీఎస్‌టీ ఆదాయం 9.2 శాతం పెరిగి రూ.1.25 లక్షల కోట్లుగా నమోదైంది. దిగుమతి చేసుకున్న వస్తువులపై స్థూల జీఎస్‌టీ ఆదాయం 12.1 శాతం పెరిగి రూ.49,976 కోట్లకు చేరింది. ఇక ఆగస్టులో రూ.24,460 కోట్ల జీఎస్‌టీ రిఫండ్‌లు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెల గణాంకాలో పోల్చితే 38 శాతం పెరిగాయి. రిఫండ్‌లను సర్దుబాటు చేసి చూస్తే, నికర జీఎస్‌టీ ఆదాయం 6.5 శాతం పెరిగి రూ.1.5 లక్షల కోట్లకు చేరింది. పండుగలకు ముందు జీఎస్‌టీ వసూళ్లు 10 శాతం పెరగడం వినియోగం బలంగా ఉన్నట్టు సూచిస్తోందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మార్కెట్‌లో లాభాలు కొనసాగే అవకాశం	ఆగస్టులో ఆటో అమ్మకాలు అంతంతే..!

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-9-2024	
విశాఖ	505–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460–00
వరంగల్	462–00
రిటైల్ ధర	5.20

టర్మ్ ఇన్సూరెన్స్‌తో ఆర్థిక భద్రత



సమీర్ జోషి,
చీఫ్ ఏజెన్సీ ఆఫీసర్,
బజాజ్ అలయంజ్ లైఫ్

మన పరోక్షంలో మన కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు సమర్థమంతమైన మార్గాల్లో నిస్సందేహంగా టర్మ్ ఇన్సూరెన్స్ కూడా ఒకటి. ఇది పూర్తిగా ప్రొటెక్షన్‌పై మాత్రమే ఫోకస్ చేసే సరళతరమైన బీమా పథకం. పాలసీదారు మరణించినా కుటుంబ పరిస్థితి తల్లకిందులు కాకుండా ఆర్థికంగా భరోసా అందించే టర్మ్ ఇన్సూరెన్స్‌ను తీసుకునేందుకు పలు కారణాలు ఉన్నాయి. అవేమిటంటే..



- **ఆదాయ నష్టం నుంచి రక్షణ:** సంపాదించే కుటుంబ పెద్ద కన్నుమూస్తే ఆదాయం నిల్చిపోయి ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం కాకుండా టర్మ్ ఇన్సూరెన్స్ కాపాడుతుంది. ఉదాహరణకు నలుగురు సభ్యులున్న కుటుంబంలో ఏకైక సంపాదనపరుడైన పాలసీదారు ఇటు ఇంటి రుణం చెల్లిస్తూ అటు పిల్లల చదువులకూ కడుతున్నారనుకుందాం. దురదృష్టవశాత్తూ ఒకవేళ ఆయన మరణించిన పక్షంలో టర్మ్ ఇన్సూరెన్సు పిల్లల చదువు ఖర్చులు, రుణాల చెల్లింపు, జీవనం సాగించడానికి అవసరమయ్యే నిధులను సమకూర్చగలదు.
- **చౌకైనది:** టర్మ్ ప్లాన్లతో తక్కువ ప్రీమియంలకే అత్యధిక కవరేజీ లభించగలదు. ముఖ్యంగా యుక్తవయస్సులో ఉన్నప్పుడు తీసుకుంటే రిస్కులు తక్కువ కాబట్టి కాబట్టి ప్రీమియంలు మరింత తక్కువగా ఉంటాయి. కనుక 20లలో లేదా 30లలో ఉన్నప్పుడు టర్మ్ పాలసీని తీసుకోవడానికి ప్రాధాన్యమివ్వాలి.
- **రుణాలకు కవరేజీ:** పాలసీదారు ఏవైనా రుణాలు తీసుకున్నా వాటిని తీర్చేందుకు కూడా టర్మ్ ఇన్సూరెన్స్‌తో కవరేజీ లభించగలదు.

ఎంత కవరేజీ ఉండాలి..

- ఇది మీ ఆర్థిక పరిస్థితులు, మీపై ఆధారపడిన వారి అవసరాలు, లైఫ్‌స్టయిల్, భవిష్యత్ లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. బండగుర్తు ఏమిటంటే వార్షిక ఆదాయానికి 10 రెట్లు అధికంగా లైఫ్ కవరేజీ ఉండాలి. అదనంగా ద్రవ్యోల్బణం, నిర్దిష్ట ఆర్థిక లక్ష్యాల్లాంటివి కూడా పరిగణనలోకి తీసుకుంటే ఎంత కవరేజీ అవసరమవుతుందనేది ఒక అవగాహనకు రావచ్చు.
- చివరగా చెప్పాలంటే.. మీ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాల్సిన అవసరం గురించి అర్థం చేసుకునేందుకు, మీకేదైనా అయితే మీ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవగలిగే వారు ఎవరైనా ఒక అయిదుగురు ఉన్నారేమో ఆలోచించి చూడండి. నా మిత్రులను అడిగితే ఏదో ఒకటో రెండో పేర్లు చెప్పారు. కొందరైతే అదీ లేదు. కాబట్టి ఏదైనా జరిగితే మానసికంగా భరోసానిచ్చేవారు చాలా మందే ఉన్నా ఆర్థికంగా వెన్నంటి ఉండేవారు అంతగా ఉండరనేది ఇది తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడానికి టర్మ్ ఇన్సూరెన్స్ ఎంతగానో తోడ్పడగలదు.

భారత్ ఎలక్ట్రానిక్స్ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 299 టార్గెట్: రూ. 360



ఎందుకంటే: పీఎస్‌యూ దిగ్గజం భారత్ ఎలక్ట్రానిక్స్ ఈ ఏడాది(2024–25) తొలి త్రైమాసికంలో అంచనాలను మించిన ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో వార్షికంగా ఆదాయం 20 శాతం ఎగసి రూ. 4,200 కోట్లకు చేరింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు ఏకంగా 3.4 శాతంమేర బలపడ్డాయి. ఆర్డర్ బుక్ విలువ రూ. 76,700 కోట్లను తాకింది. ఇది గత 12 నెలల ఆదాయంతో పోలిస్తే 3.7 రెట్లు అధికం. రానున్న రెండేళ్ల కాలంలో మరిన్ని ఆర్డర్లు పొందేందుకు వీలుంది. ప్రాడక్టులను స్థానికం(దేశీయం)గా తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం, రక్షణ రంగానికి పెట్టుబడి కేటాయింపులను పెంచడం ఇందుకు తోడ్పాటునివ్వనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరో రూ. 25,000 కోట్ల విలువైన ఆర్డర్లను అందుకునే అవకాశముంది. రూ. 25,000 కోట్ల విలువైన ప్రాజెక్ట్.. క్యూఆర్ ఎస్ఏఎం(మిస్సైల్)కు సంబంధించిన అన్ని పరీక్షలూ విజయవంతంగా పూర్తయ్యాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26)లో క్యూఆర్ఎస్ ఏఎంసహా.. మొత్తం రూ. 50,000 కోట్ల విలువైన కాంట్రాక్టులకు ప్రభుత్వం తెరతీయనుంది. కంపెనీ యాజమాన్యం ఈ ఏడాదికి 23–25 శాతం ఇబిటా మార్జిన్లతో ఆదాయంలో 15 శాతం వృద్ధి అంచనాలను పునరుద్ఘాటించింది. మరోవైపు ఎగుమతులు పెంచుకునేందుకు కంపెనీ వృద్ధి అవకాశాలను అన్వేషిస్తోంది. అంతేకాకుండా వివిధీకరణ, సామర్థ్య పెంపు, ఆధునికీకరణపై దృష్టి పెట్టింది.

స్పందన స్ఫూర్తి | బ్రోకరేజ్: ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 629 టార్గెట్: రూ. 1,184



ఎందుకంటే: దేశీయంగా అతిపెద్ద మైక్రోఫైనాన్స్ కంపెనీగా నిలుస్తున్న స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో కఠినతర పరిస్థితులను ఎదుర్కొంది. దీర్ఘ కాలం కొనసాగిన వేడిమి, సార్వత్రిక ఎన్నికలు, ప్రాజెక్ట్ పరివర్తన్ నేపథ్యంలో ఎదురైన అంతర్గత సవాళ్లు ఏప్రిల్–జూన్(క్యూ1)లో కంపెనీ పనితీరును దెబ్బతీశాయి. అంతేకాకుండా కంపెనీ ఆస్తుల(రుణాలు) నాణ్యతను సైతం ప్రభావితం చేశాయి. అయితే ఈ అంశాలన్నీ తాత్కాలికమేనని భావిస్తున్నాం. ఫలితంగా తిరిగి వసూళ్లు(కలెక్షన్స్) పుంజుకోగలవని అంచనా వేస్తున్నాం. గతేడాది(2023–24) చివరి త్రైమాసిక(జనవరి–మార్చి) రుణ(క్రెడిట్) వ్యయాలు ఈ ఏడాది తొలి అర్ధభాగం(ఏప్రిల్- సెప్టెంబర్)లో ప్రభావం చూపనున్నట్లు కంపెనీ యాజమాన్యం పేర్కొంది. ఆపై ద్వితీయార్ధం(అక్టోబర్–మార్చి) నుంచి సాధారణ పరిస్థితులు నెలకొననున్నట్లు తెలియజేసింది. ఈ ఏడాది క్యూ1లో నికర వడ్డీ మార్జిన్లు త్రైమాసికవారీగా 0.6 శాతం బలపడ్డాయి. 15.2 శాతాన్ని తాకాయి. ఇందుకు అధిక ఈల్డ్స్, తగ్గిన రుణ వ్యయాలు దోహదం చేశాయి. పోర్ట్‌ఫోలియోల పటిష్ట ఈల్డ్స్, నిధుల సమీకరణ చౌక వ్యయాలు కంపెనీ 13 శాతంస్థాయిలో నికర వడ్డీ మార్జిన్లు సాధించేందుకు దారి చూపనున్నాయి. నిర్వహణలోని ఆస్తుల(ఏయూ ఎం)లో పటిష్ట వృద్ధి(సుమారు 20 శాతం), నిలకడైన మార్జిన్లు, తగ్గుతున్న రుణ వ్యయాలు సమీప భవిష్యత్‌లో పటిష్ట లాభదాయకతకు సహకరించనున్నాయి. రెండేళ్ల కాలంలో 16 శాతం ఆర్‌వోఈ, 4 శాతం ఆర్‌వోఏ సాధించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్‌లో మూడు సంస్థల విలీనం పూర్తి

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్‌లో (టీసీపీఎల్) మూడు అనుబంధ సంస్థల విలీన ప్రక్రియ పూర్తయింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), ఇతరత్రా నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు రావడంతో దీన్ని పూర్తి చేసినట్లు సంస్థ వెల్లడించింది. విలీనమైన వాటిల్లో టాటా కన్జూమర్ సోల్‌ఫుల్, నరిష్‌కో బెవరేజెస్, టాటా స్మార్ట్‌ఫుడ్జ్ ఉన్నాయి. వ్యాపారాన్ని క్రమబద్ధీకరించుకునే క్రమంలో ఈ ప్రక్రియ చేపట్టినట్లు టీసీపీఎల్ తెలిపింది. టీసీపీఎల్‌కు రూ. 15,206 కోట్ల కన్సాలిడేటెడ్ టర్నోవరు ఉంది. టీ, కాఫీ, ఉప్పు, పప్పుధాన్యాలు, మసాలా దినుసులు, స్నాక్స్, మినీ మీల్స్ లాంటివి కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఉన్నాయి. టాటా టీ, టెట్లీ, టాటా కాఫీ గ్రాండ్ తదితర కీలక బెవరేజ్ బ్రాండ్స్‌ను విక్రయిస్తోంది.



Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



ఈటీఎఫ్ లేదా ఇండెక్స్ ఫండ్స్.. ఏది మెరుగు?

ద్రవ్యోల్బణానికి దీటైన రాబడులు ఇవ్వడంలో షార్ట్ డ్యురేషన్ డెట్ ఫండ్స్, ఆర్‌బీఐ ఫ్లోటింగ్ రేట్ బాండ్లు ప్రభావవంతమైనవేనా?

- జితేంద్ర

షార్ట్ డ్యురేషన్ డెట్ ఫండ్స్, ఆర్‌బీఐ ఫ్లోటింగ్ రేట్ బాండ్లు మంచి రాబడులను ఇవ్వగలవు. ఇవి ద్రవ్యోల్బణాన్ని మించి స్వల్ప రాబడులను ఇస్తాయి. అధిక రాబడుల కోసం ఈ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటే మరోసారి పునరాలోచించాల్సిందే. సాధారణంగా స్థిరాదాయ (ఫిక్స్‌డ్ ఇన్‌కమ్/డెట్) పథకాల్లో పెట్టుబడులు పెట్టడంలో ప్రధాన లక్ష్యాలు.. 1. పెట్టుబడిని కాపాడుకోవడం. 2. పెట్టుబడులకు స్థిరత్వాన్ని అందించడం. ఇవి ఊహించతగిన రాబడులు ఇవ్వగలవు. అలా కాకుండా ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ద్వారా గొప్ప రాబడులు ఆశిస్తున్నట్టు అయితే, అది రిస్కీ ఆప్షన్లలో పెట్టుబడి పెట్టడం అవుతుంది. కానీ, దీన్ని మేము సూచించం. పోర్ట్‌ఫోలియోలో డెట్ సాధనాలకు కేటాయింపుల లక్ష్యాన్ని ఇది నీరుగారుస్తుంది. ద్రవ్యోల్బణాన్ని మించి మెరుగైన రాబడులు ఆశిస్తున్నట్టు అయితే అప్పుడు పోర్ట్‌ఫోలియోలో కొంత భాగాన్ని ఈక్విటీలకు కేటాయించడాన్ని పరిశీలించొచ్చు.

నేను నా రిటైర్మెంట్ అవసరాల కోసం 2040 వరకు ప్రతి నెలా రూ.25,000 చొప్పున ఇన్వెస్ట్ చేయగలను. ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్స్‌లో ఏది మెరుగైన ఆప్షన్ అవుతుంది?

- వినాయక్ రావు భోలే

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు) ఏదో ఒక ఇండెక్స్‌కు అనుగుణంగా ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఉదాహరణకు సెన్సెక్స్, నిఫ్టీ 50. స్టాక్స్ మాదిరే ఇవి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడ్ అవుతుంటాయి. ఈటీఎఫ్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టడం ప్యాసివ్ ఇన్వెస్టింగ్ అవుతుంది. ఈటీఎఫ్‌లు అన్నవి చాలా తక్కువ వ్యయాలతో కూడిన పెట్టుబడి సాధనాలు. మ్యూచువల్ ఫండ్స్‌లో వీటికి ప్రత్యామ్నాయం ఇండెక్స్ ఫండ్స్. ఈటీఎఫ్‌లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) సాధ్యం కాదు. ఎందుకంటే ఇవి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడ్ అవుతుంటాయి. అదే ఇండెక్స్ ఫండ్స్‌లో అయితే సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిప్ ద్వారా అయితే పెట్టుడులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వెళ్లేందుకు సాధ్యపడుతుంది. పెట్టుబడులు సులభంగా ఉండేందుకు ఇండెక్స్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇండెక్స్ ఫండ్స్‌లో సిప్ పెట్టుబడి వేతనానికి అనుగుణంగా ఏటా పెరిగేలా చూసుకోవడం మర్చిపోవద్దు. లార్జ్‌క్యాప్ విభాగంలో యాక్టివ్ ఫండ్స్‌తో పోల్చితే ఇండెక్స్ ఫండ్స్ స్థానం బలమైనది.

జాతీయ ఉత్తమ అధ్యాపకురాలిగా డాక్టర్ మృదుల



సనత్‌నగర్ (హైదరాబాద్): జాతీయ ఉత్తమ అధ్యాపకురాలు పురస్కారానికి బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందవరం మృదుల ఎంపికయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని అందజేసే జాతీయ ఉత్తమ అధ్యాపకురాలు పురస్కారానికి దేశవ్యాప్తంగా 16 మంది ఎంపికయ్యారు. వారిలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయిని డాక్టర్ మృదుల కావడం విశేషం. ఆమె ఇటీవల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ నెల 5న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుకోనున్నారు.

ప్రయాణాలు వాయిదా వేసుకోండి

హైదరాబాద్ ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి విజయవాడ, ఖమ్మం వెళ్లే ప్రయాణికులు వీలైతే.. తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని, అత్యవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంపిక చేసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. తమకున్న సమాచారం ప్రకారం భారీ వర్షాలకు హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు, నందిగామ ప్రాంతాల్లో రహదారిపై వరద నీరు ప్రవహిస్తోందని తెలిపారు. హైదరాబాద్ – ఖమ్మం దారిలో పాలేరు జలాశయం పొంగడంతో నాయకుని గూడెం వద్ద రహదారిపై వరద నీరు ప్రయాణాలకు ఆటంకం కలిగిస్తుందని వెల్లడించారు. కోదాడ సమీపంలోని రామాపురం కూడలిలో వంతెన కూలిపోయిందని తెలిపారు. అత్యవసరంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలనుకునే వారు చౌటుప్పల్, చిట్యాల్, నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు మీదుగా విజయవాడ చేరుకోవాలని సూచించారు. ఖమ్మం వెళ్లాలనుకునే వారు చౌటుప్పల్, చిట్యాల్, నకిరేకల్, అరవపల్లి, తుంగతుర్తి, మద్దిర్యాల, మరిపేట, బుంగలోవ్ మీదుగా ఖమ్మం చేరుకోవచ్చని తెలిపారు. ప్రయాణ సమయాల్లో ఏదైనా అత్యవసరమైతే హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు హెల్ప్‌లైన్ నంబర్ 9010203626ను సంప్రదించాలని సూచించారు.

వర్షాలతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది సిద్ధమయ్యారు. అన్ని జిల్లాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశారు. వరద ఉధృతి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను సిద్ధం చేశారు. దీంతోపాటు పునరావాస కేంద్రాల్లో శిబిరాలకు ఏర్పాట్లు చేశారు. దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో వచ్చిన వారికి వెంటనే పరీక్షలు చేస్తారు. మొబైల్ వాహనాల ద్వారా ఏర్పాటు చేసిన తాత్కాలిక ల్యాబుల్లోనే నమూనాలు సేకరించి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తారు. మంత్రి ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. కోఠిలోని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇక ఇప్పటికే వైద్య, ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తూ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ (ఈడీడీ) దగ్గరగా ఉన్న గర్భిణులను ముందే ఆసుపత్రులకు తరలించనున్నట్టు అధికారులు తెలిపారు.

సెల్ఫీలతో ప్రాణాలకు ముప్పు

సాక్షి, హైదరాబాద్: వాగులు, నదులు పొంగి పొర్లుతుంటే పలుచోట్ల ప్రజలు వంతెనలు ఎక్కి సెల్ఫీలు తీసుకోవడం ప్రమాదకరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హెచ్చరించారు. ఆ సమయంలో ఎక్కడైనా వంతెన కొట్టుకుపోతే ప్రాణనష్టం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఇలాంటి సంఘటనలు అక్కడక్కడ జరగడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లవద్దని, సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవద్దని ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఆపద్బాంధవులు



వరద ప్రవాహంలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడుతున్న పోలీసులు

వరద బాధితుడిని రక్షించిన పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం: వరద ప్రవాహంలో చిక్కుకున్న ఒక వ్యక్తిని పోలీసులు కాపాడారు. వివరాలివి. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన వెంకటస్వామి ఆదివారం నాగనూలు గ్రామానికి వెళ్తుండగా.. గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో అందులో చిక్కుకుపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో వెంకటస్వామిని రక్షించారు. ఈ సందర్భంగా వెంకటస్వామిని రక్షించిన హెడ్‌కానిస్టేబుల్ తఖీఖాన్, కానిస్టేబుల్ రామును ఎస్పీ వైభవ్ అభినందించారు.

జోరువానలోనూ కరెంటోళ్ల కష్టం



ఆత్మకూరు పట్టణంలో..

- విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి..
- ఎక్స్ వేదికగా వారి సేవలను ప్రశంసించిన సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్, తాంసి, వనపర్తి: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల్లోనూ విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి మరమ్మతులు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉరుములు, మెరుపుల కారణంగా తాంసి మండలం కప్పర్ల శివారులో 11 కేవీ విద్యుత్‌లైన్ ఇన్సులేటర్ చెడిపోయింది. దీంతో సరఫరా నిలిచింది. సమస్యను గుర్తించిన విద్యుత్ శాఖ ఏఈ మనోజ్ కుమార్ సిబ్బంది నజీర్, సంజీవ్, కిష్టుతో కలిసి రాత్రి జోరుగా కురుస్తున్న వర్షంలో చెడిపోయిన ఇన్సులేటర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. మూడు గంటలపాటు శ్రమించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో ఆదివారం డిస్క్ ఫెయిలై విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జూనియర్ లైన్‌మెన్ శివాజీ జోరుగా వర్షం కురుస్తున్నా ఎల్‌సీ (లైన్ క్లియర్) తీసుకుని స్వయంగా విద్యుత్ స్తంభం ఎక్కి సమస్యను పరిష్కరించారు. భారీ వర్షంలోనూ విద్యుత్ శాఖ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి మరమ్మతులు నిర్వహిస్తున్నారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. విధి నిర్వహణలో రాజీలేని అంకిత భావంతో పనిచేస్తున్న విద్యుత్, పోలీసు, మున్సిపల్ సిబ్బంది సేవలను ఆయన కొనియాడారు.



కప్పర్ల శివారులో

దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లు

భారీ వర్షాలతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) పరిధిలో 419 విద్యుత్ స్తంభాలు, 16 సబ్ స్టేషన్లు, 75కి పైగా 33 కేవీ ఫీడర్‌లు, 37 వరకు 11కేవీ ఫీడర్లు దెబ్బతిన్నాయి. వరద పోటెత్తడంతో 4 సబ్ స్టేషన్‌లు ముంపునకు గురయ్యాయి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎన్పీడీసీఎల్) పరిధిలో 218 విద్యుత్ స్తంభాలు, 10 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి.

ఇంటితో సహా కొట్టుకుపోయిన కుటుంబం

- మంత్రి పొంగులేటి ఆదేశంతో 8గంటల పాటు రెస్క్యూ చేసిన అధికారులు
- కుమారుడిని కాపాడిన పోలీసులు.. దంపతుల గల్లంతు
- ఆ దంపతులను కాపాడలేకపోయామంటూ పొంగులేటి భావోద్వేగం.. కంటతడి



షరీఫ్‌ను రక్షించి తీసుకొస్తున్న పోలీసులు



మృత్యుంజయుడు షరీఫ్

కూసుమంచి: ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో రిజర్వాయర్ సమీపాన నివసిస్తున్న ఓ కుటుంబం వరదలో చిక్కుకుంది. నీటిలో కొట్టుకుపోతున్న కుమారుడిని పోలీసులు కాపాడినప్పటికీ ఆయన తల్లిదండ్రులు మాత్రం గల్లంతయ్యారు. కూసుమంచికి చెందిన షేక్ యాకూబ్ తన భార్య సైదాబీ, కుమారుడు షరీఫ్‌తో కలిసి నాయకన్‌గూడెం పెట్రోల్‌బంక్ పక్కన సిమెంట్ ఇటుకలు తయారు చేస్తూ అక్కడే రేకుల ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి వారు ఇంట్లో నిద్రించగా.. తెల్లవారుజామున లేచి చూసేసరికి పాలేరు రిజర్వాయర్ అలుగు పోస్తోంది. అప్పటికే కొంత నీరు వారి ఇంట్లోకి చేరింది. ఎప్పటిలాగే నీరు వచ్చి తగ్గుతుందని యాకూబ్ కుటుంబం భావించింది. ఇంతలోనే ఊహించని విధంగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగి ఇంటిని చుట్టేసింది. దీంతో వారు భయంతో ఇంటిపైకి ఎక్కారు. ఈ విషయన్ని గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో తహసీల్దార్ సురేశ్ కుమార్, సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు గజ ఈతగాళ్లతో చేరుకుని యాకూబ్ కుటుంబాన్ని రక్షించేందుకు ప్రయత్నాలు చేశారు. ఎప్పటికప్పుడు యాకూబ్‌తో ఫోన్‌లో మాట్లాడినప్పటికీ ఎన్డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది ఉన్నప్పటికీ వరదపోటుతో వారి వద్దకు వెళ్లలేకపోయారు. చివరకు డ్రోన్ ద్వారా లైఫ్ జాకెట్లు, ట్యూబ్‌లు, తాగునీరు పంపించారు. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు 8 గంటల పాటు ఇంటిపైనే యాకూబ్ కుటుంబం గడిపినా సాయం చేయలేని పరిస్థితి ఎదురైంది.

2 కిలోమీటర్లు కొట్టుకుపోయినా.. బయటపడ్డ షరీఫ్

కుటుంబం వరదలో చిక్కుకున్న విషయాన్ని కలెక్టర్ హైదరాబాద్‌లో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వీరిని కాపాడేందుకు హెలికాప్టర్ పంపించాలని కోరగా మంత్రి త్వరగా పంపిస్తానని చెబుతూ స్థానిక వనరులతో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. ఆపై యాకూబ్ కుటుంబంతో మంత్రి కూడా ఫోన్‌లో మాట్లాడారు. అయితే, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోగా హెలికాప్టర్ వచ్చేలా కానరాకపోవడం .. ఇక్కడ ఎన్డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది ఉన్నా యాకూబ్ కుటుంబం చిక్కుకున్న ఇంటివద్దకు చేరే మార్గం లేకపోయింది. ఇంతలోనే వరద అంతకంతకు పెరగడంతో ఇంటితో సహ యాకూబ్, ఆయన భార్య, కుమారుడు కొట్టుకుపోయారు. ఈక్రమంలో షరీఫ్‌ను ఖమ్మం -సూర్యాపేట జాతీయ రహదారి పాలేరు ఏటి వంతెన వద్ద పహారా ఉన్న పోలీసులు అప్రమత్తమై తాళ్ల సాయంతో రక్షించగలిగారు. రెండు కిలోమీటర్లు నీటిలో కొట్టుకుపోయిన షరీఫ్ మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. కానీ ఆయన తల్లిదండ్రులు యాకూబ్ – సైదాబీ మాత్రం నీటిలో గల్లంతవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

ఎంత చేసినా కాపాడలేకపోయాం: పొంగులేటి కంటతడి

తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో ఇటుకల పనిచేసుకునే యాకూబ్, ఆయన భార్య సైదా వరదల్లో కొట్టుకుని పోవడం పట్ల మంత్రి పొంగులేటి భావోద్వేగానికి గురయ్యారు. విలేకరులతో మాట్లాడుతున్న సమయంలోనే ఈ సమాచారం రావడంతో ఖిన్నుడైన మంత్రి కంటతడితో మాట్లాడలేకపోయారు. ఆ తర్వాత తేరుకుని ఉదయం నుంచి ఆ కుటుంబాన్ని కాపాడేందుకు చేయని ప్రయత్నం లేదని చెప్పారు. 'నేవీ, ఎయిర్‌ఫోర్స్‌తో పాటు హకీంపేట బేస్ నుంచి హెలికాప్టర్‌లను నాయికన్‌గూడెం పంపాలని ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నాను. కానీ భారీ వర్షాలకు హెలికాప్టర్లు టేకాఫ్ కావడం కష్టమని అధికారులు చెప్పారు. యాకూబ్, సైదాలతో కూడా మాట్లాడుతూ వారికి ధైర్యం చెపుతూనే ఉన్నాను. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా అక్కడకు పంపాలనుకున్నా వరద కారణంగా వెళ్లలేకపోయాయి. దీంతో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలను సిద్ధం చేశాం. దగ్గర్లో ఉన్న ఊరి నుంచి డ్రోన్‌ను పంపించి, ఆ డ్రోన్‌కు తాడు కట్టి లైఫ్ జాకెట్లను యాకూబ్, సైదాలకు అందించాం. అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ కంటే ముందు కూడా వారితో నేను మాట్లాడాను. ఇంతలోనే భారీ వరద పోటెత్తడంతో వారు ఉన్న ఇంటిగోడ కూలి వరదలో కొట్టుకుపోయారు. అయినప్పటికీ వారి కొడుకు షరీఫ్ ను రక్షించగలిగాం.' అని చెప్పారు. ఆ కుటుంబాన్ని కాపాడలేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేసిన మంత్రి పొంగులేటి .. షరీఫ్‌ను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు.

వరద చుట్టుముట్టినా కదల్లేక పోయాడు..

- చేయి, కాలు పనిచేయని స్థితిలో దివ్యాంగ కుమారుడి మృతి
- కొడుకు మృతదేహంపై పడి రోదించిన తల్లి



కొడుకు మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి రత్నమ్మ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాలు చేయి కదపలేని కొడుకు వరద నీటిలో చిక్కుకుని మృతిచెందడంతో ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. వివరాలు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన నందికొల్ల రత్నమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు రాము (29) ప్రత్యేక అవసరాలు కలిగిన శిశువుగా జన్మించాడు. అతడికి ఒక కాలు, ఒక చేయి పనిచేయవు. మానసిక పరిపక్వత కూడా అంతంతమాత్రమే. దీంతో పుట్టినప్పటి నుంచి కొడుకును కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తోంది ఆ తల్లి. ఇటీవల ఆమె భర్త మరణించాడు. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి 8 గంటల నుంచి మణుగూరులో భారీ వర్షం కురవడం మొదలైంది. రాత్రి 10 గంటల సమయంలో కరెంటు పోయింది. రత్నం ఉంటున్న రెండు గదుల ఇంటిలో ఒక గదిలో ఆమె నిద్రపోగా వెనుక గదిలో మంచంపై రాము పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో ఆ ఇంటిని వరద చుట్టుముట్టింది. వరద నుంచి రక్షించుకునే ప్రయత్నంలో రాము అదుపు తప్పి కింద పడిపోయాడు. అక్కడి నుంచి లేవలేక వరద నీటిని మింగి చనిపోయాడు. మరోవైపు రెండో గదిలోకి నీరు వచ్చిన విషయం గమనించిన రత్నమ్మ చీకట్లో కొడుకు కోసం కేకలు వేయగా సమాధానం రాలేదు. తెల్లవారగానే వెనుక గదిలో వెతకగా వరద నీటిలో విగత జీవిగా కొడుకు కనిపించాడు. కొడుకును చూస్తూ రత్నమ్మ గుండెలు బాదుకుంటూ రోదించింది. ఆమె విలపించడం చూసి స్థానికులు సైతం కన్నీరు పెట్టుకున్నారు.

జోలెకట్టి.. వాగు దాటించి

మృతదేహం తరలింపులో ఇక్కట్లు



చింతకాని: భారీ వర్షాలతో అంత్యక్రియలకు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఖమ్మం ఎస్‌ఆర్ హోమ్స్‌లో నివసించే విష్ణుమూర్తి ఆదివారం మృతి చెందారు. అంత్యక్రియల కోసం ఆయన మృతదేహాన్ని ధంసలాపురం మున్నేరు ఒడ్డుకు తీసుకెళ్లారు. కానీ ఊరు బయటే వాగు పొంగుతుండడంతో రామకృష్ణాపురం వైపు వెళ్లారు. అక్కడ కూడా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో.. ఏం చేయాలో పాలుపోలేదు. ఇంతలోనే స్థానిక యువకులు ధైర్యం చెప్పి జోలె కట్టి.. విష్ణుమూర్తి మృతదేహాన్ని వాగు దాటించడంతో అంత్యక్రియలు పూర్తి చేయగలిగారు.

117 గ్రామాల ప్రధాన రహదారులు ధ్వంసం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో పలు గ్రామాలకు రవాణా సంబంధాలు తెగిపోయాయి. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ వర్గాల ప్రాథమిక సమాచారం ప్రకారం దాదాపు 117 గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. అత్యధికంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 33 గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బ తినగా.. కరీంనగర్ జిల్లాలో 20 గ్రామాల రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో 30 గ్రామాలు, ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 8, నిజామాబాద్‌లోని 7, నల్లగొండలోని 4 గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వర్షాల వల్ల పాడైన రోడ్ల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పీఆర్ అండ్ ఆర్‌డీ అధికారులను ఆదేశించారు.

వానలతో నిలిచిన అంతర్రాష్ట్ర రవాణా

బోధన్: ఎడతెరిపి లేకుండా రెండ్రోజులుగా కురుస్తున్న వర్షం అంతర్రాష్ట్ర రవాణాపై ప్రభావం చూపింది. నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్ర శివారులోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల మధ్య ప్రవహిస్తున్న మంజీర నది వంతెన మీదుగా నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగుతాయి. ఆదివారం ఉదయం నుంచి వర్షం కురవడంతో.. వంతెనపై అప్పుడప్పుడు ఆర్టీసీ బస్సులు తప్ప ఎలాంటి ప్రైవేటు వాహనాల రాకపోకలు కనిపించలేదు. అంతర్రాష్ట్ర ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద నిర్మానుష్య వాతావరణం నెలకొంది.

96 రైళ్లు, 566 ఆర్టీసీ బస్సులు రద్దు

భారీ వర్షాలతో స్తంభించిన ప్రజారవాణా



సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చౌటపల్లి ఊరచెరువు కట్ట తెగడంతో ధ్వంసమైన మేళ్లచెరువు–చౌటపల్లి రహదారి

ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో భారీగా కోతకు గురైన రోడ్డు

సాక్షి, హైదరాబాద్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజా రవాణాపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడిచే రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహబూబాబాద్ – కేసముద్రం, కేసముద్రం – నెక్కొండ మధ్య రైల్వే ట్రాక్‌దిగువన మట్టి కొట్టుకుపోవటంతో కాజీపేట మీదుగా హైదరాబాద్–విజయవాడ వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. విజయవాడ సమీపంలో రాయనపాడు వద్ద ట్రాక్ మీదుగా వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో కూడా రైళ్లను నిలిపేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 96 రైలు సర్వీసులు రద్దయ్యాయి. 9 రైళ్లను పాక్షికంగా రద్దు చేయగా, మరో 90 రైళ్లను దారి మళ్లించి నడిపారు. సోమవారం 52 రైళ్లను రద్దు చేసి ఐదింటిని దారిమళ్లిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

రైల్‌నిలయంలో అత్యవసర కేంద్రం

సికింద్రాబాద్ రైల్‌నిలయంతో పాటు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, బేగంపేట్ తదితర స్టేషన్‌లు, కాజీపేట్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, విశాఖ, తదితర అన్ని ప్రధాన స్టేషన్‌లలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ నిరంతరం సమీక్షలు నిర్వహించారు.

రద్దయిన ప్రధాన రైళ్లు..

తిరుపతి–సికింద్రాబాద్, ఎల్‌టీటీ ముంబై–విశాఖపట్టణం,, సికింద్రాబాద్– విజయవాడ, గుంటూరు–సికింద్రాబాద్, విజయవాడ–భద్రాచలం, విశాఖపట్టణం–సికింద్రాబాద్, తిరుపతి–ఆదిలాబాద్, గుంటూరు–సికింద్రాబాద్, హైదరాబాద్–విశాఖ, లింగంపల్లి–కాకినాడ, విశాఖపట్టణం–సికింద్రాబాద్, మణుగూరు–సికింద్రాబాద్, బీదర్–మచిలీపట్నం, తాంబరం–హైదరాబాద్, సికింద్రాబాద్–బనారస్, నర్సాపూర్–హైదరాబాద్, సికింద్రాబాద్–హౌరా, సికింద్రాబాద్–తిరువనంతపురం, మహబూబ్‌నగర్–విశాఖ, లింగంపల్లి–ముంబై, కరీంనగర్–తిరుపతి రైళ్లను రద్దు చేశారు.

హెల్ప్‌లైన్ నంబర్‌లు...

- సికింద్రాబాద్: 040–27786140, 040–27786170,
- నాంపల్లి : 040–9676904334
- కాజీపేట్ : 0870–2576430
- ఖమ్మం : 08742224541, 7815955306
- వరంగల్ : 9063328082

మఠంపల్లి మీదుగా రైళ్ల మళ్లింపు

మఠంపల్లి/యాదాద్రి: హైదరాబాద్, విజయవాడ వెళ్లే పలు రైళ్లను ఆదివారం రైల్వే అధికారులు సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మీదుగా నడిపారు. అయితే, అప్పటికే విజయవాడ, హైదరాబాద్‌ల నుంచి బయల్దేరిన గౌతమి, యశ్వంత్‌పూర్, విశాఖ రైళ్లు మహబూబాబాద్, కొండపల్లి మధ్య నిలిచిపోయాయి. దీంతో ఆదివారం ఈ రైళ్లను మోటమర్రి వద్ద దారి మళ్లించి సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు, మఠంపల్లి, పాలకవీడు మండలాల నుంచి నడికుడి జంక్షన్, గుంటూరు, మిర్యాలగూడ మీదుగా హైదరాబాద్‌కు పంపించారు. నాందేడ్ నుంచి సంబల్‌పూర్ వెళ్లే రైలును పగిడిపల్లి రైల్వే స్టేషన్‌లో కాసేపు నిలిపి అనంతరం పంపించారు. సికింద్రాబాద్ నుంచి భువనగిరి మీదుగా వెళ్లే గౌతమి, గోల్కొండ, కాకతీయ, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. భద్రాచలం – సికింద్రాబాద్ రైలును బీబీనగర్ – నడికుడి మార్గంలో నడిపిస్తున్నారు.

బస్సులకూ తప్పని తిప్పలు..

వరద నీటితో ఆదివారం 218 రూట్లలో తీవ్ర అంతరాయం ఏర్పడి, 566 ఆర్టీసీ బస్సు సర్వీసులను రద్దు చేశారు. తాండూరు– మహబూబ్‌నగర్, పరిగి–మహబూబ్‌నగర్, హైదరాబాద్–శ్రీశైలం, కామారెడ్డి–బాన్సువాడ, నిజామాబాద్–సిరికొండ–భీమ్‌గల్, కామారెడ్డి–భీమ్‌గల్, నిజామాబాద్–భీమ్‌గల్, ఖమ్మం–హైదరాబాద్, ఖమ్మం –విజయవాడ వయా బోనకల్, విస్సన్నపేట–విజయవాడ, మధిర–విజయవాడ, ఖమ్మం–కోదాడ, ఖమ్మం –సూర్యాపేట, ఖమ్మం, మధిర, సత్తుపల్లి, మణుగూరు పరిధిలోని అన్ని సెక్టార్‌లు. సత్తుప ల్లి–అశ్వారావుపేట, భద్రాచలం–గుంటూరు, భద్రాచలం–వెంకటాపురం మార్గాల్లో సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది.

పిల్లలకు విషమిచ్చి.. ఉరి వేసుకుని..

ముగ్గురు పిల్లలతో తల్లి బలవన్మరణం




పిల్లలతో సువర్ణ, సుధాకర్ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: కుటుంబ కలహాలతో ఒక తల్లి ముగ్గురు పిల్లలతో సహా బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో జరిగిన ఈ సంఘటనపై సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలివి. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆత్మకూరుకు చెందిన సుధాకర్ అలియాస్ అంజి, సువర్ణ (28) దంపతులు పిల్లలతో కలిసి బతుకుదెరువుకు ఏడేళ్ల కిందట పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం వచ్చి నివసిస్తున్నారు. సుధాకర్ పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ, మద్యానికి బానిసయ్యాడు. దీంతో బంధువులు అతన్ని వారం రోజులుగా హైదరాబాద్‌లోని రీహాబిలిటేషన్ సెంటర్‌కు పంపుతున్నారు. ఉదయం బంధువులే తీసుకెళ్లి సాయంత్రం సుధాకర్‌ను తీసుకొస్తారు. ఆదివారం ఉదయం 11 గంటలైనా ఇంటి తలుపులు తీయకపోవడంతో సుధాకర్ ఇంటి ఎదురుగా ఉండే బంధువులు వచ్చి తలుపులు కొట్టారు. సువర్ణ ఎంతకూ తలుపులు తీయకపోవడంతో పగులగొట్టి లోపలికి వెళ్లగా జశ్వంత్ (5), కవల సంతానం చిన్మయి (3), చిత్రనాథ్ (3)లు నురుగులు కక్కుతూ చనిపోయి ఉన్నారు. తల్లి సువర్ణ ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. పక్కనే సూసైడ్ నోట్ కూడా ఉంది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు చేసుకున్నట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. కూతురికి కొంతకాలంగా మతిస్థిమితం లేదని, ఆమె ఆత్మహత్యకు ఎవ్వరూ కారణం కాదని సువర్ణ తండ్రి పండరి చెబుతుండటం గమనార్హం. పూర్తిస్థాయిలో విచారించి వివరాలు వెల్లడిస్తామని సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

నాన్నా.. అందరం సచ్చిపోతున్నం..

- భార్య, ఇద్దరు కుమారులకు విషమిచ్చి ఆత్మహత్య చేసుకున్న భర్త
- తండ్రికి సమాచారం ఇచ్చి దారుణానికి ఒడిగట్టిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- హైదరాబాద్‌లో ఘటన.. మృతుల స్వస్థలం మంచిర్యాల



కుమారులతో వెంకటేశ్, వర్షిణిలు.. (ఫైల్..)

మంచిర్యాలక్రైం/ కుత్బుల్లాపూర్: తన కుమారుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ భార్య, ఇద్దరు కుమారులతో ఆనందంగా జీవిస్తున్నాడని భావిస్తున్న ఆ తండ్రికి.. కొడుకు శనివారం రాత్రి అతిపెద్ద విషాద వార్త చెప్పాడు. ఫోన్ చేసి.. నాన్నా మేమిక బతకలేం! మేమందరం సచ్చిపోతున్నం'అని చెప్పాడు. కొడుకు నోట ఆ మాటలు విన్న తండ్రి గుండె పగిలినంత పనైంది. వెంటనే అప్రమత్తమైన తండ్రి 'అంత పెద్ద కష్టం ఏమొచ్చింది.. వద్దు బిడ్డా నేనున్నా'అంటూ చెప్పేలోపే ఫోన్ పెట్టేశాడు. దీంతో తండ్రి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేలోపే కోడలు, ఇద్దరు మనుమలు బెడ్‌పై విగతజీవులుగా పడి ఉన్నారు. పక్క గదిలో కొడుకు ఉరేసుకున్నాడు. హైదరాబాద్‌లో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారంలో ఈ విషాదకర ఘటన జరిగింది. జీడిమెట్ల పోలీసుల కథనం ప్రకారం .. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇప్పకొమురయ్య, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్ద కొడుకు జీవన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. బెంగళూరులో స్థిరపడ్డాడు. చిన్న కొడుకు వెంకటేశ్ (40) కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగే. భార్య వర్షిణి (33) ఇద్దరు కుమారులు రిషికాంత్ (11), విహాంత్ (3)తో కలిసి మూడేళ్లుగా హైదరాబాద్‌లోని గాజులరామారంలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులపాలు..

వెంకటేశ్ కొంత కాలంగా ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు చేస్తున్నాడు. ఇందుకోసం సుమారు రూ.25 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు వివిధ లోన్ యాప్‌ల నుంచి రుణం తీసుకున్నాడు. కాగా లోన్ చెల్లించక పోవడంతో యాప్ నిర్వాహకుల ఒత్తిడి పెరిగింది. దీంతో వెంకటేశ్, వర్షిణి తీవ్రమనస్తాపానికి గురయ్యారు. ఎవరికైనా చెబితే పరువు పోతుందనుకుని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాము చనిపోతే పిల్లలను ఎవరూ చూసుకోరని భావించారు. దీంతో పిల్లలు, భార్యకు విషమిచ్చి, తర్వాత వెంకటేశ్ తాను ఉరేసుకున్నాడు. అంతకుముందు తండ్రికి ఫోన్ చేసి చనిపోతున్నట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీడిమెట్ల పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు పరిశీలించారు.

పిల్లలు అనాథలవుతారని..

ముందుగా వెంకటేశ్ దంపతులు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. అయితే తాము చనిపోతే పిల్లలు అనాథలవుతారని భావించారు. దీంతో ఇద్దరు కుమారులకు విషమిచ్చారు. అనంతరం వర్షిణి అదే విషం తాగి బెడ్‌పై పడిపోయింది. తర్వాత వెంకటేశ్ తాను ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నాడో సెల్ఫీ వీడియోలో వివరించాడు. అనంతరం ఉరేసుకున్నాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

● రాణీ కీ వావ్

పరిష్కరించలేని పజిల్



రాణీ కీ వావ్ గురించి తెలుసుకునే ముందు ఫొటోలను ఒకసారి పరిశీలించండి. ఏదైనా సినిమాలో చూసిన గుర్తు వస్తోందా? నిజమే, ఈ బావి మెట్ల మీద బాలీవుడ్ సినిమాల్లో పాటల చిత్రీకరణ జరుగుతుంది. ఇంకా ఏదైనా గుర్తుకు వస్తోందా? మన కరెన్సీ నోట్లను గుర్తుకు తెచ్చుకోండి. కొత్తగా వచ్చిన వయొలెట్ వంద రూపాయల నోటు వెనుక వైపు ఉండే బొమ్మ ఇదే. ఈ నిర్మాణం మీద ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధనలు చేసి చేసి సమగ్రమైన వివరాలను పొందుపరిచింది.

రాణి గారి బావి



వావ్ అంటే బావి. ఆ ఏడంతస్తుల బావి 64 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, 27 మీటర్ల లోతు ఉంటుంది. నాలుగవ అంతస్తు 23 మీటర్ల లోతు వద్ద ఉంటుంది. ఒక వైపు 9.5 మీటర్లు, మరో వైపు 9.4 మీటర్ల నిడివి ఉంటుంది. దీర్ఘచతురస్రాకార నిర్మాణం కింద అంతస్తులకు వెళ్లే కొద్దీ వలయాకారంగా ఉంటుంది. ముఖ్యంగా చెప్పుకోవాల్సింది శిల్పాల గురించి. ఒక మహిళ తన భుజం మీద పై కప్పును మోస్తున్నట్లు చెక్కిన శిల్పికి చేతులెత్తి మొక్కాల్సిందే. విష్ణుమూర్తి, రాముడు, కృష్ణుడు, నరసింహుడు, వామనుడు, అప్సరసలు, నాగకన్యలు, యోగిని, దేవతలు. వీటిలో పెద్ద విగ్రహాలు 500 ఉంటే, చిన్నవి వెయ్యి ఉన్నాయని ఏఎస్ఐ ఇటీవల నిర్ధారించింది. అప్పటి వరకు చిన్న విగ్రహాలు ఎనిమిది వందలు ఉండవచ్చనే అంచనా మాత్రమే ఉండేది. ఈ బావిలోకి దిగడం మొదలు పెట్టి కొన్ని మెట్లు దిగిన తర్వాత పైకి చూస్తే ఎక్కడ నుంచి మొదలయ్యామో, ఎటు నుంచి వెళ్తే మనం మొదలైన మెట్టును చేరుకుంటామో అర్థం కాదు. ఇదొక పజిల్. పరిశీలనగా చూస్తే కళ్లు తిరుగుతాయి తప్ప పజిల్‌కి పరిష్కారం దొరకదు. ఈ బావిలోకి దిగడం ఓ సాహసం. గైడ్ సహాయంతో ప్రయత్నించాలి. ఓసారి దిగిన తర్వాత ఎవరెస్టును ఎక్కినంత గొప్ప అనుభూతి కలుగుతుంది.

సరస్వతి నది తీరం


గుజరాత్‌లోని పఠాన్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలో సరస్వతి నది తీరాన ఉంది రాణీ కీ వావ్. ఏడు అంతస్థులలో ఏడు విశాలమైన వరండాలు, ఆ వరండాలకు ఆధారమైన స్తంభాల మీద అందమైన శిల్పాలు, చల్లటి గాలి... అన్నీ కలిసి ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. సాధారణంగా బావిలో దిగిన వాళ్లు ఆక్సిజెన్ తగినంత అందక, ఎక్కువ సేపు ఉండలేకపోతారు. ఈ బావి మెట్లు దిగి కిందికి వెళ్తున్నా ఎటువంటి అసౌకర్యమూ ఉండదు. విశాలమైన వరండాలు, స్తంభాల మధ్య నుంచి గాలి సులువుగా ప్రసరించేటట్లు ఉంటుంది నిర్మాణశైలి. నాలుగో అంతస్తు నుంచి మరొక బావి నుంచి అనుసంధానమై ఉంటుంది. ఈ పరిసరాల నుంచి ఓ పది అడుగుల దూరంలో ఎండ తీక్షణంగా ఉన్నప్పుడు కూడా దిగుడు బావి దగ్గర ఉష్ణోగ్రత ఇరవై డిగ్రీలకు మించదు. అప్పటి ఆర్కిటెక్టులకు నేచురల్ ఎయిర్‌కండిషనింగ్ టెక్నాలజీ ఏదో తెలిసే ఉంటుంది. ఇన్ని తెలిసిన తర్వాత ఈ స్టెప్‌వెల్‌లోకి దిగే ప్రయత్నం చేయకుండా ఉండలేం.



ఎప్పుడు వెళ్లాలి

అక్టోబరు నుంచి మార్చి వరకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఈ టూర్‌లో పటోలా చీరలు కొనడం మర్చిపోవద్దు. పఠాన్‌లో తయారయ్యే పటోలా చీరల మీద డిజైన్‌లు రాణీ కీ వావ్ స్తంభాల మీద చెక్కిన డిజైన్‌లను పోలి ఉంటాయి.

వెయ్యేళ్ల నాటి నిర్మాణం



ఈ ప్రదేశాన్ని సోలంకి రాజవంశం పాలించిన రోజుల్లో మొదటి భీమదేవుని జ్ఞాపకార్థం ఆయన భార్య రాణి ఉదయమతి క్రీ.శ 1050లో నిర్మించింది. సరస్వతి నదికి వచ్చిన వరదల్లో మునిగి శతాబ్దాల పాటు ఇసుక మేటలోనే ఉండిపోయింది. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తవ్వకాల్లో బయట పడిన ఈ బావిని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ జాబితాలో చేరింది. వందల ఏళ్లపాటు మట్టిలో ఉన్నప్పటికీ స్తంభాల మీద శిల్పాలు చెక్కు చెదరలేదు.

ఈ బావులు ఎందుకంటే...



గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భూగర్భ జలాలను రక్షించుకోవడానికి ఇలాంటి బావులు తవ్వుతారు. క్రీస్తు పూర్వం మూడు వేల ఏళ్ల నుంచి అనుసరిస్తున్న విధానం ఇది. విహారకేంద్రంగా కూడా మలుచుకుంటారు. ఎండాకాలంలో ఇవి చక్కటి వేసవి విడుదులు. మన తెలంగాణలో కూడా తవ్వకాల్లో ఇలాంటి బావులు బయటపడ్డాయి.

● నీటి అడుగున ఆర్ట్

కొలంబియన్ కళాకారులు అంతరించిపోతున్న పగడపు జీవులను, వాటి దిబ్బలను రక్షించడానికి నీటి అడుగున ఆర్ట్ గ్యాలరీని సృష్టించారు.

కొలంబియాలోని ఇస్లా ఫ్యూర్టే సముద్రం తీర ప్రాంతం పర్యాటకం, వాతావరణ మార్పుల వల్ల ఇక్కడి పగడపు దిబ్బలు అంతరించిపోనున్నాయి అనే నివేదికలు వచ్చాయి. పగడపు జీవరాశిపై పడుతున్న ప్రతికూల పరిస్థితులను దూరం చేస్తూ, ఆ పగడపు దిబ్బలను రక్షించడానికి, జీవరాశిని పెంపొందించడానికి ఒక వినూత్నమైన శిల్పకళా గ్యాలరీ అక్కడ అభివృద్ధి చెందుతోంది.





● కొలంబియాలోని ఇస్లా ఫ్యూర్టే సమీపంలోని సముద్రపు ఒడ్డున హ్యూగో ఒసోరియో, పెడ్రో ఫ్యూయెంటిస్‌లచే అసాధారణమైన శిల్పకళా గ్యాలరీ ఉద్భవించింది.

రక్షించే పగడపు ప్రతిమలు

ఆరు మీటర్ల లోతులో...

కరేబియన్ సముద్ర తీరంలో పర్యాటకం, వాతావరణ మార్పుల నుండి పగడపు దిబ్బలకు ఈ ఆర్ట్ ద్వారా రక్షణ కల్పిస్తున్నారు. హ్యూగో ఒసోరియో, పెడ్రో ఫ్యూయెంటిస్ చేత సృష్టించబడిన 25 బొమ్మలు కొలంబియా తీరంలో ఉన్న స్వర్గధామమైన ఇస్లా ఫ్యూర్టే సముద్రం చుట్టూ ఉన్న స్వచ్ఛమైన నీటిలో కొలువు తీర్చారు. ఈ కృత్రిమ పగడపు కళాకృతులు దాదాపు ఐదు అడుగుల పొడవుతో ఉన్నాయి. సముద్రపు తీరంలో దాదాపు ఆరు మీటర్ల లోతులో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

బతికించే ప్రయత్నం

ఫ్యాషన్ డిజైనర్, ద్వీప నివాసి అయిన టటియానా ఒరెగో ముస్జిఫ్ పేరుతో ఈ ఆర్ట్‌ను ప్రారంభించారు. 2018 నుండి 25 కృత్రిమ పగడపు విగ్రహాలను సముద్రపు నీటి అడుగులో ఉంచారు. మరో 25 పగడపు ప్రతిమలను ఉంచేలా ప్లాన్ చేస్తున్నారు. 'ద్వీపంలోని సహజమైన పగడపు దిబ్బలు అంతరించిపోవడం నేను గమనించాను. పగడపు జీవరాశి జీవితాన్ని రక్షించడానికి, మెరుగుపరచడానికి ఆర్ట్ ప్రాజెక్ట్‌లో అవకాశం ఉందని తెలుసుకున్నాను' అని ఒరెగో మీడియాకు తెలియజేశారు. ఒరెగో బంకమట్టి శిల్పాలను చిన్న చిన్న పగడాలతో విత్తనీకరణ జరిగేలా చేశారు. అవి పెరుగుతుండటం చూశారు. సముద్రంలో ఇలా జీవుల పెరుగుదలకు 'అనుకూలమైన ఉపరితలం'కు కొలంబియాలో ఏర్పడిన మొట్టమొదటి నీటి అడుగున ఆర్ట్ గ్యాలరీ ఇది' అని వివరిస్తున్నార.

'కోరల్ బ్లీచింగ్, పర్యాటకులు పగడపు దిబ్బలను పగలగొట్టడం వల్ల వాటికి నష్టం ఏర్పడుతుంది. ఈ దిబ్బలు జీవుల సమూహమని ప్రజలు అర్థం చేసుకోకపోవడమే ఈ నష్టానికి కారణం' అంటున్నారు ఒరిగో. 'ఇస్లా ఫ్యూర్టే గ్యాలరీకి సంవత్సరానికి 2,000 మంది సందర్శకులు వస్తుంటారు. ఇది సహజమైన పగడపు దిబ్బలను ఓవర్‌లోడ్ చేయకుండా పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యామ్నాయం అని చెప్పవచ్చు. మేం మా సంస్కృతిని కోల్పోకుండా దీనిని కొనసాగిస్తాం' అంటున్నారు ఇక్కడి ఆర్ట్ ప్రియులు.

అంతరాలను దూరం చేసే
ఇరుదేశాల నృత్యం



శాశ్వత్ జోషి

సోషల్ మీడియాలో మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్న భారతీయ శాస్త్రీయ నృత్యకారుడు శాశ్వత్ జోషి. ఇటీవల నైరుతి చైనాలోని యువాన్ ప్రావిన్స్‌కు చెందిన చైనీస్ జాతి మైనారిటీ డ్యాన్సర్ల సహకారంతో చేసిన వీడియోలను విడుదల చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించాడు.

'నాట్యానికి భాషా అవరోధాలను, సాంస్కృతిక భేదాలను అధిగమించగల శక్తి ఉంది. దేశాల మధ్య స్నేహం, అవగాహనను పెంపొందించడానికి ఒక ప్రత్యేకమైన సాధనం. నృత్యం ద్వారా మన సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలు, విలువల ను పంచుకోవచ్చు. సాంస్కృతిక అవగాహన, ప్రశంసలను నృత్యం ప్రోత్సహిస్తుంది' అంటాడు శాశ్వత్.



భారత్–చైనా దేశాల మధ్య సాంస్కృతిక అంతరాన్ని తొలగించే ప్రయత్నంలో...

స్నేహ బంధం

ప్రఖ్యాత భారతీయ నృత్యకారులు, గాయకులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులతో కూడిన ప్రతినిధి బృందం కొన్ని రోజుల క్రితం యువాన్ రాజధాని కున్మింగ్‌ను సందర్శించింది. వారు స్థానిక సాంస్కృతిక, కళాత్మక కమ్యూనిటీకి చెందిన వ్యక్తులతో సన్నిహిత పరస్పర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ ప్రదేశాలను సందర్శించారు. దీని వల్ల భారత– చైనా యువత మధ్య స్నేహభావాలను మెరుగుపరిచేందుకు కృషి చేశారు. ప్రతినిధి బృందంలో సభ్యునిగా ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించే ప్రయత్నాలలో సాంస్కృతిక అంతరాన్ని తగ్గించడంలో నృత్యం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంద'ని ఈ సందర్భంగా శాశ్వత్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు.

చైనా పర్యటన సందర్భంగా విడుదల చేసిన ఈ వీడియోలో ప్రదర్శించిన ఒడిస్సీ నృత్య రీతులు సంప్రదాయ–సమకాలీన అంశాల ఆకర్షణీయమైన కలయికను ప్రదర్శిస్తాయి. భారతీయ ఒడిస్సీ నృత్యంలో క్లిష్టమైన పాదాల కదలికలు, చేతి ముద్రలు, సూక్ష్మ ముఖ కవళికలు ఈ శాస్త్రీయ నృత్య రూపానికున్న విశిష్ట లక్షణాలు. చైనీస్ నృత్యంలో మనోహరమైన కదలికలు, విశిష్ట లక్షణాలను ప్రతిబించించే శక్తి ఉంటుంది. ఈ రెండు దేశాల సంప్రదాయ కళను చూపడం అదృష్టంగా భావిస్తున్నాను' అంటాడు శాశ్వత్.



దల్హౌసీ ఏరియల్ వ్యూ

మనదేశంలో ఉన్న హిల్ స్టేషన్‌లను హాలిడే స్పాట్‌లుగా గుర్తించింది బ్రిటిష్ వాళ్లే. వేసవి కోసం చల్లని ప్రదేశాలను వెతికే క్రమంలో బయటపడిన అందమైన ప్రదేశాల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని డల్హౌసీ ఒకటి. ఈ హిల్ స్టేషన్‌ని బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ గుర్తించిన కారణంగా ఈ ప్రదేశానికి అతడి పేరునే ఖరారు చేసేశారు. ఈ పట్టణం లార్డ్ డల్హౌసీ

● డల్హౌసీ

సుభాష్ చంద్రబోస్ విడిది

హయాంలో కాత్‌లాగ్, పోట్రేయస్, తెహ్రా, బక్రోటా, బలున్ అనే ఐదు కొండల మీద నిర్మించారు. మధ్యయుగం నాటి నిర్మాణ శైలిలో ఉన్న చర్చ్‌లు, దేవదారు, పైన్ వృక్షాలు, రంగుల పూలతో అందమైన ఉద్యానవనాన్ని తలపిస్తుంది. ఎత్తైన దౌలాధర్ పర్వత శ్రేణులు మీద విస్తరించిన దట్టమైన అడవులు, జలపాతాలతో అందంగా ఆహ్లాదంగా ఉంటుంది. ఇక్కడ అందమైన నిర్మాణాలంటే చర్చ్‌లే. నివాసాలన్నీ నిరాడంబరంగా మధ్య తరగతి జీవితానికి అద్దం పడుతుంటాయి. మనదేశంలో పుట్టి పాకిస్థాన్‌కు వెళ్లే రావి నది డల్హౌసీ పట్టణం మీదుగా ప్రవహిస్తుంది. ఈ వంతెన మీద విహరించి ఫొటోలు తీసుకుని తీరాలి. ఇక్కడి భౌతి ప్రజల ముఖకవళికలు, వస్త్ర ధారణ, ఆహారపు అలవాట్లు టిబెట్ వాసులను పోలి ఉంటాయి. సంస్కృతి పరంగా కూడా టిబెట్ ప్రభావం కనిపిస్తుంది. బౌద్ధావలంబకులు కావడంతో ప్రశాంతంగా జీవనం సాగిస్తుంటారు.

● బోస్ స్మారకం



ఆయన గుర్తుగా...

ఫ్రీడమ్ ఫైటర్ సుభాష్ చంద్రబోస్ కొద్ది నెలల పాటు డల్హౌసీలో నివసించారు. స్వాతంత్ర్య సమరంలో భాగంగా ఆయన కొంతకాలం అజ్ఞాతంలో ఉండడానికి ఈ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఆయన గుర్తుగా ఇక్కడ ఒక వీధికి సుభాష్ చౌక్ అని, ఒక నీటి సరస్సుకు సుభాష్ బావోలీ అని పేరు పెట్టారు. బావోలి పక్కనే ఆయన స్మారకం ఉంది. ఈ టూర్‌లో తప్పకుండా కొనాల్సినవి ఉలెన్ షాల్, చంబా రుమాలు. ఇక హిమాచల్ ప్రదేశ్ గిరిజన జాతుల సంప్రదాయ ఆభరణాలు, టిబెట్ వాళ్ల చేతిలో రూపుదిద్దుకున్న అందమైన హ్యాండీక్రాఫ్ట్స్‌ను ఈ టూర్‌కి గుర్తుగా తెచ్చుకుని ఇంట్లో అలంకరించుకోవచ్చు. మార్చి నుంచి సెప్టెంబరు వరకు వాతావరణం మనకు సౌకర్యంగా ఉంటుంది. ఉలెన్ దుస్తులు తప్పని సరి. ఇక్కడి ప్రజల భోతి భాష హిందీలా ధ్వనిస్తుంది. కానీ పదాలు హిందీతో సరిపోలదు. స్థానికులు హిందీ, ఇంగ్లిష్ నేర్చుకుని గైడ్‌లుగా ఉపాధి పొందుతుంటారు.

డల్హౌసీకి వెళ్లాలంటే... డల్హౌసీకి వంద కి.మీ.ల దూరంలో కాంగ్రాలోని గగ్గల్ ఎయిర్‌పోర్ట్ ఉంది. ట్రైన్‌లో వెళ్లాలనుకుంటే 90 కి.మీ.ల దూరంలో పఠాన్‌కోట్ ఉంది.

రూరల్ టూరిజం

మలుపు తిరిగిన చరిత్ర



● కప్పడ్ బీచ్

కప్పడ్ తీరం భారతదేశ చరిత్రను మాత్రమే కాదు, ప్రపంచ చరిత్ర అంతటినీ కొత్తగా రాసింది. పోర్చుగీసు నావికుడు వాస్కోడి గామా మనదేశంలో 1498లో కేరళ తీరంలో అడుగుపెట్టాడని చిన్నప్పుడెప్పుడో చదువుకున్నాం. ఆ తీరం పేరు కప్పడ్. ఈ గ్రామం కేరళ రాష్ట్రం, కోళికోడ్ (కాలికట్) పట్టణానికి 16 కి.మీ.ల దూరంలో ఉంది. ఇది చాలా ప్రశాంతమైన తీరం. బంగాళాఖాతంతో పోలిస్తే అరేబియా సముద్రం మంద్రంగా ఉంటుంది. బంగాళాఖాతం అలలతో పోలిస్తే అరేబియా సముద్రపు అలల తీవ్రత చాలా తక్కువ. సముద్రం మీద సూర్యోదయాన్ని చూడాలంటే బంగాళాఖాతం తీరానికి వెళ్లాలి. సముద్రం మీద సూర్యాస్తమయాన్ని చూడాలంటే అరేబియా తీరానికి వెళ్లాలి.




● వాస్కోడిగామా స్మారకం

వాస్కో డి గామా స్మారకం

వాస్కోడిగామా రాకతో కేరళ తీరం నుంచి యూరప్‌కి సుగంధ ద్రవ్యాల రవాణాకు మార్గం ఏర్పడడంతో వర్తక వాణిజ్యాలు పుంజుకున్నాయి. ఆ పరిణామం అనేక విపరిణామాలకు దారి తీసి మనదేశం వలస పాలకుల చేతిలో మగ్గాల్సి వచ్చింది. వాస్కో డి గామా రాకకు గుర్తుగా కప్పడ్ తీరంలో వాస్కోడి గామా స్మారకం ఉంది. చరిత్రను మలుపు తిప్పిన సంఘటన దగ్గర ఒక ఫొటో తీసుకోవడం మర్చిపోవద్దు.

అరిటాకులో చేప

కప్పడ్ తీరంలో జాలరులు చేపలు పట్టుకోవడాన్ని దగ్గరగా చూడవచ్చు. బీచ్ రిసార్టులు అధునాతనంగా ఉంటాయి. బీచ్ వ్యూ, సీ వ్యూ గదులను బుక్ చేసుకుంటే వెకేషన్ అద్భుతంగా ఉంటుంది. గది కిటికీ, బాల్కనీల నుంచి సముద్రం మీద నుంచి వచ్చే పిల్లగాలుల్ని, సూర్యాస్తమయాన్ని ఆస్వాదించవచ్చు. రిసార్టులు, రెస్టారెంట్లలో గ్లోబల్ మెనూ ఉంటుంది. కానీ కేరళ సంప్రదాయ చేపల వంటకాన్ని తప్పకుండా రుచి చూడాలి. తాజా చేప ముక్కలకు కొబ్బరి కారం పట్టించి అరిటాకులో చుట్టి ఆవిరి మీద ఉడికిస్తారు. ఒక్కసారి తింటే ఆ రుచి ఎప్పటికి గుర్తుంటుంది.



కేరళలో పరిస్థితి నార్మల్ అవుతోంది. వర్షాలు తగ్గుముఖం పట్టాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో టూర్ ప్లాన్ చేసుకోవచ్చు. కోళికోడ్‌లో ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్ ఉన్నాయి. ఇటీవల ప్రకృతి విలయానికి గురైన వయనాడుకు కోళికోడ్ మీదుగానే వెళ్లాలి.



● అరేబియా సముద్రం మీద సూర్యాస్తమయం

మధుబని చిత్రకళా రహస్యాలు

● పుస్తకం

మిథిలా కళారూపం అద్భుతానికి ఆవిష్కరణలా అనిపిస్తుంది. ఈ అద్భుతం వెనక దాగున్న రహస్యాన్ని 'ఎ 360 డిగ్రీ రివ్యూ ఆఫ్ మధుబని పెయింటింగ్స్' పుస్తకం ద్వారా మన కళ్లకు కడుతుంది.


మధుబని కళగా విస్తృతంగా పిలువబడే మిథిలా కళ క్లిష్టమైన చిత్రిక, లోతైన సాంస్కృతిక గొప్పతనాన్ని తెలియజేస్తుంది. భారతదేశం, నేపాల్‌లో కనిపించే ఈ సంప్రదాయ కళారూపం ప్రపంచవ్యాప్తంగా కళాకారులను ఆకర్షిస్తోంది. డా.ప్రశాంత్ దాస్ నిర్వహణలో బినితా మల్లిక్,



డా.మిను అగర్వాల్, డా.లారా జిజ్కా సంయుక్తంగా సంపాదకత్వం వహించిన ఈ పుస్తకం పండితులు, సాధారణ ఔత్సాహికులను నిశితంగా పరిశీలించేలా రూపొందించారు.

ఈ ప్రచురణ మిథిలా కళపై బహుముఖ దృక్కోణాలను అందిస్తుంది. ఇందులో ప్రపంచంలో మధుబని ఆర్ట్‌పై శోధించిన పండితులు, గౌరవనీయులైన మిథిలా కళాకారులూ ఉన్నారు. 2018లో స్విట్జర్లాండ్‌లో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ అమెరికా, ఫ్రాన్స్, భారతదేశంలోని పండితుల అధ్యయనాల ఆధారంగా రూపొందించారు.

ముంబైకి చెందిన శ్రేయా సర్దా నేతృత్వంలో డిజైన్ ఫ్లైవర్ (డిఎఫ్‌వో) బృందం 'ఎ 360 డిగ్రీ రివ్యూ ఆఫ్ మధుబని పెయింటింగ్స్' పుస్తకానికి విజువల్ ఎక్సలెన్స్‌ను అందించింది. టెక్స్ట్, ఇలస్ట్రేషనల్ ద్వారా ఆకర్షణీయమైన కథనాన్ని దృశ్యంగా తీసుకువచ్చింది. ఈ విధంగా మిథిలా కళ వివిధ కోణాలను పరిశోధించే అంతర్దృష్టిని ఈ పుస్తకం స్పష్టం చేస్తుంది.



డబ్బే లక్ష్యంగా జరిగే
ఏ వ్యాపారమైనా విజయవంతం కాదు
- హెన్రీ ఫోర్డ్, అమెరికన్ వ్యాపార దిగ్గజం

బిజినెస్ రీల్

ఆగస్టులో విద్యుత్ వినియోగం డౌన్

- 4.7 శాతం క్షీణతతో 144.2 బిలియన్ యూనిట్లు



న్యూఢిల్లీ: విద్యుత్ వినియోగం ఆగస్ట్ నెలకు 144.21 బిలియన్ యూనిట్లుగా (ఒక బిలియన్ 100 కోట్లకు సమానం) నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో వినియోగం 151.32 బిలయన్ యూనిట్లతో పోల్చి చూస్తే 4.7 శాతం తగ్గింది. వర్షాలు సాధారణం కంటే ఎక్కువగా ఉండడం వల్ల వినియోగం తగ్గినట్టు తెలుస్తోంది. దీని కారణంగా ఏసీలు తదితర ఉత్పత్తుల వినయోగం తగ్గినట్టు నిపుణులు చెబుతున్నారు. ఒక రోజులో గరిష్ట డిమాండ్ (పీక్) సైతం ఆగస్టులో 216.68 గిగావాట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఆగస్టులో గరిష్ట రోజువారీ డిమాండ్ 236.29 గిగావాట్ల కంటే తక్కువే. ఈ ఏడాది మే నెలలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 250 గిగావాట్లకు చేరడం గమనార్హం. వాణిజ్య, పారిశ్రామిక వినియోగం దన్నుతో రానున్న రోజుల్లో విద్యుత్‌కు డిమాండ్ స్థిరంగా కొనసాగుతుందని అంచనా.

ఏటీఎఫ్ ధర 5 శాతం కట్..




న్యూఢిల్లీ: వరుసగా రెండు నెలల పాటు పెరిగిన విమాన ఇంధన ధరలు (ఏటీఎఫ్) తాజాగా 4.6 శాతం తగ్గాయి. అయితే, 19 కేజీల వాణిజ్య సిలిండర్ల ధర రూ. 39 మేర పెరిగింది. ప్రభుత్వ రంగ ఇంధన రిటైల్ సంస్థలు ఈ మేరకు ధరలను సవరించాయి. వీటి ప్రకారం ఏటీఎఫ్ రేటు న్యూఢిల్లీలో కిలోలీటరుకు రూ. 4,495.50 తగ్గి రూ. 93,480.22కి చేరింది. ముంబైలో ధర రూ. 91,650.34 నుంచి రూ. 87,432.78కి తగ్గింది. స్థానిక పన్నుల్లో మార్పుల ప్రకారం రాష్ట్రాన్ని బట్టి ఏటీఎఫ్ రేటు మారుతుంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో 40 శాతం వాటా ఏటీఎఫ్‌దే ఉంటుంది కాబట్టి ధర తగ్గదలతో వాటిపై ఆర్థిక భారం కొంత తగ్గుతుంది. మరోవైపు, తాజా పెంపుతో హోటళ్లలో ఉపయోగించే వాణిజ్య సిలిండర్ ధర ముంబైలో రూ. 1,644కి, కోల్‌కతాలో రూ. 1,802.50కి, చెన్నైలో రూ. 1,855కి చేరింది. పెట్రోల్, డీజిల్‌తో పాటు ఇళ్లల్లో ఉపయోగించే వంట గ్యాస్ రేట్లలో ఎలాంటి మార్పూ లేదు. అంతర్జాతీయ పరిణామాలు, రూపాయి మారకం రేటును బట్టి ప్రభుత్వ రంగ ఇంధన మార్కెటింగ్ సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ప్రతి నెలా ఒకటో తేదీన ఏటీఎఫ్, వంట గ్యాస్ ధరలను సవరిస్తాయి.

లాభాలు కొనసాగే వీలు

అంతర్జాతీయ పరిణామాలు, ఆర్థిక గణాంకాలు కీలకం

విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లపైనా దృష్టి • ఈ వారం మార్కెట్‌పై నిపుణుల అంచనా



దేశీయ స్టాక్ సూచీల లాభాలు ఈ వారమూ కొనసాగొచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనా వార్తలు ఈక్విటీ మార్కెట్లను ముందుకు నడిపించవచ్చంటున్నారు. ఆయా దేశాల స్థూల ఆర్థిక గణాంకాలు, అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ ఇన్వెస్టర్ల క్రయ విక్రయాలు దలాల్ స్ట్రీట్‌కు దిశానిర్దేశం చేస్తాయంటున్నారు. వీటితో పాటు డాలర్ మారకంలో రూపాయి విలువ, క్రూడాయిల్ కదలికలను ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించే వీలుందంటున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

"అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ రిజర్వ్ ద్రవ్య పాలసీ సమావేశం సెప్టెంబర్ 17–18 జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఫెడ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే యూఎస్ తయారీ రంగ, నిరుద్యోగ రేటు, వ్యవసాయేతర పేరోల్ గణాంకాలను ఇన్వెస్టర్లు క్షుణ్ణంగా పరిశీలించవచ్చు. లాభాలు కొనసాగితే నిఫ్టీ ఎగువ స్థాయిలో 25,500 స్థాయిని పరీక్షించవచ్చు. గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంటే 25,000 వద్ద తక్షణ మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే 24,900 వద్ద మరో మద్దతు ఉంది" అని మెహ్తా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే తెలిపారు.

యూఎస్ ద్రవ్యోల్బణం, నిరుద్యోగ క్లెయిమ్స్ తగ్గడంతో పాలసీ సర్దుబాట్లకు సమయం ఆసన్నమైందంటూ ఫెడ్ చైర్మన్ పావెల్ వ్యాఖ్యలతో గతవారం సూచీలు ఒకటిన్నర శాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సైతం సెంటిమెంట్‌ను బలపరిచాయి. ముఖ్యంగా విస్తృత స్థాయి మార్కెట్లో చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. సెన్సెక్స్ 1,280 పాయింట్లు, నిఫ్టీ 413 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.

స్థూల ఆర్థిక గణాంకాల ప్రభావం

దేశీయ ఆటో కంపెనీల ఆగస్టు వాహన విక్రయ గణాంకాల వెల్లడి కారణంగా ఆటో రంగ షేర్లలో కదలికలు గమనించవచ్చు. ఇవాళ(సోమవారం) భారత్ పాటు చైనా, యూరోజోన్‌లు ఆగస్టు తయారీ రంగ పీఎంఐ డేటాను విడుదల చేయనున్నాయి. అమెరికా ఆగస్టు తయారీ రంగ, వాహన విక్రయ డేటాను మంగళవారం ప్రకటించనుంది. దేశీయ సేవారంగ పీఎంఐ గణాంకాలు బుధవారం(సెప్టెంబర్ 4న) విడుదల అవుతాయి. ఆగస్టు 31తో ముగిసిన వారం బ్యాంకు రుణాలు, డిపాజిట్ల వృద్ధి గణాంకాలు, ఆగస్టు 24తో ముగిసిన వారం ఫారెక్స్ నిల్వలను ఆర్‌బీఐ శుక్రవారం(సెప్టెంబర్ 6న) విడుదల చేస్తుంది. ఇదే వారాంతాపు రోజున యూరోజోన్ జూన్ క్వార్టర్ జీడీపీ అంచనా డేటా, అమెరికా నిరుద్యోగ రేటు, వ్యవసాయేతర పేరోల్ గణాంకాలను వెల్లడి కానున్నాయి. ఆయా దేశాల ఆర్థిక స్థితిగతులను ప్రతిబింబిపజేసే ఈ స్థూల ఆర్థిక గణాంకాలు ఈక్విటీ మార్కెట్ల ట్రేడింగ్‌ను ప్రభావితం చేయగలవు.

ఆగస్టులో రూ.7,320 కోట్ల అమ్మకాలు

విదేశీ ఇన్వెస్టర్లు ఆగస్టులో రూ.7,320 కోట్ల విలువైన భారత ఈక్విటీలను విక్రయించారు. అధిక వాల్యుయేషన్ ఆందోళనలతో పాటు జపాన్ వడ్డీరేట్ల పెంపుతో యెన్ ఆధారిత ట్రేడింగ్ భారీగా తగ్గడం ఇందుకు ప్రధాన కారణాలు. ఆగస్టులో అమెరికా ఆర్థిక మాంద్య భయాలు, బలహీన స్థూల ఆర్థిక గణాంకాల నమోదు కూడా విదేశీ ఇన్వెస్టర్లను నిరాశపరిచాయి. అయితే జూలైలో రూ.32,365 కోట్లు, జూలైలో రూ.26,565 కోట్ల విక్రయాలతో పోలిస్తే ఇది తక్కువ కావడం విశేషం. ఇదే నెలలో డెట్ మార్కెట్లో రూ.17,960 కోట్ల పెట్టుడులు పెట్టారు. "ఎఫ్‌ఐలు సెప్టెంబర్‌లో కొనుగోళ్లు చేపట్టే వీలుంది. దేశీయ రాజకీయ స్థిరత్వం, స్థూల ఆర్థిక గణాంకాలు, ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపు, మార్కెట్ వాల్యుయేషన్‌లు, రంగాల ప్రాధాన్యత, డెట్ మార్కెట్ ఆకర్షణ అంశాలు విదేశీ ఇన్వెస్టర్ల క్రయ, విక్రయాలపై ప్రభావం చూపొచ్చు" అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ వీకే విజయకుమార్ తెలిపారు.

బజాజ్ హౌసింగ్ ఐపీవో 9న ప్రారంభం



న్యూఢిల్లీ: బజాజ్ ఫైనాన్స్ అనుబంధ సంస్థ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఈ నెల 9న ప్రారంభం కానుంది. 11వ తేదీన ముగుస్తుంది. ఈ ఐపీవో ద్వారా రూ.6,560 కోట్లను సమీకరించే లక్ష్యంతో కంపెనీ ఉంది. ఇందులో తాజా ఈక్విటీ షేర్ల జారీ రూపంలో రూ.3,560 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో రూ.3,000 కోట్ల విలువ చేసే షేర్లను బజాజ్ ఫైనాన్స్ విక్రయించనుంది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలు 2025 సెప్టెంబర్ నాటికి స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్ట్ కావాలన్న ఆర్‌బీఐ నిబంధనలకు లోబడి ఈ ఐపీవోను బజాజ్ ఫైనాన్స్ చేపట్టడం గమనార్హం.

హైదరాబాద్–గౌహతి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కొత్తగా హైదరాబాద్–గౌహతి మధ్య రోజువారీ డైరెక్ట్ సర్వీసులు ప్రారంభించింది. దీనికి సంబంధించి ఫ్లైట్లు హైదరాబాద్‌లో ఉదయం 7.15 గం.లకు, గౌహతిలో మధ్యాహ్నం 1.15 గం.లకు ప్రారంభమవుతాయి. మరోవైపు, విజయవాడ–బెంగళూరు రూట్లో కూడా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రోజువారీ డైరెక్ట్ ఫ్లైట్స్‌ను ప్రారంభించింది.

ఆగస్టు ఆటో అమ్మకాలు అంతంతే..

వరుసగా రెండోనెలా తగ్గుముఖం



ముంబై: దేశీయంగా వాహన విక్రయాలు వరుసగా రెండో నెలా డీలా పడ్డాయి. వినియోగదారుల నుంచి డిమాండ్ తగ్గడంతో ఆటో కంపెనీలు డీలర్లకు వాహన పంపిణీ(డిస్పాచ్) తగ్గించాయి. దీంతో ఈ ఆగస్టులో ఆటో అమ్మకాలు అంతంత మాత్రంగా జరిగాయి. మొత్తం 3,500,00 కార్లు అమ్ముడయ్యాయని పరిశ్రమ అంచనా. గతేడాది ఇదే ఆగస్టులో అమ్ముడైన 361,123 యూనిట్లతో పోలిస్తే ఇవి 3% తక్కువగా ఉన్నాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ విక్రయాలు క్షీణించాయి. టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్, కియా మోటార్స్ అమ్మకాలు పెరిగాయి. అయితే ద్విచక్ర వాహనాలకు డిమాండ్ కొనసాగడంతో ఈ విభాగపు అమ్మకాల్లో వృద్ధి నమోదయ్యాయి. వినాయక చవితి (సెప్టెంబర్ 7న)తో పండుగ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అమ్మకాలు పుంజుకునే వీలుందని కార్ల తయారీ సంస్థలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

గత నెల వాహన విక్రయాలు ఇలా..

కంపెనీ	ఆగస్టు 2024	ఆగస్టు 2023	(%ల్లో)
మారుతీ సుజుకీ	1,81,782	1,89,082	(–)4
హ్యుందాయ్ మోటార్స్	63,175	71,435	(–)12
టాటా మోటార్స్	71,693	78,010	(–)8
హోండా కార్స్	11,143	10,069	(+)11
ఎంజీ మోటార్స్	4,571	4,185	(+)9
టయోటా కిర్లోస్కర్	30,879	22,910	(+)35
కియా మోటార్స్	22,523	19,219	(+)17
ద్విచక్ర వాహనాలు			
హీరో మోటోకార్ప్	5,12,360	4,88,717	(+)5
టీవీఎస్ మోటార్స్	3,91,588	3,45,848	(+)13
రాయల్ ఎన్‌ఫీల్డ్	73,630	77,583	(–)5

యాప్‌లకు కూడా గోప్యతా నిబంధనలు అమలు చేయాలి..

- కేంద్రానికి సీవోఏఐ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: వాట్సాప్, టెలిగ్రాం, గూగుల్ మీట్ తదితర కాలింగ్, మెసేజింగ్ యాప్‌లక కూడా టెల్కోలతో సమానంగా ట్రేసబిలిటీ, యూజర్ వివరాల గోప్యతా నిబంధనలు అమలు చేయాలని టెలికం సంస్థల సమాఖ్య సీవోఏఐ కేంద్రాన్ని కోరింది. మెసేజింగ్‌కు సంబంధించి సింహభాగం ట్రాఫిక్.. ఎస్‌ఎంఎస్ నుంచి డేటా నెట్‌వర్క్‌కు మారిన నేపథ్యంలో స్పామ్, అక్రమ కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ఇది తోడ్పడగలదని పేర్కొంది. మెసేజీ ప్రారంభ స్థానాన్ని గుర్తించగలిగేలా నవంబర్ 1 నుంచి ట్రేసబిలిటీని పెంచాలంటూ ఆపరేటర్లను టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ ఆదేశించిన నేపథ్యంలో సీవోఏఐ డిమాండ్ ప్రాధాన్యం సంతరించుకుంది. రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తదితర సంస్థలు సీవోఏఐలో ఉన్నాయి.

ఫైనాన్షియల్, రియల్టీ నుంచే ఎక్కువగా స్పామ్ కాల్స్

- లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: మొబైల్ యూజర్లకు వచ్చే అవాంఛిత (స్పామ్) కాల్స్‌లో ఎక్కువ భాగం కాల్స్ ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్ రంగ సంస్థల నుంచే ఉంటున్నాయి. ఆన్‌లైన్ సర్వే సంస్థ లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన సర్వే ప్రకారం 95 శాతం మంది మొబైల్ యూజర్లు తమకు రోజూ ఇలాంటి కాల్స్ వస్తాయని, 77 శాతం మంది రోజుకు కనీసం 3 పైగా కాల్స్ వస్తాయని వెల్లడించారు. సర్వేలో పాల్గొన్న 17,380 మందిలో 88 శాతం మంది గత 12 నెలలుగా తమకు ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్ రంగాల నుంచి అత్యధికంగా స్పామ్ కాల్స్ వస్తున్నట్లు వెల్లడించారు. అటు టెలికం రంగ నియంత్రణ సంస్థ ప్రవేశపెట్టిన డు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) లిస్టులో నమోదు చేసుకున్నా గత 12 నెలలుగా అవాంఛిత కాల్స్ వస్తూనే ఉన్నాయని 96 శాతం మంది తెలిపారు. ఆరు నెలల క్రితం ఇలా చెప్పిన వారి సంఖ్య 90 శాతంగా నమోదైంది. సర్వే ప్రకారం చాలా మటుకు అవాంఛిత కాల్స్ వ్యక్తిగత నంబర్ల నుంచి వస్తున్నాయని 66 శాతం మంది చెప్పారు. కంపెనీలు, బ్రాండ్స్ నుంచి ఎక్కువగా కాల్స్ వస్తున్నాయని 18 శాతం మంది తెలిపారు. ఈ సర్వేకు సంబంధించి దేశీయంగా 371 జిల్లాల నుంచి 71,000 పైచిలుకు సమాధానాలు వచ్చాయి.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల మార్గదర్శకాల సవరణ

దీనిపై దృష్టి సారించిన ఆర్థిక శాఖ • బ్యాలన్స్ షీట్ల బలోపేతంతో మళ్లీ సమీక్ష



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల (సీపీఎస్‌ఈ) డివిడెండ్ చెల్లింపులు, బోనస్ ఇష్యూలు, బైబ్యాక్‌లకు సంబంధించిన మార్గదర్శకాలను సర్కారు సమీక్షించనుంది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల మెరుగైన నిర్వహణ లక్ష్యంతో కేంద్ర ఆర్థిక శాఖ 2016లో వీటికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది. నాటి నుంచి చూస్తే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల బ్యాలన్స్ షీట్లు ఇప్పుడు మరింత బలోపేతం అవ్వడమే కాకుండా, వాటి మార్కెట్ విలువ సైతం గణనీయంగా వృద్ధి చెందింది. దీంతో మూలధన పునర్వ్యవస్థీకరణ మార్గదర్శకాల సమీక్షపై ఆర్థిక శాఖ దృష్టి సారించినట్టు ఓ అధికారి తెలిపారు. ఈ నెలలోనే సవరించిన మార్గదర్శకాలు విడుదల అవుతాయని చెప్పారు. గతంలో జారీ చేసిన మార్గదర్శకాల కింద.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ఏటా తమ పన్ను అనంతరం లాభాల్లో 30 శాతం లేదా తమ నెట్‌వర్త్ (నికర విలువ)లో 5 శాతాన్ని డివిడెండ్ కింద చెల్లించాల్సి ఉంటుంది. నికర విలువ కనీసం రూ.2,000 కోట్లు, నగదు/బ్యాంక్ బ్యాలన్స్ రూ.1,000 కోట్లు ఉన్న కంపెనీలు బైబ్యాక్ కూడా చేపట్టాల్సి ఉంటుంది. చెల్లించిన మూలధనం కంటే మిగులు నిల్వలు 10 రెట్లు చేరితే బోనస్ షేర్లను కూడా జారీ చేయాలి. షేరు ముఖ విలువ కంటే మార్కెట్ ధర లేదా పుస్తక విలువ 50 రెట్లు చేరితే స్టాక్ విభజన చేపట్టాలని మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి.

మార్కెట్ విలువలో గణనీయమైన వృద్ధి

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంక్‌లు, బీమా సంస్థల మార్కెట్ విలువ గత మూడేళ్లలో రూ.15 లక్షల కోట్ల నుంచి రూ.58 లక్షల కోట్లకు చేరుకోవడం గమనార్హం. నగదు నిల్వలు దండిగా కలిగిన ప్రభుత్వరంగ సంస్థలు డివిడెండ్‌లు చెల్లించాల్సి ఉంటుందని.. దీంతో ఈ స్టాక్స్ పట్ల ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తారంటూ మార్గదర్శకాల సవరణ ఉద్దేశ్యాన్ని ఆ అధికారి వివరించారు.

ఏ స్థిరాస్తి అమ్మినా ఇల్లు కొనుక్కోవచ్చా..

గత వారం కొత్త ఇల్లు సకాలంలో కొనుక్కుంటే లభించే పన్ను ప్రయోజనాల గురించి తెలుసుకున్నాం. ఇళ్లు కొనుక్కుంటే పన్ను ఏమాత్రం చెల్లించనవసరం లేదు. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం రెండు సెక్షన్లు, 54 అలాగే 54ఎఫ్ ఈ విషయాల్ని ప్రస్తావించాయి. ఈ సెక్షన్ల ప్రకారం ఇల్లు కొంటే పన్ను మినహాయింపు ఉన్నప్పటికీ ప్రాథమిక అంశాల్లో చాలా తేడాలున్నాయి. అవి ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

1. సెక్షన్ 54 ఎప్పుడు వర్తిస్తుంది అంటే మీకు ఉన్న ఇల్లు (పాతది) అమ్మినప్పుడు ఏర్పడ్డ మూలధన లాభాలతో కొత్త ఇంటిని కొంటే వర్తిస్తుంది. అంటే ఇల్లు అమ్మి, ఇల్లు కొనడం అన్నమాట. 54ఎఫ్ సెక్షన్ ప్రకారం మీ ఇల్లు అమ్మితే ఎటువంటి ప్రయోజనం రాదు. మీరు అమ్మే క్యాపిటల్ అసెట్ ఇల్లు తప్ప మిగిలింది ఏదైనా కావాలి. అంటే జాగా, షేర్లు, బంగారం మొదలైనవి. 54ఎఫ్ ప్రయోజనం పొందాలంటే ఇల్లు అమ్మకుండా ఇతర ఆస్తుల అమ్మకంతో ఏర్పడ్డ లాభాలతో ఇల్లు కొనాలి.
2. సెక్షన్ 54 ప్రకారం కేవలం మూలధన లాభాలు పెట్టి కొత్త ఇల్లు కొంటే మినహాయింపు దొరుకుతుంది. ఉదాహరణకు మీరు రూ. 40 లక్షలు పెట్టి కొన్న ఇల్లు రూ. 90 లక్షలకు అమ్మగా ఏర్పడ్డ లాభం రూ. 50 లక్షలు. ఈ రూ. 50 లక్షలతో కొత్త ఇల్లు కొంటే సరిపోతుంది. కానీ 54ఎఫ్ ప్రకారం మీకు చేతికొచ్చిన మొత్తం ప్రతిఫలంతో కొనాలి. ఉదాహరణకు బంగారం రూ. 40 లక్షలకు కొని రూ. 1 కోటికి అమ్మారు.. ఇప్పుడు లాభంతో నిమిత్తం లేకుండా మొత్తం ప్రతిఫలం వెచ్చించి ఇల్లు కొనాలి. ఇది చాలా ముఖ్యమైన విషయం. మీ ఫైనాన్షియల్ ప్లానింగ్‌తో ముడిపడి ఉంది. 54లో కన్నా 54ఎఫ్ ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టాలి. బైటకు పోయే మొత్తం ఎక్కువ.
3. 54 ప్రకారం కొనే ఇంటి మీద ఎటువంటి ఆర్థిక ఆంక్షలు లేవు. ఎంత మొత్తం అయినా ఖర్చు పెట్టొచ్చు. అఫ్‌కోర్సు మీకు "సోర్స్" వైట్ రూపంలో ఉండాలి. బ్లాక్ నడవదు. 54ఎఫ్ ప్రకారం కొత్త ఇల్లు ధర రూ. 10 కోట్లు దాటకూడదు. పది కోట్లు దాటితే మొత్తం మీద మినహాయింపు ఇవ్వరు.
4. ఇల్లు కొనే నాటికి మీకు ఇల్లు ఉండకూడదు. 54ఎఫ్ కేవలం ఇల్లు కొనడానికే ప్రోత్సాహకంగా పెట్టారు. అంతేకాకుండా మొట్టమొదటిసారి ఇల్లు కొనేవారికే అనుకూలించేలా పెట్టారు. 54 ప్రకారం ఎటువంటి పరిమితులు, ఆంక్షలు లేవు. అన్ని రూల్స్ ఫాలో అయితే ఇల్లు కొనడం–అమ్మడంలో లబ్ధి పొందవచ్చు.
5. 54ఎఫ్ ప్రకారం ఆస్తి అమ్మిన తేదీ నుంచి ఏడాది ముందు, అలాగే రెండు సంవత్సరాల్లోపల కొనుక్కోవచ్చు. లేదా అమ్మిన తేదీ నుంచి 3 సంవత్సరాల్లోపల కట్టుకోవచ్చు. 54లో ఇటువంటి ఆంక్షలు లేవు.

మిగతా విషయాల ప్రస్తావనకొస్తే.. ఈ రెండు సెక్షన్లు వ్యక్తులకు, హిందూ ఉమ్మడి కుటుంబాలకు వర్తిస్తాయి. రూల్స్ మేరకు రెండింటికీ క్యాపిటల్ గెయిన్స్ అకౌంటు రేటు వర్తిస్తుంది. సకాలంలో జాగా కొని ఇల్లు కట్టుకున్నా ప్రయోజనం ఉంటుంది. అయితే, గుర్తుంచుకోవాల్సిన ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే సెక్షన్ 54 ప్రయోజనం, 54ఎఫ్ ప్రయోజనం పరస్పరం ప్రత్యేకమైనవి. ఒక దానికొకటి అడ్డుపడదు. కానీ 54ఎఫ్ ప్రయోజనం .. 54 ప్రయోజనాన్ని ప్రభావితం చేస్తుంది. 54 ప్రకారం ఇల్లు అమ్మితే ఇల్లు కొనుక్కోవచ్చు. బాండ్లలో పెట్టుకోవచ్చు. రెండింటిలోనూ వెచ్చించవచ్చు. వృత్తి నిపుణుల సహాయం తీసుకుని, ఆలోచించండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మిడ్‌క్యాప్‌లో మెరుగైన అవకాశాలు

- మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్

దీర్ఘకాల లక్ష్యాలకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన ఆప్షన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. మరీ ముఖ్యంగా దీర్ఘకాలంలో మెరుగైన సంపద సృష్టించాలని కోరుకునే వారు నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ విభాగంలో పెట్టుబడికి తక్కువ పథకాలే అందుబాటులో ఉన్నాయి. అందులో మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్ ఒకటి. ఇన్వెస్టర్లు తమ వెసులుబాటుకు అనుగుణంగా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) లేదా లంప్‌సమ్ రూపంలోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



రాబడులు

మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్ 2019 సెప్టెంబర్‌లో మొదలైంది. గడిచిన ఏడాది కాలంలో అసాధారణ స్థాయిలో 50 శాతం రాబడినిచ్చింది. మరీ ముఖ్యంగా మిడ్‌క్యాప్ షేర్ల ర్యాలీ ఈ పథకం లాభాల్లో ప్రతిఫలిస్తోంది. మూడేళ్లలో ఏటా 27.55 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. ఆరంభం నుంచి చూసుకుంటే వార్షిక రాబడి రేటు 32 శాతంగా ఉంది. నిఫ్టీ 100తో పోల్చి చూస్తే నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ పరిమిత రిస్క్‌తోనే రోలింగ్ రాబడులు అధికంగా ఇస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు. యాక్టివ్ ఫండ్స్‌తో పోలిస్తే ఇండెక్స్ ఫండ్స్ దీర్ఘకాలంలో మెరుగైన ఆప్షన్ అవుతుంది. వీటిల్లో ఫండ్స్ సంస్థలు వసూలు చేసే చార్జీలు తక్కువగా ఉంటాయి. దీంతో ఇన్వెస్టర్లకు రాబడులు మెరుగవుతాయి. దీర్ఘకాలంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్స్ మంచి రాబడులను ఇస్తాయి. కానీ, అదే సమయంలో అధిక రిస్క్ కూడా ఉంటుంది. కరెక్షన్లలో ఎక్కువ విలువను కోల్పోవడం ఈ విభాగంలో గమనించొచ్చు. అందుకని రిస్క్ భరించే సామర్థ్యంతో ఉన్న వారు, కనీసం 7–10 ఏళ్ల కాలానికి ఈ విభాగాన్ని పరిశీలించొచ్చు. అయితే, ఈ పథకం కేవలం మిడ్‌క్యాప్ ఒక్కటే కాకుండా, లార్జ్‌క్యాప్‌కూ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రిస్క్ తక్కువగా ఉంటుందని గమనించొచ్చు.



పెట్టుబడులకు విధానం

ప్రతీ ఇన్వెస్టర్ ఈక్విటీ పెట్టుబడుల్లో లార్జ్‌క్యాప్‌తోపాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ కంపెనీలకూ చోటు కల్పించుకోవాలి. తద్వారా రిస్క్ సర్దుబాటుతో అధిక రాబడులు సమకూర్చుకోవడం సాధ్యపడుతుంది. టాప్–100 కంపెనీల తదుపరి 150 కంపెనీల్లో ఈ పథకం ప్రధానంగా ఇన్వెస్ట్ చేస్తుంది. తమ పనితీరుతో చిన్న కంపెనీల నుంచి మధ్యస్థ స్థాయికి ఎదిగిన ఇవి.. దీర్ఘకాలంలో లార్జ్‌క్యాప్ కంపెనీలుగానూ అవతరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇది ఇన్వెస్టర్ల రాబడులను ఇతోధికం చేస్తుంది. మార్కెట్ విలువ పరంగా 101 నుంచి 250 వరకు వరుసలో ఉన్న కంపెనీలు మిడ్‌క్యాప్ విభాగం కిందకు వస్తాయి. మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు.. నిఫ్టీ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫండ్స్‌కు మధ్య వ్యత్యాసాన్ని గమనించినట్టయితే.. నిఫ్టీ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫండ్స్ ఒకే రంగానికి, ఒకే స్టాక్‌కు ఎక్కువ కేటాయింపులు చేయవు. దీంతో రిస్క్‌ను వైవిధ్యం చేసుకున్నట్టు అవుతుంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
సుజ్లాన్ ఎనర్జీ	2.17
మ్యాక్స్ హెల్త్‌కేర్	2.01
ఇండియన్ హోటల్స్	1.64
కమిన్స్ ఇండియా	1.54
పర్సిస్టెంట్ సిస్టమ్స్	1.49
యస్ బ్యాంక్	1.42
ఫెడరల్ బ్యాంక్	1.41
సీజీ పవర్	1.39
లుపిన్	1.36
డిక్సన్ టెక్నాలజీస్	1.35

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.1878 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 99.86 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసి ఉంది. ఇందులో 41 శాతం పెట్టుబడులు లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫండ్ అయినప్పటికీ లార్జ్‌క్యాప్‌కు ఈ స్థాయి కేటాయింపులతో రిస్క్‌ను తగ్గించే విధానాన్ని అనుసరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక మిడ్ క్యాప్ కంపెనీలకు 59 శాతం కేటాయింపులు చేసింది. రిస్క్ దృష్ట్యా స్మాల్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేయలేదు. పోర్ట్‌ఫోలియోలో 150 స్టాక్స్ ఉన్నాయి. అత్యధికంగా 21 శాతం పెట్టుబడులను ఇండస్ట్రియల్స్ కంపెనీలకు కేటాయించింది. ఆ తర్వాత 17 శాతం మేర ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో, కన్జ్యూమర్ డిస్క్రీషినరీలో 14.39 శాతం, మెటీరియల్స్‌లో 13 శాతం, హెల్త్‌కేర్‌లో 10.52 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఫెరారీ సవారీ



లెక్‌లెర్క్

- ఇటాలియన్ గ్రాండ్‌ప్రి టైటిల్ నెగ్గిన లెక్‌లెర్క్
- ఐదేళ్ల తర్వాత సొంతగడ్డపై ఫెరారీకి దక్కిన విజయం
- లాండో నోరిస్‌కు మూడో స్థానం
- ఆరో స్థానంతో వెర్‌స్టాపెన్ సంతృప్తి

ఫార్ములావన్ ఇటాలియన్ గ్రాండ్‌ప్రిలో ఫెరారీ రేసర్ చార్లెస్ లెక్‌లెర్క్ టైటిల్ గెలుచుకున్నాడు. నాలుగో స్థానం నుంచి రేసును ప్రారంభించిన ఫెరారీ డ్రైవర్.. వాయువేగంతో ముందుకు సాగి అగ్రస్థానం దక్కించుకున్నాడు. గత వారం డచ్ గ్రాండ్‌ప్రి టైటిల్ దక్కించుకున్న లాండో నోరిస్ మూడో స్థానంతో సరిపెట్టుకోగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో ‘టాప్’లో ఉన్న వెర్‌స్టాపెన్ ఆరో స్థానానికే పరిమితమయ్యాడు.

మోంజా (ఇటలీ): ఫార్ములావన్ సీజన్ 16వ రేసు ఇటాలియన్ గ్రాండ్‌ప్రిలో ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ప్రధాన రేసులో లెక్‌లెర్క్ అందరికంటే ముందుగా నిర్ణీత 53 ల్యాప్‌లను 1 గంటా 14 నిమిషాల 40.727 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. ఫెరారీ జట్టు ప్రధాన కేంద్రమైన ఇటలీలో ఆ జట్టుకు టైటిల్ దక్కడం ఐదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిసారి 2019లో లెక్‌లెర్కే ఫెరారీ జట్టుకు ఇక్కడ టైటిల్ అందించాడు. నాలుగో స్థానం నుంచి రేసును ప్రారంభించిన లెక్‌లెర్క్ తనకు అచ్చొచ్చిన ట్రాక్‌పై వాయువేగంతో దూసుకెళ్లాడు. గత కొన్ని రేసుల నుంచి టాప్ త్రీలో చోటు దక్కించుకోలేక పోతున్న లెక్‌లెర్క్ ఈసారి సత్తా చాటగా... గత వారం డచ్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. మెక్‌లారెన్ జట్టుకే చెందిన ఆస్కార్ పియాస్ట్రి 1 గంటా 14 నిమిషాల 43.391 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచాడు. అగ్రస్థానం దక్కించుకున్న లెక్‌లెర్క్‌తో పోల్చుకుంటే... పియాస్ట్రి 2.664 సెకన్లు ఆలస్యంగా గెలుపు గీత దాటాడు. మొత్తం 53 ల్యాప్‌లు గల 306.720 కిలోమీటర్ల ఈ రేసును పోల్ పొజిషన్‌తో ప్రారంభించిన నోరిస్ 1 గంటా 14 నిమిషాల 46.880 సెకన్లలో గమ్యాన్ని చేరి మూడో స్థానం దక్కించుకున్నాడు. డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ 1 గంట 15 నిమిషాల 18.659 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. సీజన్‌లో మరో ఎనిమిది రేసులు మిగిలుండగా... వెర్‌స్టాపెన్ 303 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతుండగా... 241 పాయింట్లతో నోరిస్ రేండో స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. తొలి రెండు స్థానాల్లో ఉన్న డ్రైవర్ల మధ్య ప్రస్తుతం 62 పాయింట్ల వ్యత్యాసం ఉంది. రేసు రేసు ఆరంభంలోనే లెక్‌లెర్క్ ఆధిక్యం దక్కించుకోగా... మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ కూడా వాయువేగంతో దూసుకెళ్లాడు. అయితే రెండో మలుపు వద్ద నోరిస్‌ను మెక్‌లారెన్ జట్టుకే చెందిన ఆస్కార్ పియాస్ట్రి వెనక్కి నెట్టి రెండో స్థానంలోకి వచ్చాడు. చివరకు వరకు పియాస్ట్రి అదే జోరు కొనసాగించినా.. లెక్‌లెర్క్‌ను అందుకోలేకపోయాడు. కార్లోస్ సెయింజ్ జూనియర్ (ఫెరారీ) 1 గంట 14 నిమిషాల 56.348 సెకన్లలో లక్ష్యాన్ని చేరి నాలుగో స్థానంలో నిలవగా... బ్రిటన్ స్టార్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్) 1 గంట 15 నిమిషాల 3.547 సెకన్లలో రేసును ముగించి ఐదో స్థానం దక్కించుకున్నాడు. ఈ రేసు ద్వారానే ఫార్ములావన్ అరంగేట్రం చేసిన విలియమ్స్ రేసింగ్ జట్టు డ్రైవర్ ఫ్రాంకో కొలాపింటో 12వ స్థానంలో నిలిచాడు. సీజన్‌లోని తదుపరి రేసు అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి ఈనెల 15న బాకు సిటీలో జరుగుతుంది.

> “ఇదో అద్భుత భావన. చివరి కొన్ని ల్యాప్‌ల్లో మరింత వేగం పెంచడం ద్వారా అగ్రస్థానం దక్కించుకోగలిగా. ఇక్కడ రెండోసారి విజేతగా నిలవడం ఆనందంగా ఉంది. ప్రతిసారి మొనాకో, మోంజా ట్రాక్‌పై రేసులు గెలవాలని కోరుకుంటా. ఈ ఏడాది ఆ రెండిట్లో విజయం సాధించడాన్ని మాటల్లో వర్ణించలేను. -లెక్‌లెర్క్

డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక

స్థానం	డ్రైవర్	జట్టు	పాయింట్లు
1	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	303
2	నోరిస్	మెక్‌లారెన్	241
3	లెక్‌లెర్క్	ఫెరారీ	217
4	పియాస్ట్రి	మెక్‌లారెన్	197
5	సెయింజ్	ఫెరారీ	184
6	హామిల్టన్	మెర్సిడెస్	164
7	పెరెజ్	రెడ్‌బుల్	143
8	రసెల్	మెర్సిడెస్	128
9	అలోన్సో	ఆస్టన్ మార్టిన్	50
10	స్ట్రోల్	ఆస్టన్ మార్టిన్	24

ఇటాలియన్ గ్రాండ్‌ప్రి ఫలితాలు

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	లెక్‌లెర్క్	ఫెరారీ	1:14:40.727		25
2	పియాస్ట్రి	మెక్‌లారెన్	1:14:43.391	2.664 సెకన్లు	18
3	నోరిస్	మెక్‌లారెన్	1:14:46.880	6.153 సెకన్లు	16
4	కార్లోస్	ఫెరారీ	1:14:56.348	15.621 సెకన్లు	12
5	హామిల్టన్	మెర్సిడెస్	1:15:03.547	22.820 సెకన్లు	10
6	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:15:18.659	37.932 సెకన్లు	8
7	జార్జ్ రసెల్	మెర్సిడెస్	1:15:20.442	39.715 సెకన్లు	6
8	పెరెజ్	రెడ్‌బుల్	1:15:34.875	54.148 సెకన్లు	4
9	అల్బన్	విలియమ్స్ రేసింగ్	1:15:48.183	67.456 సెకన్లు	2
10	మాగ్నసన్	మనీగ్రామ్ హాస్	1:15:49.029	68.302 సెకన్లు	1

రన్నరప్ సాయికార్తీక్ జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య ఎం25 టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ గంటా సాయికార్తీక్ రెడ్డి డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. థాయ్‌లాండ్‌లోని నఖోన్ సి థమారత్ పట్టణంలో ఈ టోర్నీ జరిగింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో సాయికార్తీక్ రెడ్డి (భారత్)–విషయ ట్రాంగ్‌చరోన్‌చైకుల్ (థాయ్‌లాండ్) ద్వయం 7–6 (7/5), 4–6, 7–10తో ‘సూపర్ టైబ్రేక్’లో నాలుగో సీడ్ జేక్ డెలానీ–జెస్సీ డెలానీ (ఆస్ట్రేలియా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో సాయికార్తీక్ ద్వయం ఏడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. సాయికార్తీక్ జంటకు 900 డాలర్ల (రూ. 75 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

పోరాడి ఓడిన అనిరుధ్ ద్వయం



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది రెండో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) చాలెంజర్ టోర్నీ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్‌కు నిరాశ ఎదురైంది. స్పెయిన్‌లోని మనాకోర్ పట్టణంలో జరిగిన రాఫా నాదల్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టోర్నీలో అనిరుధ్ (భారత్)–డేవిడ్ వేగా హెర్నాండెజ్ (స్పెయిన్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో అనిరుధ్–హెర్నాండెజ్ జోడీ 6–1, 3–6, 7–10తో ‘సూపర్ టైబ్రేక్’లో డేవిడ్ పిచ్లెర్–జూరిజ్ (ఆస్ట్రియా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. అనిరుధ్–వేగా హెర్నాండెజ్ జోడీకి 2,450 యూరోల (రూ. 2 లక్షల 27 వేలు) ప్రైజ్‌మనీ, 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

లిటన్ దాస్ సూపర్ సెంచరీ

- బంగ్లాదేశ్ 262 ఆలౌట్
- పాక్ పేసర్ షెహజాద్‌కు 6 వికెట్లు
- పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్ 9/2

పాకిస్తాన్ పేసర్ల ధాటికి 26 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ బంగ్లాదేశ్‌ను లిటన్ దాస్ ఆదుకున్నాడు. ఎదురుదాడితో వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశాడు. మెహదీ హసన్ మిరాజ్‌తో కలిసి చక్కటి భాగస్వామ్యం నమోదు చేసి.. జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. పాక్ పేసర్ ఖుర్రం షెహజాద్ 6 వికెట్లతో అదరగొట్టినా... ఆఖర్లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆతిథ్య జట్టు 3.4 ఓవర్లు ఆడి 2 వికెట్లు కోల్పోయి ఎదురీతకు సిద్ధమైంది.


షెహజాద్


లిటన్ దాస్

రావల్పిండి: టెస్టు క్రికెట్ చరిత్రలో తొలిసారి పాకిస్తాన్‌పై విజయం సాధించిన బంగ్లాదేశ్ జట్టు... అదే జోరులో సిరీస్ చేజిక్కించుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తోంది. పాకిస్తాన్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 78.4 ఓవర్లలో 262 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 10/0తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ ఒక దశలో 26 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. అయితే ఈ సమయంలో వికెట్ కీపర్ లిటన్ దాస్ (228 బంతుల్లో 138; 13 ఫోర్లు, 4 సిక్సర్లు) అసాధారణ ఇన్నింగ్స్ ఆడాడు. పాక్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ దాటిగా పరుగులు రాబట్టాడు. అతడికి ఆల్‌రౌండర్ మెహదీ హసన్ మిరాజ్ (124 బతుల్లో 78; 12 ఫోర్లు, ఒక సిక్సర్) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 165 పరుగులు జోడించడంతో బంగ్లాదేశ్ మెరుగైన స్కోరు చేయగలిగింది. కెప్టెన్ నజ్ముల్ షంటో (4), మోమినుల్ హక్ (1), ముష్ఫికర్ రహీమ్ (3), షకీబ్ అల్ హసన్ (2), జాకీర్ హసన్ (1), షాద్‌మన్ ఇస్లామ్ (10) విఫలమయ్యారు. పాకిస్తాన్ బౌలర్లలో ఖుర్రమ్ షెహజాద్ 6, మీర్ హమ్జా, సల్మాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 3.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 9 పరుగులు చేసింది. ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (3), నైట్ వాచ్‌మన్ ఖుర్రం షెహజాద్ (0) అవుటయ్యారు. బంగ్లా బౌలర్లలో హసన్ మహమూద్ 2 వికెట్లు పడగొట్టాడు. చేతిలో 8 వికెట్లు ఉన్న పాకిస్తాన్ ఓవరాల్‌గా 21 పరుగుల ఆధిక్యంలో ఉంది. వర్షం కారణంగా శుక్రవారం ఆట తుడిచిపెట్టుకొనిపోగా... మరో రెండు రోజులు మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో ఫలితం తేలడం పక్కాగా కనిపిస్తోంది.

అదరగొట్టేందుకు ఆరుగురు



స్మృతి మంధాన


యస్తిక భాటియా, దీప్తి శర్మ


జెమీమా, శిఖా పాండే



హేమలత

- మహిళల బిగ్‌బాష్ టి20 లీగ్‌లో ఆరుగురు భారత క్రికెటర్లు
- స్మృతి మంధాన, జెమీమా, దీప్తి శర్మ, యస్తిక భాటియా, హేమలత, శిఖా పాండేలకు చోటు
- కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు నిరాశ
- అక్టోబర్ 27 నుంచి ఆస్ట్రేలియాలో టోర్నీ

మెల్‌బోర్న్: భారత మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సహా ఆరుగురు భారత క్రికెటర్లు మహిళల బిగ్‌బాష్ టి20 లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో మెరిపించనున్నారు. ఓపెనర్ స్మృతి, ఆల్‌రౌండర్ శిఖా పాండే, టాపార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌లు ఇది వరకే ఈ లీగ్‌లో ఆడారు. అయితే కొత్తగా ఆల్‌రౌండర్ దయాళన్ హేమలత, వికెట్ కీపర్ బ్యాటర్ యస్తిక భాటియాలకు తొలిసారిగా బిగ్‌బాష్ చాన్స్ లభించింది. కానీ భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను మాత్రం లీగ్ ఫ్రాంచైజీలు పక్కన బెట్టాయి. గతంలో మెల్‌బోర్న్ రెనిగేడ్స్, సిడ్నీ థండర్‌లకు ఆడిన అనుభవమున్న సీనియర్ బ్యాటర్‌పై ఎనిమిది ఫ్రాంచైజీల్లో ఏ ఒక్క జట్టు కూడా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. హిట్టింగ్‌తో ఆదరగొట్టే బ్యాటర్ జెమీమాకు బ్రిస్బేన్ హీట్ ‘ప్లాటినమ్’ ఎంపిక ద్వారా పెద్దపీట వేసింది. ఐపీఎల్‌లో టాప్ 1, 2, 3 రిటెన్షన్ పాలసీలా డబ్ల్యూబీబీఎల్‌లో ప్లాటినమ్, గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ కేటగిరీలుంటాయి. మరో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు మెల్‌బోర్న్ స్టార్స్ ‘ప్లాటినమ్’ కేటగిరీలో ఎంపిక చేసుకుంది. ఈ కేటగిరీలోకి ఎంపికైన క్రికెటర్లకు రూ. 62.41 లక్షలు (లక్షా 10 వేల ఆసీస్ డాలర్లు) కాంట్రాక్టు మొత్తంగా లభిస్తుంది. ‘గోల్డ్’ కేటగిరీలో బ్రిస్బేన్ హీట్‌కు ఎంపికైన శిఖా పాండేకు రూ. 51 లక్షలు (90 వేల ఆసీస్ డాలర్లు), అడిలైడ్ స్ట్రయికర్స్‌కు స్మృతి మంధాన, పెర్త్ స్కార్చర్స్‌కు హేమలత, మెల్‌బోర్న్ స్టార్స్‌కు యస్తిక భాటియా సిల్వర్ కేటగిరీలో ఎంపికయ్యారు. ఈ ముగ్గురికి రూ. 36.88 లక్షలు (65 వేల ఆసీస్ డాలర్లు) కాంట్రాక్టు ఫీజుగా లభిస్తుంది. ఈ సీజన్ మహిళల బిగ్‌బాష్ లీగ్ వచ్చే నెల 27న అడిలైడ్‌లో మొదలవుతుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అడిలైడ్ స్ట్రయికర్స్‌తో బ్రిస్బేన్ హీట్ జట్టు తలపడుతుంది.

ఇంగ్లండ్‌దే టెస్టు సిరీస్

- శ్రీలంకపై రెండో టెస్టులో 190 పరుగులతో ఘనవిజయం
- అట్కిన్సన్ ఆల్‌రౌండ్ షో



అట్కిన్సన్

లండన్: సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ఇంగ్లండ్ జట్టు... శ్రీలంకపై టెస్టు సిరీస్ చేజిక్కించుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం నాలుగో రోజే ముగిసిన రెండో టెస్టులో ఆతిథ్య ఇంగ్లండ్ 190 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే ఇంగ్లండ్ 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. 483 పరుగుల విజయలక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 53/2తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక చివరకు 292 పరుగులు చేసి ఆలౌటైంది. దిముత్ కరుణరత్నె (129 బంతుల్లో 55; 7 ఫోర్లు), దినేశ్ చండీమల్ (62 బంతుల్లో 58;11 ఫోర్లు), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (71 బంతుల్లో 50; 7 ఫోర్లు) అర్ధశతకాలతో రాణించినా లాభం లేకపోయింది. మిలాన్ రత్నాయకే (56 బంతుల్లో 43; 7 ఫోర్లు) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమైంది. ఇంగ్లండ్ బౌలర్లలో అట్కిన్సన్ 5 వికెట్లు పడగొట్టగా... క్రిస్ వోక్స్, ఓలీ స్టోన్ చెరో రెండు వికెట్లు తీశారు. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 427 పరుగులు చేయగా... శ్రీలంక 196 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో 251 పరుగులు చేసిన ఇంగ్లండ్... లంక ముందు కొండంత లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేయడంతో పాటు... రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 7 వికెట్లు తీసిన అట్కిన్సన్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం నుంచి మూడో టెస్టు జరుగుతుంది.

సవతి కూతురిపైకి... కుక్కను ఉసిగొల్పి పొట్టన పెట్టుకుంది!

అమెరికాలో ఘాతుకం

సవతి కూతురు కావడమే ఆ చిన్నారి నేరమైపోయింది. చిన్నారిపైకి మారుటి తల్లి తన పెంపుడు శునకాన్ని ఉసిగొల్పి పొట్టన పెట్టుకుంది. 9 ఏళ్ల చిన్నారిని 47 కిలోలున్న రాట్‌వీలర్ జాతి కుక్క తలతో పాటు ఒళ్లంతా కొరికేసి చంపింది! ఈ విషాదం అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని మోంట్‌వెర్డే కౌంటీలో జరిగింది. లోజాన్ సెషన్స్‌ను సవతి తల్లి టీషెల్ ఎలిసీ మార్టిన్ (34) ఇలా కిరాతకంగా పొట్టన పెట్టుకుంది. పైగా ఏమీ తెలియనట్టు 'మా పాప లేవడం లే'దంటూ పోలీసులకు ఫోన్ చేసింది. వాళ్లొచ్చేసరికే తలకు తీవ్ర గాయాలతో పాప స్పృహ తప్పి ఉంది. హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా అప్పటికే చనిపోయింది. టీషెల్ తీరుపై పోలీసులకు అనుమానమొచ్చి ఇంట్లోని సీసీటీవీ ఫుటేజీని చెక్ చేస్తే అసలు దారుణం బయటపడింది. చిన్నారిని చితకబాదమే గాక పెంపుడు కుక్కను ఉసిగొల్పింది. దాడిలో పాప న్నారి తీవ్రంగా గాయపడింది. ఒళ్లంతా రక్కిన గుర్తులున్నాయి.





కొంతకాలంగా హింసిస్తోందనేందుకు గుర్తుగా కాల్చిన గాయాలూ ఉన్నాయి. స్పృహ తప్పినా చిన్నారిని ఆ రాకాసి కనికరించలేదు. ఇళ్లంతా ఈడ్చుకెళ్తూ, 'చంపేస్తా' అంటూ అరుస్తున్న దృశ్యాలు కూడా సీసీటీవీలో నమోదయ్యాయి. దాంతో ఆమెను అరెస్టు చేశారు. చిన్నారులపై ఇంత దారుణ హింసను జీవితంలో చూడలేదని పోలీసులే కన్నీరు పెట్టుకున్నారు! - వాషింగ్టన్

ఆ 'రష్యన్ స్పై వేల్' ఇక లేదు!

రష్యా గూఢచారిగా 2019 నుంచి ప్రపంచం దృష్టిని ఆకర్షించిన తెల్లని బెలుగా తిమింగలం చనిపోయింది. హవాల్డిమిర్‌గా పేరున్న ఈ తిమింగలం కళేబరం దక్షిణ నార్వేలోని రిజావికా బే వద్ద నీటిపై తేలియాడుతూ శనివారం స్థానికుల కంటబడింది. 14 అడుగుల పొడవు, 1,225 కిలోల బరువున్న హవాల్డిమిర్ కళేబరాన్ని క్రేన్‌తో బయటకు తీశారు. బెలుగా కళేబరంపై ఎటువంటి గాయాలు లేవని, మృతికి కారణాలను కనుగొనేందుకు పోస్టుమార్టం చేపట్టినట్లు అధికారులు చెప్పారు. ఒంటిపై కెమెరాను అమర్చేందుకు వీలుగా బెల్టు లాంటి ఒక పరికరం అమర్చి ఉండటం, దానిపై 'ఎక్విప్‌మెంట్ సెయింట్ పీటర్స్‌బర్గ్'అని రాసి ఉండటంతో నార్వే ప్రజలకు అనుమానం మొదలైంది. రష్యాయే నిఘా కోసం ఈ తిమింగలాన్ని పంపి ఉంటుందని, నార్వే-రష్యా భాషలను కలిపి 'హవాల్డిమిర్'గా పిలవనారంభించారు. సాధారణంగా తిమింగలాలు గుంపులుగా సంచరిస్తుంటాయి. అందుకు విరుద్ధంగా హవాల్డిమిర్ ప్రజలకు మచ్చికయ్యింది. ఇంతకీ, ఇది రష్యా పంపిందేనా అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకలేదు. బహుశా, రష్యా నిర్బంధంలో ఉంటూ అనుకోకుండా తప్పించుకుని వచ్చి ఉంటుందని, అందుకే ప్రజల సంజ్ఞలకు స్పందించే లక్షణం అబ్బి ఉంటుందని కొందరు వాదిస్తున్నారు. - హెల్సింకీ



డెలివరీ ఏజెంట్‌కు సర్‌ప్రైజ్

అహ్మదాబాద్‌లో బర్త్‌డే సెలబ్రేట్ చేసిన కస్టమర్లు





బంధువులతో కలిసి పార్టీ.. ఆత్మ బంధువుల బర్త్‌డే.. వేడుక ఏదైనా మనకు టైమ్‌కు ఫుడ్ డెలివరీ చేసి మన సంతోషంలో భాగస్వాములవుతారు డెలివరీ ఏజెంట్. వాళ్ల కష్టాన్ని చాలాసార్లు గుర్తించం. కానీ.. తమకోసం ఫుడ్ తీసుకొచ్చిన డెలివరీ ఏజెంట్ బర్త్ డే సెలబ్రేట్ చేసి అతని సంతోషాన్ని రెట్టింపు చేశారు కొందరు యువకులు. వారం కిందట అహ్మదాబాద్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. నగరానికి చెందిన యశ్ షా జొమాటోలో ఫుడ్ ఆర్డర్‌చేశాడు. ఆర్డర్ డీటెయిల్స్ చూస్తుండగా.. భారీ వర్షం వల్ల డెలివరీ లేట్ అవుతుందని ఉంది. దాంతో పాటు.. డెలివరీ బాయ్ అయిన షేక్ ఆకిబ్ బర్త్‌డే అని కూడా కనిపించింది. డెలివరీ ఏజెంట్ తన బర్త్‌డే రోజు వర్షంలో తడుస్తూ పనిచేస్తున్నాడని గ్రహించి, ఏజెంట్‌ను సర్‌ప్రైజ్ చేయాలనుకున్నారు. ఆర్డర్‌తో వచ్చిన అతడికి ఫ్రెండ్స్‌తో కలిసి 'హ్యాపీ బర్త్ డే' అంటూ విష్ చేశారు. అంతేకాదు చిన్న కానుకను కూడా అందజేశారు. ఊహించని ఈ వేడుకకు డెలివరీ ఏజెంట్ చలించిపోయాడు. చిరునవ్వుతో వారికి కృతజ్ఞతలు తెలిపాడు. ఆ దృశ్యం వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన యశ్.. 'మీకు చేతనైనంత వరకు ఆనందాన్ని పంచండి. మాకు అవకాశం ఇచ్చినందుకు జొమాటోకు ధన్యవాదాలు' అని క్యాప్షన్ పెట్టాడు. ఈ వీడియోకు రెండు మిలియన్ల వ్యూస్, లెక్కలేనన్ని లైక్స్, కామెంట్లు వచ్చాయి. దీనిపై జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్, డెలివరీ ఏజెంట్ షేక్ ఆకిబ్ కూడా స్పందించి ధన్యవాదాలు తెలిపారు. - అహ్మదాబాద్

రాజీనామాకూ కన్సల్టెన్సీ

జపాన్‌లో కొత్త పోకడ

మన దగ్గర ఉద్యోగం కల్పించడం కోసం బోలెడన్ని కన్సల్టెన్సీలు ఉంటాయి. కానీ ప్రపంచంలోని నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జపాన్ అందుకు భిన్నం! అక్కడ రాజీనామా చేయాలనుకునే ఉద్యోగుల కోసం కన్సల్టెన్సీలుంటాయి!! అవి ఇటీవల దేశవ్యాప్తంగా పుట్ట గొడుగుల్లా పెరుగుతున్నాయి. రాజీనామాకు కన్సల్టెన్సీలు ఎందుకా అనుకుంటున్నారా? జపాన్ పని సంస్కృతి, అందులోని సంక్లిష్టతలే అందుకు కారణం... - సాక్షి, నేషనల్ డెస్క్



రాజీనామా చేయాలంటే ఏం చేస్తాం? గడువు ప్రకారం రాజీనామా లేఖ ఇస్తాం. అంతటితో సరిపోతుంది. కానీ జపాన్‌లో రాజీనామా అంత ఈజీ కాదు. అక్కడి పని సంస్కృతే ఇందుకు కారణం. అక్కడ కెరీర్ మొత్తం ఒకే సంస్థలో కొనసాగించే వాళ్ల సంఖ్యే ఎక్కువట. చేస్తున్న పని ఇష్టం లేకపోయినా, బాస్ తీరు నచ్చకపోయినా వేధింపులకు భయపడో, మరో కారణంతోనో కష్టంగా అదే ఉద్యోగంలో కొనసాగుతున్న వాళ్లు చాలామంది. సరిగ్గా ఇలాంటి వాళ్లకు సాయం చేసేందుకే పుట్టుకొచ్చాయి 'రాజీనామా కన్సల్టెన్సీలు'. ఇవి కొవిడ్‌కు ముందే ఉన్నా, ఆ మహమ్మారి తదనంతర కాలంలో ఆదరణ బాగా పెరిగింది. ఒక్క ఏడాదిలోనే ఏకంగా 11,000 పైచిలుకు క్లయింట్లు తమ సేవల గురించి ఎంక్వైరీ చేసినట్టు 'మోమూరి ఆపరేషన్స్' అనే రాజీనామాల కన్సల్టెన్సీ సంస్థ చెబుతోంది. 'మోమూరి' అంటే జపనీస్‌లో 'నేనీ పని ఇంకేమాత్రమూ చేయలేను (ఐ కాంట్ డూ దిస్ ఎనీమోర్)' అని అర్థం! ఇది 2022లో పుట్టుకొచ్చింది. కర్ర విరక్కుండా, పాము చావకుండా ఎలా రాజీనామా చేసి బయట పడాలో ఇవి సలహాలిస్తాయన్నమాట. ఈ వ్యవహారంలో చట్టపరమైన వివాదాల్లాంటివి తలెత్తితే కూడా అవే చూసుకుంటాయి.

అధిక పని సంస్కృతి...

జపాన్‌లో చాలాకాలంగా అధిక పని సంస్కృతి ఉంది. రంగమేదైనా ఉద్యోగులకు పనివేళలు మరీ ఎక్కువ. ఏకధాటిగా 12 గంటలు పని చేయడం చాలా మామూలు విషయం. ఇల్లు చేసేసరికి ఏ అర్ధరాత్రో అవుతుంది. మళ్లీ ఉదయాన్నే హడావుడిగా బయల్దేరాలి. ఇలా వెనక్కు తిరిగి చూసుకుంటే పనిలో కరగదీసిన జీవితమే తప్పితే సరదాగా గడిపిన క్షణాలంటూ పెద్దగా కన్పించడం లేదని వాపోయేవాళ్ల సంఖ్యే అధికం. వీటికి తోడు సూపర్‌వైజర్లు, మేనేజర్ల నుంచి ఒత్తిళ్లు. తట్టుకోలేక రాజీనామాకు ప్రయత్నిస్తే యజమానులు వేధిస్తారట. ఇలాంటి సంస్థలను 'నల్లజాతి సంస్థలు'గా పిలుస్తుంటారు. చిన్న, మధ్య తరహా వ్యాపారాల్లోనే గాక పెద్ద సంస్థల్లోనూ ఈ సంస్కృతి ఉందట. బాధితుల్లో ప్రధానంగా ఆహార పరిశ్రమ కార్మికులు, ఆ తర్వాత ఆరోగ్య సంరక్షణ, సంక్షేమ రంగాల వారున్నారు. పరిస్థితి ఎంతదాకా వెళ్లిందంటే, తీవ్రమైన పని ఒత్తిడి పెట్టే సంస్థల జాబితాను ప్రభుత్వమే నిషేధిత జాబితాలో పెట్టడం ప్రారంభించింది! అలా జపాన్‌వ్యాప్తంగా ఇప్పటికే 370కి పైగా కంపెనీలు లేబర్ బ్యూరో బ్లాక్ లిస్ట్‌లో చేరాయి. అధిక పని ఒత్తిడి వల్ల మెదడు, గుండె సంబంధిత జబ్బులతో మరణిస్తున్న వారి సంఖ్య జపాన్‌లో పెరుగుతోందట. 31 ఏళ్ల జర్నలిస్టు ఒకామె కేవలం పని ఒత్తిడి వల్లే హార్ట్ ఫెయిల్యూర్‌తో మరణించింది. చనిపోవడానికి ముందు ఒకే నెలలో ఆమె ఏకంగా 159 గంటలు ఓవర్ టైమ్ పని చేసిందట! అలాగే ఓ 26 ఏళ్ల వైద్యుడు కూడా ఒకే నెలలో 200 గంటలకు పైగా ఓవర్ టైమ్ పనిచేసి చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు!

మారుతున్న యూత్..

ఈ పని జపాన్‌లో ఎప్పటినుంచో సంస్కృతి ఉన్నా రాజీనామా కన్సల్టెన్సీలు ఇటీవలి కాలంలోనే ఎందుకు పుట్టుకొచ్చాయి? అంటే యువత ఆలోచనల్లో వచ్చిన మార్పులే కారణమని నిపుణులు చెబుతున్నారు. జపాన్‌లో ఉద్యోగుల్లో వృద్ధుల సంఖ్య తగ్గుతోంది. ఎక్కడ చూసినా యువ ఉద్యోగులే. ఉద్యోగం స్వభావంతో సంబంధం లేకుండా యజమాని ఏది చెబితే అది చేయాలనే పాత తరం ఆలోచనతో వాళ్లు ఏకీభవించడం లేదు. అందుకే అవసరమైతే రాజీనామాకూ వెనకాడటం లేదు. అలాగని యాజమాన్యంతో ఘర్షణ పడి ఉద్యోగ భవిష్యత్తును ప్రమాదంలో పడేసుకోవడానికి ఇష్టపడటం లేదు. అందుకే నేర్పుగా పని కానిచ్చుకోవడానికి కన్సల్టెన్సీల బాట పడుతున్నారు.

> "రాజీనామా ఏజెన్సీలు జపాన్ సమాజం నుంచి పూర్తిగా కనుమరుగవ్వాలని మేం నిజాయితీగా కోరుకుంటున్నాం. ఉద్యోగులు తమ రాజీనామా గురించి నేరుగా బాస్‌తో మాట్లాడుకునే వాతావరణం వస్తే మేలు. కానీ మా క్లయింట్ల భయానక గాథలు వింటుంటే అది ఇప్పట్లో జరుగుతుందని అనిపించడం లేదు"
> - మోమూరీ కన్సల్టెన్సీ

ఒకరు ధర్మాసనంపై.. మరొకరు బోనులో... ఇద్దరు మిత్రుల కథ!



అది 2015. అమెరికాలో ఫ్లోరిడాకు చెందిన ఆర్థర్ నథానియల్ బూత్ దొంగతనం ఆరోపణలపై అరెస్టయ్యాడు. మియామీ-డేడ్ జడ్జి మిండీ గ్లేజర్ ముందు విచారణకు హాజరయ్యాడు. అతన్ని తేరిపార చూసిన జడ్జి, నువ్వు నౌటిలస్ మిడిల్ స్కూల్‌లో చదివావు కదా ప్రశ్నించారు. దాంతో ఆమెను గుర్తు పట్టిన బూత్ ఒక్కసారిగా భావోద్వేగంతో రోదించాడు. వాళ్లిద్దరూ చిన్ననాటి మిత్రులు మరి! స్కూలు రోజుల్లో బెస్ట్ ఫ్రెండ్స్. కలిసి ఫుట్ బాల్ ఆడేవాళ్లమని, బూత్ తమ స్కూళ్లోకెల్లా ఉత్తమ బాలుడని మిండీ గుర్తు చేసుకున్నారు. 'బూత్, నిన్నిక్కడ చూడాల్సి వచ్చినందుకు బాధగా ఉంది' అంటూ విచారం వ్యక్తం చేశారు. ఇకపై మంచి జీవితం గడుపుతాడని ఆశాభావం వెలిబుచ్చారు. కానీ అలా జరగలేదు. బూత్ చోర జీవితమే కొనసాగిస్తూ వచ్చాడు. నగరమంతటా వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. ప్లంబర్ వేషంలో ఓ వృద్ధుడి ఇంట్లో దూరి బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. వాటర్ ఇన్‌స్పెక్టర్‌గా నటించి ఓ ఇంట్లోంచి నగల పెట్టె దొంగిలించాడు. టైరు మారుస్తున్న మహిళ బంగారు గొలుసు లాక్కున్నాడు. ఇవన్నీ చేస్తూ సీసీ కెమెరాలకు దొరికిపోయాడు. ఎట్టకేలకు అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈసారి కోర్టులో జడ్జిగా చిన్నప్పటి నేస్తం కన్పించలేదు గానీ అతని అరెస్టుతో నాటి ఉదంతం మరోసారి తెరపైకి వచ్చింది. 2015 నాటి కోర్టు ప్రొసీడింగ్స్ వీడియో వైరల్‌గా మారింది. - వాషింగ్టన్

నేడు, రేపు కాంగ్రెస్ సీఈసీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే జమ్మూకశ్మీర్, హరియాణాల్లో అభ్యర్థుల ఖరారే ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సోమ, మంగళవారాల్లో సమావేశం కానుంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలోని మొత్తం 90 సీట్లకు గాను నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తులో భాగంగా కాంగ్రెస్ 32 స్థానాల్లో పోటీ చేయనుంది. 9 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్, మిగతా 28 చోట్ల అభ్యర్థులను సీఈసీ భేటీలో ఖరారు చేసే అవకాశముంది. అత్యంత కీలకమైన హరియాణాలో కాంగ్రెస్ మొత్తం 90 స్థానాల్లోనూ ఒంటరిగానే బరిలోకి దిగనుంది. ఇక్కడ టికెట్ల కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొని ఉంది.

గాజాలో పోలియో వ్యాక్సినేషన్ ప్రారంభం

దేర్ అల్ బలాహ్: గాజా స్ట్రిప్‌లో పోలియో వ్యాప్తిని నిరోధించడానికి పెద్ద ఎత్తున వ్యాక్సినేషన్ ప్రారంభమైంది. సెంట్రల్ గాజాలోని పిల్లలకు బుధవారం వరకు టీకాలు వేయనున్నారు. ఆ తరువాత అత్యంత విధ్వంసానికి గురైన ఉత్తర, దక్షిణ గాజా ప్రాంతాలకు వెళ్ళనున్నారు. శనివారం కొద్ది సంఖ్యలో టీకాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం సుమారు 6,40,000 మంది పిల్లలకు చేరాలని లక్ష్యంగా పెట్టుకుంది. వైద్య కేంద్రాలు, పాఠశాలలతో సహా భూభాగంలోని సుమారు 160 కేంద్రాల్లో టీకాలు వేస్తున్నారు. 10 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలకు రెండు రౌండ్లలో రెండు చుక్కల ఓరల్ పోలియో వ్యాక్సిన్ ఇస్తారు.

మెహబూబా వారసురాలు... కంచుకోటను నిలబెట్టేనా?



కశ్మీర్‌లో పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ (పీడీపీ)కి కంచుకోటగా పేరుపడ్డ శ్రీగుఫ్వారా-బిజ్‌బెహారా నియోజకవర్గంపై ఇప్పుడందరి దృష్టి కేంద్రీకృతమైంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి తొలిదశలో.. సెప్టెంబరు 18న పోలింగ్ జరగనున్న 24 నియోజకవర్గాల్లో బిజ్‌బెహారా ఒకటి. పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఈసారి పోటీకి దూరంగా ఉండటంతో బిజ్‌బెహారా నుంచి ఆమె కూతురు ఇల్తిజా బరిలోకి దిగారు. దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న ఈ నియోజకవర్గంలో కేవలం ముగ్గురే పోటీ పడుతున్నారు. మాజీ ఎమ్మెల్సీలు బషీర్ అహ్మద్ షా (నేషనల్ కాన్ఫరెన్స్), సోఫీ మొహమ్మద్ యూసుఫ్ (బీజేపీ)లతో రాజకీయాలకు కొత్తయిన ఇల్తిజా తలపడుతున్నారు. 37 ఏళ్ల ఇల్తిజా విజయం సాధిస్తే.. 1996 నుంచి పీడీపీకి కంచుకోటగా బిజ్‌బెహారాపై పీడీపీ, ముఫ్తీ కుటుంబం పట్టు మరింత పెరుగుతుంది. మాజీ సీఎం, పీడీపీ వ్యవస్థాపకుడు ముఫ్తీ మొహమ్మద్ సయీద్ తన సుదీర్ఘ రాజకీయ ఇన్నింగ్స్‌కు బిజ్‌బెహారా నుంచే శ్రీకారం చుట్టారు. 1962లో గులామ్ సాధిక్ నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ చీలికవర్గం నుంచి 1962లో బిజ్‌బెహారా ఎమ్మెల్యేగా సయీద్ విజయం సాధించారు. ఇల్తిజా తల్లి మెహబూబా ముఫ్తీ కూడా బిజ్‌బెహారా నుంచే రాజకీయ అరంగేట్రం చేశారు. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచారు. తండ్రి ముఫ్తీ మొహమ్మద్ సయీద్ కాంగ్రెస్‌ను వీడి పీడీపీని స్థాపించడంతో మెహబూబా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. సీనియర్ ముఫ్తీకి నమ్మకస్తుడైన అబ్దుల్ రెహమాన్ భట్ బిజ్‌బెహారా నుంచి వరుసగా నాలుగుసార్లు గెలిచారు. చివరిసారిగా జమ్మూకశ్మీర్‌కు 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ భట్ బిజ్‌బెహారాలో నెగ్గారు. ఈసారి సీనియర్ నాయకుడైన భట్‌పై నమ్మకంతో ఆయనకు షాంగుస్- అనంత్‌నాగ్ పశ్చిమ సీటును పీడీపీ కేటాయించింది.

ఎన్సీ ప్రత్యేక దృష్టి

పీడీపీ కోటను బద్దలు కొట్టాలని నేషనల్ కాన్ఫరెన్స్ పట్టుదలగా ఉంది. ఎన్సీ అభ్యర్థి బషీర్ అహ్మద్ షా తండ్రి అబ్దుల్‌గనీ షా 1977–1990 దాకా బిజ్‌బెహారాకు ప్రాతినిధ్యం వహించారు. పలుమార్లు ఓటమి పాలైనా ఎన్సీ ఇక్కడ బషీర్‌నే నమ్ముకుంటోంది. 2009–1014 మధ్య కాంగ్రెస్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపినపుడు బషీర్‌ను ఎమ్మెల్సీని చేసింది. పీడీపీ- ఎన్సీ మధ్య సంకుల సమరంలో ఓట్లు చీలి తాము లాభపడతామని బీజేపీ అభ్యర్థి యూసుఫ్ భావిస్తున్నారు. బీజేపీలో చేరడం నిషిద్ధంగా పరిగణించే కాలంలో కమలదళం తీర్థం పుచ్చుకున్న యూసుఫ్‌ను పీడీపీ–బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినపుడు ఎమ్మెల్సీని చేశారు. - సాక్షి, నేషనల్ డెస్క్

మరో పాతికేళ్లలో... బ్రిటన్ ఆలూ మాయం!

బ్రిటన్ ప్రజలు ఇష్టంగా తినే బంగాళదుంప సాగు అక్కడ కనాకష్టంగా మారిందట. మరో పాతికేళ్లలో బ్రిటన్లో ఆలూ సాగు అసాధ్యంగా మారినా ఆశ్చర్యం లేదని పలు నివేదికలు ఘంటాపథంగా చెబుతున్నాయి. 20250 స్కాట్లండ్ ఆలూ సాగు పరిశ్రమ తుడిచిపెట్టుకుపోవచ్చన్నది వాటి సారాంశం. పొటాటో సిస్ట్ నెమటోడ్స్ (పీసీఎన్) అనే తెగులే ఇందుకు కారణం. ఇది సోకే పంటభూముల్లో ఆలూ సాగు అత్యంత కష్టం. నేరుగా మొక్క వేర్లను నాశనం చేసే ఈ తెగులు దెబ్బకు ఆలూ దిగుబడి దారుణంగా పడిపోతుంది. బ్రిటన్‌లో వాడే ఆలూ 80 శాతం స్కాట్లాండ్ భూముల నుంచే వస్తుంది. 450 కోట్ల యూరోల విలువైన ఆలూ పరిశ్రమను ఆదుకునేందుకు బ్రిటిష్ సైంటిస్టుల బృందం నడుం బిగించింది. పీసీఎన్‌ను తట్టుకునే రెండు వంగడాలను గుర్తించినట్టు మొక్కల వ్యాధుల నిపుణుడు జేమ్స్ ప్రిన్స్ చెప్పారు. వీటి సాయంతో సమస్యను అధిగమిస్తామని ధీమా వెలిబుచ్చారు. - లండన్



- బెంబేలెత్తిస్తున్న కొత్త తెగులు
- విరుగుడు వంగడాలు కనిపెట్టామంటున్న సైంటిస్టులు

చేపపై యుద్ధం

- థాయిలాండ్‌కు వింత కష్టం
- చుక్కలు చూపుతున్న 'తిలాపియా'
- పట్టుకుంటే కేజీకి రూ.35
- దాంతో చేప వేటలో పడ్డ జనం

ఎక్కడి జీవి అక్కడ ఉంటేనే ప్రకృతి సమతుల్యత సజావుగా ఉంటుంది. ఆఫ్రికా జలాశయాల్లో జీవించే చిన్నపాటి బ్లాక్‌చిన్ తిలాపియా చేప ఇప్పుడు థాయిలాండ్‌కు చుక్కలు చూపుతోంది. అక్కడి చిన్న చేపలు, రొయ్యలు, నత్త లార్వాలను గుటకాయ స్వాహా చేస్తోంది. అలా దేశ మత్స్య పరిశ్రమకు భారీ నష్టాలు తెచ్చిపెడుతోంది. దాంతో వాటిపై థాయ్‌లాండ్ ఏకంగా యుద్ధమే ప్రకటించింది. తిలాపియా చేప అంతు చూసేందుకు రంగంలోకి దిగింది. వాటిని పట్టుకుంటే కేజీకి రూ.35 చొప్పున ఇస్తామంటూ జనాన్నీ భాగస్వాములను చేసింది. దాంతో జనం సైతమంతా తిలాపియా వేటలో పడ్డారు. గ్రామీణులు ప్లాస్టిక్ కవర్లు, వలలు చేతబట్టుకుని మోకాలి లోతు జలాశయాల్లో తిలాపియా వేటలో మునిగిపోయారు. దీనికి తోడు చెరువులు, కుంటలు, సరస్సుల్లో... ఇలా ఎక్కడ పడితే అక్కడ తిష్ట వేసిన తిలాపియా చేపలను తినే ఆసియాన్ సీబాస్, క్యాట్‌ఫిష్‌లనూ ప్రభుత్వం వదులుతోంది. ఆడ తిలాపియా చేప ఒకేసారి 500 పిల్లలను పెడుతుంది. దాంతో వీటి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది.

ఘనా నుంచి దిగుమతి!

జంతువుల దాణా, రొయ్యలు, పౌల్ట్రీ, పంది మాంసం వ్యాపారం చేసే ఓ సంస్థ దిగుమతి చేసుకున్న తిలాపియా చేపలు చివరికిలా దేశమంతటినీ ముంచెత్తినట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. కానీ ఏం చేసినా ఒక చేప జాతిని సమూలంగా అంతం చేయడం దాదాపు అసాధ్యమని స్థానిక జలచరాల శాస్త్రవేత్త డాక్టర్ సువిత్ వుథిసుథిమెథవే అంటున్నారు. ''వేగవంతమైన పునరుత్పత్తి వ్యవస్థ ఉన్న చేపలను పూర్తిగా అంతం చేయడం మరీ కష్టం. బాగా ప్రయత్నిస్తే మహా అయితే వాటి సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు'' అని అన్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్



తిలాపియా చేపల వేటలో జనం



అట్టహాసంగా యువరాణి పెళ్లి

నార్వే యువరాణి మార్తా లూయిస్ (52), అమెరికాకు చెందిన దురెక్ వెరైట్ (49) వివాహం అట్టహాసంగా జరిగింది. నార్వేలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం, కైరుంగి పట్టణంలో శనివారం రాత్రి జరిగిన ఈ వేడుకకు మార్తా తండ్రి, కింగ్ హెరాల్డ్ (87), ఇతర రాజకుటుంబీకులు హాజరయ్యారు. మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, రియాలిటీ స్టార్లు, టీవీ ప్రముఖులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మార్తాకిది రెండో వివాహం. మొదటి భర్తతో ఆమెకు 21, 19, 15 ఏళ్ల వయస్సున్న కూతుళ్లున్నారు. వాళ్లు కూడా వేడుకలో పాల్గొన్నారు. తనకు దేవదూతలతో మాట్లాడే శక్తి ఉందని మార్తా; ఆత్మలతో సంభాషించగలనని, వ్యాధులను నయం చేయగలనని వెరైట్ చెప్పుకుంటారు. తమ కుటుంబానికి ఆరు తరాలుగా అతీత శక్తులు సంక్రమిస్తూ వస్తున్నాయని వెరైట్ ప్రకటించుకున్నారు. - ఓస్లో



ఉత్సవ వేళ శోభ.. తరువాతంతా క్షోభ



నెల్లూరు నగరంలోని మైపాడు గేటు ప్రాంతంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి తెప్పోత్సవం నిర్వహించే కాలువ ఇది. ఉత్సవాల అనంతరం నగరపాలక సంస్థ దీన్ని పట్టించుకోకుండా వదిలేయడంతో ఇలా చెత్త చెదారం పేరుకుపోయి దారుణంగా తయారయింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మెడకి తగిలితే.. ఉరితాడు



విశాఖ నగరంలో దాబాగార్డెన్స్ నుంచి సంగంశరత్ రోడ్డు మధ్యలో రహదారికి ఇరువైపులా ఇష్టానుసారం వేసిన వైర్లు ఇలా ప్రమాదకరంగా తయారయ్యాయి. అవైర్లకు తీగలు అల్లుకుని ఇలా కిందికి జారిపోయాయి. వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం జరిగే పరిస్థితి. - సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వద్దురా.. సోదరా..



కొంతమంది ఇలా నిబంధనలను అతిక్రమించి ద్విచక్రవాహనంపై నలుగురు చొప్పున ప్రయాణించి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్ల వీరు అతి వేగంగా వెళ్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తిరుపతిలో ఇలా ఒకే బైక్‌పై నలుగురు ప్రయాణిస్తుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

గుడ్లవల్లేరు ఘటనపై సోషల్ మీడియా ఫోకస్

వాస్తవాలను ప్రపంచానికి తెలియజేస్తున్న నెటిజన్లు

ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఎప్పటికప్పుడు పోస్టులు

- ఆరోపణ ఎదుర్కొంటున్న విద్యార్థిని అర్ధరాత్రి కారులో తరలించిన యాజమాన్యం
- ఆందోళన చేస్తున్న విద్యార్థులకు వార్నింగ్ ఇచ్చిన పోలీసు అధికారులు
- మీడియాపైనా కాలేజీ యాజమాన్యం దౌర్జన్యం



సాక్షి, అమరావతి:

సభ్యసమాజం తలదించుకునే విధంగా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన దుర్ఘటనను ప్రభుత్వం తొక్కిపెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలను, యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును సోషల్ మీడియా ఎప్పటికప్పుడు ఏకిపారేస్తోంది. గుడ్లవల్లేరు హాస్టల్ వాష్‌రూమ్‌లో అమర్చిన సీక్రెట్ కెమెరాలను పోలీసులు ఎవరికీ తెలియకుండా తీసుకుపోతున్న విషయాన్ని, ఈ వివాదానికి ప్రధాన కారణంగా నిందలు ఎదుర్కొంటున్న విద్యార్థిని అర్ధరాత్రి కాలేజీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా తరలించిన విధానం, ఆ సమయంలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు నిందలు ఎదుర్కొంటున్న విద్యార్థి వేలు చూపిస్తూ అసభ్యకరంగా చేసిన సంజ్ఞలు, ఘటనను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా బృందాన్ని కాలేజీ యాజమాన్యం అడ్డుకుంటున్న తీరును ఇలా ప్రతి ఘటనను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ప్రపంచానికి చాటిచెపుతోంది.

విద్యార్థులకు పోలీసులతో వార్నింగ్

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు పోలీసు అధికారుల చేత ప్రభుత్వం వార్నింగ్ ఇప్పించింది. మీరు కళ్లతో చూశారా, పోలీసులు వార్నింగ్ ఇస్తున్నా మీరెందుకు మాట వినడం లేదు, విచారణ పేరుతో మీరు ఇబ్బందులు ఎదుర్కొంటారు, మీ ఆందోళన వల్ల తిండీతిప్పలు లేకుండా మేం ఇక్కడ పడిగాపులు కాయాల్సి వస్తోందంటూ ఎస్పీ స్థాయి అధికారి వార్నింగ్ ఇవ్వడంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ వీడియోను వైరల్ చేయడం ద్వారా విద్యార్థులకు పలువురు అండగా నిలుస్తున్నారు. అదే సమయంలో ఆందోళనలను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కాలేజీ యాజమాన్యం దాడి చేయడాన్ని ఖండిస్తూ.. ఏ తప్పూ చేయకపోతే యాజమాన్యం మీడియాపై ఎందుకు దాడి చేస్తుందని ప్రశ్నిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం కాల్‌మనీనే లెక్కచేయలేదు.. ఇప్పుడు ఈ వీడియోలను పట్టించుకుంటుందా.. మరో ఐదేళ్లు ఈ రాష్ట్రానికి ఇలాంటివి తప్పవు అంటూ మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

ఏబీవీపీ మద్దతుపై ప్రత్యేక చర్చ

కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీకి అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీ ఈ ఉద్యమానికి మద్దతు తెలపడమే కాకుండా ప్రత్యక్షంగా ఆందోళనలో పాల్గొనడంపై సోషల్ మీడియాలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. ఆందోళనలో పాల్గొన్న ఏబీవీపీ మహిళా ప్రతినిధిని టార్గెట్ చేస్తూ వైసీపీ పెయిడ్ ఆర్టిస్ట్ అంటూ టీడీపీ ప్రచారం చేయడంపై.. 'వాళ్లు మరెవరో కాదు మహా కూటమిలో భాగంగా ఉన్న బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీ నాయకులే..' అంటూ సాక్ష్యాలతో మరీ చూపిస్తున్నారు. బీజేపీ మాదిరిగానే పవన్ కళ్యాణ్ బయటకి వచ్చి న్యాయం చేయాలంటూ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఒకపక్క విద్యార్థులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తుంటే.. 'ఇక్కడ ఏమీ జరగలేదు. మీ కంటితో మీరు చూశారా' అని ఎస్పీ అనడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. గుడ్లవల్లేరు ఘటనను జాతీయ మీడియా విస్తృత కవర్ చేస్తున్నా ఇక్కడ పచ్చ మీడియా మాత్రం ఈ ఘటనను పూర్తిగా పక్కకు పెట్టేసింది. ఈ అంశాన్ని పక్కదోవ పట్టించడానికి ముంబై నటి వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి.. గంటలు గంటలు చర్చ చేయడాన్ని సోషల్ మీడియా ఎత్తిచూపుతోంది.







క్లుప్తంగా...

జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణతో తీరని నష్టం

ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు



తిరుపతి (అలిపిరి): లాభాలు వచ్చే జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్ వ్యక్తులకు అప్పగిస్తే దేశానికి తీరని నష్టమని ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు తెలిపారు. ఆదివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే పలు బ్యాంకులను ప్రైవేటీకరించారని, రాబోయే రోజుల్లో లాభాల్లో ఉన్న బ్యాంకులను ప్రైవేటీకరణ చేయకుండా ప్రజలు, ఉద్యోగులు ఐక్యంగా ఉంటూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు.. విద్యార్థులకు ప్రభుత్వ బ్యాంకులు రుణాలు అందిస్తూ దేశానికి వెన్నెముకగా ఉండి కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఏపీపీబీఈఎఫ్ కార్యదర్శి కె.రమాప్రసాద్ మాట్లాడుతూ బడా వ్యాపారులు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని దేశం విడిచి పారిపోయారని.. వారి ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేశారు.

మరాఠా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ఒంగోలు: మరాఠా సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా అంబురపు వెంకటేశ్వరరావు, దుమ్మే వీరు, కాలే వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా అంబురు వెంకట నాగేంద్రబాబు, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా జాదాం గంగారాయ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గానికి రాష్ట్రవ్యాప్తంగా హాజరైన పలువురు మరాఠా జిల్లాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీటీఎఫ్ అధ్యక్షుడు గోర్ల సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు ఉత్తర్వులు ఇచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వంలో సీపీఎస్ బదులు జీపీఎస్‌ను తీసుకొస్తున్నట్టు ప్రకటించడాన్ని ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. అయితే యూపీఎస్‌ను తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం దానిని అన్ని రాష్ట్రాలకు అమలు చేసుకోవచ్చని సూచించిందనీ, ఇందులో పాత పెన్షన్ విధానానికి ఎక్కడా పోలిక లేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లాభం లేని, కార్పొరేట్లకు మేలు చేసే సీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేయాలని కోరారు.

పెన్షన్ ఉద్యోగుల హక్కు

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

సాక్షి, అమరావతి: పెన్షన్ భిక్ష కాదు..ఉద్యోగుల హక్కు అని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. ఓపీఎస్ అమలయ్యే వరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాల్లో చీకటి రోజుగా సెప్టెంబర్ 1ని విద్రోహ దినంగా పాటిస్తామన్నారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా వర్షంలోనూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ మొత్తం మాయ స్కీములన్నారు. ఉపాధ్యాయుల భద్రతకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోండి

రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్

సాక్షి, అమరావతి : భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు యుద్ధప్రాతిపదికన నష్టపరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. వరదలు, వర్షాల వల్ల 14 జిల్లాల పరిధిలో లక్ష హెక్టార్లలో వరి పంట, 10 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పలు జిల్లాల్లో కాల్వలు, చెరువులు, వాగులకు గండ్లు పడి పంటలు నీటి మునిగాయని, పలు చోట్ల భూములు కోతకు గురైనట్టు చెప్పారు. ప్రకాశం బ్యారేజీకు వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోందని, ఇప్పటికే 7.69 లక్షల క్యూసెక్కుల నీటిని కిందకి వదిలారని, దీంతో దిగువనున్న గ్రామాల పరిధిలోని వేలాది ఎకరాల పంట ముంపునకు గురవుతోందని.. తక్షణమే రైతులను ఆదుకోవాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఈ–పంటతో పనిలేకుండా నష్టం అంచనా వేయాలి

ఈ పంట నమోదుతో సంబంధం లేకుండా పంట నష్టం అంచనాలు రూపొందించాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఇప్పటికీ రాష్ట్రంలో ఈ – పంట నమోదు పూర్తవలేదని, ఇలాంటి పరిస్థితుల్లో ఈ పంట నమోదుతో లింకుపెడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆయా సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.క్రిష్ణయ్య, కే.ప్రభాకరరెడ్డి, వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు ఆందోళన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ నష్టపరిహారం ఇవ్వాలని ఓ ప్రకటనలో వారు డిమాండ్ చేశారు.

రైతులకు భరోసా కల్పించండి

జిల్లాల అధికారులతో వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్

సాక్షి, అమరావతి: ముంపు నీటిలో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన సహకారం అందించి.. రైతులకు భరోసా కల్పించాలని జిల్లాల అధికారులను వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావుతో కలిసి ఆదివారం ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్, ఢిల్లీరావు మాట్లాడుతూ.. 'కృష్ణా నదీ పరివాహక జిల్లాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి.. ముంపు బారిన పడిన పొలాలను గుర్తించాలి. డ్రోన్లు, శాటిలైట్ల సాయంతో పంట నష్టం అంచనా వేసేందుకు వీలుగా రిమోట్ సెన్సింగ్ అధికారులతో చర్చించాలి. ఉత్తర కోస్తా, రాయలసీమకు ఈ వర్షాలు మేలు చేసే అవకాశం ఉన్నందున.. ఆయా జిల్లాల అధికారులు మేలైన పంటలు, ఎరువుల యాజమాన్య పద్ధతులను అనుసరించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలి' అని ఆదేశించారు. వ్యవసాయ యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. వరికి సంబంధించి బీపీటీ 5204 సాంబమసూరి రకం 3 రోజులు, ఎంటీయూ 1318 రకం 5 రోజులు, ఎంటీయూ 1061 రకం 7 రోజుల వరకు పూర్తిగా ముంపు బారిన పడినా కూడా పెద్దగా నష్టం జరగదన్నారు.

నేత్రపర్వంగా రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శివదేవునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

ఘనంగా లక్ష రుద్రాక్షార్చన

ఐ.పోలవరం: కోనసీమ జిల్లాలోని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. కాశీ నుంచి తెచ్చిన లక్ష రుద్రాక్షలను మేళతాళాలతో ఊరేగించి పవిత్ర వృద్ధ గౌతమి నదిలో పూజలు, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా బోనాలు

ఏలేశ్వరం: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని కొత్తయర్రవరంలో ధనలక్ష్మి అమ్మవారి బోనాల సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. మహిళలు పసుపు చీరలు ధరించి బోనాలతో గ్రామంలోని పలు వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు.

కోటసత్తెమ్మ సన్నిధిలో ..

నిడదవోలు రూరల్: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 81,207 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,414 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.53 కోట్ల ఆదాయం వచ్చింది.



అయినవిల్లిలో భక్తుల రద్దీ

అయినవిల్లి: కాకినాడ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస, రుద్రాభిషేకాలు, వివిధ ప్రత్యేక పూజలు జరిపారు.

రెడ్డెమ్మ తల్లీ..కరుణించమ్మా

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. రెడ్డెమ్మ తల్లీ ..కరుణించమ్మా అంటూ భక్తులు మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువ జామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు.

రేపటి నుంచి ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో మంగళవారం నుంచి పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని టీటీడీ డిప్యూటీ ఈఓ నరేష్ బాబు ఆదివారం తెలిపారు.

4 నుంచి హజరత్ అమీనుల్లా సాహెబ్ ఉరుసు


కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక పర్యాటక పుణ్యక్షేత్రమైన కడప అమీన్ పీర్ దర్గాలో ఈనెల 4 నుంచి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్తివుల్ ఖాద్రీ ఉరుసు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తెలిపారు.

బస్టాండులో ప్రయాణికులపై బ్లేడ్‌తో దాడి

- ఐదుగురికి గాయాలు
- నిందితుడ్ని చితక్కొట్టి పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు



ఆదినారాయణ



చిత్ర

చౌడేపల్లె: అందరూ చూస్తుండగా బస్టాండ్‌లో ఓ వ్యక్తి బ్లేడుతో విచక్షణారహితంగా ఐదుగురిపై దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం చిత్తూరు జిల్లా చౌడేపల్లె బస్టాండులో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. రామసముద్రం మండలం కొండూరుకు చెందిన ఆదినారాయణ, కుమార్తె చిత్ర, మనుమళ్లు నవతేజ్, దివేష్ చౌడేపల్లెకు వచ్చారు. అక్కడి నుంచి ఇరికి పెంటకు వెళ్లేందుకు కుమార్తె, పిల్లలను ఆటో ఎక్కించి ఆదినారాయణ తిరిగి కొండూరు వెళ్లేందుకు వేచి ఉన్నాడు. అంతలో పుంగనూరు వైపు నుంచి ఇరికి పెంట వెళ్లేందుకు బస్సు రావడంతో వారిని బస్సులో ఎక్కించాలని సీటు ఆపేందుకు కిటికీలోనుంచి సీట్లో టవల్ వేశాడు. ఇంతలో ఆ సీటులోకి సోమల మండలం సూరయ్యగారిపల్లెకు చెందిన రాజేష్ కూర్చొన్నాడు. ఆదినారాయణ, రాజేష్ వాదోపవాదాలు చేసుకోగా రాజేష్ కోప్రోద్రిక్తుడై చిత్రపై చేయి చేసుకున్నాడు. ఆదినారాయణ, రాజేష్ గొడవ పడగా బస్సులో ఉన్న ప్రయాణికులు సర్దిచెప్పారు. బస్సులో నుంచి కిందకు దిగిన ఆదినారాయణ, చిత్రపై ఒక్కసారిగా రాజేష్ బ్లేడుతో దాడికి పాల్పడ్డాడు. చేతికి, తలపై బలమైన గాయాలు కావడంతో వీరు కేకలు వేయగా చుట్టుపక్కల వారు రాజేష్‌ని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మరో ముగ్గురిపై బ్లేడ్‌తో దాడిచేశాడు. రాజేష్‌ని పట్టుకున్న ప్రయాణికులు అతడ్ని చితకబాది పోలీసులకు అప్పగించారు.

నష్టం తగ్గించేలా చర్యలు తీసుకోండి

వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి : భారీ వర్షాల వల్ల ఏర్పడే పంట నష్టాన్ని తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ముంపు నీరు కిందకు పోయేలా చర్యలు చేపట్టాలని, ఆ వెంటనే యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం, పశు సంపద నష్టాలను అంచనా వేయాలని చెప్పారు. వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల కాల్ సెంటర్లు కొనసాగించాలన్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు అధికారులు, సిబ్బంది సెలవులు పెట్టకుండా రైతులకు అండగా నిలవాలని సూచించారు.

హాస్టల్ విద్యార్థులు జాగ్రత్త

బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శికి మంత్రి సవిత ఫోన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, హాస్టళ్లలో విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్‌ను మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఈ మేరకు భాస్కర్‌కు ఆమె ఆదివారం ఫోన్ చేసి పలు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కారణంగా అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కాచి వడపోసి చల్లారిన నీటిని మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలన్నారు. వేడి ఆహారాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా వర్షపు నీరు లీకేజీ ఉన్న భవనాల నుంచి విద్యార్థులను సురక్షిత భవనంలోకి తరలించాలని ఆదేశించారు.

సాక్షి ప్లస్
సోమవారం । 2-9-2024

భయపెడుతున్న ఆర్థిక అనిశ్చితి

వచ్చే ఐదేళ్లలో భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా అదే పరిస్థితి

- కుటుంబ ఖర్చులు, పిల్లల చదువుల వ్యయం, వైద్యఖర్చుల పెరుగుదలపై 88 శాతం మంది ఆందోళన
- ఉద్యోగాలు, అప్పులు, రాజకీయ పరిస్థితులు ప్రభావితం చేయొచ్చనే అంచనాలు
- ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఇన్సూరెన్స్ పాలసీల వైపు 77శాతం మంది
- ఫిక్స్‌డ్ డిపాజిట్ల వైపు 49 శాతం, మ్యుచువల్ ఫండ్స్/స్టాక్స్‌లో 46 శాతం,
- ఎలాంటి ఆర్థిక రక్షణలు ప్లాన్ చేయనివారు 6 శాతం
- ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ 'అనిశ్చిత్ ఇండెక్స్' తాజా నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: భారత్‌తో సహా దాదాపుగా అన్ని ప్రపంచ దేశాల్లోని ప్రజలను ఆర్థిక అనిశ్చితి భయపెడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికరంగం ఒడిదొడుకులను ఎదుర్కొంటుండగా... రాబోయే ఐదేళ్లలోనూ ఇదే స్థితి కొనసాగుతుందా? పరిస్థితులు మరింత దిగజారుతాయా అన్న ఆందోళన వివిధ వర్గాల ప్రజల్లో వ్యక్తమవుతోంది. కుటుంబ ఖర్చులు, పిల్లల చదువుల వ్యయం, వైద్యఖర్చులు, తదితరాల పెరుగుదలతో వచ్చే ఐదేళ్లలో మనదేశంతో పాటు వివిధ దేశాల్లో ఆర్థిక అస్థిరత, నిలకడలేని వాతావరణం కొనసాగుతుందని 88 శాతం భారతీయులు భావిస్తున్నారు. ఈ అనిశ్చితితో పాటు ఉద్యోగాలు, అప్పులు, రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలు కూడా తమ జీవితాలతో ముడిపడిన ఆర్థిక అంశాలను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఆర్థిక అనిశ్చితి, దానిని ప్రభావితం చేసే అంశాలపై తాజాగా 'అనిశ్చిత్ ఇండెక్స్'నివేదికను ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 7,978 మంది వ్యక్తుల (5,320 మంది వేతనజీవులు, 2,658 మంది బిజినెస్ ప్రొఫెషనల్స్) నుంచి సేకరించిన సమాచారం, వివరాల మేరకు ఈ నివేదికను సిద్ధం చేశారు.

ఈ సర్వే ముఖ్యాంశాలు ఇవీ...

ఇండియన్లకు పెరుగుతున్న ఖర్చులే అతి పెద్ద అనిశ్చితి

- ★ కుటుంబఖర్చుల పెరుగుదలతో ఇబ్బంది పడొచ్చునని భావిస్తున్నవారు 77 శాతం మంది
- ★ ఆరోగ్యం, జీవితంలో అనిశ్చితి, అప్పులు, ఊహించని ఖర్చులు రావొచ్చునని అంచనా వేస్తున్నవారు 71 శాతం మంది
- ★ ఆర్థిక అనిశ్చితి ఎదురుకావొచ్చుననే భావనలో 67 శాతం
- ★ రాజకీయ అనిశ్చితితో ఇబ్బందులు ఎదురుకావొచ్చుననే అభిప్రాయంతో ఉన్న వారు 65 శాతం
- ★ చేస్తున్న ఉద్యోగాల్లో మార్పుచేర్పుల అనిశ్చితి నెలకొనవచ్చని అంటున్న వారు 64శాతం
- ★ వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ప్రభావంతో అనిశ్చితి ఉండొచ్చుననే భావనతో 62 శాతం

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఏర్పడొచ్చా అన్న దానిపై ఏమన్నారంటే...

- ★ 88 శాతం మంది వచ్చే 5 ఏళ్లలో భారత్‌తో సహా ప్రపంచదేశాల్లో ఆర్థిక అనిశ్చితి నెలకొన వచ్చుననే భావనతో ఉన్నారు
- ★ 10 శాతం మంది ఈ అనిశ్చితి తక్కువస్థాయిలో ఉండొచ్చునని నమ్ముతున్నారు
- ★ 2 శాతం మందికి ఇది అతి స్వల్పంగా లేదా అసలు ఉండకపోవచ్చుననే అభిప్రాయం

ఈ అనిశ్చితిని అధిగమించేందుకు 'ఫైనాన్షియల్ ప్లానింగ్'ఏ మేరకు తోడ్పడుతుంది ?

- ★ ఆర్థిక ప్రణాళికల సాయంతో ఈ అనిశ్చితిని తగ్గించవచ్చునని నమ్ముతున్నవారు 46 శాతం మంది
- ★ ఈ విషయంలో 'ఫైనాన్షియల్ ప్లానింగ్'ను గట్టిగా సమర్థిస్తున్నవారు 37 శాతం
- ★ ఈ ప్లానింగ్ పట్ల పెద్దగా మేలు జరగదని భావిస్తున్నవారు 13 శాతం
- ★ దీనిని పూర్తిస్థాయిలో నిరాకరిస్తున్న వారు 4 శాతం మంది

అనిశ్చితిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ఆర్థిక సురక్షితాలు ఉపయోగపడతాయి ?

- ★ 77 శాతం మంది ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొనేందుకు ఇన్సురెన్స్ పాలసీ అనేది అతిపెద్ద ఆర్థిక సురక్షితంగా భావిస్తున్నారు
- ★ 49 శాతం రాబోయే రోజుల్లో ఏవైనా ఆర్థికపరమైన సవాళ్లు వస్తే ఎదుర్కొనేందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి వాటిలో కొంత మొత్తం జమ చేశామని చెబుతున్నారు
- ★ 46 శాతం మంది మ్యుచువల్ ఫండ్స్/ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టినట్టుగా వెల్లడించారు
- ★ 42 శాతం మంది పెన్షన్ వచ్చే ఉద్యోగం ఉందని, తాము ప్రస్తుతం నిర్వహిస్తున్న వ్యాపారం లాభదాయకంగా ఉన్నట్టుగా తెలిపారు
- ★ 6 శాతం మంది మాత్రం తాము ఎలాంటి ఆర్థిక సురక్షితాలను సిద్ధం చేసుకోలేదని పేర్కొన్నారు

'ఫైనాన్షియల్ ప్లానింగ్'ను సమీక్షిస్తుంటారా ?

- ★ 37 శాతం మంది తమకు తాముగా ఇలాంటి సమీక్షలు చేయడం లేదు. తమ తరఫున సీఏలు, ఫైనాన్షియల్ అడ్వయిజర్లు తమ బాధ్యతను తీసుకుంటున్నట్టు తెలిపారు
- ★ 22 శాతం మంది ఏడాదికి ఒకసారి లేదా అంతకంటే తక్కువ కాలంలో సమీక్షిస్తామన్నారు
- ★ 15 శాతం మంది 3 నెలలకు ఒకసారి సమీక్షిస్తామని చెప్పారు
- ★ 14 శాతం మంది 6 నెలలకు, 14 శాతం నెలకు ఒకసారి ఈ పనిచేస్తామన్నారు

భవిష్యత్‌లో చోటుచేసుకునే పరిణామాల్లో ఏ అంశం అధిక ఆందోళనకు కారణమవుతోంది ?

- ★ 64 శాతం మంది ఉద్యోగ, వృత్తిపరంగా ఎదురయ్యే ఒడిదొడుకులు, పురోగతిపైనే అని వెల్లడి
- ★ 61 శాతం మంది దీర్ఘకాలిక ఆర్థిక పరమైన లక్ష్యాలు ఆందోళనకు గురిచేస్తున్నాయంటున్నారు
- ★ 58 శాతం మంది తమ/కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపైనే ఎక్కువ ఆందోళన ఉన్నట్టుగా తెలిపారు
- ★ 39 శాతం మంది కుటుంబసభ్యులు/ స్నేహితులతో సంబంధ బాంధవ్యాలు ఏ రకంగా ఉంటాయనే దానిపై సందిగ్ధతతో ఉన్నట్టుగా పేర్కొన్నారు

ఇదీ అధ్యయనం...

ఆర్థిక అనిశ్చితితో తలెత్తే పరిస్థితులు, ఇబ్బందులను ఎదుర్కొనేందుకు వివిధవర్గాల ప్రజలు తమ తమ ప్రాధాన్యతలను ఎప్పటికప్పుడు మార్చుకోవడంతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలను పునర్ నిర్దేశించుకోవడానికి కొన్ని త్యాగాలు చేయాల్సి వస్తున్నట్టుగా ఈ నివేదికలో వెల్లడైంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు ఆర్థికంగా సురక్షిత స్థితికి చేరేందుకు అవసరమైన మార్గాల అన్వేషణ, జాగ్రత్తగా వ్యయం చేయడం, డబ్బు పొదుపు వంటి వాటికి ప్రజలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టుగా పేర్కొంది. రాబోయే రోజుల్లో ఎదురయ్యే ఆర్థిక అనిశ్చితిని అధిగమించేందుకు వివిధ రంగాలకు చెందినవారు అనుసరించే ప్రణాళికలు, ముందస్తు ఆలోచనలను బట్టి చూస్తే... ఇన్సురెన్స్ పాలసీలు చేయించుకున్న వారు 77శాతం మంది, ఫిక్స్‌డ్ డిపాజిట్లు 49 శాతం, మ్యుచువల్ ఫండ్స్/స్టాక్స్‌లో 46 శాతం, పెన్షన్లపై ధీమా/సజావుగా సాగుతున్న వ్యాపారాలున్న వారు 42 శాతం, ఎలాంటి ఆర్థిక రక్షణలు ప్లాన్ చేయనివారు 6 శాతం ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది.

సీఎంఆర్ఎఫ్ నకిలీ బిల్లులు.. దర్యాప్తు ముమ్మరం

ఇద్దరు నిందితుల అరెస్టు



సాక్షి, హైదరాబాద్: సీఎంఆర్ఎఫ్ (చీఫ్ మినిస్టర్స్ రిలీఫ్ ఫండ్) నకిలీ బిల్లుల కుంభకోణం కేసు దర్యాప్తును సీఐడీ అధికారులు వేగవంతం చేశారు. కేసుతో సంబంధమున్న ఇద్దరు నిందితులను నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో ఆగస్టు 30న అరెస్టు చేసినట్టు సీఐడీ డీజీ శిఖాగోయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన నిందితులను మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలోని చాణక్య ఆసుపత్రిలో ఆర్ఎంపీ గొట్టి గిరి, నవీన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సూపర్‌వైజర్ ఎల్.సైదిరెడ్డిగా గుర్తించినట్టు తెలిపారు. కాగా, సీఎంఆర్ఎఫ్ కింద రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని పలు ఆసుపత్రుల నుంచి అందిన దరఖాస్తులలో అవకతవకలు జరిగినట్టు తెలంగాణ రెవెన్యూశాఖ అధికారులు ఈ ఏడాది ఆగస్టు 23న సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా సీఐడీ అధికారులు పలు సెక్షన్ల కింద మొత్తం ఆరు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నల్లగొండ ప్రాంతం నుంచి అందిన సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులలో నకిలీ బిల్లులు తయారు చేసి ప్రభుత్వాన్ని మోసగించినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు.

ఒక్కో నకిలీ దరఖాస్తుకు రూ.4వేలు

నకిలీ మెడికల్ బిల్లులు సృష్టించేందుకు నిందితులు డెస్క్‌టాప్ కంప్యూటర్లు వాడినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. ఆసుపత్రులు, డాక్టర్ల పేరిట నకిలీ రబ్బర్ స్టాంప్‌లను సైతం తయారు చేయించారు. ఇందుకోసం ఒక్కో నకిలీ సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు కోసం రూ.4వేలు కమీషన్ తీసుకున్నట్టు ఆధారాలు లభించాయి. ఇలా నల్లగొండలోని అమ్మ ఆసుపత్రి, మిర్యాలగూడలోని నవీన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల పేరిట 19 నకిలీ దరఖాస్తులను సీఎంఆర్ఎఫ్‌కు పంపినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. నిందితుల అరెస్టు సమయంలో నకిలీ మెడికల్ బిల్లులు తయారు చేసిన కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, రబ్బరు స్టాంపులు, నవీన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పేరిట ఉన్న లెటర్ హెడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును సీఐడీ జీవోడబ్ల్యూ వింగ్ ఎస్పీ ఎస్వీ నాగలక్ష్మి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ డి.ప్రశాంత్, హెడ్‌కానిస్టేబుళ్లు బి.నర్సయ్య, ఎండీ షర్ఫుద్దీన్, కానిస్టేబుళ్లు ఎస్.నర్సయ్య, బి.శివకుమార్ దర్యాప్తు చేసినట్టు శిఖాగోయల్ తెలిపారు. కేసులో ఇతర నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్టు ఆమె పేర్కొన్నారు.



ఆదివారం సిద్దిపేట జిల్లాలో వర్షానికి తెగిన హుస్నాబాద్ - పందిల్ల రోడ్డు

చిక్కితే చిప్పకూడే గతి!

రాష్ట్రంలో దూకుడు పెంచిన ఏసీబీ ● ఈ ఏడాది ఇప్పటికే సెంచరీ దాటిన కేసులు

- రోజూ 20 నుంచి 30 ఫిర్యాదులు వస్తున్నాయంటున్న అధికారులు
- లంచం తీసుకుంటూ చిక్కితే సమాజంలో చులకనవుతారు
- అవినీతి కేసుతో ఇంటిల్లిపాదికీ మానసిక క్షోభ



సాక్షి, ప్రతినిధి, కామారెడ్డి: మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే ఉద్యోగి ఇంట్లో రూ.కోట్లల్లో నగదు. రూ.కోట్ల విలువైన ఆస్తుల పత్రాలు దొరికాయంటే మామూలు విషయం కాదు. ఆ నోట్ల కట్టలను చూసి ఏసీబీ అధికారులే విస్తుపోయారు. ఇది నిజామాబాద్ నగరంలో ఇటీవల వెలుగు చూసిన ఓ కేసు ఉదంతమిది. కొన్నేళ్లుగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులను మేనేజ్ చేసుకుని కార్పొరేషన్‌ను సొంత జాగీరుగా మార్చుకుని అక్రమాలకు పాల్పడిన ఆ అధికారి ఆఖరుకు జైలులో చిప్పకూడు తినాల్సి వచ్చింది.

➤ ఇలాంటి అక్రమార్క అధికారులపై ఏసీబీకి ప్రతి రోజూ 20 నుంచి 30 ఫిర్యాదులు వస్తున్నాయని ఇటీవల ఆ శాఖ అధికారులు వెల్లడించారు. గడచిన ఎనిమిది నెలల కాలంలో ఏసీబీ కేసుల సంఖ్య సెంచరీ దాటింది. లంచం తీసుకుంటూ దొరికిన వారు కొందరైతే, అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకుని అక్రమాస్తుల కేసులో అరెస్టయినవారు కొందరున్నారు. ఒక్కో కేసులో ఇద్దరు, ముగ్గురు కూడా చిక్కిన ఘటనలున్నాయి.

అయినా.. మారడం లేదు

లంచం... ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదో పెద్ద జాఢ్యం. పని ఏదైనా సరే చేయి తడిపితేనే పనులు జరుగుతాయి. పైసలు ఇస్తేనే ఫైళ్లు ముందుకు కదులుతాయి. కొందరు అధికారులు, సిబ్బంది డబ్బు కోసం ఎంతకైనా దిగజారుతున్న పరిస్థితుల్లో అడిగినంత లంచం ఇచ్చుకోలేక కొందరు, ఎందుకు ఇవ్వాలని కొందరు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. దాంతో అవినీతిపరులు ఏసీబీకి చిక్కి జైలుపాలై, ఉద్యోగం పోయి రోడ్డున పడుతున్నారు. ఇలాంటి వాళ్లను చూసైనా అవినీతి సొమ్ముకు అర్రులు చాచే వారు వెనక్కు తగ్గడం లేదు. ఇంటి పెద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కితే ఆ కుటుంబం కూడా మానసిక క్షోభకు గురవుతోంది. ఇటీవలి కాలంలో అవినీతి నిరోధక శాఖ తమకు అందే ఫిర్యాదులపై ఎక్కువగా ఫోకస్ చేస్తుండడంతో వరుసగా ఏసీబీ కేసులు నమోదవుతున్నాయి. గతంలో ఏసీబీ కేసులో అరెస్టయిన వారు వెంటనే బెయిల్‌పై బయటకు వచ్చే అవకాశాలుండేవి. అయితే ఏసీబీకి చిక్కిన వారు సులువుగా తప్పించుకోకుండా పక్కా ఆధారాలు, సాక్ష్యాలను నమోదు చేస్తున్నారు. దీంతో ఏసీబీకి చిక్కిన వారు కొంతకాలమైనా జైలు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తోంది. ఏసీబీ కేసులో అరెస్టయ్యాడంటే చాలు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. ఒక్కోసారి ఏసీబీ కేసు తేలేవరకు ఉద్యోగంలో చేరే పరిస్థితులు లేకుండాపోయి రోడ్డున పడాల్సి వస్తోంది. మొత్తంగా లంచం తీసుకుంటే చిప్పకూడు తినడానికి రెడీ అవ్వాల్సిందేనన్న సంకేతాలను ఏసీబీ అందిస్తోంది.

ఆన్‌లైన్ సేవలకూ వసూళ్లు

ప్రభుత్వ సేవలను సులభతరం చేయడంలో భాగంగా ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నారు. అయితే ఆన్‌లైన్‌లో జరిగే పనులకు సైతం ఉద్యోగులు, అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు ఎక్కువగా అవసరమయ్యే రెవెన్యూ వ్యవస్థ అవినీతికి మారుపేరుగా నిలిచిపోయింది. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది భారీ ఎత్తున అక్రమాలకు, అవినీతికి పాల్పడినట్టు తేలింది. గతంలో ఒక్క కామారెడ్డి జిల్లాలోనే 20 మంది రెవెన్యూ ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లతో పాటు మ్యుటేషన్ ప్రక్రియలో జరిగే అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చింది. దీని ద్వారా అవినీతి తగ్గుతుందని ప్రభుత్వం భావించింది. అయితే దాన్ని కూడా తమకు అనుకూలంగా మలచుకున్నారు. ఇటీవల కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు లంచం ఇవ్వడం మా వల్ల కాదు బాబోయ్ అంటూ ఆందోళనకు దిగారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

అవినీతిలో పోలీసుతో రవాణా శాఖ పోటీ

అవినీతిలో తరువాతి స్థానంలో ఉండే పోలీసు శాఖలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువచ్చింది. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేసింది. పోలీసుస్టేషన్లతో పాటు అన్ని కార్యాలయాలకు నిర్వహణ ఖర్చులతో పాటు కావలసిన సౌకర్యాలన్నీ కల్పించింది. సరికొత్త వాహనాలను అందించి వాటికి కావలసినంత డీజిల్, పెట్రోల్ సమకూర్చడంతో పాటు నిర్వహణ ఖర్చులు కూడా ఇస్తోంది. ఇన్ని చేసినా పోలీసు శాఖలో అవినీతి మాత్రం తగ్గడం లేదు. ఇక రవాణా శాఖలో ఓపెన్ కరప్షన్ నడుస్తోంది. డ్రైవింగ్ లైసెన్సు నుంచి వాహన రిజిస్ట్రేషన్ వరకు ప్రతి దానికి ఓ ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారు. రవాణా శాఖలో అవినీతిని తగ్గించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలను తీసుకువచ్చింది. స్లాట్ బుక్ చేసుకుని కావలసిన పత్రాలు తీసుకువెళితే పని జరగాలి. కానీ అవినీతికి అలవాటుపడ్డ అధికారులు, సిబ్బంది దళారుల మధ్యవర్తిత్వంతో వసూళ్లకు పాల్పడుతూ పనులు చేస్తున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చినా దళారీ వ్యవస్థ అలాగే కొనసాగుతోంది.

అన్ని శాఖల్లోనూ అంతే..

రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో ఓపెన్‌గా వసూళ్లు నడుస్తున్నాయి. అప్పుడప్పుడు ఏసీబీ దాడులు జరుగుతున్నా ఆ శాఖలో మార్పు రావడం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, ప్రభుత్వ పనులకు సంబంధించిన చెల్లింపులన్నీ ట్రెజరీ శాఖ ద్వారానే జరుగుతాయి. అయితే ట్రెజరీ శాఖలో ఏళ్లుగా వేళ్లూనుకున్న అవినీతి ఎప్పటికీ తగ్గడం లేదు. ట్రెజరీ అంటేనే వసూళ్లకు నిలయమన్న పేరుంది. మున్సిపల్ శాఖలో కూడా అడుగడుగునా అవినీతి తాండవిస్తోంది. ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాలకు వెళితే డబ్బులు ముట్టజెప్పితే గానీ పనులు జరగడం లేదు. అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ ను అమలు చేస్తుండగా అందులోనూ చేయి తడిపితేగాని పనులు జరగడం లేదు. పౌరసరఫరాల శాఖలో అడ్డగోలుగా అవినీతి జరుగుతోంది. పేదలకు అందించే రేషన్ బియ్యం అక్రమ మార్గాల ద్వారా నల్లబజారుకు తరలుతోంది. డీలర్లు, అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే అభివృద్ధి పనులకు సంబంధించి పంచాయతీరాజ్, నీటి పారుదల, రోడ్లు భవనాలు, ఆర్‌డబ్ల్యూఎస్ వంటి శాఖల్లో కాంట్రాక్టర్లు పర్సంటేజీలు ఇవ్వడం షరామామూలే. అధికారి, సిబ్బంది స్థాయిని బట్టి ముందే నిర్ణయించుకున్న ప్రకారంగా పర్సంటేజీలు ముట్టజెప్పాల్సిందే. ఇవే గాక ఇతర శాఖలలో కూడా డబ్బులతోనే పనులు జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చేయి తడిపితేనే పనులు జరుగుతాయన్న భావన అందరిలోనూ పెరిగిపోయింది. ఆన్‌లైన్ అయినా, ఆఫ్‌లైన్ అయినా డబ్బులే డామినేట్ చేస్తున్నాయి.

ఆశపడితే జైలు, సస్పెన్షన్లు తప్పవు....

ఏసీబీ కేసుల్లో చిక్కిన వారిపై నమోదైన కేసులతో వారు బెయిల్ పొందే వరకు జైల్లో చిప్పకూడు తినాల్సిందే. అరెస్టయితే చాలు వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేయడం, కేసు తేలిన తరువాతే తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం జరుగుతోంది. చాలా మంది ఏసీబీ కేసుల్లో కనీసం ఏడాది, రెండేళ్లు సస్పెన్షన్‌లో ఉండిపోతున్నారు. ఆ సమయంలో కుటుంబం కూడా ఎంతో వేదనకు గురవుతోంది. ఏసీబీ దాడి జరిగిందంటే చాలు ఉన్న ఆస్తులన్నీ జప్తు అవుతున్నాయి. దానికితోడు సమాజంలో చెడ్డపేరు రావడంతో కుటుంబాలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అవినీతి సొమ్ముకు ఆశపడి ఏసీబీ కేసుల్లో ఇరుక్కుని అవస్థలు పడుతున్న వారిని చూసైనా మిగిలిన వాళ్లు మారాల్సిన అవసరం ఉంది.



భారీ వర్షాలకు నిండిన హైదరాబాద్‌లోని ఉప్పల్ చెరువు



హైదరాబాద్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న అశోక్ నగర్ నాలా



హైదరాబాద్ ముషరాంబాగ్‌లో..

సాక్షి ప్లస్

సోమవారం। 2-9-2024

కరెంట్ అఫైర్స్



జాతీయం

'విజ్ఞాన్ ధార'పథకం

విజ్ఞాన్ ధార పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఐటీశాఖ అమలు చేస్తున్న మూడు పథకాలను విలీనం చేసి 'విజ్ఞాన్ ధార' పేరుతో కొత్త పథకం తీసుకొచ్చింది. 15వ ఆర్థిక సంఘం కాలమైన 2021–22 నుంచి 2025–26 మధ్య రూ.10,579 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పథకం కింద 11వ, 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, యూజీ, పీజీ, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందించనుంది. అధునాతన పరిశోధనల కోసం అంతర్జాతీయ భాగస్వామ్యం, సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఫెలోషిప్ లు వంటివి ఈ పథకంలో ఉంటాయి.

ఈగల అంతరిక్ష యానం

త్వరలో నిర్వహించనున్న గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి ఇస్రో మరో కీలక నిర్ణయం తీసుకుంది. 2025లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా నలుగురు వ్యోమగాములతో పాటు 20 ఈగలను అంతరిక్షంలోకి పంపించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా డ్రోసోఫిలియా మెలనోగాస్కర్ (ఫ్రూట్ ఫ్లై) జాతికి చెందిన 10 ఆడ, 10 మగ ఈగలు గగన్యాన్లో పయనం కానున్నాయి. అంతరిక్షంలోకి వెళ్లినప్పుడు వ్యోమగాముల ఆరోగ్యంలో వచ్చే మార్పులను మరింత సునిశితంగా పరిశీలించేందుకు ఇస్రో ఈ ఆలోచన చేసింది.

హైబ్రిడ్ రాకెట్ రూమీ-1 ప్రయోగం విజయవంతం

పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. చెన్నై ఈసీఆర్ లోని తిరువిడంధై తీర గ్రామం నుంచి స్పేస్ జోన్ ఇండియా, మార్టిన్ గ్రూప్ సంస్థలు తయారుచేసిన 'రూమీ–1' రాకెట్ ను ఆగస్టు 24న మొబైల్ కంటైనర్ లాంచ్ పాడ్ నుంచి విజయవంతంగా నింగిలోకి పంపారు. ఇందులో మూడు క్యూబ్ ఉపగ్రహాలు, దానికంటే తక్కువ బరువుతో కూడిన 50 పికో ఉపగ్రహాలు ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు, కాస్మిక్ రేడియేషన్, యూవీ రేడియేషన్, గాలిలో నాణ్యత తదితర వివరాలు సేకరిస్తుంది.

దేశీయంగా తయారైన తొలి మంకీపాక్స్ నిర్ధారణ కిట్

దేశీయంగా తయారైన తొలి మంకీపాక్స్ నిర్ధారణ కిట్ విశాఖలోని ఏపీ మెడ్ టెక్ జోన్ (ఏఎంటీజెడ్) మరో ఘనత సాధించింది. తమ భాగస్వామి ట్రాన్స్‌షియా డయాగ్నస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో కలిసి ఎంపాక్స్ (మంకీపాక్స్) వ్యాధి నిర్ధారణకు ఆర్టీపీసీఆర్ కిట్ ను ఉత్పత్తి చేసింది. ఎర్బాఎండీఎక్స్ మంకీపాక్స్ ఆర్టీపీసీఆర్ పేరిట కిట్ ను అభివృద్ధి చేసింది. ఎంపాక్స్ నిర్ధారణకు దేశీయంగా రూపొందించిన తొలి టెస్టింగ్ కిట్ ఇదేనని ప్రకటించారు.దీనికి ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ధ్రువీకరణతో పాటు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి అత్యవసర అనుమతులు మంజూరయ్యాయి.

అందుబాటులోకి చంద్రయాన్-3 పరిశోధన డేటా

చంద్రయాన్–3 మిషన్ ద్వారా సేకరించిన పరిశోధన డేటాను విశ్లేషణ కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అంతర్జాతీయ శాస్త్రవేత్తలకూ అందుబాటులో ఉంచింది. చందమామ దక్షిణ ధ్రువానికి చేరువలోని ప్రాంతంలో ఈ వ్యోమనౌక కాలుమోపి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ చర్యను చేపట్టింది. మొత్తం 55 గిగాబైట్ల డేటాను అందిస్తోంది. చంద్రయాన్–3లో భాగంగా ఉన్న విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ లోని ఐదు సైన్స్ పరికరాలు ఈ డేటాను సేకరించాయి. 'ఆయా పరికరాలను రూపొందించిన శాస్త్రవేత్తలకు మాత్రమే ఈ డేటాను పరిమితం చేయడంలేదు. దేశ, విదేశాల్లోని పరిశోధకులకు దీన్ని అందుబాటులో ఉంచుతున్నాం. దీనివల్ల ఫలితం మరింత మెరుగ్గా ఉంటుంది' అని ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ తెలిపారు. ఇండియన్ స్పేస్ సైన్స్ డేటా సెంటర్ (ఐఎస్ఎస్ డీసీ) కి సంబంధించిన వెబ్ సైట్ నుంచి ఈ డేటాను పొందవచ్చు.

మహిళల భద్రత కోసం షీ-బాక్స్ పోర్టల్

పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం షీ–బాక్స్ (SHe-Box) పోర్టల్‌ను ప్రారంభించింది. దీనిని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి ఆగస్టు 29న ప్రారంభించారు. మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఇంటర్నల్ కమిటీలు, స్థానిక కమిటీలకు సంబంధించిన సమాచారం దీనిలో ఉంటుందని ఈ మంత్రిత్వ శాఖ తెలిపింది.

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తే నెలకు రూ.8 లక్షలు

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, విజయాలకు ప్రచారం కల్పించేందుకు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను యూపీ సర్కారు రంగంలోకి దించనుంది. ఈ మేరకు నూతన సోషల్‌మీడియా పాలసీని రూపొందించింది. దీని ప్రకారం.. ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించడం ద్వారా ఇన్‌ఫ్లుయెన్సర్లు నెలకు రూ.8 లక్షల వరకు ఆర్జించవచ్చు. మరోవైపు, సోషల్‌మీడియాలో దేశ వ్యతిరేక పోస్టులు పెట్టేవారికి మూడేళ్ల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష విధించేలా నూతన పాలసీలో నిబంధనలు పొందుపరిచారు.

12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆగస్టు 29న జరిగిన కేంద్ర క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఏపీ, తెలంగాణ, బిహార్, పంజాబ్‌లో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేస్తారు. తెలంగాణలోని జహీరాబాద్‌లో 3245 ఎకరాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తారు. ఏపీలోని ఓర్వకల్లు, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు కొలువుతీరనున్నాయి. ఓర్వకల్లులో 2621 ఎకరాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు కానుంది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ. 28602 కోట్లను వెచ్చించనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏకంగా రూ. 1.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించవచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది.

భారత్ అమ్ముల పొదిలో అణు జలాంతర్గామి.. 'అరిఘాత్'

భారత్ అమ్ముల పొదిలో మరో అణు జలాంతర్గామి 'అరిఘాత్' చేరింది. అరిహంత్ క్లాస్‌లో రెండోదైన ఈ అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్‌ను విశాఖ నేవల్ డాక్‌యార్డులో ఆగస్టు 29వ తేదీ జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేవీలోకి ప్రవేశపెట్టారు.

మహిళల కనీస వివాహ వయసు 21 ఏళ్లు

హిమాచల్‌ప్రదేశ్‌లో ఇకపై మహిళల కనీస వివాహ వయసు 21 ఏళ్లు. నిర్దేశిత వయసు కంటే తక్కువ వయసున్న మహిళలకు పెళ్లి చేస్తే నేరం అవుతుంది. మహిళ కనీస వివాహ వయసును 18 నుంచి 21 ఏళ్లకు పెంచుతూ హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. ఈ మేరకు బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 స్థానంలో బాల్య వివాహాల(హిమాచల్ ప్రదేశ్) నిషేధ సవరణ–2024 చట్టం తీసుకొచ్చారు. 2006 నాటి చట్టం ప్రకారం మహిళల కనీస వివాహ వయసు 18 ఏళ్లు కాగా, పురుషుల కనీస వివాహ వయసు 21 ఏళ్లుగా ఉంది.

భారత్ బయోటెక్ నుంచి ఓరల్ కలరా వ్యాక్సిన్

ప్రముఖ ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ 'ఓరల్ కలరా వ్యాక్సిన్' (OCV) ప్రారంభించింది.'హిల్‌చోల్' (HILLCH-OL) పేరుతో కంపెనీ ఈ వ్యాక్సిన్‌ను విడుదల చేసింది. దీనిని సింగపూర్‌కు చెందిన హిల్‌మాన్ లేబొరేటరీస్ లైసెన్స్‌తో అభివృద్ధి చేసినట్లు భారత్ బయోటెక్ వెల్లడించింది.

అంతర్జాతీయం

చంద్రుడిపై మట్టితో మంచినీరు.. చైనా శాస్త్రవేత్తల సరికొత్త ప్రయోగం

చంద్రుడిని మానవులకు నివాసయోగ్యంగా మార్చే దిశగా చైనాకు చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త ప్రయోగం చేపట్టారు. మానవ మనుగడకు కీలకమైన నీటి వనరులను సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్) లోని నింగ్‌బో ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్‌కు చెందిన శాస్త్రవేత్తలు చంద్రుడి ఉపరితలం నుంచి సేకరించిన మట్టి నుంచి నీటిని వెలికితీశారు. చాంగ్ ఈ–5 మిషన్ లో భాగంగా చంద్రుడి ఉపరితలం నుంచి తెచ్చిన మట్టిని 1,200 కెల్విన్‌కు పైగా వేడి చేసి, ప్రత్యేకమైన ప్రక్రియ ద్వారా నీటిని తీసినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఒక టన్ను మట్టితో దాదాపు 500 లీటర్ల తాగు నీటిని తయారుచేయవచ్చని వీరు పేర్కొన్నారు. చంద్రుడిపై మట్టి నుంచి తయారుచేసిన నీటిని హైడ్రోజెన్, ఆక్సిజన్‌గా కూడా వేరు చేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్పారు.

గురుగ్రామ్‌లో సౌతాంప్టన్ వర్సిటీ క్యాంపస్

నూతన జాతీయ విద్యా విధానం కింద తొలి విదేశీ విశ్వవిద్యాలయం ఆఫ్‌షోర్ క్యాంపస్ గురుగ్రామ్‌లో ఏర్పాటు కాబోతున్నది. బ్రిటన్‌కు చెందిన సౌతాంప్టన్‌వర్సిటీ దీనిని ఏర్పాటు చేస్తుందని కేంద్రం ఆగస్ట్ 29న తెలిపింది. దీనికి సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ని విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ వర్సిటీ ప్రతినిధులకు అందజేశారు.

క్రీడలు

క్రికెట్ కు శిఖర్ ధావన్ రిటైర్మెంట్

శిఖర్ ధావన్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించారు. అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ కు ఆయన రిటైర్మెంట్ ప్రకటించారు. ఆయన 167 వన్డేలు,34 టెస్టులు, 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్ లు ఆడారు.

ఐసీసీ కొత్త ఛైర్మన్‌గా జై షా

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కొత్త ఛైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి ఐసీసీ ఛైర్మన్‌గా జై షా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఐసీసీ ఛైర్మన్ గా కొనసాగుతున్న గ్రేగ్ బార్క్‌లే మూడోసారి ఆ పదవిలో కొనసాగేందుకు విముఖత చూపించడంతో ఎన్నిక అనివార్యమైంది. అయితే జై షా మాత్రమే నామినేషన్‌దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. 35 ఏళ్లకే అత్యున్నత పదవీ బాధ్యతలు దక్కించుకున్న జై షా ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా నిలిచారు.

వార్తల్లో వ్యక్తులు

సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌కు కొత్త చీఫ్‌లు

కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా రజ్విందర్ సింగ్ భట్టి, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) చీఫ్‌గా దల్జిత్ సింగ్ చౌదరి నియమితులయ్యారు. సిబ్బంది వ్యవహారాల శాఖ బుధవారం ఈ మేరకు ఆదేశాలను జారీ చేసింది. భట్టి 1990 బ్యాచ్ బీహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఆయన వచ్చే ఏడాది సెప్టెంబరు 30 వరకు పదవిలో కొనసాగుతారు. చౌదరి 1990 బ్యాచ్ యూపీ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఆయన వచ్చే ఏడాది నవంబరు 30 వరకు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా కొనసాగుతారు.

రైల్వే బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన సతీష్ కుమార్

ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎంఎస్) అధికారి సతీష్ కుమార్ రైల్వే బోర్డు ఛైర్మన్–సీఈఓగా నియమితులయ్యారు. ఈ పదవిని చేపట్టనున్న తొలి దళిత అధికారి ఈయనే. ప్రస్తుతం ఆయన రైల్వే బోర్డు మెంబర్(ట్రాక్షన్–రోలింగ్ స్టాక్)గా ఉన్నారు. ప్రస్తుతం ఛైర్మన్ గా ఉన్న జయ వర్మ సిన్హా ఈ నెల 31వ తేదీ పదవీ విరమణ చేయనున్నారు. అనంతరం సతీష్ ఆ బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎస్‌బీఐ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సీఎస్ శెట్టి

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి (సీఎస్ శెట్టి) బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఛైర్మన్ గా వ్యవహరించిన దినేష్ ఖరా పదవీ కాలం ఆగస్టు 27వ తేదీ ముగిసింది. ఎస్‌బీఐ దేశంలోనే అత్యంత విలువైన ఆర్థిక సేవల సంస్థగా ఎదిగేందుకు కృషి చేస్తుందని, నికర లాభాలు పెంచుకుంటుందని సీఎస్ శెట్టి అన్నారు.

న్యాయ కోవిదుడు ఏజీ నూరానీ కన్నుమూత

ప్రముఖ విద్యావేత్త, రచయిత, న్యాయ కోవిదుడు అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ (94) ఆగస్టు 29న ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన 1930 సెప్టెంబరు 16న ముంబైలో జన్మించారు. ఆయన బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రాక్టీస్ చేశారు. ఆయన 'ది కశ్మీర్ డిస్ప్యూట్ 1947–2012', 'ఆర్టికల్ 370 : ఏ కాన్ స్టిట్యూషనల్ హిస్టరీ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్', 'ది డిస్ట్రక్షన్‌ఆఫ్ హైదరాబాద్' వంటి పుస్తకాలు రాశారు.



ఎం.బాలలత, సబ్జెక్ట్ నిపుణులు

శత వర్ష సంగ్రామం ఏ దేశాల మధ్య జరిగింది?



జాగ్రఫీ

1. ఇందూరుగా ఏ నగరాన్ని పిలుస్తారు?
   1) వరంగల్ 2) నిజామాబాద్
   3) కర్నూలు 4) విజయపురి
2. దేశంలోనే పొడవైన కన్వేయర్ బెల్ట్ కలిగిన ఓడరేవు ఏది?
   1) కాకినాడ 2) విశాఖపట్నం
   3) కృష్ణపట్నం 4) మచిలీపట్నం
3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బకింగ్‌హామ్ కాలువ పొడవు ఎంత?
   1) 250 కి.మీ 2) 310 కి.మీ
   3) 280 కి.మీ 4) 400 కి.మీ
4. అనంతపురం జిల్లా రాయదుర్గంలో నేత మిల్లును ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1920 2) 1922
   3) 1924 4) 1921
5. గుంటూరు, ఖమ్మం జిల్లాల్లో 15 మిలియన్ టన్నుల నిల్వలు కలిగి ఉన్న ఖనిజం ఏది?
   1) రాగి 2) సీసం
   3) క్వార్ట్జ్ 4) బాక్సైట్
6. వృష్ట జలాలు ఎక్కువగా ఏ తీరం వెంట కనిపిస్తాయి?
   1) కొంకణ్ 2) మలబార్
   3) ఉత్కళ్ 4) కోరమాండల్
7. మాంగనీస్ నిల్వలు అత్యధికంగా గల రాష్ట్రం?
   1) ఒడిశా 2) మణిపూర్
   3) మహారాష్ట్ర 4) కర్ణాటక
8. సుహేలి దీవులకు, మినికాయ్ దీవులకు మధ్య ఉన్న చానల్ ఏది?
   1) 9° చానల్ 2) 10° చానల్
   3) 8° చానల్ 4) కోకో చానల్
9. ఇండియాలో అతి పెద్ద రైల్వే జోన్ ఏది?
   1) మధ్య రైల్వే 2) దక్షిణ రైల్వే
   3) ఉత్తర రైల్వే 4) పశ్చిమ రైల్వే
10. మన దేశ శీతోష్ణస్థితిని థార్న్‌థ్వైట్ ఏ వాతావరణ అంశం ఆధారంగా వర్గీకరించారు?
    1) ఉష్ణోగ్రత 2) వర్షపాతం
    3) జలసంతులన 4) అల్పపీడనం
11. సౌర కుటుంబంలో అన్నింటి కంటే తక్కువ సాంద్రత గల గ్రహం?
    1) శుక్రుడు 2) శని
    3) బుధుడు 4) అంగారకుడు
12. నిహారిక పరికల్పన సిద్ధాంతకర్త ఎవరు?
    1) చాంబర్లీన్ మౌల్టన్ 2) లాప్లస్
    3) జీన్ జఫ్రీస్ 4) ఇమ్మాన్యుయేల్ కాంట్
13. అపహేళి సంభవించే రోజు?
    1) జనవరి 3 2) జూన్ 4
    3) జూలై 4 4) ఆగస్టు 4
14. సున్నపురాయి ఏ శిలగా రూపాంతరం చెందుతుంది?
    1) క్వార్ట్జ్ 2) పలకరాయి
    3) పాలరాయి 4) గ్రానైట్
15. భూకంప తరంగాల్లో ఘన పదార్థాల ద్వారా ప్రయాణించే తరంగాలు?
    1) P-తరంగాలు 2) S-తరంగాలు
    3) L-తరంగాలు 4) R-తరంగాలు
16. క్రాకటోవా క్రియాశీల అగ్నిపర్వతం ఏ దేశంలో ఉంది?
    1) ఇటలీ 2) గ్రీస్
    3) ఈక్వెడార్ 4) ఇండోనేషియా
17. సౌర స్థిరాంకం?
    1) 1.19 కేలరీలు 2) 1.24 కేలరీలు
    3) 1.94 కేలరీలు 4) 2.94 కేలరీలు
18. ప్రశాంత మండలంగా ఏ పీడన మేఖలను పిలుస్తారు?
    1) ఉప ఆయనరేఖా అధిక పీడన మేఖల
    2) ధ్రువ అధిక పీడన మేఖల
    3) ఉప ధ్రువ అల్పపీడన మేఖల
    4) భూమధ్యరేఖ అల్పపీడన మేఖల
19. ఉష్ణమండల ఎడారులు లేని ఖండం?
    1) ఐరోపా 2) ఆస్ట్రేలియా
    3) అంటార్కిటికా 4) ఉత్తర అమెరికా
20. ప్రపంచంలో గొప్ప ఆర్చిపెలాగో?
    1) జపాన్ 2) హవాయి
    3) ఫిలిప్పైన్స్ 4) ఇండోనేషియా
21. ఖండతీరపు అంచు అత్యధికంగా గల మహాసముద్రం?
    1) పసిఫిక్ 2) హిందూ
    3) అట్లాంటిక్ 4) ఆర్కిటిక్
22. లాబ్రడార్ శీతల ప్రవాహం ఏ మహాసముద్ర ప్రవాహ వ్యవస్థను కలిగి ఉంది?
    1) పసిఫిక్ మహాసముద్రం
    2) అట్లాంటిక్ మహాసముద్రం
    3) హిందూ మహాసముద్రం
    4) ఆర్కిటిక్ మహాసముద్రం
23. ప్రపంచంలో మూడో అత్యధిక జనాభా గల సావోపాలో నగరం ఏ దేశంలో ఉంది?
    1) బొలీవియా 2) బ్రెజిల్
    3) ఈక్వెడార్ 4) అర్జెంటీనా
24. ఆస్ట్రేలియా రాజధాని నగరం కాన్‌బెర్రా ఏ రాష్ట్రంలో ఉంది?
    1) న్యూసౌత్‌వేల్స్ 2) దక్షిణ ఆస్ట్రేలియా
    3) ఉత్తర ఆస్ట్రేలియా 4) క్వీన్స్‌లాండ్
25. 'టౌరెన్‌లు' ఫల్లాహీన్స్' లను ఏ ఎడారిలోని తెగలుగా గుర్తించారు?
    1) కలహారి 2) అరేబియా
    3) సహారా 4) ఆస్ట్రేలియా

హిస్టరీ

26. సరైన వ్యాఖ్యను గుర్తించండి?
    1) హోమోసెఫియన్స్ ఆధునిక మానవులకు సామీప్యంగా ఉంటారు.
    2) మెసపటోమియా, ఈజిప్టు నాగరికతలకు సమకాలీన నాగరికత సింధు నాగరికత.
    3) పూర్వ చారిత్రక యుగానికి లిఖిత ఆధారాలు ఉండవు.
    4) పైవన్నీ
27. చైనాలోని చౌ వంశస్థుల రాజధాని నగరం?
    1) కూన్ 2) లియా
    3) కోసాన్ 4) పెకింగ్
28. ప్రధాన నక్షత్ర కేంద్రమైన కోసాస్ ఏ నాగరికతకు సంబంధించింది?
    1) ఇన్‌కాస్ 2) మయాన్
    3) అటెటిక్స్ 4) ఏదీకాదు
29. రెండో ప్రపంచ యుద్ధానికి మూల కారణం?
    1) స్పానిష్ యుద్ధం
    2) వర్సయిల్స్ సంధి
    3) నానాజాతి సమితి వైఫల్యం
    4) చైనా – జపాన్ యుద్ధం
30. 1956లో హంగేరీ ప్రజల తిరుగుబాటును అణిచివేసేందుకు ఏ దేశం సైన్యాలను పంపింది?
    1) ఇంగ్లండ్ 2) ఫ్రాన్స్
    3) రష్యా 4) అమెరికా
31. జపాన్, మంచూరియాపై దాడి చేసిన సంవత్సరం?
    1) 1938 2) 1931
    3) 1935 4) 1933
32. నల్లమందు యుద్ధం ఏ దేశాల మధ్య జరిగింది?
    1) చైనా – అమెరికా
    2) ఇంగ్లండ్ – జపాన్
    3) ఇంగ్లండ్ – ఫ్రాన్స్
    4) చైనా – ఇంగ్లండ్
33. ఫ్రాన్స్‌లో పత్రికా స్వాతంత్ర్యాన్ని, నేషనల్ గార్డ్స్‌ను రద్దు చేసిన రాజు?
    1) 18వ లూయీ 2) 10వ చార్లెస్
    3) లూయీ ఫిలిప్ 4) టాలీహంట్
34. బ్రిటన్‌లో మొదటి ఫ్యాక్టరీ చట్టాన్ని ఎప్పుడు చేశారు?
    1) 1880 2) 1881
    3) 1882 4) 1883
35. కాన్‌స్టాంట్ నోపుల్‌ను తురుష్కులు ఏ సంవత్సరంలో ఆక్రమించుకున్నారు?
    1) 1454 2) 1455
    3) 1453 4) 1458
36. వందేమాతరం ఉద్యమం కోసం ఆంధ్ర ప్రాంతంలో పర్యటించిన జాతీయ కాంగ్రెస్ నాయకుడు?
    1) భగత్‌సింగ్
    2) లాలాలజపతిరాయ్
    3) బిపిన్ చంద్రపాల్
    4) బాలగంగాధర్ తిలక్
37. శత వర్ష సంగ్రామం ఏ దేశాల మధ్య జరిగింది?
    1) ఇంగ్లండ్ – రష్యా 2) ఇంగ్లండ్ – ఫ్రాన్స్
    3) చైనా – ఫ్రాన్స్ 4) ఇటలీ – టర్కీ
38. జొల్లా వెరీన్ అనే కస్టమ్స్ యూనియన్‌ను ఏర్పాటు చేసిన దేశం?
    1) బ్రిటన్ 2) ప్రష్యా
    3) జర్మనీ 4) ఇటలీ
39. ఫ్రెంచి వలసలకు ప్రధాన కేంద్రం?
    1) హైదరాబాద్ 2) పాండిచ్చేరి
    3) సూరత్ 4) కాన్పూర్
40. ఏ యుద్ధంతో ఫ్రెంచివారు భారతదేశంపై తమ పట్టును కోల్పోయారు?
    1) మొదటి కర్ణాటక యుద్ధం
    2) రెండో కర్ణాటక యుద్ధం
    3) మూడో కర్ణాటక యుద్ధం
    4) రెండో మైసూర్ యుద్ధం
41. బ్రిటిష్‌వారు భారతదేశంలో విద్యాభివృద్ధికి లక్ష రూపాయలను ఏ చట్టం ప్రకారం కేటాయించారు?
    1) 1813 చార్టర్ చట్టం
    2) 1833 చార్టర్ చట్టం
    3) 1853 చార్టర్ చట్టం
    4) 1858 భారత ప్రభుత్వ చట్టం
42. నలంద బౌద్ధారామం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) జార్ఖండ్ 2) బిహార్
    3) ఒడిశా 4) ఉత్తర ప్రదేశ్
43. శాసనోల్లంఘన ఉద్యమం ఏ రోజున ప్రారంభమైంది?
    1) 1929, జనవరి 26
    2) 1920, జనవరి 26
    3) 1928, ఫిబ్రవరి 3
    4) 1930, జనవరి 26
44. వ్యక్తిగత సత్యాగ్రహాన్ని చేపట్టిన మొదటి వ్యక్తి?
    1) మోతీలాల్ నెహ్రూ
    2) గోపాలకృష్ణ గోఖలే
    3) వినోభా భావే
    4) సుభాష్ చంద్రబోస్
45. చేర రాజుల్లో సుప్రసిద్ధ చక్రవర్తి?
    1) కరికాలుడు 2) అజాతశత్రువు
    3) సెంగుత్తవాన్ 4) నెడుంజెలియన్
46. హాతిగుంఫా శాసనాన్ని వేయించింది?
    1) అశోకుడు 2) ఖారవేలుడు
    3) రెండో పులకేశి
    4) మొదటి చంద్రగుప్తుడు
47. ఏకవీర దేవాలయాన్ని నిర్మించినవారు?
    1) పశ్చిమ చాళుక్యులు
    2) కాకతీయులు 3) హోయసలులు
    4) రాష్ట్రకూటులు

పాలిటీ

48. సమాచార కమిషన్ ఛైర్మన్‌ను ఎవరు నియమిస్తారు?
    1) కేంద్ర మంత్రిమండలి
    2) ప్రధానమంత్రి
    3) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
    4) రాష్ట్రపతి
49. లోక్ అదాలత్‌లను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1982 2) 1983
    3) 1984 4) 1985
50. ప్రస్తుతం భారతదేశంలో హైకోర్టుల సంఖ్య?
    1) 22 2) 23
    3) 24 4) 25
51. విధాన పరిషత్తుకు ఉపాధ్యాయుల ద్వారా ప్రాతినిధ్యం ఎంతవరకు ఉంటుంది?
    1) 1/3వ వంతు 2) 1/12వ వంతు
    3) 1/8వ వంతు 4) 1/4వ వంతు
52. రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ నిబంధన ప్రకారం విధిస్తారు?
    1) 356 2) 352
    3) 358 4) 360
53. జిల్లా పరిషత్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులు కానివారు?
    1) జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ఛైర్మన్
    2) జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్
    3) మండలాభివృద్ధి అధికారి
    4) జిల్లా కలెక్టర్
54. గ్రామంలో గరిష్ఠ వార్డు సభ్యుల సంఖ్య?
    1) 5 2)15 3) 20 4) 21
55. లోకాయుక్త ఛైర్మన్‌ను ఎవరు నియమిస్తారు?
    1) ముఖ్యమంత్రి 2) గవర్నర్
    3) రాష్ట్ర మంత్రిమండలి
    4) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
56. ఆస్తి హక్కును ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు?
    1) 42 2) 43 3) 44 4) 48
57. 1983లో ఏడో అలీన దేశాల సదస్సు ఏ నగరంలో జరిగింది?
    1) న్యూఢిల్లీ 2) హరారే
    3) బెల్‌గ్రేడ్ 4) జకార్తా

ఎకనామిక్స్

58. వినియోగదారుడి మిగులు సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది?
    1) హెచ్ హెచ్ గాసెన్ 2) డ్యూపిట్
    3) మార్షల్ 4) ఆడమ్‌స్మిత్
59. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ గల అతిపెద్ద దేశం?
    1) అమెరికా 2) చైనా
    3) జపాన్ 4) భారత్
60. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసేది?
    1) రూ. 50 2) రూ. 100
    3) రూ. 20 4) రూ. 1
61. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1981 2) 1982 3) 1983 4) 1985
62. 13వ ఆర్థిక సంఘం ఛైర్మన్?
    1) వై. వేణుగోపాలరెడ్డి
    2) బిమల్ జలాన్ 3) విజయ్‌కేల్కర్
    4) అరవింద్ పనగడియం
63. జనాభా విభాజక సంవత్సరంగా ఏ ఏడాదిని ప్రకటించారు?
    1) 1920 2) 1921
    3) 1922 4) 1923
64. రిజర్వు బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) న్యూఢిల్లీ 2) కోల్‌కతా
    3) ముంబై 4) ఆగ్రా
65. పరోక్ష పన్నుకు ఉదాహరణ?
    1) ఆదాయం పన్ను 2) ఎక్సైజ్ పన్ను
    3) సంపద పన్ను 4) వ్యయ పన్ను

సమాధానాలు

1) 2	2) 2	3) 2	4) 4	5) 2
6) 2	7) 1	8) 1	9) 3	10) 3
11) 2	12) 2	13) 3	14) 3	15) 2
16) 4	17) 3	18) 4	19) 3	20) 4
21) 3	22) 2	23) 2	24) 4	25) 3
26) 4	27) 1	28) 2	29) 2	30) 3
31) 2	32) 4	33) 2	34) 2	35) 3
36) 3	37) 2	38) 2	39) 2	40) 2
41) 1	42) 2	43) 4	44) 3	45) 3
46) 2	47) 2	48) 4	49) 4	50) 3
51) 2	52) 2	53) 3	54) 4	55) 2
56) 3	57) 1	58) 2	59) 4	60) 4
61) 2	62) 3	63) 2	64) 3	65) 2

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాతీయ జెండా నియమావళిని సిఫారసు చేసిన కమిటీ?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో సమాఖ్య ప్రభుత్వ ఏర్పాటుకు కిందివాటిలో ఏ చట్టం ఆధారం?
   a) 1919 మార్లే - మింటో సంస్కరణల చట్టం
   b) 1919 మాంటెగ్ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం
   c) 1935 భారత ప్రభుత్వ చట్టం
   d) 1947 భారత స్వతంత్ర చట్టం
2. రాజ్యాంగ పరిషత్ ఉప సంఘమైన సలహా సంఘం అధ్యక్షుడిగా ఎవరు పని చేశారు?
   a) బి. నర్సింగరావు b) జె.బి. కృపలాని
   c) సర్దార్ వల్లభాయ్ పటేల్
   d) రాజేంద్రప్రసాద్
3. రాజ్యాంగ ప్రవేశిక ప్రకారం రాజ్యాంగం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   a) 26-1-1950 b) 15-8-1947
   c) 24-1-1950 d) 26-11-1949
4. 1976లో రాజ్యాంగ ప్రవేశికలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన పదాలేవి?
   a) సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర
   b) సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక
   c) సామ్యవాద, లౌకిక, సమగ్రత
   d) సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర
5. భారత రాజ్యాంగంలోని ఒకటో అధికరణ భారత ప్రభుత్వాన్ని ఏవిధంగా ప్రకటించింది?
   a) సమాఖ్య ప్రభుత్వం
   b) అర్ధ సమాఖ్య ప్రభుత్వం
   c) కేంద్రీకృత సమాఖ్య ప్రభుత్వం
   d) పైవేవీ కాదు
6. భారతదేశంలో ప్రభుత్వం ఎంతవరకు అధికారంలో కొనసాగుతుంది?
   a) ప్రజల విశ్వాసం మేరకు
   b) రాష్ట్రపతి విశ్వాసం మేరకు
   c) పార్లమెంట్ విశ్వాసం మేరకు
   d) లోక్‌సభ విశ్వాసం మేరకు
7. అల్ప సంఖ్యాకుల సంరక్షణ కోసం చేర్చిన ప్రత్యేక హక్కు ఏది?
   a) సమానత్వ హక్కు
   b) విద్య, సాంస్కృతిక హక్కు
   c) మత స్వాతంత్ర్య హక్కు
   d) పీడనాన్ని నిరోధించే హక్కు
8. ప్రభుత్వాలు తమ కర్తవ్యాలను, విద్యుక్త ధర్మాలను సమర్థంగా నిర్వహించడానికి తోడ్పడేవి?
   a) ఆదేశిక సూత్రాలు b) ప్రాథమిక హక్కులు
   c) ప్రాథమిక విధులు d) ప్రణాళికలు
9. ఏ కమిటీ సిఫార్సు మేరకు 2002 నుంచి జాతీయ జెండా నియమావళిని అమల్లోకి తీసుకువచ్చారు?
   a) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
   b) స్వరణ్‌సింగ్ కమిటీ
   c) జస్టిస్ వర్మ కమిషన్
   d) జస్టిస్ శ్రీ కృష్ణ కమిటీ
10. కిందివాటిలో సరికానిది ఏది?
    a) అంటరానితనం నిషేధం: అధికరణ - 17
    b) వెట్టిచాకిరి నిషేధం: అధికరణ - 23
    c) బలవంతంగా మతమార్పిడి నిషేధం: అధికరణ -29
    d) బాలకార్మికుల వ్యవస్థ నిషేధం: అధికరణ - 24
11. ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని 2015లో ఏ రాష్ట్రంలో నిర్వహించారు?
    a) గుజరాత్ b) మహారాష్ట్ర
    c) తెలంగాణ d) హర్యానా
12. రాజ్యసభలో సీట్ల కేటాయింపు గురించి ఏ షెడ్యూల్‌లో పేర్కొన్నారు?
    a) షెడ్యూల్-1 b) షెడ్యూల్-4
    c) షెడ్యూల్-10 d) షెడ్యూల్-8
13. రాష్ట్రపతిని ఎన్నుకునే 'ఎలక్టోరల్ కాలేజీ'లో ఎవరు సభ్యులుగా ఉంటారు?
    a) పార్లమెంట్ సభ్యులు, అసెంబ్లీ సభ్యులు
    b) ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, ఎన్నికైన విధానసభ సభ్యులు
    c) పార్లమెంట్ సభ్యులు మాత్రమే
    d) ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయిస్తుంది
14. కింద పేర్కొన్నవారిలో అతి తక్కువ కాలం రాష్ట్రపతిగా పనిచేసింది ఎవరు?
    a) జాకీర్‌హుస్సేన్
    b) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
    c) వి.వి.గిరి d) నీలం సంజీవరెడ్డి
15. విదేశీ రాయబారిగా పనిచేసి రాష్ట్రపతి అయిన వ్యక్తి ఎవరు?
    a) జాకీర్ హుస్సేన్
    b) కె.ఆర్.నారాయణన్
    c) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
    d) నీలం సంజీవరెడ్డి
16. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
    a) అధికరణ - 108 ప్రకారం రాష్ట్రపతి పార్లమెంట్ ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు
    b) అధికరణ - 72 ప్రకారం నేరస్థులకు క్షమాభిక్ష పెట్టవచ్చు. శిక్ష తగ్గించవచ్చు
    c) అధికరణ -143 ప్రకారం - రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు
    d) పైవన్నీ
17. కిందివారిలో ఎవరికి సభలో సభ్యత్వం లేక పోయినా నిర్ణాయక ఓటు హక్కు ఉంటుంది?
    a) లోక్‌సభ స్పీకర్ b) రాజ్యసభ చైర్మన్
    c) విధాన పరిషత్ అధ్యక్షులు
    d) రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
18. ఉప రాష్ట్రపతి పదవికి ఖాళీ ఏర్పడినప్పుడు తాత్కాలిక ఉప రాష్ట్రపతిగా ఎవరు కొన సాగుతారు?
    a) రాజ్యసభ ఉపాధ్యక్షుడు
    b) లోక్‌సభ స్పీకర్
    c) ప్యానెల్ స్పీకర్ d) ఎవరూ కాదు
19. కిందివారిలో అతి తక్కువ కాలం ప్రధానిగా పని చేసింది ఎవరు?
    a) అటల్ బిహారీ వాజ్‌పాయ్ b) చంద్రశేఖర్
    c) వి.పి.సింగ్ d) దేవెగౌడ
20. కిందివాటిలో సరికానిది ఏది?
    a) జాతీయ ప్రభుత్వాన్ని నడిపిన ప్రధాని - జవహర్ లాల్ నెహ్రూ
    b) మైనార్టీ ప్రభుత్వాన్ని నడిపిన ప్రధాని - పి.వి. నరసింహారావు
    c) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఎక్కువ కాలం నడిపిన ప్రధాని - వాజ్‌పాయ్
    d) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి ప్రధాని - మొరార్జీ దేశాయ్
21. ఎవరి జన్మదినాన్ని సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించారు?
    a) జవహర్ లాల్ నెహ్రూ
    b) గుల్జారీ లాల్ నందా
    c) లాల్ బహదూర్ శాస్త్రి
    d) అటల్ బిహారీ వాజ్‌పాయ్
22. 1947లో నెహ్రూ ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో విదేశాంగ శాఖను నిర్వహించిన మంత్రి ఎవరు?
    a) సర్దార్ వల్లభాయ్ పటేల్
    b) జగ్జీవన్‌రామ్
    c) ఎస్.పి. ముఖర్జీ d) ఎవరూ కాదు
23. మంత్రి మండలి సభ్యుల సంఖ్య లోక్‌సభ సభ్యుల సంఖ్యలో 15 శాతానికి మించకూడదని ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు?
    a) 89 b) 91 c) 92 d) 100
24. మంత్రి మండలి సభ్యులు వ్యక్తిగతంగా ఎవరికి బాధ్యత వహిస్తారు?
    a) రాష్ట్రపతి b) ప్రధానమంత్రి
    c) పార్లమెంట్ d) లోక్‌సభ
25. ఏ ప్రధానమంత్రి కాలంలో ఇద్దరు ఉప ప్రధాన మంత్రులు పనిచేశారు?
    a) చరణ్‌సింగ్ b) వి.పి.సింగ్
    c) మొరార్జీ దేశాయ్ d) ఇందిరాగాంధీ
26. పార్లమెంట్ మొదటి సమావేశం ఎప్పుడు జరిగింది?
    a) 13-5-1952 b) 13-5-1950
    c) 1-4-1952 d) 14-5-1952
27. లోక్‌సభ మొత్తం స్థానాల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా కేటాయించిన సీట్ల సంఖ్య?
    a) 79, 41 b) 84, 47
    c) 84, 44 d) 79, 47
28. లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్యను 2026 వరకు పొడిగించకూడదని ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు?
    a) 81 b) 84 c) 85 d) 91
29. లోక్‌సభకు మొదటి మధ్యంతర ఎన్నికలు జరిగిన సంవత్సరం?
    a) 1967 b) 1971
    c) 1980 d) 1991
30. పార్లమెంట్ ఉమ్మడి సభ సమావేశానికి అధ్యక్షత వహించేది ఎవరు?
    a) భారత రాష్ట్రపతి b) ప్రధానమంత్రి
    c) లోక్‌సభ స్పీకర్ d) రాజ్యసభ చైర్మన్
31. ప్రస్తుతం కొనసాగుతున్న రాజ్యసభ ఎన్నోది?
    a) 13 b) 14 c) 16 d) ఏదీకాదు
32. ప్రస్తుత రాజ్యసభ చైర్మన్ ఎవరు?
    a) హమీద్ అన్సారీ b) జగదీప్ ధన్‌కర్
    c) తంబిదొరై d) గులాంనబీ ఆజాద్
33. ఆర్థిక బిల్లుకు సంబంధించి సరికానిది?
    a) రాష్ట్రపతి ఆమోదంతో మొదట లోక్‌సభలో ప్రవేశపెట్టాలి
    b) లోక్‌సభలో ఆమోదం పొందకపోతే ప్రభుత్వం కూలిపోతుంది
    c) రాజ్యసభకు పంపినప్పుడు ఆమోదించి లేదా వ్యతిరేకించి 14 రోజుల్లో తిప్పి పంపాలి
    d) రెండు సభల మధ్య విభేదాలు ఏర్పడితే రాష్ట్రపతి ఉమ్మడి పార్లమెంట్ సభ సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు
34. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి ఎంత మంది సభ్యుల మద్దతు కావాలి?
    a) 20 b) 50 c) 100 d) 273
35. పార్లమెంటరీ ప్రక్రియలో పేర్కొనని పదం ఏది?
    a) ప్రశ్నల గంట b) శూన్య కాలం
    c) వాయిదా తీర్మానం d) సావధాన తీర్మానం
36. పార్లమెంటరీ కమిటీల్లో అతి ప్రాచీనమైనది ఏది?
    a) ప్రభుత్వ ఖాతాల సంఘం
    b) ప్రభుత్వ అంచనాల సంఘం
    c) ప్రభుత్వ ఉపక్రమాల సంఘం
    d) సభా వ్యవహారాల సంఘం
37. పార్లమెంట్, రాష్ట్రపతి, మంత్రిమండలి మధ్య సంధానకర్తగా ఎవరు పనిచేస్తారు?
    a) రాష్ట్రపతి b) ప్రధానమంత్రి
    c) లోక్‌సభ స్పీకర్ d) కేబినెట్ కార్యదర్శి
38. కేంద్ర కేబినెట్ సభ్యుడు కాకపోయినా కేబినెట్ సమావేశాల్లో పాల్గొనే అర్హత ఉన్నవారెవరు?
    a) అటార్నీ జనరల్ b) లోక్‌సభ స్పీకర్
    c) హోంశాఖ కార్యదర్శి
    d) భారత రాష్ట్రపతి
39. కేంద్రం - రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం సుప్రీంకోర్టు ఏ అధికార పరిధిలోకి వస్తుంది?
    a) ప్రారంభ అధికార పరిధి
    b) అప్పీళ్ల విచారణ పరిధి
    c) సలహా అధికార పరిధి d) పైవేవీకాదు
40. జాతీయ ప్రజాస్వామ్య కూటమి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పాటు చేసిన జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ అధ్యక్షునిగా ఎవరు కొనసాగుతారు?
    a) ప్రభుత్వం నియమించిన న్యాయమూర్తి
    b) భారత రాష్ట్రపతి
    c) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
    d) సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి

సమాధానాలు				
1) c	2) c	3) d	4) c	5) d
6) d	7) b	8) a	9) c	10) c
11) a	12) b	13) b	14) a	15) b
16) d	17) b	18) d	19) b	20) c
21) d	22) d	23) b	24) a	25) c
26) a	27) b	28) b	29) b	30) c
31) d	32) b	33) d	34) b	35) b
36) a	37) c	38) a	39) a	40) c

ఉద్యోగాలు

ఈఎస్ఐసీ, న్యూఢిల్లీలో 22 యంగ్ ప్రొఫెషనల్స్/ కన్సల్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్స్/కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 22. » పోస్టుల వివరాలు: యంగ్ ప్రొఫెషనల్-15, కన్సల్టెంట్ గ్రేడ్-1,2-05, సీనియర్ కన్సల్టెంట్-02.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, బీటెక్(ఐటీ), ఎంబీఏ/ఎంసీఏ/ఎంటెక్(ఫైనాన్స్), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 32 నుంచి 62 ఏళ్లు మించకూడదు. ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు రూ.70,000, కన్సల్టెంట్ గ్రేడ్-1 పోస్టుకు రూ.80,000 నుంచి రూ.1,45,000, కన్సల్టెంట్ గ్రేడ్-2 పోస్టుకు రూ.1,45,000 నుంచి రూ.2,65,000, సీనియర్ కన్సల్టెంట్ పోస్టుకు రూ.2,65,000 నుంచి 3,30,000.

ముఖ్య సమాచారం:

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
» దరఖాస్తులకు చివరితేది: 11.09.2024.
» వెబ్‌సైట్: https://www.esic.gov.in/

పీడీఐఎల్, నోయిడాలో 57 పోస్టులు


నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్(పీడీఐఎల్) కాంట్రాక్ట్ ప్రాతిపదికన పీడీఐఎల్ కార్యాలయాలు/ప్రాజెక్ట్ సైట్‌లో వివిధ విభాగాల్లో ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 57.
» పోస్టుల వివరాలు: డిప్లొమా ఇంజనీర్-04, డిగ్రీ ఇంజనీర్-53.
» విభాగాలు: ఫైర్/ఇండస్ట్రియల్ సేఫ్టీ, సివిల్(కన్‌స్ట్రక్షన్), ఎలక్ట్రికల్(కన్‌స్ట్రక్షన్), ఇన్‌స్పెక్షన్(ఎలక్ట్రికల్), ఇన్‌స్పెక్షన్(సివిల్), ఇన్‌స్పెక్షన్(మెకానికల్), ఇన్‌స్ట్రుమెంటేషన్(కన్‌స్ట్రక్షన్), మెకానికల్(కన్‌స్ట్రక్షన్), మెకానికల్(మెషినరీ).
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్(సైన్స్ సబ్జెక్టులు), ఇంజనీరింగ్ డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం:

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
» దరఖాస్తులకు చివరితేది: 11.09.2024.
» వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీలు: అక్టోబర్ మొదటి లేదా రెండో వారం 2024.
» ఇంటర్వ్యూ వేదిక: పీడీఐఎల్ భవన్, నోయిడా.
» వెబ్‌సైట్: https://www.pdilin.com/

What is the code for 'WORK'?



MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): Each of the questions below consists of a question and two statements marked I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and give answer:

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statements I alone are not sufficient to answer the question, while the data in statement II alone are sufficient to answer the question.
3) If the data either in statement I or in statement II alone are sufficient to answer the question.
4) If the data even in both the statements I and II together are not sufficient to answer the question.
5) If the data in both statements I and II together are needed to answer the question.

1. What is Virat's rank in a class of 50 students?
   I. Suraj, whose rank is 17th in the class, is ahead of Ghana by 8 ranks. There are 7 perso-ns between Ghana and Virat.
   II. Sivramesh is 20 ranks ahead of Virat and Malala is 6 ranks behind Virat. Sangita stands exactly in the middle of Malala and Sivramesh.
2. How many daughters does Y have?
   I. E and Q are the only daughters of Z.
   II. D is brother of Q and son of Y.
3. What does "De" stands for in the code language?
   I. "Pa Ni Nok De" means "better late than never" and "Ri Nok De Pam" means "never be so late" in that code language.
   II. "Mi De Mo Nam" means "being late is lazy" and "De Mok Sac Li" means "Late moves spoil plans" in that code language.
4. Who amongst P, Q, R, S, T and U, who are at different weights, is the heaviest?
   I. P is lighter than only R.
   II. Only R is heavier than P.
5. Towards which direction is A from Z?
   I. A is exactly to the south east of M.
   II. Z is exactly to the south of M.

Directions (Q. No. 6-10): Observe the statements carefully and choose the option by finding out the validity of the given conclusions:

6. **Statements:** All Rats are Cats. Some Cats are planets. All planets are Tiles.
   Conclusions:
   I. Some Tiles are Rats.
   II. No Rat is a Tile.
   III. All Tiles being planets is a possibility
   1) Only I, II and III follow
   2) Only II and III follow
   3) Only III with Either I or II follows
   4) I and III follow
   5) None of these
7. **Statements:** All Fans are bats. All bats are rats. All rats are cots.
   Conclusions:
   I. Some cots are not bats
   II. All cots are bats
   III. All those rats which are fans must be bats
   1) Only II and III follow
   2) Only I and III follow
   3) Either I or II and III follow
   4) All follow 5) None of these
8. **Statements:** All curtains are rods. Some rods are sheets. Some sheets are pillows.
   Conclusions:
   I. Some pillows are rods.
   II. Some rods are curtains.
   III. Some pillows which are sheets need not necessarily be rods.
   1) Only I and III follow
   2) Only II and III follow
   3) Either I or III and II follows
   4) All follow 5) None of these
9. **Statements:** No wall is roof. All pens are walls. All doors are roofs.
   Conclusions:
   I. Some doors are walls.
   II. No roof is wall
   III. No any Pen is door
   1) Only I and III follow
   2) Only II and III follow
   3) Either I or II and III follows
   4) All follow 5) None of these
10. **Statements:** All switches are plugs. Some plugs are bulbs. All bulbs are sockets.
    Conclusions:
    I. At least Some sockets are plugs
    II. Some plugs are switches.
    III. All sockets can never be swi-tches
    1) Only I and II follow
    2) All follow
    3) Either I or III and II follows
    4) None follows
    5) None of these


Directions (Q. No. 11 - 15): Study the information carefully and answer the following questions:

In a certain code language-
a) "GOOD WORK EARNS MONEY" is written as "kat lat ho gat"
b) "PRODUCTIVE AND EXCELLENT WORK" is written as, 'mat ta pat kat'
c) "MONEY IS DIRECT OUTPUT" is written as, "zi lat ne ki"
d) "WORK PRODUCES EXCELLENT RESULTS" is written as, "zat mat kat da"


11. What is the code for "WORK" in the given code language?
    1) gat 2) ho 3) pat 4) kat 5) da
12. What is the code for "EXCELLENT" in the given code ?
    1) kat 2) da 3) mat 4) gat 5) zi
13. What is the code for "MONEY" in the given code language?
    1) lat 2) ho 3) kat 4) zi 5) da
14. What is the code for "RESULTS" in the given code language?
    1) zat 2) da 3) either 1 or 2 4) mat 5) da
15. What is the code for "PRODUCTIVE" in the given code?
    1) mat 2) pat 3) kat 4) ta 5) cannot be determined

Solutions


1. As Suraj is ahead of Ghana by eight ranks, there are seven persons between Suraj and Ghana. Hence, Virat is eight ranks behind Ghana by which his rank is 33rd in the class. Hence, I is sufficient.
   Statement II does not indicate the position of Virat. **Ans: 1**
2. By combining both the statements it is clear that E and Q are the only two daughters of Y. Hence, both the statements are required. **Ans: 5**
3. From Statement II, "late" is the only common word which is indicated by "De". Hence, only II is sufficient. **Ans: 2**
4. From Statement I, R >P. Hence, R is the heaviest.
   From Statement II, R is the heaviest person. Hence, either I or II is sufficient. **Ans: 3**
5. It cannot be determined as only the direction is given but distance between A and M as well as that of between Z and M is not given. Hence, neither I nor II is sufficient. **Ans: 4**
6. **Basic Diagram** **Alternate Diagram**




   As all the given statements are affirmative, there is a possibility of "some Rats are Tiles". Hence, both the conclusions form a complementary pair. Answer is "Only III with either I or II" follows. **Ans: 3**
7. **Basic Diagram** **Alternate Diagram**




   As all the given statements are affirmative, there is a possibility of "All cots are bats". Hence, both the conclusions form a complementary pair. Answer is "Only III with Either I or II" follows. **Ans: 3**
8. **Basic Diagram**



   Clearly, only II and III conclusion are valid. **Ans: 2**
9. **Basic Diagram**



   "No roof is wall" is a valid conclusion as the statement given is "No wall is roof". No pen is door is also valid. Hence, conclusion II and III follow. **Ans: 2**
10. **Basic Diagram**



    Clearly, both I and II conclusions are valid. All sockets can be switches. Hence, conclusion III is not valid. **Ans: 1**

(11-15) By comparing

11. (a) (b) & (d) WORK = kat **Ans: 4**
12. (b) & (d) EXCELLENT = mat **Ans: 3**
13. (a) & (c) MONEY = lat **Ans: 1**
14. (d) RESULTS = Either zat or da **Ans: 3**
15. (b) PRODUCTIVE = Either ta or pat. Hence, cannot be determined. **Ans: 5**